
ఆ ఎంజైమ్‌ను అడ్డుకుంటే క్యాన్సర్‌కు చెక్!



11

కీలక ఎంజైమ్‌ను గుర్తించిన దక్షిణ కొరియా శాస్త్రవేత్తలు

దాన్ని నిరోధిస్తే క్యాన్సర్ కణాలు తిరిగి సాధారణ స్థితికి

క్యాన్సర్ పరిశోధనల్లో కీలక మైలురాయి

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

బుధవారం | 12-2-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 298 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, శుక్లపక్షం; తిథి: పౌర్ణమి రా. 7.23 తదుపరి పాడ్యమి; నక్షత్రం: ఆశ్లేష రా. 7.35 తదుపరి మఖ; వర్జ్యం: ఉ. 7.54-9.34; దుర్ముహూర్తం: మ.12.06-12.52; అమృతఘడియలు: సా. 5.54-7.35; రాహుకాలం: మ. 12.00 -1.30; సూర్యోదయం: 6.46; సూర్యాస్తమయం: 6.12 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

జేఈఈ మెయిన్ సెషన్-1లో 14 మందికి 100 పర్సంటైల్!

- వీరిలో రాజస్థాన్ నుంచే ఐదుగురు
- జాబితాలో ఇద్దరు తెలుగు విద్యార్థులు
- ఏపీ నుంచి సాయి మనోజ్ఞ గుత్తికొండ, తెలంగాణ నుంచి బాని బ్రతా మాజీ
- ఏప్రిల్ 1 నుంచి 8వ తేదీ వరకు మెయిన్ సెషన్-2 పరీక్షలు

14



మనోజ్ఞ

బాని బ్రతా మాజీ

కుంభమేళాకు వెళ్లొస్తూ.. ఏడుగురు దుర్మరణం



జబల్‌పూర్ వద్ద జరిగిన ప్రమాదంలో తుక్కుతుక్కైన టెంపో ట్రావెలర్

- మృతులంతా హైదరాబాద్‌కు చెందిన వారే..
- మధ్యప్రదేశ్‌లో జబల్‌పూర్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం
- రాంగ్‌రూట్‌లో వచ్చి టెంపో ట్రావెలర్‌ను ఢీకొట్టిన లారీ
- మృతుల్లో ముగ్గురు బంధువులు, ముగ్గురు స్నేహితులు
- ఒకరు డ్రైవర్.. మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

11

- భార్య సంవత్సరీకానికి రెండ్రోజుల ముందే భర్త మృతి

కుటుంబం గడవడం కష్టమనుకుంటేనే ‘కారుణ్య నియామకం’!



- ఉద్యోగి మరణించిన ప్రతి కేసులోనూ వారసులకు కొలువు ఇవ్వడం సరికాదు
- మృతుల కుటుంబ జీవన ప్రమాణాలు పడిపోతాయంటూ నియమించనక్కర్లేదు.. సుప్రీం సంచలన తీర్పు

ఈవీఎంలలో డేటా తొలగించొద్దు

ఈసీకి సుప్రీంకోర్టు ఆదేశం

11



మంత్రులు, కార్యదర్శుల భేటీలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రులు నిమ్మల, లోకేశ్, అచ్చెన్నాయుడు, అనిత, అనగాని, సీఎస్ విజయానంద్, డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా తదితరులు

స్పీడ్ పెంచేద్దాం!

8 నెలల కృషితో మంచి ఫలితాలు: ముఖ్యమంత్రి

కీలక సమయంలో అలసత్వం కుదరదు.. అధికారులు కొత్తగా ఆలోచించాలి



- జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉత్తమ విధానాలను పరిశీలించండి
- డబ్బుల్లేవని ఆలోచనలను ఆపొద్దు
- తక్కువ వ్యయంతో, కేంద్రం మద్దతుతో అమలు చేసేలా ప్రణాళికలు
- సీఎంవో స్థాయిలో ‘ఇన్నోవేషన్ సెంటర్’
- ముగ్గురు అధికారులతో కమిటీ
- ఇంట్లో కూర్చుంటే సమస్యలు తెలియవు
- ప్రతి నెలా 3-4 జిల్లాల్లో తిరగాలి
- సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యం
- అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశాలు
- సూటిగా సాగిన ‘కార్యదర్శుల సదస్సు’

“మంత్రులు, కార్యదర్శులతో సమావేశం నిర్వహించడంతో కొత్త ఉత్సాహం వచ్చింది. 8 నెలల్లో మనం చేసిన పనుల ఫలితాలు ఇప్పుడు కనిపిస్తున్నాయి. దీనికి సమష్టి కృషే కారణం. ఇది ప్రారంభం మాత్రమే. మునుముందు మరిన్ని ఫలితాలు వస్తాయి.” - చంద్రబాబు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

“ఇప్పుడిప్పుడే పాలన గాడిన పడుతోంది. కీలకమైన ఈ సమయంలో నిర్లిప్తత, అలసత్వం కుదరదు. వేగం పెంచాల్సిందే” అని అన్ని శాఖల కార్యదర్శులు, ఆపైస్థాయి అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఎలాంటి రాగద్వేషాలకు తావులేకుండా రాష్ట్ర ప్రజలకు

మిగతా 12వ పేజీలో...

మార్చిలో మెగా డీఎస్సీ నోటిఫికేషన్
జూన్ నాటికి బడుల్లో కొత్త టీచర్లు

ఏప్రిల్ 1 నుంచి కొత్త పాస్ పుస్తకాలు
మార్చి నాటికి సర్వేరాళ్లపై జగన్ బొమ్మలు తొలగింపు

2026 జూన్ నాటికి 5 లక్షల ఇళ్లు
అవన్నీ ఒకేరోజు ప్రారంభించాలి: సీఎం చంద్రబాబు

ఇక ప్రభుత్వ సేవలన్నీ వాట్సాప్‌లోనే
ప్రజలు ఆఫీసులకు రావాల్సిన అవసరం ఉండొద్దు

దారిలో పడని ‘పోలీసు’!
20 శాఖల సేవల్లో పోలీసులకు 18వ స్థానం

12, 13లో

ఫిర్యాదుల్లో 90 శాతం భూవివాదాలే

ఏడాదైనా ఫైళ్లు క్లియర్ చేయరా?

- బాధ్యత లేకుండా పనిచేస్తున్నారు
- సమాచారం లేకుండా రావడమేంటి?
- నన్ను మెప్పించే ఉపన్యాసాలు కాదు
- పనిచేసి చూపించండి
- అధికారులపై సీఎం తీవ్ర ఆగ్రహం
- లక్ష్యాలు పెట్టుకొని పనిచేయాలి
- ఆర్థిక బాధలున్నా బకాయిలు చెల్లింపు
- 22,507 కోట్ల అప్పు కట్టాం: సీఎం

అమెరికాలో ట్రంపొచ్చె.. మార్కెట్ పోయె





- ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల మార్కెట్లు షేక్.. ‘బేర్’మంటున్న భారత స్టాక్ మార్కెట్
- ట్రంప్ అమెరికా అధ్యక్షుడైనప్పటి నుంచీ మదుపర్లకు రూ.23 లక్షల కోట్ల నష్టం
- రోజుకు సగటున లక్ష కోట్లకుపైగా లాస్.. గత 5 రోజుల్లో రూ.17 లక్షల కోట్లు ఆవిరి

“వివాహం విద్య నాశాయ..” అని నానుడి! అదే కోవలో.. “ట్రంప్ అధ్యక్షుడైతే స్టాక్‌మార్కెట్లు సర్వనాశాయ” అని ఎన్నికలకు ముందే పలువురు ఆర్థిక నిపుణులు హెచ్చరించారు. వారి అంచనాలన్నీ ఇప్పుడు నిజమవుతున్నాయి. శ్వేతసౌధంలో అడుగుపెట్టిన రోజు నుంచీ ట్రంప్ జారీ చేస్తున్న ఉత్తర్వులు, తీసుకుంటున్న నిర్ణయాలు, విధిస్తున్న సుంకాల దెబ్బకు ప్రపంచవ్యాప్తంగా స్టాక్‌మార్కెట్లు అల్లాడిపోతున్నాయి. మరీ ముఖ్యంగా మన బీఎస్ఈ సెన్సెక్స్, నిఫ్టీ50 కుదేలై.. ఈక్విటీ ఇన్వెస్టర్లు ఐదంటే ఐదు రోజుల్లో రూ.16.97 లక్షల కోట్లు నష్టపోయారు. 22 రోజుల్లో రూ.23 లక్షల కోట్లు ఆవిరైపోయాయి!!

అమెరికా అధ్యక్షుడుగా డోనాల్డ్ ట్రంప్ బాధ్యతలు చేపట్టడం ప్రపంచ ఈక్విటీ మార్కెట్లకు అశనిపాతంగా మారింది. అధికారం చేపట్టిన రోజు నుంచి ట్రంప్ తీసుకున్న పలు నిర్ణయాలు స్టాక్ మార్కెట్లను కుదేలు చేశాయి. సాధారణంగా కొత్తగా అధికారంలోకి వచ్చిన కొంత మంది నాయకులు వరుసగా కొద్దిరోజులపాటు అత్యుత్సాహంతో నిర్ణయాలు తీసుకుంటుండడం కద్దు. కానీ.. ట్రంప్ అధికారంలోకి వచ్చి 20 రోజులు దాటిపోయినా ఆయన తీరులో ఏ మార్పూ రాలేదు! వైట్‌హౌస్‌లో అడుగుపెట్టినరోజే డజన్ల కొద్దీ కార్యనిర్వాహక ఉత్తర్వులు గుప్పించిన ట్రంప్.. ఆ తర్వాత తన, మన అనే తేడా లేకుండా పలు దేశాల, పలు ఉత్పత్తుల

మిగతా 11వ పేజీలో...



సాయిరామ్

14

వైద్యుడవ్వాలనే కల కరిగిపోయింది!

కాకినాడ రంగరాయలో వైద్య విద్యార్థి బలవన్మరణం

శోక సంద్రంలో కుటుంబ సభ్యులు

కారణం తెలీక కన్నీరుమున్నీరు



ప్రసాద్

3

పెళ్లి సంబంధాలు చూస్తున్న తరుణంలో.. సాఫ్ట్‌వేర్ ఇంజనీరు దారుణ హత్య

తలను రాయికేసి కొట్టి, కత్తితో పొడిచి చంపిన దుండగులు

విజయనగరం జిల్లాలో దారుణం



నెయ్యి కల్తీలో ఇంటి దొంగలు?

- టీటీడీలోని కొందరి సహకారంతోనే అక్రమాలు!
- నెయ్యి టెండర్ల నిబంధనలు బహు కఠినం
- అయినా, తప్పుడు డాక్యుమెంట్లతో ‘ఏఆర్’కు అర్హత!
- సరైన పత్రాల్లేవని ‘భోలేబాబా’లో టీటీడీ తనిఖీలు
- అక్రమాలు బయటపడినా ఏఆర్‌లో సోదాలేవీ?
- 2019 నుంచే నెయ్యి సరఫరాలో అక్రమాలు
- భక్తుల ఫిర్యాదులు పట్టించుకోని నాటి పాలకవర్గం
- ఈ కేసు నిందితులు సూత్రధారులా.. పాత్రధారులా?
- ఇంతకీ ఆ నెయ్యి తయారైంది ఎక్కడ?.. సిట్ శోధన

(తిరుపతి - ఆంధ్రజ్యోతి)

శ్రీవారి ప్రసాదాల తయారీ కోసం టీటీడీకి ఆవు నెయ్యి సరఫరాలో అక్రమాలు మొదలైంది 2019 నుంచేనని సుప్రీంకోర్టు నియమించిన సిట్ దర్యాప్తు ఆధారంగా తేటతెల్లమవుతోంది. అంతకు మునుపు శ్రీవారి ప్రసాదాల నాణ్యతను భక్తులు ప్రశ్నించింది లేదు. గత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 2019 ద్వితీయార్థం నుంచే శ్రీవారి ప్రసాదాల నాణ్యత, రుచి వంటివాటిపై విమర్శలు, భక్తుల్లో ఆగ్రహం మొదలయ్యాయి. గతానికి భిన్నంగా నెయ్యి సరఫరా టెండర్లలో అర్హత కోసం కొన్ని డెయిరీలు అడ్డదార్లు తొక్కి తప్పుడు డాక్యుమెంట్లు సమర్పించడం అప్పటి నుంచే మొదలైంది. అంత అడ్డదిడ్డంగా పనులు చేసుకోగలిగిన డెయిరీల ప్రతినిధులకు అప్పట్లో టీటీడీలో సహకరించింది ఎవరు? సిట్ బృందం అరెస్టు చేసిన నిందితులు ఈ వ్యవహారంలో సూత్రధారులా లేక కేవలం పాత్రధారులా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. దీంతో టీటీడీకి

మిగతా 3వ పేజీలో...

పౌల్ట్రీపై పిడుగు!

- గోదావరి జిల్లాలను వణికిస్తున్న బర్డ్‌ఫ్లూ
- ఉమ్మడి జిల్లాల్లో 350కిపైగా పౌల్ట్రీలు
- వాటిలో 3 కోట్ల కోళ్లు పెంపకం
- రోజుకు 2.40 కోట్ల గుడ్లు ఉత్పత్తి
- ఇన్ఫెక్షన్ జోన్‌లోని ఫారాలు మూసివేత
- చికెన్, గుడ్ల అమ్మకాలు నిలిపివేత
- బర్డ్ ఫ్లూ భయంతో తెలంగాణ అప్రమత్తం
- ఏపీ నుంచి వచ్చే కోళ్ల వాహనాలు వెనక్కి



తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండలం కల్వచర్లలో చనిపోయిన కోళ్లు

రాజమహేంద్రవరం, తణుకు రూరల్, భీమవరం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): గోదావరి జిల్లాలను బర్డ్‌ఫ్లూ వణికిస్తోంది. తూర్పుగోదావరి జిల్లా కానూరు అగ్రహారం, పశ్చిమగోదావరి జిల్లా తణుకు రూరల్ మండలం వేల్పూరులోని కోళ్లఫారాల్లో ఉన్నట్టుండి వేలకొద్దీ కోళ్ల మరణించడం.. వాటి శాంపిల్స్‌ను పరీక్షించగా బర్డ్‌ఫ్లూ నిర్ధారణ కావడంతో

మిగతా 14వ పేజీలో...

ఒక్క బడినీ మూసేయం

14

- బడికి దూరంగా ఉండే విద్యార్థులకు నెలకు రూ.600 రవాణా ఖర్చుల కింద పది నెలల పాటు ఇస్తాం
- ఆదర్శ ప్రాథమిక పాఠశాలల్లో తరగతికి ఒక టీచర్.. ప్రతి మూడో శనివారం మధ్యాహ్నం బడికి సెలవు
- పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు.. మార్చి నాటికి 300 కోట్లు ఖర్చు చేయాలి: ఎస్పీడీ

హెచ్ఏఎల్ మీద నమ్మకం లేదు!

- ఆ సంస్థ మిషన్‌మోడ్‌తో పని చేయటం లేదు
- 11 తేజస్ ఎంకే1ఏలు సిద్ధం చేస్తామన్నారు
- ఒక్కటీ కాలేదు.. సాఫ్ట్‌వేర్ మార్పులతో సరిపోదు
- పనితీరులో సమూల మార్పు రావాలి
- వాయుసేన అధిపతి అమర్‌ప్రీత్‌సింగ్ వ్యాఖ్యలు



11

ఏపీలో ఏరోస్పేస్, డిఫెన్స్ కంపెనీల పెట్టుబడులు

11

- రూ. 2,458 కోట్ల విలువైన ఎంవోయూలు
- 8 వేల మందికి ఉపాధి: మంత్రి భరత్

సీనియర్ ఐపీఎస్ సునీల్‌కుమార్‌పై సీఐడీ విచారణ ప్రారంభం

- వైసీపీ హయాంలో పలువురిపై వేధింపులు
- అర్ధరాత్రి అరెస్టులు, థర్డ్ డిగ్రీలు
- న్యాయవాది లక్ష్మీనారాయణ సహా పలువురి వాంగ్మూలాల నమోదు

14



అదానీకి ట్రంప్ అండ!

- అమెరికాలో అదానీపై నమోదైన కేసులు బలహీనపడేలా నిర్ణయం
- విదేశీ అవినీతి కార్యకలాపాల చట్టం అమలు నిలిపివేత
- మోదీ పర్యటనకు ముందు నిర్ణయం
- ఆంధ్ర, ఒడిశా సహా 5 రాష్ట్రాల అధికార్లకు భారీ లంచాలిచ్చినట్లు అదానీపై ఆరోపణ
- ఎఫ్‌సీపీఏ చట్టం కిందే గతంలో కేసులు
- ట్రంప్ నిర్ణయంతో షేర్ మార్కెట్లలో పుంజుకున్న అదానీ సంస్థల షేర్లు

వాషింగ్టన్, ఫిబ్రవరి 11: ముడుపుల ఆరోపణలతో అమెరికాలో నమోదైన కేసులతో స్వదేశంలో, విదేశాల్లో తీవ్ర ఇరకాటంలో పడిన అదానీలకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారీ ఊరట కలిగించారు. వ్యాపారాల కోసం అమెరికా, ఇతర దేశాల వ్యాపార సంస్థలు లంచాల ఎరచూపకుండా అడ్డుకునే విదేశీ అవినీతి కార్యకలాపాల చట్టం (ఎఫ్‌సీపీఏ-1977) అమలును నిలిపివేశారు. విదేశాల్లో వ్యాపారాలు నిలబెట్టుకునేందుకు సదరు విదేశాల అధికారులకు ముడుపులు ఇచ్చిన అమెరికన్ సంస్థల ప్రాసిక్యూషన్‌ను స్తంభింపజేస్తూ సోమవారం కార్యనిర్వాహక ఆదేశాలు జారీచేశారు. సదరు చట్టం కింద గతంలో, ప్రస్తుతం తీసుకున్న

మిగతా 11వ పేజీలో...

KIMS CUDDLES®
MOTHER & CHILD CENTRE


KIMS SIKHARA HOSPITALS

Namaste Guntur!

Bringing Affordable Advanced Accessible and Quality Healthcare to our Guntur. Opening today.



Inauguration by



Shri Nara Chandrababu Naidu Garu
Hon'ble Chief Minister of Andhra Pradesh



Shri Konidela Pawan Kalyan Garu
Hon'ble Deputy Chief Minister, Panchayati Raj, Rural Development & Rural Water Supply Environment, Forest, Science & Technology



Shri Nara Lokesh Garu
Hon'ble Human Resources Development, IT Electronics & Communication, RTG Minister



Shri Satya Kumar Yadav Garu
Hon'ble Minister of Health, Family Welfare and Medical Education of Andhra Pradesh



Shri Pemmasani Chandrasekhar Garu
Hon'ble Minister of State for Communications of India & Guntur M.P



Shri Kinjarapu Ram Mohan Naidu Garu
Minister of Civil Aviation of India



Shri Lavu Sri Krishna Devarayalu Garu
Hon'ble Member of the Lok Sabha, Narasaraopet M.P



Shri Kinjarapu Atchannaidu Garu
Minister of Agriculture of Andhra Pradesh



Shri Nadendla Manohar Garu
Hon'ble Minister of Civil Supplies, Food & Consumer Affairs



Shri Anagani Satya Prasad Garu
Hon'ble Minister for Revenue, Registration and Stamps



Shri Payyavula Keshav Garu
Hon'ble Minister of Finance



Shri Anam Ramanarayana Reddy Garu
Hon'ble Minister of Endowments



Dr Ponguru Narayana Garu
Hon'ble Minister of Municipal Administration & Urban Development



Shri Kandula Lakshmi Durgesh Prasad Garu
Minister for Tourism and Culture
Government of Andhra Pradesh



Sri Gottipati Ravi Kumar Garu
Hon'ble Minister of Energy of Andhra Pradesh



Sri Nimmala Rama Naidu Garu
Minister of Water Resources of Andhra Pradesh



Shri Mohammed Naseer Ahmed Garu
Guntur East MLA

Board of Directors

Dr. B. Bhaskar Rao
Chairman & Managing Director
KIMS Group of Hospitals

Dr. B. Abhinay
Chief Executive Officer
KIMS Group of Hospitals

Adwik Bollineni
Director on Board
KIMS Group of Hospitals

D. Anitha
Director (Director Operations)
KIMS Group of Hospitals

Executive of Directors

Dr. Lakshmana Rao
Executive Director
KIMS SIKHARA Hospitals

Dr. Kolli Jaya Kishan
Executive Director
KIMS SIKHARA Hospitals

Dr. Vishnu Prasad Ravella
Executive Director
KIMS SIKHARA Hospitals

Dr. Sudheer Kumar Vadlamudi
Executive Director
KIMS SIKHARA Hospitals

Dr. Rajasekar Malempati
Executive Director
KIMS SIKHARA Hospitals

Sri. K. China Subba Rao
Executive Director
KIMS SIKHARA Hospitals

Sri. D. Krishna Prasad
Executive Director
KIMS SIKHARA Hospitals

Dr. C. Ashok
Executive Director
KIMS SIKHARA Hospitals

Date: 12th February, 2025 | **Time:** 11am **Venue:** Mangalagiri Road, Mangaldas Nagar, Guntur.

• 200-Bed Facility • 25+ Specialities • 70+ Doctors

Our Network Hospitals:

Andhra Pradesh: • Nellore • Vizag (2 Units) • Rajahmundry • Ongole • Srikakulam • Anantapur • Kurnool • Guntur | **Telangana:** • Secunderabad • Kondapur • Begumpet • Gachibowli | **Maharashtra:** • Nagpur • Nashik • Thane | **Karnataka:** Bengaluru (2 Units) | **Kerala:** • Kannur • Kollam

నెయ్యి కల్తీలో ఇంటి దొంగలు?

(మొదటి పేజీ తరువాయి)

నెయ్యి సరఫరాలో అక్రమాల వ్యవహారంపై అనుమానాలన్నీ అదే ఏడాది అధికారంలోకి వచ్చిన వైసీపీ సంబంధిత వ్యక్తులపైనే మళ్లుతున్నాయి. కాగా ఈ కేసులో టీటీడీకి సరఫరా అయిన నాణ్యత లేని నెయ్యి ఎక్కడ తయారైందన్న విషయాన్ని మాత్రం సిట్ ఇంకా తేల్చలేకపోతోంది.

తప్పుడు డాక్యుమెంట్ల సమర్పణ

టీటీడీకి లడ్డూ ప్రసాదాల తయారీ కోసం రోజువారీ 15 వేల కిలోల ఆవు నెయ్యి కావాలి. అంటే ఏడాదికి సుమారు 55 లక్షల కిలోల ఆవు నెయ్యి అవసరం అవుతుంది. టీటీడీ ఆగ్‌మార్క్ స్పెషల్ గ్రేడ్ నెయ్యి మాత్రమే శ్రీవారి ప్రసాదాల తయారీకి వినియోగిస్తుంది. ఆరు నెలలకు సరిపడా పరిమాణంలో నెయ్యి సేకరణకు టీటీడీ టెండర్లు పిలుస్తుంది. దీనికి మూడు విధానాలు అనుసరిస్తుంది. మొదటి విధానంలో జాతీయ స్థాయి డెయిరీల నుంచీ 20 లక్షల కిలోల నెయ్యి సేకరణకు ఇ-టెండర్లు పిలుస్తుంది. రెండవ విధానంలో తిరుమలకు 1,500 కిలోమీటర్ల పరిధిలోని డెయిరీల నుంచీ 10 లక్షల కిలోల ఆవు నెయ్యి సేకరణకు ఇ-టెండర్లు నిర్వహిస్తుంది. మూడవ విధానంలో ఏపీ పరిధిలోని డెయిరీల నుంచీ 5 లక్షల కిలోల ఆవు నెయ్యి సేకరణకు ఇ-టెండర్లు ఆహ్వానిస్తుంది. భారీ పరిమాణంలో నాణ్యమైన నెయ్యి సరఫరా చేయాల్సి వున్న దృష్ట్యా టీటీడీ టెండరు నిబంధనలు కఠినంగా ఉంటాయి. అయితే, ఏఆర్ డెయిరీకి వాస్తవంగా టీటీడీ టెండర్లలో పాల్గొనే అర్హత గానీ, సామర్థ్యం గానీ లేవు. దానికోసం ఏఆర్ డెయిరీ యాజమాన్యంతో భోలేబాబా డెయిరీని ఉత్తరాఖండ్‌లో నిర్వహిస్తున్న డైరెక్టర్లలో ఒకరైన పొమిల్ జైన్ అడ్డదార్లు తొక్కించారు. టీటీడీకి నెయ్యి సరఫరా చేయాలంటే ఆ డెయిరీ కనీసం రోజువారీ 2 లక్షల లీటర్ల పాల సేకరణ సామర్థ్యం కలిగి ఉండాలి. ఏఆర్ డెయిరీ రోజువారీ పాల సేకరణ సామర్థ్యం 1.45 లక్షల లీటర్లు మాత్రమే. అయితే డెయిరీ ఎండీ రాజశేఖరన్ 2022-23లో తమ డెయిరీ రోజువారీ 2.52 లక్షల లీటర్ల పాలు సేకరించినట్టు టెండర్లు దాఖలు చేసిన సందర్భంలో టీటీడీకి ఒక నకిలీ డాక్యుమెంట్ సమర్పించారు. టీటీడీకి నెయ్యి సరఫరా చేయదలిచే డెయిరీకి ఏడాదికి కనీసం 2,750 మెట్రిక్ టన్నుల ఆవు పాల కొవ్వు సేకరించే సామర్థ్యం వుండాలి. 2022-23లో ఎఫ్ఎస్ఎస్ఏఐకి ఏఆర్ డెయిరీ సమర్పించిన వార్షిక టర్నోవర్ రిటర్నుల ప్రకారం ఆ డెయిరీ ఆవు పాల కొవ్వు సేకరణ సామర్థ్యం కేవలం 1,002 మెట్రిక్ టన్నులు మాత్రమే. అయితే టీటీడీకి టెండరు వేసేటప్పుడు సమర్పించిన 2022-23 ఎఫ్ఎస్ఎస్ఏఐ వార్షిక టర్నోవరు రిటర్నుల ప్రతులలో మార్పులు చేసి ఏకంగా తమ డెయిరీ సామర్థ్యం 3,072 మెట్రిక్ టన్నులుగా చూపించారు. ఈ వ్యవహారం సిట్ దర్యాప్తులో బయటపడింది.

ఉత్పత్తి, విక్రయాల సామర్థ్యంలోనూ అదే అడ్డదారి

టీటీడీకి నెయ్యి సరఫరా చేసే డెయిరీ నెలకు కనీసం 180 మెట్రిక్ టన్నుల ఆవు నెయ్యి ఉత్పత్తి గానీ, విక్రయాలు గానీ చేసే సామర్థ్యం కలిగి ఉండాలి. దిండిగల్‌కు చెందిన ఏఆర్ డెయిరీ ఎఫ్ఎస్ఎస్ఏఐకి సమర్పించిన వార్షిక రిటర్నుల ప్రకారం 2022-23లో కేవలం 56.80 మెట్రిక్ టన్నుల ఆవు నెయ్యి మాత్రమే ఉత్పత్తి చేసింది. అయితే టీటీడీ టెండరు డాక్యుమెంట్లలో మాత్రం ఏకంగా 196.80 మెట్రిక్ టన్నుల ఆవు నెయ్యి ఉత్పత్తి చేసినట్టు తప్పుడు వివరాలు పేర్కొన్నారు. వైష్ణవి డెయిరీ సీఈవో అపూర్వ చావడా ఈ తప్పుడు డాక్యుమెంట్లను తయారు చేయగా ఏఆర్ డెయిరీ ఎండీ రాజశేఖరన్ వాటిపై సంతకాలు చేసి టీటీడీకి సమర్పించినట్టు సిట్ దర్యాప్తులో తేలింది.

సహకరించింది ఎవరు?

అర్హత లేకున్నా టెండర్లు దక్కించుకోవడం నుంచీ నాణ్యత లేని నెయ్యి సరఫరా చేయడం వరకూ భోలేబాబా, వైష్ణవి, ఏఆర్ వంటి డెయిరీలు పాల్పడిన అక్రమాలకు టీటీడీలో సహకారం అందించింది ఎవరన్న ప్రశ్న ఇపుడు ప్రధాన చర్చనీయాంశంగా మారుతోంది. టెండర్ల సమయంలో ఈ డెయిరీలు తప్పుడు డాక్యుమెంట్లు సమర్పిస్తే వాటిని నిర్ధారించుకునే వ్యవస్థ ఏదీ టీటీడీలో లేదా? కంపెనీల రిజిస్ట్రార్ కార్యాలయాల్లో డాక్యుమెంట్లు వెరిఫై చేసుకునే ప్రయత్నం ఎందుకు చేయలేదు? అన్న ప్రశ్నలకు టీటీడీ నుంచీ జవాబు లేదు. నిజానికి ఆయా డెయిరీలను, నెయ్యి తయారీ ప్లాంట్లను పరిశీలించి, అవసరమైన రికార్డులు తనిఖీ చేసే అధికారం టీటీడీకి టెండర్ అగ్రిమెంటు రూపంలో దక్కుతుంది. ఉదాహరణకు జాతీయ స్థాయి డెయిరీల కేటగిరీలో 2022లో భోలేబాబా డెయిరీ టీటీడీకి నెయ్యి ట్యాంకర్లు సరఫరా చేసిన సమయంలో టీటీడీ ప్లాంట్ ఇన్‌స్పెక్షన్ కమిటీ ఆ డెయిరీలో తనిఖీలు చేసి అక్రమాలు గుర్తించింది. టీటీడీ ఆ డెయిరీతో నెయ్యి సరఫరా కాంట్రాక్టును రద్దు చేసుకుంది. మరి అదే విధానాన్ని ఆ తర్వాత ఏఆర్ డెయిరీల విషయంలో ఎందుకు అనుసరించలేదు? ఏఆర్ డెయిరీని, దాని ప్లాంటును తనిఖీ చేయకుండా టీటీడీపై ఎవరైనా ఒత్తిడి తెచ్చారా? ఒత్తిడి లేకపోతే ఎందుకు తనిఖీ చేయలేదు? ఒకవేళ తనిఖీ చేసినా నామమాత్రంగా చేశారా? ఆ దిశగా టీటీడీపై ఏ శక్తులు లేదా ఏ ప్రలోభాలు పనిచేశాయి? తమతో టెండరు అగ్రిమెంటు కుదుర్చుకున్న డెయిరీల వాస్తవ సామర్థ్యాలను టీటీడీ ఆయా రాష్ట్రాల్లోని రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ కార్యాలయాల నుంచీ సునాయాసంగా పొందే వీలుంది. అయినా ఆ అవకాశాన్ని టీటీడీ ఎందుకు వినియోగించుకోలేదు? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇపుడు అదే అవకాశాన్ని వినియోగించుకుని సిట్ అదే రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ కార్యాలయంనుంచీ ఏఆర్ డెయిరీ భాగోతాన్ని బట్టబయలు చేసింది.

వాళ్లు సూత్రధారులా లేక పాత్రధారులా?

టీటీడీకి కల్తీ నెయ్యి సరఫరా చేసిన కేసు దాదాపు కొలిక్కి వచ్చేసినట్టే. ఇపుడు పట్టుబడిన నిందితులు భోలేబాబా డైరెక్టర్లు పొమిల్ జైన్, విపిన్ జైన్, ఏఆర్ డెయిరీ ఎండీ రాజశేఖరన్, వైష్ణవీ డెయిరీ సీఈవో అపూర్వ వినయ్‌కాంత్ చావడా... నలుగురూ కల్తీ నెయ్యి వ్యవహారానికి సూత్ర ధారులా లేక తెర వెనుక వ్యక్తులు నడిపించిన పాత్రధారులా అన్నది తేలాల్సింది. కేసు దర్యాప్తులో భాగంగా సిట్ అధికారులు దిండిగల్‌లోని ఏఆర్ డెయిరీ, తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలంలోని వైష్ణవి డెయిరీ, ఉత్తరాఖండ్ రాష్ట్రం రూర్కీలోని భోలేబాబా డెయిరీలలో తనిఖీలు చేపట్టింది. తొలుత ప్రధాన నిందితులు పొమిల్ జైన్, విపిన్ జైన్, వినయ్‌కాంత్ చావడా, రాజశేఖరన్ తదితరులు సిట్‌కు దొరక్కుండా తప్పించుకుని తిరిగారు. భోలేబాబా డెయిరీ సిబ్బంది సుమారు 40 మంది అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఇతర వ్యాపార ప్రదేశాలకు వెళ్లినా సిట్‌కు అక్కడి సిబ్బంది నుంచీ సహాయ నిరాకరణే ఎదురైంది. తర్వాత ఈ నలుగురూ పట్టుబడినా అప్పటికే వారు ఎలాంటి ఆధారాలు దొరక్కుండా తమ పాత మొబైల్ ఫోన్లను ధ్వంసం చేసేశారని సిట్ గుర్తించింది. ఈ మొత్తం వ్యవహారంలో నిందితుల తరపున కీలకంగా వ్యవహరించిన వైష్ణవి డెయిరీ ప్లాంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కలీముల్లా ఖాన్ అలియాస్ సామిర్ పరారీలో వున్నారు. అతడు వైష్ణవి డెయిరీ సీఈవో చావడాకు సన్నిహిత బంధువని సిట్ గుర్తించింది.

కల్తీ నెయ్యి తయారైంది ఎక్కడ?

టీటీడీకి నెయ్యి సరఫరా చేసేందుకు టెండరు దక్కించుకున్నది తమిళనాడు దిండిగల్‌లోని ఏఆర్ డెయిరీ. ఆ డెయిరీయే నెయ్యి తయారు చేసి టీటీడీకి సరఫరా చేయాలి. కానీ ఏఆర్ డెయిరీలో నెయ్యి తయారు కాలేదు. ఆ డెయిరీ టీటీడీకి నెయ్యి సరఫరా చేయలేదు. ఏఆర్ డెయిరీ పేరిట టీటీడీకి నెయ్యి సరఫరా చేసింది వైష్ణవి డెయిరీ డైరెక్టర్లు. కానీ ఆ వైష్ణవీ డెయిరీలో కూడా నెయ్యి తయారు కాలేదు. అక్కడి నుంచీ నెయ్యి టీటీడీకి సరఫరా కాలేదు. ఈ రెండు డెయిరీలను ముందు పెట్టి కథ నడిపించిన భోలేబాబా డెయిరీకి టీటీడీకి అవసరమైన నెయ్యి తయారు చేసే సామర్థ్యం గానీ, సరఫరా చేసే సామర్థ్యం గానీ లేవు. కానీ నెయ్యి ఆ డెయిరీ నుంచే వైష్ణవి, ఏఆర్ డెయిరీల మీదుగా టీటీడీకి చేరింది. ఇంతకీ ఏఆర్ డెయిరీ పేరుతో టీటీడీకి చేరిన నెయ్యి ఎక్కడిది? ఎవరు తయారు చేశారు? కల్తీ ఎక్కడ జరిగింది? భోలేబాబా డెయిరీకి ఆ నెయ్యి ఎలా చేరింది? అన్నది అంతుబట్టడం లేదు. ఇప్పటి దాకా సాగించిన దర్యాప్తులో సిట్ అధికారులు ఈ అంశాన్ని మాత్రం కనిపెట్టలేకపోయింది. ఇక...భోలేబాబా డెయిరీ నుంచి వైష్ణవి డెయిరీకి నెయ్యి సరఫరాకు నెల్లూరు జిల్లా ముత్తుకూరు ప్రాంతానికి చెందిన ట్యాంకర్లను వినియోగించినట్టు వెల్లడైంది. ఆ ట్యాంకర్లు నెల్లూరు జిల్లా ముత్తుకూరుకు చెందిన హనుమాన్ ట్రాన్స్‌పోర్ట్ అండ్ ఎస్‌కేడీ లాజిస్టిక్స్‌కు చెందినవిగా సిట్ గుర్తించింది. ఆ నెయ్యిని వైష్ణవి డెయిరీ 17 వేల కిలోల నెయ్యి పట్టే సొంత ట్యాంకర్ల ద్వారా ఏఆర్ డెయిరీకి సరఫరా చేసినట్టు తేల్చారు.

కల్తీ నెయ్యి నిందితుడి బెయిల్ పిటిషన్

- 'కౌంటర్ ఫైల్'కు వ్యవధి కోరిన ఏపీపీ

తిరుపతి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): టీటీడీకి కల్తీ నెయ్యి సరఫరా కేసులో రెండో నిందితుడికి బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ అతడి తరఫు న్యాయవాదులు తిరుపతి 2వ ఏడీఎం కోర్టులో మంగళవారం పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసులో ఏ2 నిందితుడైన ఏఆర్ డెయిరీ ఎండీ రాజశేఖరన్‌కు ఆరోగ్యం బాగా లేదని పేర్కొంటూ బెయిల్ కోసం కోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన 2 ఏడీఎం కోర్టు న్యాయమూర్తి ప్రవీణ్ కుమార్.. ఏపీపీ జయశంకర్‌కు నోటీసులు జారీచేశారు. బెయిల్ మంజూరు చేయవద్దంటూ అభ్యంతరం వ్యక్తంచేసిన ఏపీపీ.. కౌంటర్ ఫైల్ చేయడానికి నాలుగు రోజులు వ్యవధి ఇవ్వాలని కోర్టును అభ్యర్థించారు. ఆ మేరకు కోర్టు ఏపీపీకి గడువు ఇచ్చింది.

సిట్‌కు రూ.51 లక్షల బడ్జెట్ కేటాయింపు

శ్రీవారి లడ్డూ ప్రసాదాల తయారీకి కల్తీ నెయ్యి సరఫరా చేశారన్న ఫిర్యాదుపై సుప్రీంకోర్టు ఆదేశాలతో దర్యాప్తు చేస్తున్న సిట్(ప్రత్యేక దర్యాప్తు బృందం)కు రాష్ట్ర ప్రభుత్వం రూ.51 లక్షల బడ్జెట్ కేటాయించింది. సిట్ నిర్వహణకు నిధులు కేటాయించాల్సిందిగా డీజీపీ గత డిసెంబరు 12న లేఖ రాయగా ప్రభుత్వం ఈ మేరకు నిధులు విడుదల చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

వైసీపీ హయాంలో 30 వేల కోట్ల లిక్కర్ స్కాం

- ఢిల్లీ మద్యం కుంభకోణం కన్నా 10 రెట్లు పెద్దది: ఎంపీ సీఎం రమేశ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏపీలో రూ.30 వేల కోట్ల లిక్కర్ స్కాం జరిగింది. ఢిల్లీ మద్యం కుంభకోణం రూ.2,500 కోట్లు కంటే పది రెట్లు పెద్ద స్కాం అది' అని బీజేపీ ఎంపీ సీఎం రమేశ్ ఆరోపించారు. మంగళవారం లోక్‌సభలో జీరో అవర్‌లో ఆయన మాట్లాడారు. '2019లో వైసీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక మద్యం పాలసీని మార్చింది. మద్యం దుకాణాలను ప్రైవేటు నుంచి ప్రభుత్వ మద్యం దుకాణాలుగా మార్చింది. రూ.వేల కోట్ల అవినీతికి పాల్పడింది. మద్యం దుకాణాల్లో ఐదేళ్లలో రూ.లక్ష కోట్లకు పైగా అమ్మకాలు జరిగాయి. లావాదేవీలన్నీ నగదు రూపంలోనే జరిగాయి. ఒక్క పేమెంట్ కూడా డిజిటల్ రూపంలో తీసుకోలేదు. మద్యం దుకాణాల్లో కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగులను నియమించారు' అని రమేశ్ ఆరోపించారు. ఈక్రమంలో వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి జోక్యం చేసుకున్నారు. 'సీఎం రమేశ్ బీజేపీలో ఉంటూ టీడీపీ కోసం పనిచేస్తున్నారు. మార్గదర్శి స్కాంపై మాట్లాడినందుకు ప్రతీకారంగా మాపై ఆరోపణలు చేస్తున్నారు' అని అన్నారు.

'మద్యం'పై జగన్ పిచ్చి ప్రేలాపనలు

- వైసీపీ హయాంలో భారీగా మద్యం అక్రమాలు
- పిచ్చి బ్రాండ్లతో జనం సొమ్ము దోచేశారు
- కల్తీ బ్రాండ్లతో ప్రజల ప్రాణాలు హరించారు
- జగన్ తెచ్చిన అప్పుల్లో రూ.13వేల కోట్లు చెల్లించాల్సి ఉంది
- కూటమి వచ్చాక అంతా పారదర్శకం
- బాటిల్‌పై రూ.10 పెంపుతో నష్టంలేదు
- జగన్ మద్యం దోపిడీపై విచారణ జరుగుతోంది
- అక్రమాలు బయటపడతాయనే ఆరోపణలు
- మంత్రి కొల్లు రవీంద్ర

అమరావతి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మద్యం విధానంపై వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పిచ్చి ప్రేలాపనలు చేస్తున్నారని ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మండిపడ్డారు. మంగళవారం ఆయన అమరావతి సచివాలయంలో విలేకరులతో మాట్లాడారు. వైసీపీ హయాంలో పెద్ద ఎత్తున మద్యం అక్రమాలకు పాల్పడి పిచ్చి బ్రాండ్లతో జనం సొమ్మును దోచేశారన్నారు. 2019-2004 మధ్య కాలంలో రాష్ట్రంలో మద్య విధానాన్ని ఏ విధంగా భ్రష్టు పట్టించారో, ఎంతలా దోచుకున్నారో, కల్తీ మద్యంతో ఎంత మంది ప్రాణాలను హరించారో ప్రజలంతా చూశారన్నారు. జగన్ ప్రభుత్వం మద్యం డిపోలను తాకట్టు పెట్టి తెచ్చిన అప్పుల్లో ఇప్పటికీ రూ.13 వేల కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. నాటి పరిణామాలను దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వం మద్యం పాలసీని అత్యంత పారదర్శకంగా అమలు చేస్తుంటే, దీనిపై వైసీపీ నేతలు విమర్శలు చేయడం హాస్యాస్పదమని పేర్కొన్నారు. మద్యం షాపుల కేటాయింపు నుంచి బ్రాండ్ల పునరుద్ధరణ వరకూ అత్యంత పారదర్శకంగా అమలు చేయడం చూసి జగన్ రెడ్డి అండ్ కో ఓర్వలేకపోతున్నారన్నారు. ఏకంగా 90వేల దరఖాస్తులు వచ్చాయని, రూ.1800 కోట్ల వరకు ఆదాయం ప్రభుత్వానికి వచ్చిందన్నారు. తాజాగా సీఎం ఇచ్చిన హామీ మేరకు మార్జిన్ మొత్తాన్ని 14శాతానికి పెంచేందుకు నిర్ణయించడాన్ని కూడా వక్ర భాష్యాలు చెబుతున్నారని మంత్రి మండిపడ్డారు. ఒక్కో బాటిల్‌పై రూ.10 పెంచుతూ తీసుకున్న నిర్ణయంతో ప్రభుత్వ ఖజానాకు నష్టం అనే వార్తల్లో కూడా



నిజం లేదన్నారు. మార్జిన్ పెంచినప్పటికీ బాటిల్‌కు రూ.10 పెంచినప్పటికీ ప్రభుత్వానికి ఏటా రూ.100 నుంచి 150 కోట్ల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉందన్నారు. వాస్తవాలు ఇంత స్పష్టంగా ఉన్నా లేనిపోని అవాస్తవాలు ప్రచారం చేయడం సరికాదన్నారు. 2019-24 మధ్య కాలంలో జేబులు నింపుకోవడం కోసం రూ.60 ఉండే క్వార్టర్ రూ.200కి అమ్మారని, ప్రపంచంలో ఏ మూలనా దొరకని బ్రాండ్లను ఏపీలో ప్రజల నెత్తిన రుద్దారని విమర్శించారు. పిచ్చి మద్యం బ్రాండ్లు తెచ్చి ప్రజల ప్రాణాలు తీసిన వారే ఇప్పుడు మద్యం విధానంపై మాట్లాడుతున్నారన్నారు. గత ఐదేళ్లలో అధికారాన్ని అడ్డంపెట్టుకుని షాపుల్ని అధికారుల్ని డిస్టిలరీలను చెప్పుచేతల్లో పెట్టుకుని దోచుకున్నారన్నారు. ఆ మొత్తం దోపిడీపై విచారణ జరుగుతోందని, త్వరలోనే పూర్తి నివేదికలు వస్తాయని మంత్రి తెలిపారు. అక్రమాలు బయటపడతాయనే భయంతోనే ఆరోపణలు చేస్తున్నారన్నారు. బెల్టు షాపుల విషయంలో కూడా ప్రభుత్వం కఠినంగా ఉందన్నారు. త్వరలోనే నవోదయం 2.0 కార్యక్రమం ద్వారా సారా రహిత రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దుతామని మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు.

నులి పురుగు మాత్రలు వికటించి గిరిజన బాలిక మృతి

- అల్లూరి జిల్లా మారేడుమిల్లి మండలంలో విషాదం

రంపచోడవరం/మారేడుమిల్లి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ సిబ్బంది నిర్లక్ష్యానికి ఓ చిన్నారి ప్రాణం బలైంది. అల్లూరి జిల్లా మారేడుమిల్లి మండలం తాడేపల్లికి చెందిన కత్తుల రేష్మిత(5)తో అంగన్వాడీ సిబ్బంది మంగళవారం నులిపురుగుల మాత్రలు వేశారు. అయితే ఆ బాలిక నురగలు కక్కుకుని అపస్మారక స్థితికి చేరుకోవడంతో హుటాహుటిన రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే బాలిక మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. బాలిక మృతి చెందిన విషయం గిరిజన శాఖ మంత్రి సంధ్యారాణి దృష్టికి చేరడంతో ఆమె తీవ్రంగా స్పందించారు. రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలాన్ని తక్షణ విచారణకు ఆదేశించారు. ఆయన హుటాహుటిన తాడేపల్లి చేరుకుని విచారణ చేపట్టారు. వైద్య సిబ్బంది పర్యవేక్షణ లేకుండా, సక్రమ పద్ధతిలో మాత్రలు వేయకపోవడమే ఇందుకు కారణమని ప్రాథమిక విచారణలో గుర్తించారు. అనంతరం ప్రభుత్వానికి విచారణ అంశాలను నివేదించిన ఆయన ఇందుకు బాధ్యులుగా అంగన్వాడీ సూపర్‌వైజరు, ఏఎన్ఎం, ఆశా వర్కర్, అంగన్వాడీ టీచర్, ఫార్మాసిస్టులను సస్పెండ్ చేశారు.

ఉక్కు ఉద్యోగుల జీతాలకు హామీ

- కేంద్ర మంత్రి కుమారస్వామితో పురందేశ్వరి భేటీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్ ప్లాంట్ ఉద్యోగులకు ప్రతి నెలా జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకుంటామని కేంద్ర ఉక్కు, భారీపరిశ్రమల మంత్రి హెచ్‌డీ కుమారస్వామి హామీ ఇచ్చారని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి తెలిపారు. మంగళవారం, కేంద్ర మంత్రి కుమారస్వామి, సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మతో పురందేశ్వరి భేటీ అయ్యారు.

జగన్ లిక్కర్ స్కాంపై సీబీఐ విచారణ జరిపించాలి: ఎంపీ సానా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): 'ఏపీలో గత ప్రభుత్వ హయాంలో రూ.వేల కోట్ల లిక్కర్ స్కాం జరిగింది. దానిపై సీబీఐ విచారణ జరిపించాలి' అని రాజ్యసభలో టీడీపీ ఎంపీ సానా సతీశ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఏపీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాజ్యసభలో టీడీపీ ఫ్లోర్ లీడర్ బీద మస్తాన్‌రావుతో పాటు ఆయన మాట్లాడారు. 'ఢిల్లీ లిక్కర్ స్కాం రూ.2 వేల కోట్లే. దాని కంటే ఏపీ లిక్కర్ స్కాం పెద్దది. విచారణలో అన్నీ బయటకు వస్తాయి. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మిథున్‌రెడ్డి అటవీ భూములు, లిక్కర్ స్కాంకు సంబంధించిన అంశాలను సభలో మాట్లాడా. ప్రజల దృష్టి మరల్చేందుకే రాజ్యసభలో నా ప్రసంగానికి వైసీపీ నేతలు అడ్డుపడ్డారు. ఇష్టారీతిన మాట్లాడారు. మిథున్‌రెడ్డి, ఇతరులు నేరం రుజువైతే శిక్ష అనుభవించాల్సిందే. కూటమి ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపునకు దిగితే ఇప్పటికే వారు అరెస్టు అయ్యేవారు' అని సతీశ్ అన్నారు. ఎంపీ బీద మస్తాన్‌రావు మాట్లాడుతూ... 'వైఎస్ జగన్ చెప్పినట్లు వైసీపీ ఎంపీలు మాట్లాడుతున్నారు. పోలవరం ఎత్తు తగ్గించారని వైసీపీ ఎంపీలు మాట్లాడడం విడ్డూరంగా ఉంది. జగన్ పత్రికలో ఇష్టారీతిన రాసుకున్నా... ఆ పత్రికను చదివేవారు ఎవరూ లేరు. అది వైసీపీ కరపత్రం' అని బీద మస్తాన్ రావు ఎద్దేవా చేశారు.

ఫలించిన 15 ఏళ్ల న్యాయపోరాటం

- ఎట్టకేలకు సురేష్‌కుమార్‌కు ప్రభుత్వ ఉద్యోగం
- సీనియారిటీ, ఇతర ప్రయోజనాలు కల్పించండి.. ప్రభుత్వం, ఏపీపీఎస్సీకి హైకోర్టు ఆదేశాలు

అమరావతి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగం కోసం ప్రకాశం జిల్లాకు చెందిన సురేష్ కుమార్ అనే వ్యక్తి 15 ఏళ్లుగా చేసిన సుదీర్ఘ న్యాయం పోరాటం ఎట్టకేలకు ఫలించింది. ఆయన్ను అసిస్టెంట్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ పోస్టులో నియమించాలని హైకోర్టు తాజాగా రాష్ట్ర ప్రభుత్వం, ఏపీపీఎస్సీకి ఆదేశాలు జారీచేసింది. సురేష్ మిగిలిన అభ్యర్థుల కన్నా మెరిట్ సాధించినప్పటికీ రిజర్వేషన్ అమలు విషయంలో ప్రభుత్వం, పబ్లిక్ సర్వీస్ కమిషన్ తీరుతో అతనికి నష్టం జరిగిందని అభిప్రాయపడింది. 2010 ఏపీ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ ఉత్తర్వులు మేరకు పిటిషనర్‌కు ఉద్యోగం ఇవ్వాలని ఆదేశించింది. జనరల్ కేటగిరీ కింద పోస్టు ఖాళీ లేకుంటే సూపర్ న్యూమరీ పోస్టును సృష్టించాలని స్పష్టం చేసింది. పిటిషనర్‌కు 2007 డిసెంబరులో ఇచ్చిన నోటిఫికేషన్‌కి అనుగుణంగా నియమితులైన వారితో సమానంగా సీనియారిటీ, ఇతర ప్రయోజనాలు కల్పించాలని తెలిపింది. నెల రోజుల్లో కోర్టు ఆదేశాలు అమలు చేయాలని పేర్కొంది. ప్రభుత్వం, ఏపీపీఎస్సీ వైఖరిని తప్పుబడుతూ రూ.లక్ష చొప్పున ఖర్చులు విధించింది. ఈ మేరకు అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ ఉత్తర్వులను సవాల్ చేస్తూ ప్రభుత్వం, ఏపీపీఎస్సీ 2012లో దాఖలు చేసిన పిటిషన్లను కొట్టివేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరి, జస్టిస్ మండవ కిరణ్మయి ధర్మాసనం ఈ తీర్పు ఇచ్చింది. అసిస్టెంట్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ పోస్టుల భర్తీ కోసం ఏపీపీఎస్సీ 2007 డిసెంబర్‌లో నోటిఫికేషన్ ఇచ్చింది. అందులో 6 ఓసీ జనరల్, 4 ఓసీ మహిళలకు రిజర్వ్ చేసింది. ప్రకాశం జిల్లా కంభం మండలం లక్ష్మీకోట గ్రామానికి చెందిన సురేష్‌కుమార్ దరఖాస్తు చేశారు. అయితే పరీక్షలో మెరిట్ సాధించిన తనను పక్కనపెట్టి, మెరిట్ తక్కువ ఉన్న మహిళా అభ్యర్థులతో పోస్టులను భర్తీ చేయడంపై ఆయన 2010లో అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు.

తప్పులను కప్పిపుచ్చుకునేందుకే వైసీపీ ఎదురుదాడి

- ఎంపీ కలిశెట్టి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): 'సీఎం చంద్రబాబు ప్రతిపక్షంలో ఉండగా నాటి వైసీపీ ప్రభుత్వం ఆయనను అరెస్టు చేసింది. అది అక్రమ అరెస్టు అనీ, జగన్ తప్పు చేశాడనీ ఏపీ ప్రజలు నిరూపించారు' అని టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. మంగళవారం, మీడియా సమావేశంలో ఎంపీ మాట్లాడారు. 'సీఎం చంద్రబాబును చూసి ఏపీకి పెట్టుబడులు వస్తున్నాయి. కేంద్రం సాయం లభిస్తోంది. అభివృద్ధి కార్యక్రమాలను చూసి వైసీపీ నేతలు ఓర్వలేక పార్లమెంట్‌లో, బయట మాట్లాడుతున్న తీరు అన్యాయం. వైసీపీ నేతలు చేసిన తప్పులను కప్పి పుచ్చుకునేందుకే ఎదురుదాడికి పాల్పడుతున్నారు. ఐదేళ్ల ఏపీని దోచుకున్నారు. అస్తవ్యస్తంగా మారిన ఏపీని కఠోర దీక్షతో పట్టాలు ఎక్కించేలా సీఎం చంద్రబాబు ప్రయత్నిస్తున్నారు' అని కలిశెట్టి అన్నారు.

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ దారుణ హత్య

- తలను రాయికేసి కొట్టి, కత్తితో పొడిచి చంపిన దుండగులు



ప్రసాద్

తెర్లాం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా తెర్లాం మండలం నెమలాం గ్రామానికి చెందిన కోనారి ప్రసాద్ (28) అనే సాఫ్ట్‌వేర్ ఇంజనీరును సోమవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు హత్యచేశారు. పోలీసుల కథనం మేరకు.. ప్రసాద్ బెంగళూరులోని ఐబీఎంలో ఉద్యోగం చేస్తున్నాడు. పెళ్లి సంబంధాలు చూసుకునేందుకు ఇటీవలే స్వగ్రామానికి వచ్చాడు. సోమవారం సాయంత్రం అమ్మమ్మ ఊరు విజయరాంపురానికి వెళ్లాడు. కొద్దిసేపటి తర్వాత ఇంటికి తిరిగి బయల్దేరాడు. రాత్రి 9-30 గంటల సమయంలో గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో ప్రసాద్ మృతదేహం పడి ఉండడాన్ని చూసిన వారు.. కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. బొబ్బిలి డీఎస్పీ జి.భవ్యారెడ్డి మంగళవారం ఉదయం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్, డాగ్‌స్క్వాడ్ బృందాలు ఆధారాలు సేకరించింది. మృతదేహం మీద కత్తిగాట్లు కనిపిస్తున్నాయని, అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి నిందితులను త్వరలో పట్టుకుంటామని డీఎస్పీ తెలిపారు. ప్రసాద్ తలను ఓ రాయికేసి గట్టిగా బాదడం వల్లే చనిపోయినట్లు తెలుస్తోందని వైద్యులు చెబుతున్నారు.

నేడు గుంటూరులో కిమ్స్ శిఖర హాస్పిటల్‌ను ప్రారంభించనున్న సీఎం

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): గుంటూరు మంగళదాస్ నగర్ రోడ్‌లో బెస్ట్‌ప్రైజ్ సమీపంలో నూతనంగా నిర్మించిన కిమ్స్ శిఖర హాస్పిటల్స్‌ను బుధవారం ఉదయం పది గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించనున్నారు. అత్యాధునిక సౌకర్యాలతో 200 పడకల సామర్థ్యంతో ఈ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను నిర్మించారు. తల్లీ బిడ్డల ఆరోగ్య సంరక్షణ కోసం ఏర్పాటు చేసిన కిమ్స్ కడిల్స్ సెంటర్‌నూ ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

బీరేన్ తరువాత...

మణిపూర్ మండిపోతున్నప్పుడూ, ఊచకోతలు ఎడతెగకుండా సాగుతున్నప్పుడే బీరేన్ రాజీనామా చేసివుంటే మరింత బాగుండేది. విపక్షం ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంలో తమ ముఖ్యమంత్రి ఓడిపోవడం ఖాయమన్న భయంతో బీజేపీ పెద్దలు ముందే ఆయనను గద్దెదింపేశారు. అధిష్ఠానం ఆశీస్సులు ఏమాత్రం ఉన్నా తిమ్మినిబమ్మిని చేసి అధికారంలో కొనసాగగల సమర్థత బీరేన్‌కు లేకపోలేదు. కానీ, స్పీకర్ కేంద్రంగా సొంతపార్టీలో అసమ్మతి రాజుకుంటున్నప్పుడు ఎత్తులు వేయగల, ఎవరినీ నమ్మగల స్థితిలో పార్టీ అధిష్ఠానమే లేదు. మీతీలను ఆయుధాలు దోచుకోనివ్వండి, లూటీలు చేయనివ్వండి అని పోలీసు ఉన్నతాధికారులను ముఖ్యమంత్రి ఆదేశించింది నిజమేనని సుప్రీంకోర్టుకు సమర్పించిన ఫోరెన్సిక్ నివేదిక తేల్చిన తరువాత కూడా ఆయనను కొనసాగనివ్వడానికి చాలామంది బీజేపీ ఎమ్మెల్యేలు సిద్ధంగా లేరు. విపక్షంతో చేతులు కలిపి, వారంతా బీరేన్‌ను దింపివేసినపక్షంలో పార్టీ పెద్దలకు అంతకంటే అవమానం ఇంకేమీ ఉండదు. తెగల మధ్య తగవులుపెట్టి 650రోజులపాటు రాష్ట్రాన్ని రగల్చిన బీరేన్ సింగ్ చివరకు హోంమంత్రి దర్శనం కరువై, మహాకుంభమేళాలో మునిగి, బలవంతపు రాజీనామాతో నిష్క్రమించాల్సి వచ్చింది.

21నెలల హింసారిరంసల అనంతరం ఆయనను వదల్చుకున్న పార్టీ అధిష్ఠానం తెలివిగా అవిశ్వాస తీర్మానానికి ముందే ఆయనను దింపివేసి, వెనువెంటనే అసెంబ్లీ సమావేశాలనూ రద్దుచేసింది. రెండు సమావేశాల మధ్య గడువు ఆర్నెల్లకంటే ఎక్కువ ఉండకూడదని మీకు తెలియదా? అని ఢిల్లీ కాంగ్రెస్ నేతలు మణిపూర్ గవర్నర్‌ను ప్రశ్నిస్తున్నారు. సమావేశాల రద్దు రాజ్యాంగ విరుద్ధం కావచ్చునేమో కానీ, బీరేన్ రాజీనామా తరువాత కూడా రాష్ట్రమూ, రాజకీయమూ విపక్షాల చేతుల్లోకి పోకుండా బీజేపీ ఇలా జాగ్రత్త పడింది. బీరేన్ స్థానంలో ఎవరిని నియమించాలో బీజేపీ ఇంకా తేల్చుకోలేదని, సంబిత్ పాత్ర చర్చోపచర్చలు చేస్తున్నారని వార్తలు వస్తున్నాయి. రాష్ట్రం చేజారిపోకుండా ముందే జాగ్రత్తపడిన అధిష్ఠానం బీరేన్‌స్థానంలో ఎవరినీ కూచోబెట్టబోవడం లేదని, అంతిమంగా రాష్ట్రపతిపాలన విధించడం ద్వారా ఈ నాటకాన్ని రక్తికట్టిస్తారని వినికిడి.

సుప్రీంకోర్టు పరిశీలనలో ఉన్న టేపుల్లో బీరేన్ గొంతు 93శాతం సరిపోలిందని ట్రూత్ ల్యాబ్స్ నిర్ధారించిన ఐదురోజుల్లోనే ఆయన తప్పుకున్నారు. అది ప్రైవేటు సంస్థ కనుక, సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబరేటరీ (సిఎఫ్ఎస్ఎల్) లో పరీక్షచేయించాలని సొలిసిటర్ జనరల్ సుప్రీంకోర్టుకు చెప్పుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మరికాస్తంత సమయం సంపాదించిపెట్టారు. కానీ, జస్టిస్ ఖన్నా ఇచ్చింది మూడువారాల గడువే కనుక, సదరు ప్రభుత్వ సంస్థనుంచి ఇందుకు పూర్తివిరుద్ధమైన నివేదిక వస్తే తప్ప సుప్రీంకోర్టు నుంచి బీరేన్‌ను కాపాడటం అసాధ్యం. ఆయన ఆదివాసీ వ్యతిరేక, మీతీ అనుకూల వైఖరులు, విధానాలు పూర్తిగా ఆయన సొంతం కాదని, ఢిల్లీపెద్దల రక్షణల మధ్య ఆయన చెలరేగిపోయారని అందరికీ తెలుసు. పోలీసుల సహకారంతో, వారు అందించిన, వారినుంచి దోచుకున్న ఆయుధాలతో వారి వాహనాల్లోనే ప్రయాణిస్తూ మీతీ మిలిటెంట్ గ్రూపులు కుకీలపై అఘాయిత్యాలకు పాల్పడ్డాయన్న ఆరోపణలను ఈ ఆడియోటేపులు నిజమని నిర్ధారిస్తున్న నేపథ్యంలో, రేపు సర్వోన్నత న్యాయస్థానంలో బీరేన్ ఇరుక్కోవడం ఖాయం. కేంద్రప్రభుత్వ ప్రతినిధులకు, కమిటీలకు ఈ టేపులు ఇచ్చినా ఫలితం లేకపోవడంతో, కుకీ హ్యూమన్‌రైట్స్ ఆర్గనైజేషన్ (కోహుర్) సుప్రీంకోర్టును ఆశ్రయించాల్సివచ్చింది. మణిపూర్‌లో 21 నెలలుగా జరుగుతున్నదేమిటో ఈ టేపులు తేల్చేశాయి. బీరేన్‌కు అండగా ఉంటున్న బీజేపీ పెద్దలను కూడా బోనులో నిలబెట్టాయి. సుప్రీంకోర్టు చొరవ లేనిదే ఈ పరిణామాలు ఉండేవి కావు.

బీరేన్ తప్పుకోవాలని ఆదివాసీ తెగలు ఎప్పటినుంచో డిమాండ్ చేస్తున్నందున, ఇప్పుడు వాళ్ళు కాస్తంత శాంతపడవచ్చు. ఒకపక్క బర్మాలో సాగుతున్న అంతర్యుద్ధం మణిపూర్‌ను మరింత రాజేస్తుంటే, ఈ రాష్ట్రం కారణంగా ఈశాన్యమంతా ప్రమాదకరంగా తయారైందని అధ్యయనాలు చెబుతున్నాయి. వేలాదిమంది కేంద్ర బలగాలతో ఇంతకాలం సాధించలేనిది బీరేన్ నిష్క్రమణతో మొదలు కావచ్చును. కేవలం హింస ఆగినంతమాత్రాన శాంతి నెలకొన్నట్టు కాదు. బీరేన్ కారణంగా నిలువుగా చీలిపోయిన సమాజం ఒక్కటి కావాలి. వారూ వీరూ తేడా లేకుండా ప్రతీ మిలిటెంట్ గ్రూపునుంచీ ఆయుధాల స్వాధీనం జరగాలి. గాలివార్తలకు గ్రామాలు తగలబడుతూ, అనుమానాలు, భయాల మధ్య పరస్పర అవిశ్వాసంతో ఎవరికివారుగా ఉంటున్న అన్ని తెగలూ, జాతులూ సొంతిళ్ళకు చేరి, సయోధ్యతో జీవించగలగాలి. బీరేన్ వారసుడిగా ఓ కుకీని నియమించినా, గవర్నర్ ఏలుబడి సాగినా మణిపూర్‌కు కేంద్ర ప్రభుత్వం చేసిన అన్యాయాన్ని సరిదిద్దడం అంత సులభం కాదు.

ఆదాయాన్నిచ్చే రిజిస్ట్రేషన్ వ్యవస్థపై మరింత శ్రద్ధ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ముఖ్యమైన మూడవ అతిపెద్ద (11శాతం వాటా) ఆదాయాన్ని ఆర్జించే విభాగం రిజిస్ట్రేషన్ మరియు స్టాంపుల విభాగం. 1864 సంవత్సరం నుండి పనిచేస్తున్న ఈ శాఖ లక్ష్యం ఆస్తులకు రిజిస్టర్డ్ పత్రాల ద్వారా హక్కు కల్పించి రక్షించడం. స్టాంప్ డ్యూటీ, ట్రాన్స్‌ఫర్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజుల ద్వారా ఈ విభాగం రాష్ట్ర ఖజానాకు ఆదాయాన్ని సేకరిస్తోంది. కానీ ప్రస్తుత రిజిస్ట్రార్ కార్యాలయాల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంది. అనేక కార్యాలయాలు అద్దె భవనాలలో కనీస సౌకర్యాలు కూడా లేకుండా కొనసాగుతున్నాయి. విజయవాడ నగరంలో అత్యధిక రిజిస్ట్రేషన్లు జరిగే కార్యాలయం అయిన పటమట రిజిస్టర్ ఆఫీసులో కనీసం తాగునీరు కూడా సరిగ్గా దొరకదు.

రిజిస్ట్రార్ ఆఫీసుల్లో దస్తావేజుకు రూ.500 యూజర్స్ చార్జెస్ వసూలు చేస్తున్న పరిస్థితి ఉన్నది. ఈ ఛార్జీల ద్వారా లభించే ఆదాయాన్ని కూడా రిజిస్ట్రేషన్ శాఖ ప్రయోజనాల కోసం వాడటం లేదు. దస్తావేజు రైటర్స్ వ్యవస్థకు మరో మంచి ప్రత్యామ్నాయాన్ని ఏర్పాటు చేయగలిగితే దళారీల పాత్రను తగ్గించవచ్చు. పూర్వం లాగే డాక్యుమెంట్ రైటర్లకు లైసెన్సులు ఇవ్వాలి. రిజిస్ట్రేషన్ సేవలు పొందే సమయంలో ప్రజలు కార్యాలయాల వద్ద ఎండలో, వానలో రోడ్ల మీద వేచి చూడాల్సిన పరిస్థితి ఉన్నది. ఈ ఆఫీసులలో కనీస సౌకర్యాలను తక్షణం పెంచాలి. రాష్ట్ర ఆదాయంలో ముఖ్య పాత్ర పోషించే రిజిస్ట్రేషన్ ఆఫీసులను మెరుగుపరచాలి.

రాష్ట్రానికి నిర్దిష్ట ఏపీ స్టాంప్ చట్టం అవసరం. కర్ణాటక, గుజరాత్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాలు తమ రాష్ట్ర చట్టానికి సవరణ ద్వారా అదనపు ఆదాయాన్ని సేకరించేందుకు వీలుగా స్వంత స్టేట్ స్టాంప్ చట్టాన్ని కలిగి ఉన్నాయి. కానీ మనం ఇప్పటికీ కేంద్ర ప్రభుత్వ చట్టాన్ని అమలు చేస్తున్నాం. ఇండియన్ స్టాంప్ చట్టం 1899 నాటిది కాబట్టి పార్లమెంటు అనుమతి లేకుండా మేము సవరించలేకపోతున్నాం అని రిజిస్ట్రేషన్ శాఖ చెపుతుంది. ప్రభుత్వం దీనిపై సమీక్ష జరపాలి. ఏపీ కోసం కొత్త స్టాంప్ చట్టాన్ని తీసుకురావాలి.

రాష్ట్ర ఖజానాకి భవిష్యత్తులో సంవత్సరానికి అదనంగా దాదాపు రూ.1000కోట్లు రాబడి తేవాలంటే రిజిస్ట్రేషన్ డిపార్టుమెంట్‌కు నిర్దిష్ట స్టాంప్ చట్టం అవసరం. దీనిని ప్రజలపై పన్ను భారంగా భావించరాదు. అట్లాగే కొత్త భవన నిర్మాణాలకు యూజర్ చార్జీలు కింద వసూలయ్యే మొత్తంలో కొంత వినియోగించుకోవాలి. రాష్ట్రంలో మొత్తం రిజిస్ట్రార్ కార్యాలయాలు 294 కాగా వీటిలో దాదాపు సగం భవనాలు అద్దె భవనాలలోనే ఉన్నాయి. రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్న ప్రభుత్వ భవనాలు కూడా శిథిలమైన స్థితిలో ఉన్న పరిస్థితి. అద్దె భవనాలు కూడా సరైన సౌకర్యాలతో సక్రమంగా లీజుకు తీసుకోబడలేదు. అలానే రిజిస్ట్రేషన్ శాఖ ఉద్యోగులు 2500కు గానూ ప్రస్తుతం సుమారు 1800 మాత్రమే ఉన్నారు. ఉద్యోగుల కొరత కారణంగా ఈ ఆఫీసులలో అనధికారిక వ్యక్తుల ప్రమేయం పెరుగుతున్నది. స్కానింగ్, కేవైసీ ఆధార్ సీడింగ్ మొదలైన వాటి కోసం ప్రైవేట్ వ్యక్తులపై ఆధారపడవలసి వస్తోంది. అడ్వాన్స్‌డ్ కంప్యూటర్లు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం లేదు. ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడేందుకు సిబ్బందికి సరైన శిక్షణ లేదు. చిన్న చిన్న సర్వర్ సమస్యల కోసం ప్రైవేట్ కాంట్రాక్టర్లపై ఆధారపడాల్సి వస్తున్నది. దీనివల్ల రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన సాధారణ ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యల పరిష్కారం దిశగా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.



కూటమి ప్రభుత్వం రిజిస్ట్రేషన్ స్టాంపుల విభాగంలో లోపాలను, లొసుగులను పూర్తిగా ప్రక్షాళన చేస్తుందని, కనీస సౌకర్యాలు మెరుగుపరుస్తుందని ప్రజలు ఎదురుచూస్తున్నారు. సుదీర్ఘ పాలనానుభవం, దక్షత ఉన్న చంద్రబాబునాయుడి ద్వారానే రిజిస్ట్రేషన్ శాఖలో సంస్కరణలు సాధ్యమని ప్రజలు భావిస్తున్నారు.

ఈ-స్టాంప్ విధానం కోసం రాష్ట్ర ప్రభుత్వం స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాతో ఒప్పందం కుదుర్చుకుంది. స్టాంప్‌ల కొరత, నకిలీ స్టాంప్‌ల విక్రయం, ట్యాంపరింగ్.. వంటి సమస్యలకు ఈ-స్టాంప్ చెక్ పెడుతుందంటున్నారు అధికారులు. నాన్ జ్యుడిషియల్‌కు ఉన్న చట్టబద్ధత ఈ-స్టాంపుకూ ఉంటుంది. స్టాంప్ వెండర్లతో పాటు కామన్ సర్వీస్ సెంటర్లలో ఈ-స్టాంప్‌లు అందుబాటులో ఉంటాయి. తమకు ఎంతో కొంత కమిషన్ వచ్చేలా చూస్తే కొత్త విధానం ఎంతో బాగుంటుందని స్టాంప్ వెండర్లు చెబుతున్నారు. స్టాంప్ పేపర్ల తయారీ ఖర్చు భవిష్యత్తులో మరింత పెరిగే అవకాశముంది.

గత ప్రభుత్వ హయంలో రిజిస్ట్రేషన్ శాఖలో చోటుచేసుకున్న చలానాల కుంభకోణాన్ని ఛేదించే క్రమంలో ఆశ్చర్యగొలిపే విషయాలు వెలుగులోకి వచ్చాయి. కడప సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈ కుంభకోణం మొదట వెలుగుచూసింది. రాష్ట్రంలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 2018 నుంచి ఆన్‌లైన్ ద్వారా అప్లోడ్ చేసిన చలాన్లను అధికారులు పరిశీలించి దాదాపు అన్ని జిల్లాల్లోనూ అవకతవకలు ఉన్నట్లు గుర్తించారు. ప్రజల వెసులుబాటు కోసం ప్రభుత్వం తీసుకువచ్చిన సీఎంఎఫ్ఎస్ విధానం అక్రమార్కులకు అందివచ్చిన అవకాశంగా మారింది. ఈ విధానంలో కంప్యూటర్ ద్వారా వచ్చే చలానాలపై అధికారుల ధ్రువీకరణ సంతకాలు, సీళ్లు ఉండవు. నకిలీ చలానాలు సృష్టించడానికి ఇది అనువుగా మారింది. చలానా కట్టిన అనంతరం రిజిస్ట్రేషన్ చెల్లింపు మొత్తాన్ని ఎడిట్ చేసుకునే సాంకేతిక పరిజ్ఞానాన్ని అక్రమార్కులు వాడుకున్నారని ప్రచారం జరుగుతోంది. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద రైటర్స్‌గా పనిచేసిన వ్యక్తులే కోట్లాది రూపాయల ప్రభుత్వాదాయానికి గండి కొట్టారని పోలీసులు గుర్తించారు. కృష్ణా జిల్లా మండవల్లి, నెల్లూరు జిల్లా నాయుడుపేట, పశ్చిమ గోదావరి జిల్లా తణుకు, కర్నూలు జిల్లా నంద్యాల, గుంటూరు జిల్లా మంగళగిరి, విజయవాడ గాంధీనగర్, విశాఖ జిల్లా లంకెలపాలెం వంటి ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించిన అధికారులు నకిలీ చలానాలను, నగదును స్వాధీనం చేసుకున్నారు.

గత వైసీపీ ప్రభుత్వం ప్రయోగాత్మకంగా గ్రామ సచివాలయాల ద్వారా ఆస్తుల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ చేపట్టింది. ఈ విధానం ద్వారా ప్రజల కష్టాలు పూర్తిగా తీరిపోతాయని చెబుతూ-సచివాలయ ఉద్యోగులకు సరైన శిక్షణ ఇవ్వకుండా, అరకొర సదుపాయాలతో ఈ కార్యక్రమం ప్రారంభించారు. అయితే ఈ ప్రయోగాల వల్ల గ్రామ సచివాలయంలోని ఉద్యోగులపై ఒత్తిడి పెరిగింది తప్ప మరే సత్ఫలితమూ సమకూరలేదు. గత రెండున్నర ఏళ్ల కాలంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో కేవలం 110 ఆస్తుల రిజిస్ట్రేషన్లు మాత్రమే జరిగాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం గ్రామ సచివాలయాల్లో ఆస్తుల రిజిస్ట్రేషన్లను పూర్తిగా రద్దు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ ప్రభుత్వం రిజిస్ట్రేషన్ స్టాంపుల విభాగంలో లోపాలను, లొసుగులను పూర్తిగా ప్రక్షాళన చేస్తుందని, కనీస సౌకర్యాలు మెరుగుపరుస్తుందని ప్రజలు ఎదురుచూస్తున్నారు. సుదీర్ఘ పాలనానుభవం, దక్షత ఉన్న చంద్రబాబునాయుడి ద్వారానే రిజిస్ట్రేషన్ శాఖలో సంస్కరణలు సాధ్యమని ప్రజలు భావిస్తున్నారు.

■ యార్లగడ్డ వెంకట్రావ్
ప్రభుత్వ విప్, గన్నవరం శాసనసభ్యులు

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన ఈ-మెయిల్
editpage@andhrajyothy.com
వ్యాసాలు యూనికోడ్‌లో ఉండాలి, 800 పదాలకు మించకూడదు.

మోదీని కాంగ్రెస్ అడ్డుకోగలదా?



■ ఎ. కృష్ణారావు
ఇండియాగేట్

'రాజుకు ఒకటే నిబంధన వర్తిస్తుంది. అతడు బలంగా ఉండాలి, విస్తరిస్తూనే ఉండాలి' అని చాణక్యుడు చెప్పినట్లుగా మౌర్య సామ్రాజ్యం దేశమంతటా విస్తరించినట్లే భారతీయ జనతా పార్టీ కూడా నరేంద్ర మోదీ సారథ్యంలో దేశమంతటా విస్తరించేందుకు దండ యాత్రలు చేస్తున్నట్లు కనపడుతోంది. ఏడాది ఏడాదికీ ఆయన సారథ్యంలో ప్రతిపక్ష రాష్ట్రాల సంఖ్య తగ్గిపోతూ వస్తోంది. రెండేళ్ల క్రితం రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ బీజేపీ కైవశం కాగా క్రమంగా ఒడిషా, ఆంధ్రప్రదేశ్, హరియాణాతో పాటు ఇటీవలి కాలంలో దేశ రాజధాని ఢిల్లీ కూడా బీజేపీ లేదా బీజేపీ మిత్రపక్షాల పాలనలోకి వచ్చాయి. ప్రస్తుతం 15 రాష్ట్రాలు బీజేపీ పట్టులోకి పూర్తిగా రాగా మొత్తం 21 రాష్ట్రాల్లో ఎన్డీఏ కూటమి అధికారంలో ఉన్నది. మోదీ బలగాలు పశ్చిమ బెంగాల్, తెలంగాణతో పాటు సాధ్యమైనన్ని రాష్ట్రాల్లో చొచ్చుకువచ్చేందుకు ఉవ్విళ్లూరుతున్నాయి.

నిజానికి ఢిల్లీలో బీజేపీ పూర్వరూపమైన జన సంఘ్‌ను బలోపేతం చేయడంలో అటల్ బిహారీ వాజపేయి, లాల్‌కృష్ణ ఆడ్వాణీ కీలక పాత్ర పోషించారు. 1957లో ఎంపీగా ఉన్న అటల్ బిహారీ వాజపేయికి సహాయపడేందుకు ఢిల్లీ వచ్చిన లాల్‌కృష్ణ ఆడ్వాణీ ఢిల్లీలో జనసంఘ్ బాధ్యత కూడా చేపట్టారు. 1958లో తొలిసారి ఏర్పడిన ఢిల్లీ మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో పార్టీని గెలిపించేందుకు ఆయన తీవ్ర కృషి చేశారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, జనసంఘ్ తన తొలి సంకీర్ణ రాజకీయాలు ఢిల్లీలో కమ్యూనిస్టులతో ప్రారంభించింది. మేయర్, ఉప మేయర్ పదవులను రొటేషన్ ప్రకారం పంచుకునేందుకు జనసంఘ్, సీపీఐల మధ్య ఒప్పందం కుదరడమే అందుకు నిదర్శనం. 1970వ దశకంలో కార్పొరేషన్ ఎన్నికల్లో జనసంఘ్‌ను గెలిపించేందుకు వాజపేయి, ఆడ్వాణీతో పాటు వందలాది జనసంఘ్ కార్యకర్తలు రాత్రింబగళ్లు కృషిచేశారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా జనసంఘ్ విజయం సాధించలేదు. ఫలితాలు వెలువడిన రోజు సాయంత్రం 'ఛలో కోయీ సినిమా దేఖ్ నే చల్తీ హై' అని అటల్, ఆడ్వాణీ పహాడ్ గంజ్‌లోని ఇంపీరియల్ సినిమా థియేటర్‌కు వెళ్లి ఒక హిందీ సినిమా చూశారు. ఆ సినిమా పేరు 'ఫిర్ సుబా హోగీ' (మళ్లీ ఉదయం వస్తుంది)! ఒకప్పుడు ఢిల్లీ సింహంగా పేరొందిన మదన్‌లాల్ ఖురానా. ఆడ్వాణీ మాదిరే పాకిస్థాన్ నుంచి కట్టుబట్టలతో వచ్చినవాడే. విజయ్‌కుమార్ మల్హోత్రా, కేదార్‌నాథ్ సహానీ లాంటి నేతలతో కలిసి ఢిల్లీలో జనసంఘ్ విభాగాన్ని స్థాపించిన ఖురానా తర్వాతి కాలంలో బీజేపీని కూడా బలోపేతం చేశారు. 1993 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి 47.82 శాతం ఓట్లతో 49 సీట్లు సాధించి బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పరిచారు. ఆ తర్వాత బీజేపీ అంతర్గత కలహాలతో కూరుకుపోయింది. అప్పటి నుంచీ ఇప్పటి వరకూ ఢిల్లీలో బీజేపీ అధికారంలోకి రాలేకపోయింది.

ఢిల్లీలో 27 ఏళ్ల తర్వాత అధికారంలోకి వచ్చేందుకు బీజేపీ సామ దానభేద దండోపాయాలను ప్రయోగించింది. గత పదేళ్లుగా మోదీ, షాలు ఎంత ప్రయత్నించినా కేజ్రీవాల్‌ను ఢీకొనలేకపోయారు. కాని ఈ సారి ఢిల్లీలో అధికారంలోకి వచ్చేందుకు మోదీ, షాలు చేయని ప్రయత్నమంటూ లేదు. అన్ని రకాల ఎన్నికల వ్యూహాల్ని అవలంబించడమే కాదు, కేజ్రీవాల్‌ను ప్రజల దృష్టిలో దిగజార్చేందుకు బీజేపీ తీవ్రయత్నాలు చేసింది. అతడి అవినీతి కార్యకలాపాలను బయటపెట్టి అతడు నిజాయితీపరుడన్న భ్రమలు తొలిగేలా చేసి అధికారంలోకి రాగలిగింది. నిజానికి ఢిల్లీలో బీజేపీకి చెప్పుకోదగ్గ నాయకుడు లేనేలేడు. బీజేపీ మోదీ పేరుతోనే ఎన్నికల్లో గెలిచింది. మోదీ హయాంలో బీజేపీ రాష్ట్రాల్లో ముఖ్యమంత్రి ఎవరు అవుతారన్న దానికి ప్రాధాన్యం లేకుండా పోయింది. కేజ్రీవాల్ లాంటి బలమైన నేతలు కూడా మోదీని ఢీకొనలేక పోవడం దేశ రాజకీయాల్లో కీలక పరిణామం.

స్పష్టంగా చెప్పాలంటే కేజ్రీవాల్ తనకు తిరుగులేదన్న అహంతో ఎన్నో వ్యూహాత్మక తప్పిదాలకు పాల్పడ్డారు. తనపై మారుతున్న ప్రజాభిప్రాయాన్ని పసిగట్టలేకపోయారు. 'ఒక మద్యం సీసా బాటిల్ కొంటే మరో మద్యం సీసా ఉచితంగా ఇచ్చి మా సంసారాన్ని నాశనం చేశాడు సార్' అని ఒక పని మనిషి చెప్పింది. మద్యం కుంభకోణమే అన్ని అవినీతి కార్యకలాపాలకన్నా కేజ్రీవాల్ ప్రతిష్ఠను బాగా దెబ్బ తీసింది. ఈ కుంభకోణంలో తనను అరెస్టు చేసినప్పుడు జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సొరేన్ లా రాజీనామా చేయకుండా జైలుకు వెళ్లి కూడా ముఖ్యమంత్రిగా కొనసాగడంతో కేజ్రీవాల్‌పై సానుభూతి అన్నది లేకుండా పోయింది. జైలు నుంచి రాగానే తనను తాను మళ్లీ ముఖ్యమంత్రి పదవికి అభ్యర్థిగా ప్రకటించుకున్నారు. ఆయన జైలులో ఉన్నప్పుడు కేజ్రీవాల్ భార్య ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చుని సందేశాలివ్వడం, ముఖ్యమంత్రి అయిన అతిషీ ఆ కుర్చీలో కూర్చోకుండా మితిమీరిన భక్తి ప్రదర్శించడం తప్పుడు సంకేతాలు ఇచ్చింది. అంతే కాదు, పార్టీకోసం పనిచేసిన వారిని విస్మరించి దాదాపు 30 స్థానాల్లో ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికే కేజ్రీవాల్ సీట్లు ఇచ్చారు. మనీష్ సిసోడియా లాంటి వ్యక్తికి సీటు మార్చి అతడి ఓటమికి కారణమయ్యారు. రాజ్యసభ సీట్లను రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అమ్ముకున్నారన్న అపఖ్యాతి మూటగట్టుకున్నారు. అభివృద్ధి జన జీవనాలను మెరుగుపరచడంపై కాకుండా ఉచితాలను అధికంగా నమ్ముకున్నారు. ఉచిత విద్యుత్, ఉచిత నీరు, మహిళలకు ఉచిత బస్‌పాస్‌లు గెలిపిస్తాయనుకున్నారు. యమునలో మురికినీరు ప్రవహిస్తున్నా, రహదారులు దెబ్బతిన్నా, వాయుకాలుష్యం పెరిగిపోతున్నా, రహదారులు, కాలనీల్లో ఆక్రమణలు పెరిగిపోతున్నా పట్టించుకోలేదు. స్వంత కాళ్ల క్రింద నేల కరిగిపోతున్నా గ్రహించకుండా ఇతర రాష్ట్రాల్లో విస్తరించి జాతీయ నాయకుడుగా ఎదగాలన్న తహతహను ప్రదర్శించారు. సహజంగా ప్రాంతీయ పార్టీల అధినేతలు చేసే తప్పులనే కేజ్రీవాల్ చేశారు. ఆ తప్పుల్ని బీజేపీ పూర్తిగా సద్వినియోగపరుచుకుంది.

తమ విస్తరణ లక్ష్యాలలో మోదీ విజయవంతం కావడం అనేక ప్రశ్నలకు తావిస్తున్నది. క్రమంగా భారతదేశమంతటా బీజేపీ విస్తరించగలుగుతుందా? బీజేపీ, కాంగ్రెస్‌లతో చేతులు కలపని ప్రాంతీయ పార్టీల మనుగడ ప్రమాదంలో పడుతుందా? అసలు కాంగ్రెస్ ఎంత వరకు బీజేపీ ధాటిని తట్టుకుని నిలబడగలుగుతుంది? ఇప్పటి వరకూ బీజేపీని అడ్డుకోవాలంటే ప్రాంతీయ పార్టీలకే సాధ్యమన్న ప్రచారం జరిగింది. ఇప్పుడు అదికూడా జరిగేటట్లు కనపడడం లేదు. కేజ్రీవాల్ లాంటి నేతలు కాంగ్రెస్ ఓటు బ్యాంకును కబళించి అధికారంలోకి వచ్చిందని తెలిసినా ఆ ఓటు బ్యాంకును తిరిగి సాధించేందుకు కాంగ్రెస్ బలంగా ప్రయత్నించలేదు. కేజ్రీవాల్ ప్రభ తగ్గిపోతోందని గమనించినా ఢిల్లీలో కాంగ్రెస్ ఉధృతంగా పనిచేయనేలేదు.

ముఖాముఖి పోటీల్లో బీజేపీని ఓడించడం కాంగ్రెస్‌కు సాధ్యపడదని హరియాణా, మధ్యప్రదేశ్, రాజస్థాన్ ఎన్నికల ఫలితాలు నిరూపించాయి. కుల గణన, రాజ్యాంగం, సామాజిక న్యాయం అంటూ ఎన్ని సైద్ధాంతిక అంశాలను లేవనెత్తినా బీజేపీ ఉధృతిని కాంగ్రెస్ అడ్డుకోలేకపోతోంది. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమిని కాంగ్రెస్ నేతృత్వంలో ఇండియా కూటమి అడ్డుకోగలుగుతుందా అన్న సందేహాలు కాంగ్రెస్ శిబిరంలోనే వ్యక్తమవుతున్నాయి. ఎవరితో చర్చించినా 'కాంగ్రెస్‌కు బీజేపీని ఎదుర్కోగల శక్తి ఎక్కడుంది? హరియాణాలో జరిగింది చూశారు కదా?' అన్న ప్రశ్నలు వేస్తున్నారు. నిజానికి సార్వత్రిక ఎన్నికల్లో సీట్లు తగ్గిన తర్వాత నరేంద్రమోదీ దెబ్బతిన్న బెబ్బులిలా ప్రతి రాష్ట్రంలోనూ గెలవాలన్న కసితో సర్వశక్తులు ఒడ్డారు. వేర్వేరుగా ఎన్నికలు జరిపించి ఒక్కో రాష్ట్రంపై ప్రత్యేక దృష్టి సారించారు. హరియాణా, మహారాష్ట్రలను గెలుచుకోవడంతో మోదీకి తిరుగులేదన్న అభిప్రాయం కల్పించారు. ఇక ఢిల్లీ విజయంతో అనితరసాధ్యుడని నిరూపించుకున్నారు. రాజకీయాల్లో తమ సిద్ధాంతాలు, తమ ఉపన్యాసాలపై మాత్రమే దృష్టి పెట్టకుండా ప్రత్యర్థి బలంపై దృష్టి కేంద్రీకరించి వ్యూహరచన చేయడం అవసరం. కాంగ్రెస్ ఈ విషయంలో వెనుకబడి పోతోంది.

కేజ్రీవాల్ ఇప్పుడు కనీసం ఎమ్మెల్యే కూడా కాదు. కనుక కాంగ్రెస్ ఇప్పటి నుంచే బలంగా పనిచేసి ఢిల్లీలో తాను కోల్పోయిన ఓటు బ్యాంకును మళ్లీ సంపాదించుకునేందుకు గట్టి ప్రయత్నాలు చేసే అవకాశాలు ఉన్నాయి. ఈ ఏడాది ఆఖరులో జరిగే బిహార్ ఎన్నికల్లో తమకు రావాల్సిన సీట్లను ఇప్పుడే నిర్ణయించుకుని అన్నిటిలో గెలిచే ప్రయత్నం చేయవచ్చు. ఆ రాష్ట్రంలో గత ఎన్నికల్లో కాంగ్రెస్ 70 సీట్లకు పోటీ చేసి కేవలం 19 స్థానాలలో మాత్రమే విజయం సాధించి మహాఘట్ బంధన్ సర్కార్ ఓటమిలో కీలక పాత్ర పోషించింది. వచ్చే ఏడాది మార్చిలో జరిగే పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు ఉండదని తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీ ప్రకటించి ఒకరకంగా కాంగ్రెస్‌కు మేలే చేసారు. గత ఎన్నికల్లో ఒక్క సీటు కూడా సాధించలేకపోయిన కాంగ్రెస్ ఈసారి బెంగాల్‌లో ఓటు బ్యాంకు పెంచుకునేందుకు ఏమి చేయాలో ఇప్పటి నుంచే దృష్టి కేంద్రీకరించాల్సి ఉంటుంది. ఒడిషాలో బీజేడీ ఓడిపోవడం కాంగ్రెస్ బలోపేతం అయ్యేందుకు అవకాశాన్నిచ్చినట్లయింది. తెలంగాణలో బీఆర్ఎస్ ఓడిపోయినప్పటికీ ఆ పార్టీ తమ భావి విజయానికి అడ్డురాకుండా ఏమి చేయాలో కాంగ్రెస్ దృష్టి పెట్టాలి. ప్రాంతీయ పార్టీలు బలహీనపడడం ఒక రకంగా కాంగ్రెస్‌కు సదవకాశంగా భావించాలి. ఈ నేపథ్యంలో ఇండియా కూటమిలో ఇప్పటికే ఉన్న పార్టీలతో స్నేహ సంబంధాలు పటిష్ఠం చేసుకుంటూనే కూటమి ఉనికిలో లేని రాష్ట్రాల్లో బీజేపీతో ముఖాముఖి పోరుకు కాంగ్రెస్ బలంగా సిద్ధపడితే కాని ఆ పార్టీ కోలుకునే అవకాశాలు లేవు. విచిత్రమేమంటే నరేంద్రమోదీ ఇప్పటికీ కాంగ్రెస్‌ను తన బలమైన ప్రత్యర్థిగానే భావిస్తున్నట్లున్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలుపుతూ పార్లమెంటు ఉభయ సభల్లో చేసిన ప్రసంగాల్లో అత్యధిక సమయాన్ని గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాల తప్పుల్ని ఎండగట్టేందుకే వినియోగించుకున్నారు. మోదీ విమర్శలను సవాలుగా తీసుకొని బీజేపీతో బలమైన పోరుకు కాంగ్రెస్ తనను తాను సమాయత్తం చేసుకోగలదా?

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)



ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇప్పటికీ కాంగ్రెస్‌నే తన బలమైన ప్రత్యర్థిగా భావిస్తున్నట్లున్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలుపుతూ పార్లమెంటు ఉభయ సభల్లో చేసిన ప్రసంగాల్లో అత్యధిక సమయాన్ని గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాల తప్పులను ఎండగట్టేందుకే వినియోగించుకున్నారు. మోదీ విమర్శలను సవాలుగా తీసుకొని బీజేపీతో బలమైన పోరుకు కాంగ్రెస్ తనను తాను సమాయత్తం చేసుకోగలదా?

పెట్టుబడుల ప్రకటనలతో సరిపోలని ప్రగతి

ప్రపంచ ఆర్థిక వేదిక (వరల్డ్ ఎకానమిక్ ఫోరమ్–డబ్ల్యుఇఎఫ్) వార్షిక సమావేశాలను, అంతర్జాతీయ పెట్టుబడుల అవగాహన ఒప్పందాలకు పరిమితం చేయకుండా, పారిశ్రామిక, ఆర్థిక, సామాజిక రంగాలలో నిష్ణాతులైన పలువురు ప్రపంచస్థాయి ప్రభావశీలులైన వ్యక్తులతో దీర్ఘకాలిక పరిచయాలు నిలుపుకోవటానికీ, వర్తమానంలోనూ భవిష్యత్తులోనూ ప్రపంచ దిశ దశ ఏమిటి అనే విషయంలో అవగాహన కలగడానికీ అవకాశంగా ఉపయోగించుకోవాలని ఆర్థిక విశ్లేషకుల అభిప్రాయం. ఇంచుమించు ఇదే అభిప్రాయాన్ని దావోస్ పర్యటన ముగించుకుని వచ్చిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కూడా వెల్లడించారు. ఇటీవలి డబ్ల్యుఇఎఫ్ దావోస్ వార్షిక సమావేశంలో, భారత కంపెనీలతో సహా అంతర్జాతీయ పెట్టుబడి సంస్థలతో పెద్ద ఎత్తున అవగాహన ఒప్పందాలు చేసుకుంటున్నట్లు కొందరు ముఖ్యమంత్రుల అవాస్తవ ప్రకటనల నేపథ్యంలో ఇలాంటి విశ్లేషణలకు ప్రాముఖ్యత వున్నదనాలి.

డబ్ల్యుఇఎఫ్ స్విట్జర్లాండ్‌లోని ఒక అంతర్జాతీయ ప్రభుత్వేతర సంస్థగా 1971 జనవరి 24న జర్మన్ ఇంజనీర్, ఆర్థికవేత్త క్లాస్ స్క్వాబ్ తన 33వ ఏట యూరోపియన్ మేనేజ్‌మెంట్ ఫోరమ్ పేరుతో స్థాపించారు. దీని లక్ష్యం ప్రపంచ ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచడం; వ్యాపార, రాజకీయ, విద్యావేత్తలతో పాటు సమాజంలోని ఇతర ప్రతిభాశీలురైన నాయకులను ఒక ఉమ్మడి వేదిక మీదకు చేర్చి, వార్షిక సదస్సులు నిర్వహించి, ప్రపంచ, ప్రాంతీయ, పారిశ్రామిక విధానాలను రూపొందించడం. ఇటీవల ముగిసిన 54వ డబ్ల్యుఇఎఫ్ వార్షిక సమావేశం జనవరి 15–19 తేదీల మధ్య దావోస్‌లో జరిగింది.

ఇందులో అంతర్జాతీయ సంస్థల, ప్రపంచ ప్రఖ్యాత కంపెనీల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భారతదేశం నుండి గతంలో కంటే అత్యధిక సంఖ్యలో 133 మంది ప్రతినిధులు ('ఒకే బృందం, ఒక భారతీయ ప్రదర్శన' అనే థీమ్‌తో) హాజరయ్యారు. వీరిలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటక, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల ప్రతినిధులు కూడా ఉన్నారు. ఐదుగురు కేంద్ర మంత్రులు, ముగ్గురు రాష్ట్ర ముఖ్యమంత్రులతో సహా, వివిధ రంగాల నుండి సుమారు 100 మంది సీఈఓలు పాల్గొన్నారు.

యూరోపియన్ మేనేజ్‌మెంట్ నిపుణలకు, అమెరికన్ మేనేజ్‌మెంట్ మెళకువలను, విధివిధానాలను నేర్పించడమనే క్లాస్ స్క్వాబ్ ప్రారంభ ఆలోచన క్రమంగా ఆర్థిక, సామాజిక సమస్యలపై దృష్టి పెట్టడంగా మార్పు చెందింది. 1971 సంవత్సరం నాటి ప్రారంభ సమావేశానికి 400 మంది దిగ్గజ యూరోపియన్ వ్యాపారవేత్తలను, వివిధ రంగ నిపుణులను ఆహ్వానించి, స్క్వాబ్ వ్యూహాత్మకంగా తక్షణ, భవిష్యత్తు నిధులను సమీకరించాడు. స్విస్ ఫెడరల్ ప్రభుత్వ పర్యవేక్షణలో లాభాపేక్షలేని సంస్థగా స్థాపించబడిన డబ్ల్యుఇఎఫ్ వార్షిక సమావేశాలు నిర్వహించడం ఆనవాయితీగా సాగుతున్నది.

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు 2015లో దాలియాన్‌లో జరిగిన అలాంటి ఒక ప్రత్యేక సమావేశంలో పాల్గొని, తనదైన ప్రత్యేక శైలిలో, తెలంగాణను పెట్టుబడుల స్వర్గంగా ప్రచారం చేయడంలో సఫలమయ్యారు. ఆ సమావేశంలో ఆయన రాజనీతిజ్ఞతతో చేసిన ఉపన్యాసంలో భారత ఆర్థిక వ్యవస్థను సమర్థించడం, చైనా అభివృద్ధిని ప్రశంసించడం, తెలంగాణ సాధించిన అభివృద్ధిని తెలియచేయడం విశేషం.



ప్రపంచ ఆర్థిక వేదిక అంతర్జాతీయ భాగస్వామ్యాలను నిర్మించేందుకు, భాగస్వామ్య దేశాల ప్రతినిధులు పెట్టుబడులను ఆకర్షించేందుకు విశిష్టమైన వేదికగా ఎదుగుతున్నప్పటికీ, ఆర్థికాభివృద్ధి, ఉద్యోగ ఉపాధి కల్పన వంటి వాస్తవిక ప్రయోజనాలను ఎంతవరకు సాధిస్తున్నదీ అనేదానిపై అనుమానాలు వ్యక్తమవుతూనే ఉన్నాయి.

ప్రత్యేక ఆహ్వానితులకే ప్రపంచ ఆర్థిక వేదిక సమావేశాల్లో పాల్గొనే వీలుంది. ఆర్థిక, రాజకీయ రంగంలో ప్రధాన పాత్రదారులు, క్లిష్టతరమైన ప్రపంచ సమస్యలను పరిష్కరించడం లాంటి డబ్ల్యుఇఎఫ్ లక్ష్యాలను ముందుకు తీసుకుపోగలిగే వారు సమావేశాలకు ఆహ్వానితులు. పెట్టుబడుల అవకాశాల కోసం తెరవెనుక లాబీయింగ్ చేయడానికి ఈ వేదికను ఉపయోగించుకోవచ్చు. బహుశా అందువల్లనే, భారతదేశం నుండి ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు ఈ వేదిక వార్షిక సమావేశాలలో పాల్గొంటారు. నియంత్రణల సడలింపునకు, మార్కెట్ స్వేచ్ఛకు ప్రాధాన్యమిచ్చే 'నయా ఉదారవాద విధానాల' వేదికగా డబ్ల్యుఇఎఫ్ మారుతున్నదన్న విమర్శ వస్తున్నది. బహుశా ప్రజల సార్వజనీన, విస్తృత ప్రయోజనాలకు ఈ వేదిక సరిపడకపోవచ్చునేమో. ఏదేమైనా, అభివృద్ధి చెందని, చెందుతున్న దేశాల పెట్టుబడి అవకాశాలను మెరుగుపరచుకోవడానికి ఇది ప్రధాన వేదికే.

నారా చంద్రబాబునాయుడు 1990–2000 మధ్య కాలంలో, ప్రపంచ ఆర్థిక వేదిక సమావేశాల్లో పాల్గొన్న తొలి భారతీయ ముఖ్యమంత్రులలో బహుశా ప్రథముడు కావచ్చు. ఆయన ఆ వేదికను చాకచక్యంగా ఉపయోగించుకుని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని విదేశీ ప్రత్యక్ష-పరోక్ష పెట్టుబడుల కేంద్రంగా మలిచారు. హైదరాబాద్‌ను ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కేంద్రంగా రూపొందించి, దేశ ఐటీ వృద్ధిలో ఆయన నిర్వహించిన పాత్ర అమోఘం. ఈసారి కూడా చంద్రబాబునాయుడు వార్షిక సమావేశంలో పాల్గొన్నారు. మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్‌తో చర్చలు జరిపారు. అలాగే, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 2023లోనూ, ఇప్పుడూ కూడా పాల్గొని అమెజాన్, సన్ పెట్రోకెమికల్స్, టిల్‌మన్ గ్లోబల్ హోల్డింగ్స్ వంటి హేమాహేమీ సంస్థల నుండి రూ.1.78లక్షల కోట్ల విలువైన పెట్టుబడులను తెలంగాణకు సాధించారు. ఈ పెట్టుబడుల ద్వారా సుమారు 49,550 మందికి ఉద్యోగ అవకాశాలు కలగనున్నట్లు ప్రభుత్వ అంచనా. ఇందుకు ముఖ్యమంత్రిని, ఆయన సహచర ప్రతినిధుల బృందాన్ని అభినందించాలి.

ప్రపంచ ఆర్థిక వేదిక అంతర్జాతీయ భాగస్వామ్యాలను నిర్మించేందుకు, భాగస్వామ్య దేశాల ప్రతినిధులు పెట్టుబడులను ఆకర్షించేందుకు విశిష్టమైన వేదికగా ఎదుగుతున్నప్పటికీ, ఆర్థికాభివృద్ధి, ఉద్యోగ ఉపాధి కల్పన వంటి వాస్తవిక ప్రయోజనాలను ఎంతవరకు సాధిస్తున్నదీ అనేదానిపై అనుమానాలు వ్యక్తమవుతూనే ఉన్నాయి. చంద్రబాబునాయుడు పాలన చేసిన రోజుల నుండి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తదనంతర తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఇతర నాయకులు ఈ వేదికను సద్వినియోగం చేసుకుని, బిలియన్ డాలర్లలో పెట్టుబడులు పొందినట్లు ప్రకటనలు చేస్తున్నారు. ఈ ప్రకటనలు ఎంతమేరకు దీర్ఘకాలిక అభివృద్ధి సాధించడానికి దోహదపడుతాయనేది కూడా 'బిలియన్ డాలర్ల ప్రశ్నే'! లేదా, రాజకీయ స్వప్రయోజనాలను ప్రచారం చేసుకోవడానికేనా అన్నది కూడా ప్రశ్నార్థకంగా మిగిలిపోతుంది.

ఈ నేపథ్యంలో, జనాభా సమస్యను మొట్టమొదట సూత్రీకరించిన విశ్వవిఖ్యాత బ్రిటీష్ ఆర్థికవేత్త రాబర్ట్ థామస్ మాల్థస్ 'జనాభా సిద్ధాంతాన్ని' ప్రపంచ ఆర్థిక వేదికలో రాజకీయ నాయకులు ప్రకటించే బిలియన్ డాలర్ల పెట్టుబడులతో పోల్చి చూస్తే ఆసక్తికరంగా ఉంటుంది. ఆహారధాన్యాల పెరుగుదల రేటు కంటే జనాభా పెరుగుదల రేటు హెచ్చుగా ఉంటుందని మాల్థస్ తన సిద్ధాంతంలో వివరించాడు. ఆహార ధాన్యాలు అంకశ్రేణిలో పెరిగితే, జనాభా గుణశ్రేణిలో పెరుగుతుంది. అంటే ఆహార ధాన్యాల వృద్ధి అంకశ్రేణి క్రమంలో– అంటే 1, 2, 3, 4, 5... పద్ధతిలో పెరుగుతుంటే, జనాభా వృద్ధి గుణశ్రేణి క్రమంలో– అంటే, 1, 2, 4, 8, 16... పద్ధతిలో పెరుగుతుంది. డబ్ల్యుఇఎఫ్ వేదిక ఆధారంగా జరిగే అవగాహనా ఒప్పందాలు, దరిమిలా అవి కలిగించే వాస్తవ ప్రయోజనాల మధ్య కూడా ఇలాంటి అసమానతలే ఉన్నాయి.

పెట్టుబడుల ప్రకటనలు ఆర్థిక ప్రగతి, అభివృద్ధి, భారీ ఉద్యోగ–ఉపాధి కల్పనల గురించి ఆశలు రేకెత్తిస్తాయి. కానీ ఈ ప్రకటనల స్థాయిలో వాస్తవిక ఫలితాలు ఉండటం లేదు. నిధుల విడుదల, మౌలిక ప్రాజెక్టుల అమలు, క్షేత్రస్థాయిలో ఆర్థిక ప్రయోజనాలు సాధించడంలో అనేక నియంత్రణ సమస్యలు, ఆర్థిక అనిశ్చితులు అడ్డుగా నిలుస్తున్నాయి. ఈ అసమానత కారణంగా అభివృద్ధి అంతరం ఏర్పడుతోంది. వాగ్దానాల ప్రకారం ఆర్థిక మార్పు సాధించడంలో విఫలమవ్వడం వల్ల సంశయాలు, విలంబం, విధాన మార్పులు చోటుచేసుకుంటున్నాయి. కాబట్టి పెట్టుబడుల ప్రకటనలు వాస్తవ ప్రగతితో అనుసంధానమయ్యేలా జాగ్రత్తపడాలి.

● వనం జ్వాలా నరసింహారావు



● కల్యాణం.. కమనీయం



పెనుగంచిప్రోలులో గోపయ్య సమేత తిరుపతమ్మ కల్యాణం కనుల పండువగా మంగళవారం రాత్రి జరిగింది. అమ్మవారి వంశీకుల తరపున కొల్లా వెంకట చంద్రమౌళి, ఉషా దంపతులు, గోపయ్య వంశీకుల తరపున కాకాని వెంకట శ్రీనివాసరావు - కృష్ణ వేణి దంపతులు పట్టు వస్త్రాలు, మంగళ సూత్రాలు, పూజాద్రవ్యాలను మేళతాళాలు మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకొచ్చారు. కల్యాణ తంతును ప్రధాన అర్చకుడు మర్రి బోయిన గోపిబాబు ఆధ్వర్యంలో ఆలయ పురోహితుడు శివరాం బొట్ల ఆంజనేయశర్మ శాస్త్రోక్తంగా నిర్వహించారు. కల్యాణం వీక్షించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు.

6లో



గుణదల మేరీమాత ప్రార్థన మందిరం వద్ద భక్తుల రద్దీ



n కొండంత విశ్వాసం

గుణదల మేరీమాత మహోత్సవాలు మంగళవారం ఘనంగా ముగిశాయి. చివరి రోజు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. కొండపైకి వెళ్లే మార్గాలన్నీ కిటకిటలాడాయి. కొండంత విశ్వాసంతో మరియమాతను స్మరిస్తూ భక్తులు కొవ్వొత్తులు వెలిగించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలకు విదేశీయులు హాజరయ్యారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

6లో

బర్డ్‌ఫ్లూ భయం



పౌల్ట్రీ ఫామ్‌ను పరిశీలిస్తున్న పశుసంవర్ధకశాఖ వైద్యుడు

ఉభయగోదావరి జిల్లాల్లో బర్డ్‌ఫ్లూ ఉన్నట్లు నిర్ధారణ

ఉమ్మడి కృష్ణాజిల్లా అధికారులు అప్రమత్తం

- ● పొరుగు జిల్లాల నుంచి కోళ్లు, కోడిగుడ్లు దిగుమతి కాకుండా జాగ్రత్తలు
- ● పదిరోజుల పాటు అప్రమత్తంగా ఉండాలన్న కృష్ణా కలెక్టర్ బాలాజీ
- ● పడిపోయిన చికెన్, కోడిగుడ్ల ధరలు, విక్రయాలు



బర్డ్‌ఫ్లూ భయం ఉమ్మడి కృష్ణాజిల్లాను వణికిస్తోంది. ఉమ్మడి గోదావరి జిల్లాల్లో నిర్ధారణ కావడంతో అధికారులు అప్రమత్తం అయ్యారు. ఆయా జిల్లాల నుంచి కోళ్లు, కోడిగుడ్లు దిగుమతి కాకుండా చర్యలు తీసుకుంటున్నారు. పది రోజుల పాటు అందరూ అప్రమత్తంగా ఉండాలని కృష్ణాజిల్లా కలెక్టర్ బాలాజీ ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. బర్డ్‌ఫ్లూ ప్రభావం మాంసం దుకాణాలు, కోడి గుడ్ల వ్యాపారులపై పడింది. కొనుగోళ్లు బాగా తగ్గిపోయాయి. బర్డ్‌ఫ్లూ నుంచి కోళ్లను కాపాడుకునేందుకు పౌల్ట్రీఫామ్ యజమానులు విశ్వప్రయత్నం చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం/విజయవాడ: జిల్లాలోని చల్లపల్లి, మొవ్వ, మోపిదేవి, ఘంటసాల, పెదపారుపూడి తదితర ప్రాంతాల్లో పౌల్ట్రీఫామ్‌లు ఉన్నాయి. వీటిలో 36 లక్షల లేయర్, బ్రాయిలర్ కోళ్ల పెంపకాలు జరుగుతున్నాయి. ఇప్పటి వరకు జిల్లాలో బర్డ్‌ఫ్లూ ఆనవాళ్లు లేవని జిల్లా పశుసంవర్థకశాఖ జేడీ ఎన్‌సీహెచ్.నరసింహులు తెలిపారు. బర్డ్ ఫ్లూ సోకుతుందనే కారణంతో చికెన్, కోడిగుడ్లను కొనుగోలు చేసేందుకు, తినేందుకు ప్రజలు జంకుతున్నారు. ఉమ్మడి గోదావరి జిల్లాలో బర్డ్‌ఫ్లూ సోకినట్లుగా రుజువు కావడంతో జిల్లాపైనా ఈ ప్రభావం పడుతుందనే భయం పౌల్ట్రీ యాజమానులను వెంటాడుతోంది.

అధికార యంత్రాంగం అప్రమత్తం

తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని పౌల్ట్రీఫామ్‌లలో అధిక సంఖ్యలో కోళ్లు చనిపోతుండటంతో వీటి నమూనాలను భోపాల్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హై సెక్యూరిటీ యానిమల్ డీసీజెస్ ల్యాబ్‌కు పంపారు. అక్కడ నుంచి వచ్చిన నివేదికలో బర్డ్‌ఫ్లూగా నిర్ధారించారు. దీంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. కృష్ణాజిల్లాకు ఉభయ గోదావరి జిల్లాల నుంచి కోళ్లు, కోడి గుడ్లు అధికంగా దిగుమతి అవుతూ ఉంటాయి. ఆ జిల్లాల నుంచి దిగుమతి చేసుకోవద్దని, కోళ్లను, కోడిగుడ్లను రవాణా చేసే వాహనాలను కూడా జిల్లాలో ప్రవేశించకుండా నిఘా ఏర్పాటు చేయాలని కలెక్టర్ బాలాజీ మంగళవారం అధికారులను ఆదేశించారు. జిల్లాలోని

మిగతా 8లో..

తగ్గిన కోడిమాంసం విక్రయాలు



ఉమ్మడి కృష్ణాజిల్లాలోని చికెన్ దుకాణాలకు కోళ్లు కంచికచర్ల, నందిగామ, నూజివీడు, ఏలూరు, నరసరావుపేటతోపాటు తెలంగాణ ప్రాంతాల నుంచి వస్తాయి. బర్డ్‌ఫ్లూ మాంసం వ్యాపారంలో భిన్న పరిస్థితులను చూపిస్తోంది. అమ్మకాలు తగ్గిపోయి వ్యాపారులు నానా ఇబ్బందులు పడుతుంటే పౌల్ట్రీలు మాత్రం కోళ్ల ధరలను పెంచుతున్నాయి. ఉమ్మడి కృష్ణాజిల్లాలో సుమారుగా 2 వేల నుంచి 3 వేల వరకు కోడిమాంసం దుకాణాలు ఉన్నాయి. ఒక్కో దుకాణంలో సీజన్‌లో రోజుకు 20 నుంచి 30 కోళ్లను కోస్తారు. అదే ఆదివారం రోజున 150 కోళ్ల వరకు కోస్తారు. బర్డ్‌ఫ్లూ ప్రభావంతో రోజుకు పది కోళ్లకు మించి కోయలేక పోతున్నామని వ్యాపారులు చెబుతున్నారు. ఆదివారం రోజున దారుణంగా 70 కోళ్లకు కోతలు పడిపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోడిమాంసం అమ్మకాలు తగ్గిపోవడంతో గుడ్డు ధరలు క్రమంగా పతనమవుతున్నాయి. కోడిగుడ్డు ధర కొద్దిరోజుల కిందటి వరకు ఏడు రూపాయలు పలికేది. ఇప్పుడు అది కాస్త ఐదు రూపాయలకు పడిపోయింది.

సమస్య నుంచే సంపద సృష్టి

కోకో 'పీట్' ఐడియా సూపర్ హిట్



- పారేసిన కొబ్బరి బొండాల నుంచి కోకో పీట్, కోకో పీచు
- నగర ప్రజలకు మేలు, కార్పొరేషన్‌కు ఆదాయం

8లో

ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ల పరిశీలన పూర్తి

- 10 నామినేషన్లు తిరస్కరణ
- 30 మంది అభ్యర్థుల నామినేషన్లకు ఆమోదం

గుంటూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కృష్ణా - గుంటూరు పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గం ఎన్నికల నామినేషన్ల పరిశీలన గుంటూరు కలెక్టరేట్‌లోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో మంగళవారం పూర్తయ్యింది. మొత్తం 40 మంది అభ్యర్థులకు చెందిన 69 నామినేషన్లను అధికారులు పరిశీలించారు. 10 మంది అభ్యర్థుల నామినేషన్లను వేర్వేరు కారణాలతో తిరస్కరించారు. 30 మంది నామినేషన్లను ఆమోదిస్తున్నట్లు ఆర్వో నాగలక్ష్మి ప్రకటించారు. ఈ కార్యక్రమానికి అబ్జర్వర్ వి.కరుణ హాజరయ్యారు. కాగా నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఈ నెల 13వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు ఉంది. ఆ తర్వాత తుది అభ్యర్థుల జాబితాను ఎన్నికల సంఘం నిబంధనల మేరకు రూపొందించి విడుదల చేస్తారు. ఆ వెంటనే బ్యాలెట్ పేపర్ ముద్రణ ప్రక్రియ చేపడతారు. నామినేషన్ల పరిశీలనలో జాయింట్ కలెక్టర్ భార్గవ తేజ, ఏఆర్వో షేక్ ఖాజావలి, డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

పది పరీక్షలకు పగడ్బందీ ఏర్పాట్లు

- అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- జిల్లాలో 31,231మంది.. 168 పరీక్షా కేంద్రాలు : కలెక్టర్ లక్ష్మీశ

6లో

మార్చి కల్లా అందుబాటులోకి సీసీపీ!

ఇక విదేశాలకు మామిడి పల్ప్ ఎగుమతులు

మామిడి రైతులకు మంచి రోజులు!

వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో ఏడాదిగా మూలనపడిన కోర్ ప్రాసెసింగ్ ప్లాంట్

కాంట్రాక్టు సంస్థను సాగనంపేందుకు ఏపీఐఐసీ చర్యలు

- కొత్త కాంట్రాక్టర్‌కు నిర్వహణ బాధ్యతలు అప్పగించేందుకు సిద్ధం
- ప్లాంట్ పునరుద్ధరణకు కృషి చేస్తున్న గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ

మామిడి రైతులకు ఇక మంచి రోజులు రానున్నాయి. మల్లవల్లిలోని కోర్ ప్రాసెసింగ్ సెంటర్ (సీపీసీ) యూనిట్ మార్చిలో అందుబాటులోకి రాబోతోంది. మామిడి సీజన్‌లో పల్ప్ ఎగుమతులను ప్రోత్సహించేందుకు అవసరమైన చర్యలను ఏపీఐఐసీ అధికారులు చేపట్టారు. ఇదే జరిగితే ఈ మామిడి సీజన్‌లో రైతులకు బహుళ ప్రయోజనకరంగా ఉంటుంది. గత వైసీపీ ప్రభుత్వం నిర్వాకంతో ఏడాదిగా మూలనపడి ఉన్న కోర్ ప్రాసెసింగ్ సెంటర్‌ను పునః ప్రారంభించేందుకు గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు కృషి చేస్తున్నారు.



కోర్ ప్రాసెసింగ్ ప్లాంట్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): మల్లవల్లిలోని మోడల్ ఇండస్ట్రియల్ పార్క్ (ఐపీ)కు అనుబంధంగా ఉంటున్న మెగా ఫుడ్ పార్క్‌లోని ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల కామన్ అవసరాలైన పల్ప్, ప్యాకింగ్, కోల్డ్ స్టోరేజ్ తదితరాలను తీర్చేందుకు వీలుగా సీపీసీని ఏర్పాటు చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో సీపీసీని వివాదాస్పదం చేశారు. సీపీసీ లక్ష్యాన్ని నీరుగార్చేలా ఓ ఫ్లోర్ మిల్ యాజమాన్యానికి నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. ఫ్లోర్ మిల్ యాజమాన్యం దీనిని సరిగా నిర్వహించకపోవటంతో పాటు బిల్లుల పేరుతో సీపీసీ కార్యకలాపాలనే నిలుపుదల చేసింది. కిందటేడాది మ్యాంగో పల్ప్ తీసి ఎగుమతులు చేయాలనుకున్న వ్యాపారులకు ఫ్లోర్ మిల్ యాజమాన్యం ఝలక్ ఇచ్చింది. ఆ తర్వాత పూర్తిగా ప్లాంట్ మూలన పడటంతో మెగా ఫుడ్ పార్క్‌లో పరిశ్రమలు ఏర్పాటు చేసిన ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు కూడా ఇబ్బందికరంగా మారింది. కూటమి ప్రభుత్వం వచ్చాక.. సీపీసీ పునఃప్రారంభానికి చర్యలు చేపట్టింది. స్థానిక ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు కూడా కొంత కాలంగా మల్లవల్లిపై దృష్టి సారించి పునరుద్ధరణ చర్యలు చేపట్టేందుకు కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా సీపీసీని కూడా మార్చి నాటికి ఎట్టి పరిస్థితుల్లో

మిగతా 8లో..



అమ్మవారి సేవలో ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ దంపతులు

కన్నుల పండువగా తిరుపతమ్మ కల్యాణం

» వైభవంగా పెద్ద తిరునాళ్లు ప్రారంభం

పెనుగంచిప్రోలు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : శ్రీ తిరుపతమ్మ అమ్మవారి పెద్ద తిరునాళ్ల మహోత్సవాలు మంగళవారం ఉదయం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలుత ఆలయ డిప్యూటీ కమిషనర్ బీహెచ్ వీఎస్ఎన్ కిషోర్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఎల్.రమాలు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అఖండ జ్యోతి స్థాపన చేసి ఉత్సవాలను లాంఛనంగా ప్రారంభించారు. శివాలయం అర్చకులు రేలంకి



అమ్మవారి మంగళ సూత్రాలను భక్తులకు చూపుతున్న ప్రధాన అర్చకుడు

భాస్కర శర్మ, అమ్మవారి ఆలయ ప్రధాన అర్చకుడు మర్రిబోయిన గోపిబాబు తిరుముడి కార్యక్రమాలను ప్రారంభించారు.

కల్యాణం.. కమనీయం

గోపయ్య స్వామి సమేత తిరుపతమ్మ అమ్మవారి కల్యాణ మహోత్సవం మాఘ శుద్ధ పౌర్ణమి మంగళవారం రాత్రి శోభాయమానంగా జరిగింది. అమ్మవారి తరపున కొల్లా వెంకట చంద్రమౌళి-ఉషా దంపతులు గోపయ్య స్వామి తరపున కాకాని వెంకట శ్రీనివాసరావు - కృష్ణ వేణి దంపతులు పట్టు వస్త్రాలు మంగళ సూత్రాలు, పూజాద్రవ్యాలను మేళ తాళాలు మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారి కల్యాణ పీటలపై కూర్చున్నారు. తిరుపతమ్మ, గోపయ్య స్వాముల ఉత్సవ మూర్తులను మంగళ వాయిద్యాలతో కల్యాణ వేదిక వద్దకు ఆలయ అధికారులు తీసుకువచ్చారు. కల్యాణ కార్యక్రమాన్ని ప్రధాన అర్చకుడు మర్రిబోయిన గోపిబాబు ఆధ్వర్యంలో ఆలయ పురోహితుడు శివరాం బొట్ల ఆంజనేయశర్మ శాస్త్రోక్తంగా నిర్వహించారు. సీపీ రాజశేఖర్ బాబు ఆధ్వర్యంలో ఏసీపీ తిలక్, జగ్గయ్యపేట సీఐ వెంకటేశ్వరరావు, ఎస్సై ఎం.ఎస్.కె అర్జునలు బందోబస్తును పర్యవేక్షించారు.



» భక్తులు హృదయ పరివర్తన పొందాలి..

» బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు

» ప్రశాంతంగా ముగిసిన గుణదల లూర్దు మాత మహోత్సవాలు

గుణదల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : మూడు రోజుల గుణదల లూర్దుమాత మహోత్సవాలు మంగళవారం ఘనంగా ముగిశాయి. చివరిరోజు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో తరలిరావడంతో గుణదల కొండపైకి వెళ్లే మార్గాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. కొండపైన తలనీలాలు సమర్పించడం, మరియమాత గుహ వద్ద కొవ్వొత్తులు వెలిగించడం, కొండ శిఖరాగ్రాన శిలువ చెంతన కొబ్బరికాయలు కొట్టి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. మరియమాత భక్తులమైన మనం మహోత్సవాలను సందర్శించినపుడు హృదయ పరివర్తన పొంది తిరిగి



సమిష్టి దివ్యపూజాబలి వేదిక వద్దకు బిషప్‌లను ఊరేగింపుగా తీసుకొస్తూ..

వెళ్లాలని విజయవాడ కతోలిక పీఠాధిపతి బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు అన్నారు. మూడు రోజులుగా జరుగుతున్న గుణదల మాత 101 ముగింపు మహోత్సవాలకు మంగళవారం ముఖ్యఅతిథిగా తెలగతోటి జోసఫ్ రాజారావు హాజరయ్యారు. భక్తులను ఉద్దేశించి ఆయన సందేశం ఇస్తూ.. మరియతల్లి పరమ పవిత్రురాలని దేవునికి జన్మనిచ్చి సంపూర్ణ అనుగ్రహాలు పొందారని తెలిపారు. గుణదల కొండపై కొలువై ఉన్న లూర్ధుమాత ఆశీస్సులు, దీవెనలు భక్తులకు మెండుగా లభిస్తున్నాయని, అందుకే ఆమెకు భక్తులు నీరాజనాలు పలుకుతున్నారని చెప్పారు. ప్రతి కతోలిక కుటుంబం ఆలోచనలు పవిత్రంగా ఉండాలన్నారు. శిలువ అంటే దేవుని శక్తి అని.. శిలువ పుణ్యమార్గం వైపు భక్తులను నడిపిస్తుందని తెలిపారు. ఫ్రాన్సు దేశంలోని లూర్ధునగర్‌లో బెర్నెదత్ అనే బాలికకు లూర్ధుమాత 18 సార్లు దర్శన మిచ్చిందని చెప్పారు. కతోలిక భక్తులమైన మనకు యేసు ప్రభువు మార్గం కావాలన్నారు. 2025 సంవత్సరాన్ని జగద్గురువులు పోప్ ఫ్రాన్సిస్ జూబ్లీ సంవత్సరంగా ప్రకటించారని గుర్తుచేశారు. గుణదల పుణ్యక్షేత్రం దగ్గర్లో నూతనంగా నిర్మిస్తున్న శతాబ్ది లూర్ధుమాత దేవాలయం త్వరగా పూర్తికావాలని దేవుని ప్రార్థిద్దామని చెప్పారు. పరిశుద్ధ పోప్ జాన్ పాల్-2 ఫిబ్రవరి 11న 33 సంవత్సరాల క్రితం విశ్వవ్యాప్త వ్యాధిగ్రస్తులను అక్కున చేర్చుకుని ఆదిరించాలని చెప్పిన విషయాన్ని ఎవరూ మరువరాదన్నారు. అనంతరం బిషప్ గ్రాసి ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో అలంకరించిన పూజా పీఠంపై బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు, గుంటూరు కతోలిక పీఠం బిషప్ చిన్నాబత్తుల భాగ్యయ్య, ఇటాలియన్ విశ్రాంత బిషప్ సీజర్ బొనవెంచర్, మోన్సిగ్నోర్ మువ్వల ప్రసాద్, వికర్ జనరల్ మేశపాం గాబ్రియేలు, తోట సునీల్ రాజు, తెలగతోటి పాలు, డయాసిస్ గురువులు ముగింపు మహోత్సవాల సమిష్టి దివ్యపూజాబలి సమర్పించారు. అనంతరం బిషప్ రాజారావు, మోన్సిగ్నోర్ మువ్వల ప్రసాద్‌లు కతోలిక భక్తులకు దివ్యసత్ప్రసాదం అందజేశారు. ఫాదర్ బి.జాన్‌పీటర్ రచించిన దివ్యపూజాబలి పుస్తకాన్ని పీఠాధిపతులు ఆవిష్కరించారు. మధిర బెర్నాడ్ ఆధ్వర్యంలో విజయవాడ మైత్రాసన గాయక బృందం ఆలపించిన గీతాలు పీఠాధిపతుల ప్రశంసలు అందుకున్నాయి. సత్యోపదేశ పరీక్షల్లో గెలుపొందిన వారికి పీఠాధిపతులు బహుమతులు అందజేశారు.

కార్యక్రమంలో రెక్టర్ యేలేటి విలియం జయరాజు, ఎస్ఏసి డైరెక్టర్ తోటసునీల్ రాజు, ఫాదర్ తెలగతోటి పాలు(జర్మనీ), పల్లె జోజిబాబు, పసల తోమస్, ఆస్ట్రేలియా దేశపు కతోలిక భక్తులు, డయాసిస్ గురువులు, కన్యస్త్రీలు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

వెల్లటూరు విచారణ బృందం ప్రదర్శించిన కోలాటం భక్తులను ఆకట్టుకుంది. దర్శి డాన్‌బోస్కో ఆధ్వర్యంలో ప్రదర్శించిన నిరీక్షణ యాత్రికుల సాంస్కృతిక కార్యక్రమం భక్తులను అలరించింది. రేగుంట మేరీ ఫ్రాన్సిస్ నాట్యమండలి వారు ప్రదర్శించిన లాజరు-ధనవంతుడు నాటకం, కొండపావులూరు జె.ఎం.జె నాట్యమండలి ప్రదర్శించిన నిడువని ప్రేమ నాటకం ఆసాంతం భక్తులను కట్టిపడేసింది.



భక్తులను ఉద్దేశించి సందేశం ఇస్తున్న విజయవాడ కతోలిక పీఠం బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు



ప్రత్యేక ఆకర్షణగా విదేశీయులు



మదినిండా భక్తితో..



పుట్టలో పాలుపోసి పూజలు చేస్తున్న విశ్వక్సేన్

జిల్లాలో విశ్వక్సేన్ సందడి

సుబ్బారాయుడిని దర్శించిన సినీహీరో

మోపిదేవితి/అవనిగడ్డ/పెడన, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని ప్రముఖ సినీ హీరో విశ్వక్సేన్ మంగళవారం ఉదయం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చక బృందం ఆయనకు స్వాగతం పలుకగా, నాగపుట్ట వద్ద పాలు పోసి స్వామివారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. అర్చక బృందం వేదమంత్రాలతో ఆశీర్వచనం పలికి శేషవస్త్రాలతో సత్కరించారు. మోపిదేవి విచ్చేసిన విశ్వక్సేన్‌కు ఎంపీ బాలశౌరి తనయుడు అనుదీప్, కూటమి నేతలు మండలి వెంకట్రామ్, కనపర్తి శ్రీనివాసరావులు స్వాగతం పలికారు.

● అవనిగడ్డలో సినీహీరో విశ్వక్సేన్ సందడి చేశారు. 'లైలా' చిత్ర ప్రమోషన్‌లో భాగంగా మంగళవారం అవనిగడ్డ విచ్చేసిన ఆయన స్థానిక ఎస్‌వీఎల్ క్రాంతి కళాశాలలో విద్యార్థులతో కలిసి ఆటపాటలతో సందడి చేశారు. అక్కడి నుంచి తిరిగి వెళుతూ చల్లపల్లిలోని శ్రీ వెంకటేశ్వర స్పెషల్ బాదంపాలు రుచిచూశారు.

● నందమూరు వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలపై యాజమాన్యంతో హీరో విశ్వక్సేన్ మాట్లాడారు. అనంతరం విద్యార్థులతో కలిసి ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎంపీ వల్లభనేని బాలసౌరి తనయుడు అనుదీప్, జనసేన నేత బండి రామకృష్ణ తనయుడు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో నిందితుల బెయిల్ నేటికి వాయిదా

విజయవాడ, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లా గన్నవరంలోని టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో జైల్లో ఉన్న నిందితుల బెయిల్ పిటిషన్ విచారణను విజయవాడలోని ఎస్సీ, ఎస్టీ కోర్టు బుధవారానికి వాయిదా వేసింది. గన్నవరంలో టీడీపీ కార్యాలయంపై అప్పటి ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అనుచరులు దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో మొత్తం 88 మందిని పోలీసులు నిందితులుగా గుర్తించారు. వారిపై ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ఇన్‌టర్మ్ ఆర్డర్ ఇచ్చింది. ఈ ఉత్తర్వుల గడువు ముడుగుస్తుండటంతో నిందితులు ఎస్సీ, ఎస్టీ కోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై మంగళవారం వాదనలు జరిగాయి. రెండు వర్గాల న్యాయవాదుల వాదనలను విన్న తర్వాత న్యాయాధికారి హిమబిందు విచారణను బుధవారానికి వాయిదా వేశారు.

కొక్కెర వ్యాధితో 11 వేల కోళ్ళ మృతి!

గంపలగూడెం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : అనుముల్లంక గ్రామంలో అత్తునూరు పద్మారెడ్డికి చెందిన కోళ్ల ఫాంలో సుమారు 11వేల కోళ్లు కొక్కెర వ్యాధితో మృతి చెందినట్టు పశు వైద్యాధికారి అభిలాష్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కోళ్ల మృతికి బర్డ్ ఫ్లూ కారణం కాదని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర సరహద్దులైన నెమలి, పెనుగొలను, గోసవీడు చెక్ పోస్టుల వద్ద కోళ్ల రవాణా జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కొంతకాలం కోడిమాంసం తినకుండా ఉంటే మంచిదన్నారు. కోళ్లు ఏకారణంతో చనిపోయింది తేలాల్సి ఉందన్నారు.

పది పరీక్షలకు పగడ్బందీ ఏర్పాట్లు

» అధికారులు సమన్వయంతో పనిచేయాలి

» ఎన్టీఆర్ జిల్లాలో 31,231మంది.. 168 పరీక్షా కేంద్రాలు : కలెక్టర్ లక్ష్మీశ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

ఎన్టీఆర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : మార్చి 17 నుంచి 31 వరకు నిర్వహించనున్న 10వ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ సమన్వయ శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో పది పరీక్షల నిర్వహణపై పాఠశాల విద్య, రెవెన్యూ, పోలీస్, రవాణా, విద్యుత్, పోస్టల్ తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో పది పరీక్షలకు రెగ్యులర్, ఓపెన్ స్కూల్ కలిపి మొత్తం 31,231 మంది హాజరుకానున్నారని, వీరిలో బాలురు 14,212 మంది కాగా బాలికలు 17,019 మంది వున్నారని తెలిపారు. జిల్లాలో 168 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 వరకు జరుగుతాయన్నారు. 25 స్టోరేజ్ పాయింట్లు ఏర్పాటు చేయడం జరిగిందని, అదేవిధంగా 336 మంది చీఫ్ సూపరింటెండెంట్లను, ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. 12 మంది రూట్ అధికారులు, మరో 12 మంది సహాయ రూట్ అధికారులను నియమించాలన్నారు. మొత్తం 1,848 మంది ఇన్విజిలేటర్లు సేవలందించనున్నట్లు వివరించారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు పరీక్ష రాసేందుకు వీలుగా ఫర్నీచర్, తాగునీరు, విద్యుత్ సరఫరాకు ఇబ్బందిలేకుండా చూడాలని సూచించారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకొని, పరీక్ష అనంతరం ఇళ్లకు తిరిగి చేరుకొనేలా ఆర్టీసీ బస్సులను రీ షెడ్యూల్ చేయాలని ప్రజా రవాణా అధికారులకు సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద మెడికల్ క్యాంపులు ఏర్పాటు, పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని వైద్యఆరోగ్యం, పంచాయితీ, మున్సిపల్ శాఖల అధికారులను ఆదేశించారు. 144 సెక్షన్ అమలు, బందోబస్తు ఏర్పాటు, భద్రతా చర్యల విషయంలో పోలీసు శాఖతో సమన్వయం చేసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులకు సూచించారు. సమావేశంలో డీఈఓ యూవీ సుబ్బారావు, విజయవాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ డి.చంద్రశేఖర్, ఆర్డీవో ఆర్.ప్రవీణ్, పోస్టల్ ఇనస్పెక్టర్ ఎ.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమరావతికి హడ్కో రుణం

రూ.11 వేల కోట్లు మంజూరు

» ఇప్పటికే ప్రపంచబ్యాంకు, ఏడీబీల నుంచి రూ.15 వేల కోట్ల అప్పు

» త్వరలో కేఎఫ్‌డబ్ల్యూ నుంచి రూ.5 వేల కోట్లు



విజయవాడ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : అమరావతి రాజధాని నిర్మాణ పనులను ముందుకు తీసుకెళ్లేందుకు హడ్కో రూ.11 వేల కోట్ల రుణాన్ని మంజూరు చేసింది. హడ్కో జాయింట్ జనరల్ మేనేజర్(జేజేఎం) ఎస్ఎం శ్రీనివాస్, జేజేఎం(ప్రాజెక్ట్స్) కె.విజయకుమార్ మంగళవారం విజయవాడలోని సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంలో సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబును కలిసి రుణ మంజూరు పత్రాలను అందించారు. రుణపత్రాలను స్వీకరించినప్పటి నుంచి నాలుగు నెలల్లో లోన్ అగ్రిమెంట్ వ్యవహారాలను పూర్తి చేసుకోవాలని హడ్కో ప్రతినిధులు కమిషనర్‌కు చెప్పారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో విధ్వంసానికి గురైన అమరావతి రాజధాని అభివృద్ధిని తిరిగి పట్టాలు ఎక్కించేందుకు కూటమి ప్రభుత్వం అమరావతి 2.0కు శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. రాజధానిలో పునర్నిర్మాణ పనులకు రూ.48,012.67 కోట్ల వ్యయంతో ప్రభుత్వం పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. ఐఏఎస్, ఏపీఎన్‌జీవో, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్వార్టర్లు, ప్రిన్సిపల్ సెక్రటరీ బంగ్లాలు, జడ్జీల క్వార్టర్లు, గవర్నమెంట్ టైప్-1, 2 భవనాలు, ప్రధాన రోడ్ల పునర్నిర్మాణ పనులు, హ్యాపీనెస్ట్, సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయాల పునర్నిర్మాణాలు, ఎల్‌పీఎస్ జోన్లలో మౌలిక సదుపాయాల కల్పన పనులు, ట్రంక్ ఇన్‌ఫ్రా పనులు, అమరావతి వరద నియంత్రణ పనులు తదితర అనేక ముఖ్యమైన పనులకు టెండర్లు పిలిచేందుకు సీఆర్‌డీఏ, ఏడీసీ సిద్ధమయ్యాయి. ఈ క్రమంలో ప్రపంచబ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు, హడ్కో, కేఎఫ్‌డబ్ల్యూ నుంచి రూ.31 వేల కోట్ల రుణాన్ని పొందేందుకు సీఆర్‌డీఏ ప్రయత్నాలు చేసింది. ఇప్పటికే ప్రపంచబ్యాంకు, ఏడీబీల నుంచి రూ.15 వేల కోట్ల రుణం మంజూరైంది. ఆ పత్రాలు కూడా సీఆర్‌డీఏకు అందాయి. ఇదే సందర్భంలో హడ్కో నుంచి రూ.11 వేల కోట్ల రుణం, జర్మనీకి చెందిన డెవలప్‌మెంట్ బ్యాంక్ కేఎఫ్‌డబ్ల్యూ నుంచి రూ.5 వేల కోట్ల రుణం పొందేందుకు ప్రయత్నాలు చేపట్టారు. హడ్కో, కేఎఫ్‌డబ్ల్యూ కూడా రుణం ఇవ్వటానికి మౌఖికంగా అంగీకరించాయి.

ఆధార్ అప్‌డేట్‌కు ప్రత్యేక డ్రైవ్‌లు

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

ఎన్టీఆర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఐదేళ్లకు పైబడిన పాఠశాల విద్యార్థులు, 15ఏళ్లకు పైబడిన ప్రభుత్వ, ప్రైవేటు, రెసిడెన్సియల్ కళాశాలల విద్యార్థులు తప్పనిసరిగా ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేషన్ చేయించాల్సి వుంటుందని, ఇందుకు ప్రత్యేక డ్రైవ్‌లు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

చేపట్టాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి ఆధార్ పర్యవేక్షణ కమిటీ (డీఎంఏఎంసీ) సమావేశం జరిగింది. రెవెన్యూ, విద్య, వైద్య ఆరోగ్యం, ఐసీడీఎస్, మున్సిపల్ తదితర శాఖల అధికారులు సమావేశంలో నేరుగా పాల్గొనగా యూఐడీఏఐ రీజనల్ కార్యాలయ అసిస్టెంట్ మేనేజర్ జి.గిరిధర్ వర్చువల్‌గా హాజరయ్యారు. జిల్లాలో ఆధార్ నమోదు స్థితిగతులు, ఆధార్ కేంద్రాల పనితీరు తదితరాలపై చర్చించారు. వైద్య ఆరోగ్య శాఖ, ఐసీడీఎస్, గ్రామ, వార్డు సచివాలయాల అధికారులు పారదర్శక, దోషరహిత ఆధార్ విషయంలో సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. జిల్లాస్థాయి ఆధార్ పర్యవేక్షణ కమిటీ కన్వీనర్, గ్రామ వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి, డీసీపీ కేజీవీ సరిత, డీఈవో యూవీ సుబ్బారావు, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, ఎల్‌డీఎం కె.ప్రియాంక, కమిషనర్ డి.చంద్రశేఖర్, ఐసీడీఎస్ డీపీ డి.శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



రహదారి వాకథాన్‌లో కలెక్టర్ లక్ష్మీశ

దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే..

ఎన్టీఆర్ కలెక్టరేట్ : దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే వుందని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను తూ.చ తప్పకుండా పాటిస్తూ భద్రమైన సమాజం దిశగా ముందడుగు వేయాలని కలెక్టర్ లక్ష్మీశ పిలుపునిచ్చారు. మంగళవారం రవాణా శాఖ అధ్వర్యంలో 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు (జనవరి 16-ఫిబ్రవరి 15) సందర్భంగా ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం, ఈట్‌స్ట్రీట్ వద్ద ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ, విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ హెచ్.ఎం.ధ్యానచంద్ర, అధికారులు తదితరులతో కలిసి రహదారి భద్రత వాకథాన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. వాకథాన్ బెంజిసర్కిల్ వరకు సాగింది. కలెక్టర్ మాట్లాడుతూ, స్వర్ణాంధ్ర సాకారానికి రహదారి భద్రత కూడా అత్యంత ముఖ్యమని, యువతతో పాటు ప్రతిఒక్కరూ రహదారులను బాధ్యతాయుతంగా ఉపయోగించుకోవాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో డీటీసీ మోహన్, ఏపీ ఎన్జీవో నేతలు కేవీ శివారెడ్డి, ఎ.విద్యాసాగర్, రవాణా శాఖ ఉద్యోగుల జోనల్ అధ్యక్షుడు ఎం.రాజుబాబు, విద్యార్థులు, రవాణా శాఖ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో 340 మొబైల్ వెటర్నరీ యూనిట్లు

» ఎంపీ కేశినేని శివనాథ్ ప్రశ్నకు కేంద్రమంత్రి లిఖితపూర్వక సమాధానం



వన్‌టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్‌లో మొత్తంగా 340 మొబైల్ వెటర్నరీ యూనిట్లు ఉన్నాయని, కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, పాడి పరిశ్రమలశాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ (లాలన్ సింగ్) వెల్లడించారు. పార్లమెంటులో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అడిగిన ప్రశ్నకు మంగళవారం మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి వివరాలు వెల్లడిస్తూ ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 340 మొబైల్ వెటర్నరీ యూనిట్లు ఉన్నాయని చెప్పారు. అత్యధికంగా నెల్లూరు జిల్లాలో 18, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 6, కృష్ణాజిల్లాలో 14, ఎన్టీఆర్ జిల్లాలో 11 యూనిట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతుల ఇంటి వద్దనే మెరుగైన సేవలు అందించేందుకు 1962 హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. దేశవ్యాప్తంగా ఈ పథకం ద్వారా 66,54,662 మంది రైతులు సేవలు అందుకున్నారని తెలిపారు. మొబైల్ యూనిట్లను 100 శాతం కేంద్రమే భరిస్తుందన్నారు. నిర్వహణ ఖర్చులను మాత్రం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరిస్తాయన్నారు. కాగా దేశవ్యాప్తంగా ఈ పథకం కింద ఇప్పటి వరకు 997.59 కోట్లు విడుదల చేశామని, మొబైల్ యూనిట్లు మారుమూల ప్రాంతాల్లో, దూర ప్రాంతాలలో రైతుల వద్ద ఉన్న పశువులకు అత్యవసర వెటర్నరీ సేవలు అందించేందుకు సహాయపడుతున్నాయని ఆయన వివరించారు. ఈ సందర్భంగా ఆయన దేశవ్యాప్తంగా పశువుల ఆరోగ్య సంరక్షణ, తదితర అంశాలను వెల్లడిస్తూ ఏపీలో 16,08,868 మంది రైతులు లబ్ధి పొందారని పేర్కొన్నారు.

విజయవాడ డివిజన్ పరిధిలో

నేటి నుంచి పలు పాసింజర్ రైళ్లు రద్దు

రైల్వేస్టేషన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో కృష్ణా కెనాల్-గూడూరు మధ్య 3వ ట్రాక్ పనుల సందర్భంగా తెనాలి యార్డును ఆధునీకరిస్తున్నారు. ఈ క్రమంలో కొత్త ప్లాట్ ఫారం, కొత్త అప్రాన్ నిర్మాణాలు చేస్తున్నందున పలు పాసింజర్ రైళ్లను ఈనెల 12 నుంచి మార్చి 13 వరకు రద్దు చేశారు. 67221 విజయవాడ - తెనాలి రైలును, 67231, 67332 తెనాలి - రేపల్లె రైళ్లను ఈనెల 12 నుంచి మార్చి 13 వరకు రద్దు చేశారు. 67224 రేపల్లె - తెనాలి రైలును 60 నిమిషాల మేరకు రీషెడ్యూల్ చేశారు.

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125,134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 450

పీబీ సిద్ధార్థలో అంతర్జాతీయ పద్యాలాపన పోటీలు 21న

మొగల్రాజపురం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా ఈ నెల 21న ముమ్మనేని సుబ్బారావు కళాపీఠం , పీబీ సిద్ధార్థ కళాశాల, ఉయ్యూరు ఏజీ అండ్ ఎస్‌జీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో పద్యాలాపన పోటీలు తమ కళాశాలలో నిర్వహిస్తున్నామని పీబీ సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ నెల 18 లోపు 8374865621, 9848547022 నెంబరులో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవచ్చని పెర్కొన్నారు.





గుణదల లూర్దు మాత మహోత్సవాలలో చివరి రోజు మంగళవారం ప్రార్థనలకు హాజరైన తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌ను సత్కరించిన విజయవాడ కతోలిక పీఠం బిషప్ తెలగతోటి రాజారావు,పుణ్యక్షేత్రం రెక్టర్ యేలేటి విలియం జయరాజు తదితరులు, కొండ కింద ఆలయంలో ప్రార్థనల్లో విశ్వాసులు, ఆవరణలో కార్యక్రమానికి హాజరైన విశ్వాసులు

జేఈఈ-మెయిన్స్ ఫలితాల్లో విజయవాడ నారాయణ విద్యార్థుల విజయభేరి

పెనమలూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మంగళవారం విడుదలైన జేఈఈ-మెయిన్స్ సెషన్-1 ఫలితాల్లో విజయవాడ నారాయణ విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారని సంస్థ డీజీఎం రవి శంకర్ తెలిపారు. తేరాటి భరద్వాజ్99.98, వడ్లమూడి లోకేష్99.97, ఎం. కృష్ణ హర్షిత్ 99.95, ఆంజనేయ రెడ్డి99.95, కూన లిఖిత శ్రీ99.94, తేజ యశ్వంత్ 99.94, శివసాయి దినేష్99.88, ఆశ్రిత సాయి లక్ష్మి 99.63, వీ. గీతిక 99.55, షణ్ముఖ శ్రీరాజ్ 99.30, దత్త సాయి 99.26, మనోజ్ఞ 99.22 పర్సెంటైల్లు సాధించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని రవిశంకర్ పేర్కొన్నారు. 99పర్సంటైల్‌కు పైగా 103 మంది, 98పర్సంటైల్ పైగా 184 మంది, 97 పర్సంటైల్ పైగా 260 మంది. 96 పర్సంటైల్ పైగా 320మంది, 95పర్సంటైల్ పైగా 430, 90 పర్సంటైల్ పైగా 715 మంది విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి జాతీయ స్థాయిలో సత్తా చాటారని ఆయన తెలిపారు. పటిష్టమైన బోధనా పద్ధతులు, మైక్రో షెడ్యూలింగ్, పరీక్ష విధానాలపై ప్రత్యేక శిక్షణ ఇవ్వడమే కాకుండా విద్యార్థులపై వ్యక్తిగత శ్రద్ధ తదితర అంశాలవల్లే ఇంతటి ఘన విజయాలు సాధిస్తున్నామని తెలిపారు. విజేతలను డీన్లు, ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు అభినందించారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ కిషోర్

లయోలాలో రాష్ట్రస్థాయి టెక్నోమీట్ సైంటియా-2025 నేడు

భారతీనగర్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): యువతలో వృత్తిపరమైన నైపుణ్యాన్ని పెంపొందించడమే కంప్యూటర్ సైన్స్ విభాగం రాష్ట్రస్థాయి టెక్నోమీట్ సైంటియా-2025 ముఖ్య ఉద్దేశ్యమని ప్రిన్సిపాల్ పి.కిషోర్ అన్నారు. లయోలాలో కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించనున్న రాష్ట్రస్థాయి టెక్నోమీట్ సైంటియా-2025 ఈవెంట్ పోస్టర్‌ను మంగళవారం ప్రిన్సిపాల్ పి.కిషోర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా విభాగాధిపతి టి.కమలాకర్ రాజు మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో స్లైడ్ స్పాట్‌లైట్, నాలెడ్జ్ నాకౌట్, కోడింగ్, డీబగ్గింగ్, మిస్టిక్ ట్రెజర్, ప్రెజెంటేషన్ బోర్డ్, కళా మహోత్సవ్, ప్రతిష్టాత్మకమైన మిస్టర్, మిసెస్ సైంటియా పోటీలు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ కె.అపర్ణ, విభాగాధిపతులు, తదితరులు పాల్గొన్నారు.

ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించాలి

నగర కమిషనర్ ధ్యానచంద్ర



చెత్త సేకరణను పరిశీలిస్తున్న నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర

గుణదల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): వ్యర్థాల సేకరణలో జాప్యం ఉండరాదని, వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగిస్తుండాలని విజయవాడ నగర కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను దేశించారు. మంగళవారం ఉదయం తన పర్యటనలో భాగంగా శిఖామణి సెంటర్, బాడవపేట, ఉడ్‌పేట, గుణదల ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ వ్యర్థాలను కచ్చితంగా సేకరించాలని, రోడ్డుపై ఉన్న వ్యర్థాలను ఎప్పటికప్పుడు ట్రాక్టర్లతో గార్బజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌కు తరలించాలని చెప్పారు. నగరంలో ఉన్న అన్ని మరుగుదొడ్లను మరమ్మతులు చేయించాలని ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. గుణదల ఉత్సవాలకు కల్పిస్తున్న సౌకర్యాల్లో లోపం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ పర్యటనలో సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వి ప్రసాద్, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, ఉన్నత అధికారులు పి.సత్యకుమారి, జి.సామ్రాజ్యం, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

వైద్యఖర్చుల నిమిత్తం ఆర్థికసాయం



భారతీనగర్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) తూర్పు పరిధి 3వ డివిజన్‌లోని కామినేనినగర్ కాలనీకి చెందిన దేవరాజు గట్టు గాయత్రి అనే మహిళ వైద్య ఖర్చుల నిమిత్తం పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని టీడీపీ యువ నాయకులు గద్దె క్రాంతికుమార్ అందజేశారు. ఇటీవల గాయత్రికి యాక్సిడెంట్‌కు గురై నడవలేని స్థితిలో ఉన్నారు. మంగళవారం గద్దె క్రాంతికుమార్ గాయత్రి ఇంటికి వెళ్లి పరామర్శించి, సాయం అందజేశారు. గద్దె రమేష్, తాడి బాబురావు, గుంజి ఏసుబాబు, రాజనాల సురేష్, కోటిరెడ్డి, గుణమాల రాజశేఖర్, పొట్లూరి దర్శిత్ పాల్గొన్నారు.

ఘంటసాల గానం తెలుగు జాతికి వరం



ఘంటసాల విగ్రహం వద్ద అంజలి ఘటిస్తున్న కళాసంస్థల ప్రముఖులు

విజయవాడ కల్చరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) :చలనచిత్ర నేపథ్య గాయకుడు, తన స్వరంతో తెలుగు చలన చిత్ర సీమను సుసంపన్నం చేసిన గంధర్వ గాయకుడు ఘంటసాల స్వర రసోదయశాల అని పలు కళాసంస్థల ప్రముఖులు అన్నారు. మంగళ వారం సాయంత్రం తుమ్మలపల్లి వారి కళాక్షేత్ర య్య కళాక్షేత్రంలో ఘంటసాల సంగీత కళా వేదికచే 2009లో ఆవిష్కరించబడిన ఘంట సాల విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. శ్రీ కళాభారతి, ఘంటసాల సంగీత కళావేదిక అధ్యక్షులు శింగంశెట్టి చంద్రశేఖర్, జీఆర్‌కే పోలవరపు సాంస్కృతిక సమితి అధ్యక్షుడు గోళ్ల నారాయణరావు, తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు, బోడి ఆంజనేయరాజు, గాయకులు డేవిడ్‌రాజు, శ్యాంప్రసాద్, చంద్రశేఖర్, డాక్టర్ రామతీర్థ, మండవ దామోదరశివ తదితరులు మాట్లాడుతూ ఘంటసాల గానం తెలుగు జాతికి వరమని, ఆయన పాట ఆయన గానం పాటకు ప్రాణం అని, ఘంటసాల చిరస్మరణీయుడని శాస్త్రీయ సంగీత విద్వాంసునిగా, నేపథ్య గాయకునిగా ఆయన కీర్తి అజరామరమన్నారు.

మాచవరం వాకర్స్‌ను కలిసిన ఆలపాటి



ఎస్ఆర్ఆర్ ఆవరణలో మాచవరం వాకర్స్ అసోసియేషన్ సభ్యులతో ముచ్చటిస్తున్న ఆలపాటి

గుణదల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో ఉన్న ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాచవరం వాకర్స్ అసోసియేషన్ సభ్యులను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆలపాటి స్థానిక కార్పొరేటర్ వల్లభనేని రాజేశ్వరి సమక్షంలో ఎస్ఆర్ఆర్ కళాశాల ఆవరణలో వాకర్స్‌ను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని కార్పొరేటర్ వల్లభనేని రాజేశ్వరి ఓటర్లను అభ్యర్థించారు. ఆలపాటి వెంట గద్దె క్రాంతి, చెరుకూరి కృష్ణ కుమార్, చెన్నుపాటి ఉషా, గొట్టుముక్కల రాఘురామరాజు, రత్నశ్రీ, 26వ డివిజన్ ఇన్‌చార్జ్ వల్లభనేని సతీష్, డివిజన్ అధ్యక్షుడు తోట పాండు, కడియం ప్రకాష్, విజ్జి డేవిడ్, కాళిదాసు, సింహాచలం, తేజ, షేక్ హసీనా, తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

14, 15 తేదీల్లో వచన కవిత్వంపై వర్క్‌షాప్

వన్‌టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కళాశాల విద్యార్థులకు వచన కవిత్వ రచనలో శిక్షణ ఇచ్చి, వారిలో సృజనాత్మక నైపుణ్యాలను పెంచాలనే లక్ష్యంతో 'వచన కవిత్వ రచన' పై రెండు రోజులపాటు వర్క్ షాపు నిర్వహిస్తున్నట్లు కేబీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం (నెల్లూరు), కృష్ణా విశ్వ విద్యాలయం, తమ కళాశాల తెలుగు విభాగం సంయుక్త నిర్వహణలో ఈనెల 14, 15తేదీల్లో కేబీఎన్ కళాశాలలో శిక్షణ జరుగుతుందన్నారు.

అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులు ప్రారంభం



రాణిగారితోట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రాణిగారి తోట 17వ డివిజన్‌లో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. డివిజన్‌లోని లక్కీబార్ ఎదురు రోడ్డు, శాంపిల్ బిల్డింగ్ రోడ్, మల్లెల తిరుపతమ్మ వీధుల్లో గత కొంత కాలంగా అండర్ గ్రౌండ్ సమస్య తీవ్రంగా ఉండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో స్థానికుల ఇబ్బందులను డివిజన్ అధ్యక్షురాలు రాయి రంగమ్మ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ దృష్టికి తీసుకువెళ్లడంతో స్పందించిన ఆయన అత్యవర సమస్యగా గుర్తించి ఆయా రోడ్డులలో యూజీడీ సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. దీంతో యూజీడీ పనులను మంగళవారం నుంచి ప్రారంభించారు.

గత పాలకుల నిర్వాకమే

- రాయి రంగమ్మ

డివిజన్‌లో యూజీడీ సమస్యకు గత వైసీపీ పాలకులే కారణం అని, ఈ సమస్యతో స్థానికులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌కు వివరించడంతో ఆయన అధికారులను ఆదేశించడంతో పనులు చేపట్టారు. డివిజన్‌లో మిగిలిన రోడ్డులలో కూడా యూజీడీ సమస్యను త్వరలో పరిష్కరించే విధంగా ఎమ్మెల్యే చర్యలు తీసుకుంటున్నారు.

ఇంటర్నెట్ లావాదేవీల పట్ల అప్రమత్తంగా ఉండాలి

స్టేట్ ఇన్ఫర్మేటిక్స్ అధికారి పొన్నాడ లక్ష్మీనారాయణ



పీబీ సిద్ధార్థ కళాశాలలో జరిగిన అంతర్జాల దినోత్సవంలో ఎన్ఐసీ అడిషనల్ ఇన్ఫర్మేటిక్స్ అధికారి మధుసూదన్‌రావు , ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ తదితరులు

మొగల్రాజపురం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఇంటర్‌నెట్ ఆధారంగా నిర్వహించే లావాదేవీల పట్ల అప్రమత్తంగా ఉండాలని అత్యంత సురక్షిత పద్ధతుల్లో నిర్వహించుకోవాలని స్టేట్ ఇన్ఫర్మేటిక్స్ అధికారి పొన్నాడ లక్ష్మీనారాయణ చెప్పారు. ఎంజీ రోడ్డులో ఉన్న రాష్ట్ర ఎన్ఐసీ(నేషనల్ ఇన్ఫర్మేటిక్ సెంటర్) కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇంటర్‌నెట్ జీవితంలో ఒక భాగమైపోయిన ఈ రోజుల్లో సైబర్ మోసాలు కూడా ఎక్కువయ్యాయని చెప్పారు. ముఖ్యంగా ఓటీపీ, డెబిట్, క్రెడిట్ కార్డుల సీవీవీ నెంబర్లు, వ్యక్తిగ త పాస్‌వర్డు, యూజర్ ఐడీలు భద్రంగా ఉంచుకోవాలని చెప్పారు . కార్యక్రమంలో ఎన్ఐసీ సిబ్బంది పాల్గొన్నారు.

● **పీబీ సిద్ధార్థలో**

భారత ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్, సాంకేతిక మంత్రిత్వ శాఖ చేపట్టిన సురక్షిత అంతర్జాల దినోత్సవాన్ని పీబీ సిద్ధార్థ కళాశాల కంప్యూటర్ సైన్స్ డేటా విభాగాలు, స్టేట్ ఇన్ఫర్మేటిక్స్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎన్ఐసీ అడిషనల్ ఇన్ఫర్మేటిక్స్ అధికారి మధుసూదన్‌రావు మాట్లాడుతూ సమాచార చౌర్యం ద్వారా సైబర్ నేరగాళ్లు ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నారని చెప్పారు. విజయవాడ సైబర్ పోలీసు స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఆర్ఎస్ఆర్ మూర్తి మాట్లాడుతూ నగరంలో ఇటీవల జరిగిన సైబర్ నేరాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, డైరెక్టర్ వేమూరి బాబూరావు, కంప్యూటర్ సైన్స్ విభాగం అధిపతులు డాక్టర్ టిఎస్ రవికిరణ్, కోనేరు సుధీర్ , ప్లేస్‌మెంట్ అధికారి కావూరి శ్రీధర్, ఎన్ఐసి సిబ్బంది , అధ్యాపకులు, పాల్గొన్నారు.

క్రీడారంగం అభివృద్ధికి కూటమి కృషి

ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

విజయవాడ (స్పోర్ట్స్), ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఏపీ లో క్రీడారంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. ఎక్సీల సంస్థ ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహిస్తున్న అమరావతి టి-20 క్రికెట్ చాంపియన్ షిప్ పోటీలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలను ప్రోత్సహించే ప్రయత్నాలు కేవలం ప్రభుత్వాలు మాత్రమే కాకుండా సమాజంలోని వివిధ సమస్యలు ఔత్సాహికులు ముందుకు వచ్చి తమ వంతు సహకారం అందించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం సహకారంతో ఏపీ లోని క్రీడారంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు సీఎం చంద్రబాబు నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా ఆయన క్రికెట్ ఆడి క్రీడాకారులను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో ఎక్సీల సంస్థ చైర్మన్ అరుసువిల్లి అరవింద్ పాల్గొన్నారు.

దుకాణంలో అగ్నిప్రమాదం

రూ.2 లక్షల ఆస్తినష్టం

సత్యనారాయణపురం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): అయోధ్యనగర్ లోటస్ ల్యాండ్‌మార్క్‌లో మంటలు చెలరేగి రెండులక్షల రూపాయల మేర అస్తినష్టం జరిగింది. అయోధ్యనగర్ లోటస్ ల్యాండ్‌మార్క్ ప్రారంభంలో కూచిపూడి శేషకుమారి(75) క్వాలిటీఫుడ్స్ షాపు నిర్వహిస్తుంది. షాపుపైన నివాసం ఉంటున్నారు. మంగళవారం ఉదయం షాపు తీసి గ్యాస్‌స్టౌవ్‌పై నీరు పెట్టి వెనుకాల వంటసామగ్రిని శుభ్రపరుస్తుండగా గ్యాస్ వాసన వచ్చింది. ఇంతలో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. షాపులో వంటకు సంబంధించిన ఆయిల్స్ ఉండడంతో పెద్దెత్తున మంటలు చెలరేగాయి. మంటలు ఆపేందుకు ప్రయత్నించినా ఫలితం లేక పోవడంతో, వెంటనే ఫైర్ ఇంజన్‌కు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేశారు. షాపులోని ఫ్రిడ్జ్, బీరువా, వంటసామగ్రి సుమారు 2లక్షలు విలువైన వస్తువులు అగ్నికి ఆహుత య్యాయి. షాపులోని బీరువాలో ఉంచిన సుమారు 55 వేల నగదు కాలి బూడిద అయింది. అగ్నిప్రమాదం జరిగిన సమయంలో మూడు నిండు సిలిండర్లు షాపులో ఉన్నాయి. పేలక పోవడంతో పెను ప్రమాదం తప్పింది.

పాలిటెక్నిక్ కాలేజీలో స్కిల్ డెవలప్‌మెంట్‌పై ఉచిత శిక్షణ

గన్నవరం: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్కిల్ హబ్ లో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుపై నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎ.పద్మావతి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వచ్చే నెల 15 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని చెప్పారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ చదివిన ఆసక్తిగల యువత 94940-05725 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

కోకో 'పీట్' ఐడియా సూపర్ హిట్

సమస్య నుంచే సంపద సృష్టి

● పారేసిన కొబ్బరి బొండాల నుంచి కోకో పీట్, కోకో పీచు ● నగర ప్రజలకు మేలు, కార్పొరేషన్‌కు ఆదాయం

కొబ్బరి చెట్టు ఉపయోగాలు అనేకం. వాటి ఆకుల నుంచి వేర్ల వరకు మానవ జీవితానికి ఏదో ఒక మేలు చేస్తూనే ఉంటాయి. కొబ్బరి, కొబ్బరి నీళ్లు, కొబ్బరి నూనె వంటివి మన ఆరోగ్యానికి ఎంతగానో దోహదపడతాయి. దేవుడు ముందు కొట్టే కొబ్బరి కాయలు, మనం తాగి వదిలేసిన కొబ్బరి బొండాల వ్యర్థాలు కూడా మానవాళికి ఉపయోగపడవచ్చని సరికొత్త అర్థాలను చెబుతున్నాయి. 'ట్రీ ఆఫ్ లైఫ్' అని గొప్పగా పిలుచుకునే కొబ్బరిచెట్టు వ్యర్థాల నుంచి కోకో పిట్, కోకో పీచు వంటివి కార్పొరేషన్ తయారు చేయిస్తూ లాభాలను పొందుతోంది.

- ఆంధ్రజ్యోతి, అజిత్‌సింగ్‌నగర్



కోకో పీట్ తయారీ యంత్రం

గతంలో తాగిపారేసిన కొబ్బరి బొండాలు నగరంలో ఓ పెద్ద సమస్యగా ఉండేవి. ఏ మూలచూసిన కుప్పలు తెప్పలుగా పడి పారిశుధ్య కార్మికులకు ఎంతో తలనొప్పిగా మారేవి. దీనికి తోడు బొండాల వ్యాపారులు వీటిని బుడమేరు, ఏలూరు, బందరు కాలువల్లో పడవేసేవారు. దీంతో ఆయా ప్రాంతాలు దోమల ఆవాసాలకు కేంద్ర బిందువులుగా మారి వాటివ్యాప్తికి ప్రధాన కారణమౌతున్నాయి. కాలువలు ఎండిపోయిన సమయంలో దుర్గంధం వెదజల్లుతున్నాయి. మురుగులో కలిసిపోవటంతో కాలువలు క్రమంగా పూడుకుపోయే పరిస్థితి ఏర్పడింది. మురుగు సమస్య అధికంగా ఉండేది. ప్రస్తుతం నగరపాలక సంస్థ వేసిన నూతన ఐడియాతో ఒకపక్క సమస్యకు పరిష్కారం దొరకడమే కాక సమస్య నుంచి సంపద సృష్టిస్తున్నారు.







కోకో పీట్, కోకో పీచు ప్రాసెసింగ్ ఇలా..

గతంలో వ్యర్థాలుగా రోడ్ల పక్క, కాలువల్లో, డంపింగ్ యార్డు ప్రాంతాల్లో పడి ఉండే ఈ బొండాల నుంచి నేడు కోకో పిట్, కోకో పీచు తయారీ చేస్తూ వీఎంసీ లాభాలను గడించడమే కాక చేతివృత్తిదారులకు ఉపాధిని కల్పిస్తోంది.

ముందుగా కొబ్బరి బొండాలను సేకరించి అజిత్‌సింగ్‌నగర్‌లోని ఎక్సెల్ ప్లాంట్ ఆవరణలో ఏర్పాటు చేసిన కంపోస్ట్ యూనిట్‌కు తరలిస్తారు. అక్కడ యంత్రాల ద్వారా కొబ్బరి బొండాల పీచును వేరు చేస్తారు. పీచు తీయగా మిగిలిన బొండాలను పొడి చేసి వచ్చిన పీట్‌ను వీఎంసీ పరిధిలోని పార్కులకు తరలించి మొక్కలకు ఎరువుగాను, వేర్ల పెరుగుదలకు పయోగపడేలా వినియోగిస్తున్నారు.

కిలో పీచు రూ.5

యూనిట్‌లో తీసిన కిలో పీచును రూ.5కు అధికారులు అమ్ముతున్నారు. ఆటోలు, ఇతర వాహనాల సీట్లకు, పరుపులు, సోఫాలు తదితర చేతి వృత్తిదారులు పీచును కొనుగోలు చేస్తున్నారు. ఈ పీచు కావాలనుకునే వారు సత్యనారాయణపురంలోని సర్కిల్-2 కార్యాలయంలో చలానా కట్టి కొబ్బరి పీచు కొనుగోలు చేయవచ్చు.





రక్తదానం చేస్తున్న ఉద్యోగులను పరామర్శిస్తున్న ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు

ఆర్టీసీ డ్రైవర్లు అభినందనీయులు

● రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన ఆర్టీసీ ఎండీ

బస్టేషన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రజా రవాణ సంస్థలోని డ్రైవర్లు నిత్యం ఏకాగ్రతతో విధులు నిర్వహిస్తూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చుతుండటం అభినందనీయమని ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలు సందర్భంగా మంగళవా రం పీఎన్‌బీఎస్ డిస్పెన్సరీలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రా రంభించారు. విజయవాడ రెడ్‌క్రాస్ బ్లడ్ సెంటర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో ఎన్టీఆర్ జిల్లా ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలు ఈనెల 15తో ముగియనున్నాయి. ఈ సందర్భంగా ద్వారకా తిరుమలరావు రక్తదానం చేసిన డ్రైవర్లు, ఉద్యోగుల వద్దకు వెళ్లి వారిని పరామర్శించారు. రక్తదానం ప్రాణం ఇవ్వటంతో సమానమని చెబుతూ మ రొకరి ప్రాణాలకు ఉపయోగపడే రక్తాన్ని ఇస్తున్నందుకు వారిని అభినందించారు. 83మంది ఉద్యోగులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారని కొనియాడారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలు సందర్భంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్టు అధికారులు తెలిపారు. అడ్మిన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జీవీ రవివర్మ ఆపరేషన్స్ డైరెక్టర్ ఏ అప్పలరాజు, ఇంజనీరింగ్ డైరెక్టర్ పీ చెంగల్ రెడ్డి, ఎన్టీఆర్ జిల్లా ప్రజా రవాణ అధికారి ఎం.వై.దానం, సీనియర్ మెడికల్ ఆఫీసర్లు స్వర్ణకుమారి, అధికారులు, సిబ్బంది, డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు.

ఎనికేపాడులో భూ వివాదం!

● వేధిస్తున్నారంటూ కలెక్టర్, సీపీకి బాధితుడి ఫిర్యాదులు

ఆంధ్రజ్యోతి, విజయవాడ: ఎనికేపాడులో రూ.3కోట్ల విలువైన 11 సెంట్ల భూ వివాదంలో పోలీసులు తమపై తీవ్రంగా ఒత్తిడి తెస్తున్నారంటూ ఎన్టీఆర్ జిల్లా పోలీసు అధికారులకు ఫిర్యాదు అందింది. కోర్టులో కేసు నడుస్తున్నా ఒక పోలీసు అధికారి పటమట పోలీసులపై ఒత్తిళ్లు తెచ్చి ఇబ్బంది పెడుతున్నాడంటూ బాధితుడు కలెక్టర్ లక్ష్మీశ, పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళితే విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడు గ్రామంలో వెలగపూడి నాగార్జున తనకు వారసత్వంగా సంక్రమించిన 580 చదరపు గజాల స్థలాన్ని ఓ ప్రైవేటు ఫైనాన్షియర్ తమ తల్లిదండ్రులైన వెలగపూడి సాయి వెంకట సుబ్బారావు, పుణ్యవతి నుంచి బలవంతంగా సేల్‌డీడ్ చేయించుకోవటమే కాక తమ స్వాధీనంలోని స్థలాన్ని బలవంతంగా లాక్కునే ప్రయత్నం చేశాడని ఆరోపించాడు. పటమట పోలీసులను ఆశ్రయించగా ఒక పోలీసు అధికారి ఒత్తిడితో తమ ఫిర్యాదును కాకుండా సేల్‌డీడ్ రాయించుకున్న ప్రైవేట్ ఫైనాన్షియర్ ఫిర్యాదును స్వీకరించి ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ ఫిర్యాదు చేశాడు. ఈ వివాదం కోర్టు విచారణలో ఉండగా పోలీసులు తమను ఇబ్బందులు పెడుతున్నారని ఫిర్యాదులో వాపోయాడు

ఘనంగా 'విజయ' వజ్రోత్సవం

పాలఫ్యాక్టరీలో కృష్ణా మిల్క్ యూనియన్ వేడుకలు

చిట్టినగర్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాలతోపాటు దేశవ్యాప్తంగా పాలు, పాల పదార్థాలు విక్రయిస్తూ విజయ పథంలో దూసుకుపోతున్న విజ య డెయిరీ (కృష్ణా మిల్క్ యూనియన్) 60 ఏళ్ల వ జ్రోత్సవాలు మంగళవారం చిట్టినగర్ పాలఫ్యాక్టరీలో వైభవంగా జరిగాయి. తొలుత యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు ఎండీ కొల్లి ఈశ్వరబాబు, పలువురు డైరెక్టర్లతో కలిసి ఫ్యాక్టరీలో ఉన్న కాకాని వెంకటరత్నం, వర్గీస్ కురియన్, నందమూరి తారక రామారావు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం 60 కేజీల కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఛైర్మన్ చలసాని ఆంజనేయులు మాట్లాడుతూ 60 ఏళ్లుగా పాడి రైతులకు భరోసా ఇచ్చేలా ఒక నమ్మకంతో కృష్ణా మిల్క్ యూనియన్ అభివృద్ధి చెందిందన్నారు. 650 లీటర్ల పాలసేకరణతో మొదలై, నేడు రోజుకి 3లక్షల లీటర్ల పాలసేకరణ జరుగుతుందని, లీటర్‌కు 50 పైసలు నుంచి ప్రస్తుతం లీటర్‌కు రూ.90కు పైగా చెల్లిస్తున్నామన్నారు. రూ.200 కోట్ల మిగులు నిధులతో దేశంలోనే అత్యధిక పాలసేకరణ ధర చెల్లిస్తూ ఒక చరిత్ర కృష్ణా మిల్క్ యూనియన్(విజయా డెయిరీ) సృష్టించిందన్నారు. యూనియన్ ఎదుగుదలలో పాత్ర ఉన్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో మొట్టమొదటి చిల్లింగ్ సెంటర్‌ను 1965 ఫిబ్రవరి 11న పామర్రులో ప్రారంభించగా నాటి నుంచి నేటి వరకు దినదినాభివృద్ధి చెందుతూ పాడి రైతులకు, వినియోగదారులకు అండగా నిలుస్తోందన్నారు. సురక్షితమైన పాలను అందించడంలో ప్రమాణాలను పాటిస్తూ 3 సార్లు కేంద్ర ప్రభుత్వం నుంచి ఏ ప్లస్ గ్రేడ్ సర్టిఫికెట్ దక్కించుకుందన్నారు. ఎండి. కొల్లి ఈశ్వరబాబు, డైరెక్టర్లు ఉయ్యూరు అంజిరెడ్డి, దాసరి వెంకటబాలవర్ధనరావు, వీటీకేవీ సుబ్బారావు, అర్జా వెంకట నగేష్, చలసాని చక్రపాణి, వేమూరి సాయి వెంకటరమణ, పల్లగాని కొండలరావు, బొట్టు రామచంద్రరావు, పాలడుగు వెంకటరామ వరప్రసాద్, నెలకుదిటి నాగేశ్వరరావు, నెక్కలపు వాణిశ్రీ, చెరుకూరి లవయ్య, శనగల వెంకటశివజ్యోతి, మద్దుకూరి వెంకటలక్ష్మి, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



పాలకవర్గ సభ్యులతో కలసి కేక్ కట్ చేస్తున్న ఛైర్మన్ చలసాని ఆంజనేయులు

ఉత్తమ సేవలందించిన పలువురికి సత్కారం

యూనియన్ వజ్రోత్సవం సందర్భంగా 30 ఏళ్లకు పైగా పనిచేసి సేవలందించిన లెనిన్, వీ.వెంకట బాలాజీ, కె. వెంకటేశ్వరరావు, జీ.కొండలరావు, జీ.నాగేశ్వరరావు, ఎం.శ్రీనివాసరావు, కేవీ శేషగిరిరావు, పీ కొండలను ఛైర్మన్ చలసాని ఆంజనేయులు, ఎండీ కొల్లి ఈశ్వరబాబు, డైరెక్టర్లు సత్కరించారు.

చెరువులో పడి రెండేళ్ల చిన్నారి మృతి

● బోళ్లపాడు గ్రామంలో విషాదం

ఘంటసాల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు చెరువులో పడి రెండేళ్ల చిన్నారి మృతి చెందిన విషాద సంఘటన ఘంటసాల మండలంలో చోటు చేసుకుంది. మండల పరిధిలోని బోళ్లపాడు గ్రామానికి చెందిన అంగడాల శివరామకృష్ణ కుమార్తె హేమశ్రీ (2) కనిపించకపోవటంతో తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు వెతుకులాట ప్రారంభించారు. మంగళవారం సాయంత్రం చెరువులో తేలడంతో కంగారు పడిన కుటుంబసభ్యులు హుటాహుటిన చల్లపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు సీపీఆర్ చేసినా ఫలించలేదు. చిన్నారి మృతి చెందినట్టు వైద్యులు తెలియజేయటంతో కుటుంబసభ్యులు బోరున విలపిస్తున్నారు. ఈ ఘటనతో గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న పోలీసులు చల్లపల్లి ప్రభుత్వాసుపత్రికి వెళ్లి వివరాలు సేకరించారు.



మృతి చెందిన హేమశ్రీ

బర్డ్‌ఫ్లూ భయం

(5వ పేజీ తరువాయి)

చెక్ పోస్టుల వద్ద నిఘా ఉంచడంతోపాటు అనుమానిత చికెన్ షాపులలో తనిఖీలు కూడా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. కోళ్ల ఫారాల వద్ద అధికసంఖ్యలో కోళ్లు చనిపోతుంటే అక్కడి నుంచి నమూనాలు సేకరించి ముందస్తు చర్యలు తీసుకోవాలని కూడా వైద్య, పశుసంవర్ధకశాఖతో పాటు ఇతర విభాగాల అధికారులను ఆదేశించారు. బర్డ్‌ఫ్లూ సోకిన కోడిమాంసం, కోడిగుడ్లు తింటే మనుషులకు ఈ వైరస్ సోకే ప్రమాదం ఉన్న నేపథ్యంలో పొరుగు జిల్లాల నుంచి కోళ్లు, కోడిగుడ్లు జిల్లాకు తరలించకుండా పటిష్ఠ నిఘా ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

2 నెలల కిందట మోపిదేవిలో చనిపోయిన కోళ్లు

రెండు నెలల కిందట మోపిదేవి మండలంలోని కప్తానుపాలెంలోని పౌల్ట్రీఫామ్‌ల్లో అధిక సంఖ్యలో కోళ్లు చనిపోయాయి. నాటు కోళ్లు కూడా చనిపోవటంతో వాటి శాంపిళ్లను జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారులు భోపాల్‌లోని ల్యాబ్‌కు పంపారు. ఆ తర్వాత వాటి వివరాలను బయటకు వెల్లడించలేదు. అప్పటి నుంచి జిల్లాలోని అన్ని పౌల్ట్రీ ఫామ్‌లను పశుసంవర్ధకశాఖ అధికారులు తరచుగా పరిశీలిస్తూ బర్డ్‌ఫ్లూ సోకకుండా కోళ్లకు వాక్సినేషన్ వేయడం, పౌల్ట్రీఫామ్‌ల వద్ద తీసుకోవాల్సిన పారిశుధ్య చర్యలు, తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు.

అమ్మకాలు తగ్గినా.. ధర అక్కడే!

బర్డ్‌ఫ్లూ ప్రభావంతో కోడిమాంసం అమ్మకాలు పడిపోతుండగా, కోడి ధర మాత్రం తగ్గినట్టే తగ్గి పెరుగుతోంది. ప్రస్తుతం కిలో కోడిమాంసం స్కిన్‌లెస్ రూ.240 ఉంది. కొద్దిరోజుల కిందటి వరకు ఇది రూ.200 ఉండేది. స్కిన్‌తో ఇప్పుడు రూ.230 పలుకుతోంది. కోడిమాంసం దుకాణాలకు వచ్చే కోళ్ల ధరలను పౌల్ట్రీలు క్రమంగా పెంచుతున్నాయి. పౌల్ట్రీల నుంచి కోడిమాంసం దుకాణాలకు వచ్చే కోడి కిలో రూ.100 ఉండేది. రెండు రోజుల నుంచి ఈ ధర పెరిగినట్టు వ్యాపారులు చెబుతున్నారు. ఇప్పుడు కిలో కోడి ధర రూ.125 పలుకుతోంది. బర్డ్‌ఫ్లూ ప్రభావంతో రూ.25 ధర పెరిగిందని వ్యాపారులు చెబుతున్నారు.

జిల్లాలో బర్డ్‌ఫ్లూ లక్షణాలు లేవు

జిల్లాలో బర్డ్‌ఫ్లూ లక్షణాలు లేవు. ఉభయ గోదావరి జిల్లాల్లో ఉన్నట్లు నిర్ధారణ కావడంతో ఆ జిల్లాల నుంచి కోళ్లు, కోడిగుడ్లు దిగుమతి కాకుండా నిఘా ఉంచాం. కోడి మాంసం దుకాణాలను కూడా పరిశీలిస్తున్నాం ఇతర జిల్లాల నుంచి తక్కువ ధరకు కోళ్లను దిగుమతి చేసుకోకుండా చూస్తున్నాం. బర్డ్‌ఫ్లూ సోకకుండా పౌల్ట్రీ యజమానులు ఇప్పటికే కోళ్లకు వ్యాక్సినేషన్ చేయించారు. వలస పక్షులు కోళ్లఫామ్‌ల పక్కనే ఉన్న చెట్లపై వాలకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చాం.

-ఎన్‌సీహెచ్.నరసింహులు, జేడీ, జిల్లా పశుసంవర్ధకశాఖ

14న 'పేట'కు భార్గవ్ భౌతికకాయం

నెట్టెం చొరవ, లోకేశ్ కృషితో ఐర్లాండ్ నుంచి ప్రత్యేక విమానంలో రాక





చిట్టూరి భార్గవ్, చెరుకూరు సురేష్

జగ్గయ్యపేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): జనవరి 31న ఐర్లాండ్‌లోని కార్లో నగర సమీపంలో జరిగిన కారు ప్రమాదంలో అసువులు బాసిన జగ్గయ్యపేటకు చెందిన చిట్టూరి భార్గవ్ భౌతికకాయం శుక్రవారం జగ్గయ్యపేటకు చేరుకోనుంది. తీవ్రమైన మంచు కురుస్తుండటంతో కార్లో సమీపంలో రాతో ప్రాంతంలో చెట్టును ఢీకొని బోల్తా కొట్టిన సంఘటనలో చిట్టూరి భార్గవ్‌తో పాటు గుంటూరుకు చెందిన చెరుకూరు సురేష్ మృతి చెందిన విషయం తెలిసిందే. వీరిద్దరూ అక్కడ సౌత్ ఈస్ట్ టెక్నాలజికల్ వర్సిటీలో ఎంఎస్ చదువుకునేందుకు ఏడాదిన్నర క్రితం వెళ్లారు. చదువు పూర్తయి ఉద్యోగాన్వేషణలో ఉండగా ప్రమాదం జరగటంతో ఆ రెండు కుటుంబాలు తీవ్ర విషాదంలో మునిగాయి. చిట్టూరి భార్గవ్ తండ్రి సాయిబాబు గండ్రాయి గ్రామం కాగా, జగ్గయ్యపేటలో నివాసం ఉంటున్నాడు, టీడీపీ విజయవాడ పార్లమెంట్ అధ్యక్షుడు నెట్టెం రఘురాం చొరవతో మంత్రి నారా లోకేశ్ ఐర్లాండ్ ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి భౌతికకాయాలను త్వరగా పంపించాలని కోరారు. సీఎంవో నుంచి పరిస్థితిని సమీక్షించారు. మృతి చెందిన 15 రోజులకు భౌతికకాయాలు స్వదేశానికి రానున్నాయి. బుధవారం ఐర్లాండ్ నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి గురువారం రాత్రికి హైదరాబాద్‌లోనికు చేరుతాయని భార్గవ్ కుటుంబసభ్యులకు సమాచారం అందింది.

డాక్టర్ గురురాజు హోమియో కళాశాల

ప్రిన్సిపాల్ రమాదేవి సస్పెన్షన్

● పెన్షన్ ప్రక్రియలో లేటు చేయడమే కారణం

గుడివాడ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ గురురాజు హోమియోపతి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.రమాదేవిని సస్పెండ్ చేస్తూ ఆయూష్ డిపార్టుమెంట్ రాష్ట్ర కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. డిపార్టుమెంట్ ఆఫ్ ఆయూష్ పరిధిలోని హోమియోపతి కళాశాలలో పనిచేసిన ఉద్యోగులకు పెన్షన్ విషయంలో కోర్టు తీర్పునిచ్చింది. పర్మినెంట్ ఉద్యోగులు 1987 నుంచి 1991 వరకు తాత్కాలికంగా విధులు నిర్వర్తించారు. పలువురు ఉద్యోగులు రిటైర్ అయి, రావలసిన బెనిఫిట్స్ తీసుకుని పెన్షన్ పొందుతున్నారు. కోర్టు నాలుగేళ్ల పనికాలాన్నీ పరిగణనలోకి తీసుకుని పెన్షన్, బెనిఫిట్స్‌ను చెల్లించాలని ఆదేశాలిస్తూ మూడు వారాల గడువునిచ్చింది. స్థానిక డా.గురురాజు హోమియోపతి కళాశాలలో విధులు నిర్వర్తించిన ఉద్యోగి ఒకరు 2007లో రిటైరయ్యారు. పెన్షన్, బెనిఫిట్స్ మొత్తం అంచనాలను ప్రిన్సిపాల్ డా.డి.రమాదేవి తయారు చేసి ఏజీ కార్యాలయానికి, ఆయూష్ విభాగానికి పంపారు. ప్రక్రియ పూర్తికి కోర్టు గడువుకన్నా అదనంగా మరోవారం ఎక్కువ సమయం తీసుకున్నారు. దీంతో న్యాయమూర్తి పరిష్కారంలో నిర్లక్ష్య వైఖరి, అదనపు సమయం తీసుకున్నందుకు ఆయూష్ కమిషనర్‌ను వ్యక్తిగతంగా హాజరు కావాలని ఆదేశాలిచ్చారు. దీంతో ఆయూష్ కమిషనర్ డా.రమాదేవిని సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. సస్పెన్షన్ సమయంలో ముందస్తు అనుమతి లేకుండా బయటకు వెళ్లకూడదన్నారు.

యంత్రాలతోనే ఇసుక తవ్వకాలు

● ప్రజాభిప్రాయ సేకరణ సదస్సులో అధికారుల వెల్లడి ● వద్దంటున్న మేస్త్రీలు

తోట్లవల్లూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): నూతన క్వారీల్లో పర్యావరణానికి ఆటంకం కలగకుండా చిన్న యంత్రాలతో ఇసుక తవ్వకాలు చేపడతామని అధికారులు వెల్లడించారు. తోట్లవల్లూరు గ్రామ సచివాలయం-2 వద్ద మంగళవారం నార్తువల్లూరు రెవెన్యూ పరిధిలో 445 సర్వే నెంబరులో 25 హెక్టార్లలో నూతనంగా క్వారీ ఏర్పాటు చేసి 2.50 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక తీసేందుకు నిర్ణయించామని, దీనిపై ప్రజాభిప్రాయ సేకరణకు సదస్సు నిర్వహించారు. ఆర్డీవో హేలా షారోన్ మాట్లాడుతూ ప్రజల అభిప్రాయాలను గౌరవిస్తామని, ఇసుక తవ్వకాల వల్ల ఏమైనా పర్యావరణ ఇబ్బందులుంటే చెప్పాలని సూచించారు. ఎన్విరో ల్యాబ్స్ (విశాఖపట్నం) కన్సల్టెంట్ ఎంవీవీఎస్ రామకృష్ణ మాట్లాడుతూ చిన్న జేసీబీలతో ఒక మీటరు లోతున ఇసుక తవ్వకాలు చేపడతారని, క్వారీలో 22 మందికి ఉపాధి లభిస్తుందన్నారు. రోడ్లపై దుమ్ము లేవకుండా వాటరింగ్ చేస్తారని, ఇసుక తవ్వకాలు చేసినవారు మొక్కలు నాటుతారన్నారు. అనంతరం జిల్లా మైనింగ్ శాఖ అసిస్టెంట్ జియాలజిస్టు కొండారెడ్డి ప్రసంగించారు. సర్పంచ్ పెనుముత్స రాధిక, తూమాటి సుధాకర్, వల్లూరు కుమార్, మట్టా రాజేష్ మాట్లాడుతూ కార్మికుల ఉపాధి దెబ్బతినకుండా ఇసుక తవ్వకాలు చేయాలని, యంత్రాలు పెడితే కార్మికులు నష్టపోతారన్నారు. ఇప్పటి వరకు జరిపిన ఇసుక తవ్వకాలతో గ్రామంలో దుమ్ము, దూళితో ప్రజలు శ్వాసకోశ వ్యాధులకు, అలర్జీలకు, కంటి సమస్యలకు గురవుతున్నారని, ఈటిపై ఎవ్వరికి చెప్పుకోవాలో తెలియడం లేదన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీవో హేలా షారోన్, ఈఈ శ్రీనివాస్, తహసీల్దార్ కుసుమకుమారి

ఇసుక క్వారీల్లో యంత్రాలు వద్దు

ఇసుక క్వారీల్లో యంత్రాలను ప్రవేశపెట్టవద్దని కోరుతూ మంగళవారం రొయ్యూరు ఇసుక ముఠా మేస్త్రీలు నిమ్మగడ్డ రాకేష్, లుక్కా దుర్గా నాగేశ్వరరావు తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. రొయ్యూరులో 300 మంది ఇసుక కార్మికులు జీవనోపాధిని కాపాడాలని వారు కోరారు.

మరణించినా ముగ్గురికి ప్రాణదానం

● రోడ్డు ప్రమాదంలో గాయపడి బ్రెయిన్‌డెడ్‌కు గురైన కోటేశ్వరరావు

● అవయవదానానికి అంగీకరించిన కుటుంబసభ్యులు

● గ్రీన్‌చానల్ ద్వారా అవయవాలను తరలించిన కామినేని ఆసుపత్రి వైద్యులు

పెనమలూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): తాను మరణిస్తూ మరో ముగ్గురికి ప్రాణం పోసి చిరంజీవి అయ్యాడు కృష్ణాజిల్లా బంటుమిల్లికి చెందిన బుద్దన కోటేశ్వరరావు. కృష్ణాజిల్లా బంటుమిల్లికి చెందిన బుద్దన కోటేశ్వరరావు (54) ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయపడ్డాడు. అతడిని చికిత్స నిమిత్తం తాడిగడపలోని కామినేని ఆసుపత్రికి తీసుకొచ్చారు. చికిత్స పొందుతూ కోటేశ్వరరావు బ్రెయిడ్ డెడ్‌కు గురవటంతో ఆసుపత్రి వైద్యుల సలహా మేరకు కుటుంబసభ్యులు కోటేశ్వరరావు అవయవ దానానికి అంగీకరించారు. నిబంధనల మేరకు కిడ్నీలు, లివర్‌ను సేకరించిన వైద్యులు గ్రీన్‌చానెల్ ద్వారా అవసరమైన చోట్లకు తరలించారు. కామినేని క్లస్టర్ హెడ్ సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో వైద్యులు ఉయ్యూరు శ్రీధర్, రాంబాబు పాల్గొన్నారు.

మామిడి రైతులకు మంచి రోజులు!

(5వ పేజీ తరువాయి)

అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఏపీఐఐసీ అధికారులు చర్యలు చేపడుతున్నారు.

ఫ్లోర్ మిల్ యాజమాన్యం, ఏపీఐఐసీ మధ్య వివాదం

కోర్ ప్రాసెసింగ్ సెంటర్ (సీపీసీ)ను అందుబాటులోకి తీసుకురావాలంటే.. ప్రధానంగా ప్రస్తుత నిర్వహణ సంస్థ ఏదైతే ఉందో దానిని సాగనంపే చర్యలను ఏపీఐఐసీ అధికారులు చేపడుతున్నారు. ఫ్లోర్ మిల్ యాజమాన్యం ఏపీఐఐసీ అధికారుల మీద ఒక సూట్ కూడా వేసింది. తాను గతంలో ఈ ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించి కొన్ని పనులు చేసి ఉన్నానని, వాటికి డబ్బులు చెల్లించాల్సిందిగా కోరినట్టు తెలుస్తోంది. ఏపీఐఐసీ అధికారులు మాత్రం ఈ పనుల గురించి తమకు ఎలాంటి సమాచారం లేదన్న వాదనలు వినిపిస్తున్నారు. నిర్వహణ చేసినందుకు చెల్లించాల్సిన బకాయిలను చెల్లిస్తామని ఏపీఐఐసీ అధికారులు చెబుతున్నారు. పనులకు సంబంధించి మాత్రం సమాచారం లేనందున చెల్లించటం కుదరదని చెబుతున్నారు. ఇక్కడే ఉభయుల నడుమ వివాదం తలెత్తింది. ఈ సమస్యను ఎట్టి పరిస్థితుల్లో మార్చి కల్లా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఏపీఐఐసీ జెడ్ఎం సీతారాం 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు.

మామిడి సీజన్‌కు అందుబాటులోకి..

మామిడి సీజన్‌కు నూరు శాతం మల్లవల్లి సీపీసీ యూనిట్ అందుబాటులోకి రానుంది. ఉమ్మడి కృష్ణాజిల్లాతో పాటు ఉభయ గోదావరి జిల్లాల మామిడి రైతాంగానికి కూడా సీపీసీ ఎంతగానో ఉపయోగపడుతుంది. నాణ్యమైన మామిడి పల్ప్ ఎగుమతులకు విదేశాలలో మంచి డిమాండ్ ఉంది. ధర కూడా బాగా పలుకుతుంది. కిందటి సారి కోర్ ప్రాసెసింగ్ సెంటర్ అందుబాటులోకి రాకపోవటం వల్ల మామిడి రైతులు నిరుత్సాహం చెందారు. సీపీసీలో అయితే చాలా తక్కువ ధరకు మ్యాంగో పల్ప్ తయారు చేయవచ్చన్న రైతులు పెట్టుకున్న ఆశలు వమ్ము అయ్యాయి. ఈ దఫా ఎట్టి పరిస్థితుల్లోనూ అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.



ప్యాకింగ్ యూనిట్

అసలు సీపీసీ ద్వారా ఏమేమి జరుగుతాయంటే..

కోర్ ప్రాసెసింగ్‌లో మెగా ఫుడ్‌పార్క్‌లోని ఆహార శుద్ధి పరిశ్రమలతో పాటుగా ఉద్యానపంటల రైతాంగానికి కూడా ఎంతగానో దోహద పడుతుంది. ఈ సీపీసీలో పల్పింగ్ లైన్ అనేది చాలా ప్రధానమైనది. గంటకు ఆరు టన్నుల టమాటా, 10 టన్నుల మామిడి, ఐదు టన్నుల బొప్పాయి, ఆరు టన్నుల జామకాయ, నాలుగు టన్నుల అరటి వంటి ఫ్రూట్ పల్ప్‌ను పల్పింగ్ లైన్ ద్వారా చేయవచ్చు. అలాగే ఫుల్లీ ఆటోమేటిక్ బ్రిక్ కార్టన్ ఫిల్లింగ్ అండ్ ప్యాకింగ్ లైన్ అనేది మరొకటి ఉంది. దీంట్లో 200 ఎంఎల్ జ్యూస్ ఉత్పత్తులను, కొబ్బరి నీటిని ప్యాకింగ్ చేస్తారు. ఈ సీపీసీలో 4000 మెట్రిక్ టన్నుల గోడౌన్ సదుపాయం కూడా ఉంది. ఇందులో అన్ని రకాల రా మెటీరియల్స్‌ను నిల్వ చేసుకోవచ్చు. మరో 3000 మెట్రిక్ టన్నుల కోల్డ్ స్టోరేజీ ఉంది. ఇందులో పండ్లు, కూరగాయలు, సుగంధ ద్రవ్యాలు, పల్ప్ వంటివి నిల్వ చేయవచ్చు. ప్యాకింగ్ యూనిట్ కూడా ఉంది. ఈ యూనిట్‌లో 100 గ్రాముల నుంచి 2 కేజీల వరకు నిమిషానికి 50 - 70 ప్యాకెట్లను తయారు చేయగల సామర్థ్యాన్ని కలిగి ఉంది.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
బుధవారం • 12 ఫిబ్రవరి 2025



ఝుంకా మెరుపుల్

ఫ్యాషన్

చెవులకు చిట్టిపొట్టి పోగులు ధరించే రోజులు పోయాయి. ఇప్పుడంతా భారీ ఝుంకాల ఫ్యాషనే! పెళ్లిళ్ల సీజన్లో ఇలాంటి భారీ ఝుంకాలకు గిరాకీ ఎక్కువ. కాబట్టి తాజాగా మహిళలను ఆకట్టుకుంటున్న ఈ ఫ్యాషన్ గురించి తెలుసుకుందామా?







దక్షిణ భారత మూలాలు కలిగిన సంప్రదాయ ఆలయ ఆభరణాలైన ఝుంకాలు గుడి గంట ఆకారంలో తయారవుతూ ఉంటాయి. ఆకారంలో పెద్దవిగా, బరువుగా ఉండే ఈ ఆభరణాలు కాలక్రమేణా కొత్త హంగులు అద్దుకుంటూ వినూత్నమైన డిజైన్లతో రూపొందడం మొదలుపెట్టాయి. ప్రారంభంలో దక్షిణ భారత దేశంలోని భరతనాట్య కళాకారిణులు చంప సరాలతో కలిపి వీటిని ధరించడం మొదలుపెట్టారు. ప్రాంతాన్ని బట్టి భిన్నమైన పేర్లను పొందిన ఈ ఆభరణాలను రాజస్థాన్‌లో మీనాకారి ఝుంకాలుగా పిలుస్తూ ఉంటారు. ఆ ప్రాంతంలో ఇవి పూలు, నెమలి డిజైన్లతో రూపొందుతూ ఉంటాయి. బంగారం, వెండి, వజ్రాలతో రూపొందే ఝుంకాలు వేర్వేరు పరిమాణాలు, డిజైన్లలో మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి.

వేర్వేరు నమూనాల్లో...

గుండ్రని, గంటాకారపు, చంద్రాకారపు, శంఖాకార ఝుంకాలు తయారవుతూ ఉంటాయి. వీటిలో పెద్దవీ, చిన్నవీ ఉంటాయి. అయితే ఆకారంలో పెద్దవిగా ఉండే వాటిని అన్ని సందర్భాల్లో ధరించడం వీలు కాదు కాబట్టి వాటిని స్టడ్‌గా, ఝుంకాగా వేర్వేరుగా విడదీసే వీలుండే డిటాచబుల్ నమూనాలు కూడా దొరుకుతున్నాయి. వీటికి మ్యాచ్ అయ్యే చంపసరాలు కూడా అందుబాటులో ఉంటున్నాయి. కాబట్టి పెళ్లిళ్ల లాంటి వేడుకల్లో భారీ ఝుంకాలనూ, రోజువారీ వాడుక కోసం తేలికపాటి ఝుంకాలను ఎంచుకోవచ్చు. మరీ ముఖ్యంగా సంప్రదాయ వేడుకల్లో టెంపుల్ జ్యువెలరీ విభాగానికి చెందిన ఝుంకాలు చాలా బాగుంటాయి.

నప్పేవాటిని ఎంచుకుని...

ఝుంకాలు భారీగా ఉన్నప్పుడు మెడలో తేలికపాటి ఆభరణాలు ధరించాలి. మెడలో వేసుకునే నెక్లెస్ లేదా చోకర్ భారీగా ఉన్నప్పుడు తేలికపాటి ఝుంకాలు పెట్టుకోవాలి. అలాగే వస్త్రధారణను బట్టి అందుకు తగిన ఝుంకాలను ఎంచుకుంటూ ఉండాలి. ఇలా వేడుక, సందర్భం, వస్త్రధారణల ఆధారంగా తగిన ఝుంకాలను ధరిస్తే చూపరులను ఇట్టే ఆకట్టుకోవచ్చు.

నూనె వాడకం తగ్గించాలంటే..!

వంటకాల్లో అధికంగా నూనెను ఉపయోగించడం ఆరోగ్యానికి మంచిది కాదని నిపుణులు సూచిస్తున్నారు. నూనె వాడకాన్ని ఎలా తగ్గించాలో తెలుసుకుందాం!

- వంట చేసేటప్పుడు నూనెను నేరుగా బాటిల్‌తో కాకుండా చెంచాతో కొలిచి వేయడం అలవాటు చేసుకోవాలి. కూరలు చేసేటప్పుడు, పచ్చళ్ల తాలింపులో ఎక్కువ నూనెని ఉపయోగించవద్దు.
- మూకుడు నిండుగా నూనె పోసి చేసే వంటకాలకు బదులు ఆవిరి మీద ఉడికించి చేసే అల్పాహారాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. వేపుళ్లు తగ్గించాలి. తాలింపు కూరలు చేసుకుంటే శరీరానికి ఎ, డి, కె విటమిన్లు బాగా అందుతాయి.
- అప్పడాలను నూనెలో వేయించకుండా సన్నని మంట మీద కాల్చుకుని తినవచ్చు.
- డీప్ ఫ్రైకి బదులు షాలో ఫ్రై, రోస్ట్, బేకింగ్, గ్రిల్లింగ్, స్టీవింగ్ పద్ధతులను అనుసరించాలి.
- గ్రేవీ ఆధారిత కూరలు, తొందరగా మగ్గే కూరలను తక్కువ నూనెతో చేసుకోవచ్చు. మాంసాహార కూరలు చేసేటప్పుడు అవసరమైనంతే నూనె వాడాలి.
- దోశలు చేసేటప్పుడు పెనం మీద చెంచాతో నూనె రాయడానికి బదులు ఒక పెద్ద ఉల్లిపాయను మధ్యకు కోసి దానితో రుద్దితే చాలు. కావాలనుకుంటే దోశమీద బ్రష్‌తో కొద్దిగా నూనె రాసుకోవచ్చు. చపాతీలు కాల్చేటప్పుడు కూడా ఇదే పద్ధతిని అనుసరించాలి.
- కూరగాయల ముక్కలను ముందుగానే ప్రెజర్ కుక్కర్ లేదా ఓవెన్‌లో ఉడికించి తరవాత తేలికపాటి తాలింపుతో కూరలు చేసుకుంటే ఆరోగ్యానికి మంచిది.
- నెలకి ఎంత నూనె వాడుతున్నామో ఒక పుస్తకంలో రాసి పెట్టుకోవాలి. దీనివల్ల నూనె వాడకంపై ఒక అవగాహన వస్తుంది.

శిరోజాల అందానికి...

కాఫీ పొడిలో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి ఆరోగ్యాన్నేకాదు శిరోజాలను కూడా ఫ్రీ రాడికల్స్ నుంచి కాపాడతాయి. కాఫీ పొడితో హెయిర్ మాస్క్ తయారు చేసుకుని వాడితే శిరోజాలు అందంగా పెరుగుతాయి.

- ఒక గిన్నెలో రెండు చెంచాల కాఫీ పొడి, ఒక కప్పు పెరుగు వేసి బాగా కలపాలి. పెరుగు స్థానంలో కలబంద గుజ్జును కూడా కలపుకోవచ్చు. ఈ మిశ్రమాన్ని మాడుకు, శిరోజాల కుదుళ్ల నుంచి చివరి వరకు పట్టించాలి. గంటసేపు ఆరిన తరవాత మైల్డ్ షాంపూతో శుభ్రం చేసుకోవాలి. ఇలా వారానికి ఒకసారి చేస్తే జుట్టు సమస్యలన్నీ తొలగి పోతాయి. కుదుళ్లు బలంగా మారతాయి. తల వెంట్రుకలు నల్లగా పొడవుగా పెరుగుతాయి.
- ఒక గ్లాసు నీళ్లలో రెండు చెంచాల కాఫీ పొడి వేసి బాగా మరిగించండి. తరవాత వడకట్టి చల్లారనివ్వండి. ఈ నీటిని తలంతా పట్టించి ఇరవై నిమిషాలు ఆరిన తరవాత మంచి నీళ్లతో తలస్నానం చేయండి. ఇలా పదిరోజులకోసారి చేస్తూ ఉంటే శిరోజాలు నల్లగా మెరుస్తాయి. మాడు మీద చర్మానికి తేమ అంది చుండ్రు రాదు.

అది అపురూప ఘట్టం

విజేత



పేదరికమనే అడ్డుగోడలు దాటి... ఒకరికి ఒకరు స్ఫూర్తిగా ఎదిగిన నేపథ్యం. కష్టాన్ని పెట్టుబడిగా పెట్టి... స్వయంకృషితో సాధించిన విజయం. కానిస్టేబుల్ అయిన గురువుకు... అదే పోలీసు స్టేషన్‌కు ఎస్ఐగా వచ్చి అపురూప కానుక ఇచ్చారు ఓ శిష్యురాలు. ఆమే... రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ సబ్‌ఇన్‌స్పెక్టర్ (ప్రొబెషన్)గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన జబీనా బేగం. ఈ ప్రయాణంలో తనకు ప్రేరణగా నిలిచిన గురువు గురించి... సమస్యలు, సవాళ్లను అధిగవించి అందుకున్న లక్ష్యం గురించి ఆమె 'నవ్య'తో సంభాషించారు.

'సమస్యలు, సవాళ్లు అందరికీ ఎదురవుతాయి. వాటిని తట్టుకొని నిలబడితేనే జీవితం ముందుకు సాగుతుంది. ఈ తత్వం నాకు చిన్నప్పుడే బోధపడింది. అందుకే పేదరికం ప్రతిబంధకంగా మారినా... దాన్ని సాకుగా చూపి వెనకడుగు వేయదలుచుకోలేదు. ఎవరో వచ్చి ఏదో చేస్తారనీ ఎదురుచూడలేదు. నా కాళ్లపై నేను నిలబడాలని నిశ్చయించుకున్నాను. అనుకున్నది సాధించాను. వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండలం మక్త వెంకటాపూర్‌లో ఓ నిరుపేద కుటుంబం మాది. మా అమ్మ దౌలత్‌బేగం. నాన్న మహమ్మద్ షరీఫ్. మేం ముగ్గురు సంతానం. అన్నయ్య మహమ్మద్ సలీం, చెల్లెలు ఆఫ్రీన్‌బేగం. ఊళ్లో ఉన్న చిన్న కిరాణా దుకాణం మినహా మాకంటూ మరే ఆధారం లేదు. షాపు మీద వచ్చే కొద్దిపాటి ఆదాయంపైనే మా కుటుంబం అంతా ఆధారపడేది. ఈ పేదరికం నుంచి బయటపడాలంటే నాకున్న ఒకేఒక్క దారి చదువు. ఈ విషయం గ్రహించి, మానకుండా రోజూ బడికి వెళ్లేదాన్ని. ఏడో తరగతి వరకు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నాను. ఎనిమిదో తరగతి రాజేంద్రనగర్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో చేరాను. పదో తరగతిలో మంచి మార్కులు రావడంతో... పరిగిలోని ప్రతిభ ప్రైవేటు జూనియర్ కాలేజీవారు ఉచితంగా సీటుతో పాటు స్కాలర్‌షిప్ కూడా ఇచ్చారు. ఇంటర్ తరువాత హైదరాబాద్‌లో డిగ్రీ చదివాను.

పాఠాలు చెబుతూ...

వెంకటాపూర్ మారుమూల గ్రామం. చిన్న తండా. అక్కడ కిరాణా దుకాణంపై వచ్చే ఆదాయం ఏ మూలకూ సరిపోయేది కాదు. ఆపై మా చదువులు. అమ్మానాన్నలకు తలకు మించిన భారమైంది. ఆర్థిక ఇబ్బందులనుంచి బయటపడడానికి మా ఊరు వదిలి, హైదరాబాద్ గౌలిదొడ్డికి వచ్చాం. అమ్మానాన్న... ఆ ప్రాంతంలోని రోడ్డు పక్కన చిన్న హోటల్ పెట్టారు. కానీ మా అందరి చదువులకూ ఆ సంపాదన సరిపోయేది కాదు. అమ్మానాన్న మా కోసం ఇంత కష్టపడుతున్నారు. వాళ్ల శ్రమ కొంతైనా తగ్గించాలన్న ఉద్దేశంలో డిగ్రీ అవ్వగానే నార్సింగిలోని రెసిడెన్షియల్ పాఠశాలలో పాఠాలు చెప్పాను. ఆ డబ్బు నా గ్రూప్స్ కోచింగ్‌కు ఉపయోగపడింది.

ఆ తపనతోనే...

నా చుట్టూ ఉన్నవారితో పోలిస్తే నాకంటూ ఒక ప్రత్యేకత ఉండాలని కోరుకొంటాను. బడి వయసులో అయినా... చేసే ఉద్యోగంలో అయినా! చదువుకొనే రోజుల్లో నేను స్కూల్ లీడర్‌ని. అంతేకాదు.. టీచర్లు చెప్పే పాఠాలు అర్థం కాని కొందరు తోటి విద్యార్థులకు వివరించి చెప్పేదాన్ని. పాఠ్యాంశాలపై పట్టు సాధించడానికి అది నాకు ఉపయోగపడింది. అన్నిటికీ మించి మా అమ్మకు నాపై నమ్మకం. నేను ఏంచేసినా ముందు అమ్మకు చెబుతాను. అన్నయ్య కూడా ఎంతో సహకారం అందించాడు. వారి ప్రోద్బలంవల్లే కట్టుబాట్లను దాటి నేను లక్ష్యం వైపు వెళ్లగలిగాను.

పెళ్లి ప్రస్తావన పక్కన పెట్టి...

నాలుగేళ్ల కిందటి మాట ఇది. ఇంటర్ చదువుతున్న రోజుల్లో నాకు పెళ్లి చేద్దామని నిర్ణయించారు మా ఇంట్లోవాళ్లు. సంబంధం కూడా కుదిరింది. అయితే అప్పుడే పెళ్లి చేసుకొంటే నా జీవితం అంతటితోనే ఆగిపోతుందని భావించాను. నాకంటూ కొన్ని లక్ష్యాలున్నాయి. వాటిని చేరాకే పెళ్లయినా... మరేదైనా అనుకున్నాను. ఇదే విషయం అమ్మానాన్నలకు చెప్పాను. విషయం మా లెక్చరర్ లాల్యానాయక్‌కు తెలిసింది. ఆయనది కూడా నిరుపేద కుటుంబం. వికారాబాద్ జిల్లా పరిగి మండలం చౌదరిగూడ స్వస్థలం. నేను బాగా చదువుతానని నన్ను ఎంతో ప్రోత్సహించారు. నా పెళ్లి గురించి తెలియగానే ఆయన మా ఇంటికి వచ్చి అమ్మానాన్నలతో మాట్లాడారు. నేను, అన్నయ్య కూడా నచ్చజెప్పడంతో, అమ్మావాళ్లు ఒప్పుకున్నారు. నా పెళ్లి ప్రస్తావన పక్కన పెట్టారు.

స్నేహితుల సహకారం...

పెళ్లయితే ఆగింది. కానీ పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలంటే ఖర్చుతో కూడుకున్నది. అంత డబ్బు సమకూర్చే వెసులుబాటు మా ఇంట్లో లేదు. తినడానికి తిండి కూడా లేని సందర్భాలు అనేకం ఉన్నాయి. అలాంటి క్లిష్ట పరిస్థితుల్లో నా స్నేహితులు మమత, షహనాజ్ నన్ను ఆదుకున్నారు. ఏడాదిపాటు వాళ్ల ఇళ్లల్లోనే ఉన్నాను. ఓయూలో మరో స్నేహితురాలు అనూష దగ్గర కొన్ని నెలలు ఉన్నాను. తన కార్డు మీదే భోజనం చేసేదాన్ని. తెలిస్తే బాధపడతారని ఈ విషయం ఇవాల్టి వరకు ఇంట్లోవాళ్లకు చెప్పలేదు. అలా మా ఇంటికి వెళ్లకుండా ఏడాదికి పైగా గ్రూప్స్‌కు సన్నద్ధమయ్యాను. ఏదో ఒక ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్నది నా పట్టుదల. అయితే పోలీసు కొలువు కోరుకోలేదు. కానీ గత ఏడాది పరీక్షలు రాస్తే ఎస్ఐ ఉద్యోగం వచ్చింది. అంతే... మా ఇంట్లోవాళ్ల ఆనందానికి అవధులు లేవు. దీని వెనుక నా పట్టుదల, కృషి మాత్రమే కాదు... మా గురువు గారు ఇంటర్ తరువాత, ఉద్యోగం వచ్చేవరకు నాకు మార్గదర్శనం చేశారు. నా స్నేహితులు నాకు అండగా నిలిచారు. వారందరి ప్రోత్సాహం, సహకారం వల్లే ఇది సాధ్యమైంది. ప్రస్తుతం మా చెల్లెలు కూడా కానిస్టేబుల్‌గా ఎంపికైంది.

ఉద్వేగ క్షణం...

మా గురువు లాల్యానాయక్ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకొని ఎంఏ, బీఎడ్ పూర్తి చేశారు. కొన్నాళ్లు లెక్చరర్‌గా పని చేశారు. కరోనా సమయంలో కళాశాల మూతపడటంతో ఉపాధి కోల్పోయారు. పోటీ పరీక్షలకు సిద్ధమై, 2020లో కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. ప్రస్తుతం మొయినాబాద్ పోలీసు స్టేషన్‌లో పని చేస్తున్నారు. ఇప్పుడు నేను ఏడాది శిక్షణ పూర్తి చేసుకొని అదే పోలీసు స్టేషన్‌కు ఎస్ఐ (ప్రొబెషన్)గా వచ్చాను. స్టేషన్‌లోకి అడుగుపెట్టే సమయంలో... ప్రధాన ద్వారం వద్ద కానిస్టేబుల్‌గా మా గురువు నాకు సెల్యూట్ కొట్టినప్పుడు ఎంతో ఉద్వేగానికి లోనయ్యాను. తన శిష్యురాలిని తనకంటే ఉన్నత స్థానంలో చూసి ఆయన మురిసిపోయారు. ఎంతో గర్వపడ్డారు. నా జీవితంలోనే అపురూప ఘట్టం అది. ఇద్దరి నేపథ్యం ఒక్కటే... పేదరికం. దృఢ సంకల్పంతో దాన్ని అధిగమించి అనుకున్నది సాధించాం. నాలాంటి అమ్మాయిలకు చెప్పేది ఒక్కటే... నిబద్ధతతో కష్టపడితే ఏదీ అసాధ్యం కాదు."



\- **ఆర్.యాదయ్య**, మొయినాబాద్

సోఫా కవర్ల మట్టి వదిలించాలంటే...

సోఫా కవర్లను కాటన్, మైక్రోఫైబర్, పాలిస్టర్, లినెన్, వెల్వెట్ ఫ్యాబ్రిక్‌లతో రూపొందిస్తూ ఉంటారు. ఫ్యాబ్రిక్‌ని బట్టి వీటిని శుభ్రం చేసే విధానం మారుతూ ఉంటుంది. వివిధ రకాల సోఫా కవర్లను ఎలా శుభ్రం చేయాలో తెలుసుకుందాం!

- ముందుగా సోఫాపై ఉన్న లేబుల్‌ను పరిశీలిస్తే కవర్‌ను ఏ మెటీరియల్‌తో రూపొందించిందీ తెలుస్తుంది. దాన్ని శుభ్రం చేయడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఒక అవగాహన వస్తుంది.



- కాటన్, పాలిస్టర్, లినెన్, వెల్వెట్ కవర్లను వాషింగ్ మెషిన్‌లో వేసేకన్నా చేతితో ఉతకడం మంచిది. దీనివల్ల ఫ్యాబ్రిక్ నాణ్యత పాడవకుండా ఉంటుంది. ముందుగా వీటిని మంచినీళ్లలో ముంచి తీయాలి. తరవాత సర్ఫ్, షాంపూ, డిటర్జెంట్ కలిపిన నీళ్లలో ఇరవై నిమిషాలు నానబెట్టాలి. చేతులతో సున్నితంగా ఉతికి గోరువెచ్చని నీటితో శుభ్రం చేయాలి. గట్టిగా పిండకుండా నీడలో ఆరేయాలి. ఇవి పూర్తిగా ఆరిన తరవాత వెల్వెట్ వినహా అన్నింటినీ తక్కువ వేడితో ఇస్త్రీ చేస్తే కొత్తవాటిలా మెరుస్తాయి.
- మైక్రోఫైబర్ కవర్లు చాలా సున్నితంగా ఉంటాయి. ముందుగా వీటిని బాగా దులిపి దుమ్ము, ధూళి వదిలించాలి. తరవాత డిటర్జెంట్ లేదా షాంపూ కలిపిన నీళ్లలో ముంచి తీయాలి. మరోసారి చల్లని నీళ్లలో ముంచి తీసి నీడలో ఆరేయాలి.
- లెదర్ కవర్ల మీద దుమ్ము నిలవదు. కాబట్టి వీటిని శుభ్రం చేయడం తేలిక. పలుచని బట్ట లేదా స్పాంజ్‌ని డిటర్జెంట్ నీళ్లలో ముంచి పిండాలి. దీనితో కవర్‌ను శుభ్రంగా తుడవాలి. తరవాత ఫ్యాన్ గాలికి ఆరనిస్తే సరిపోతుంది.
- సోఫా కవర్లను తరచూ వాక్యూమ్ క్లీనర్‌తో శుభ్రం చేస్తూ ఉంటే వాటిపై పేరుకునే దుమ్ము పోతుంది. మరకలు పడితే వెనిగర్, ఆల్కహాల్, శానిటైజర్ వేసిన దూదితో రుద్ది తొలగించాలి. దీంతో కవర్లను వెంట వెంటనే డ్రైక్లీనింగ్ లేదా ఉతికే అవసరం రాదు.

చిత్రజ్యోతి
SINCE 1965



ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం రహదారికి నేమ్ బోర్డు ఆవిష్కరణ

- డిప్యూటీ సీఎం ఉదయనిధి, పలువురు మంత్రుల హాజరు

దివంగత సినీ నేపథ్యగాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కీర్తివిశేషాలు, సేవలకు గుర్తుగా ఆయన నివసించిన రోడ్డుకు ఆయన పేరే పెడుతూ తమిళనాడు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ రోడ్డుకు 'నేమ్ బోర్డు'ను మంగళవారం రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఉదయనిధి లాంఛనంగా ఆవిష్కరించారు. స్థానిక నుంగంబాక్కం, కామ్‌ధర్ నగర్ మెయిన్ రోడ్డులో ఎస్పీబీ నివసించేవారు. ఆయన జ్ఞాపకార్థం కామ్‌ధర్ మెయిన్ రోడ్డుకు తన తండ్రి పేరు పెట్టాలని ఎస్పీబీ తనయుడు ఎస్పీ చరణ్ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌కు విజ్ఞప్తి చేశారు. నేమ్‌బోర్డు ఆవిష్కరణలో రాష్ట్ర మంత్రులు, ఎస్పీబీ సతీమణి, కుమారుడు, కుమార్తె, సోదరి ఎస్పీ శైలజ పాల్గొన్నారు. సహజంగా తమిళుల పేర్లకు చివరన 'ఎన్' అక్షరం వుంటుంది. కానీ ఎస్పీబీ కుటుంబ సభ్యుల వినతి మేరకు ప్రభుత్వం ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం రోడ్ అనే ప్రభుత్వం పేరు పెట్టింది.

\- చెన్నై (ఆంధ్రజ్యోతి)

మళ్లీ రాజకీయాల్లోకి రాను



- రాజకీయాల్లోకి రీ ఎంట్రీ ప్రచారాన్ని ఖండించిన చిరంజీవి
- నా రాజకీయ ఆశయాలను పవన్ కల్యాణ్ నెరవేరుస్తాడు

"పెద్దవాళ్లందరికీ దగ్గరవుతున్నాడు, వాళ్లు కూడా దగ్గరకు తీసుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారు, చిరంజీవి మళ్లీ రాజకీయాల్లోకి వస్తాడేమో అని చాలామంది అనుకుంటున్నారు. కానీ అలాంటిదేం లేదు. ఇక ముందు పొలిటికల్‌గా వెళ్లడమనేది లేదు. మీరు మరో ఆలోచన పెట్టుకోవద్దు" అని చిరంజీవి అన్నారు.

బ్రహ్మానందం, ఆయన కుమారుడు రాజా గౌతమ్ ప్రధాన పాత్రల్లో నటించిన 'బ్రహ్మా ఆనందం' చిత్రం ఈ నెల 14న విడుదలవుతోంది. మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో చిరంజీవి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజకీయాల్లోకి పునరాగమనం చెయ్యబోతున్నారంటూ తన గురించి జరుగుతున్న ప్రచారాన్ని చిరంజీవి ఖండించారు. 'చాలామందికి చాలా అనుమానాలు వస్తున్నాయి. ఎవరితో సన్నిహితంగా మెసిలినా సినీరంగానికి నా వంతు సేవలందించడానికే తప్ప దానివెనుక రాజకీయ ఆలోచన లేదు. పొలిటికల్‌గా ముందుకెళ్లడానికీ, నేననుకున్న లక్ష్యాలు, సేవలను కొనసాగించడానికి పవన్ కల్యాణ్ ఉన్నాడు. ఇక ఈ జన్మంతా రాజకీయాలకు దూరంగా ఉంటూ, సినిమాలకు అతి దగ్గరగా ఉంటూ, అభిమానులను అక్కున చేర్చుకొని ఆ కళామతల్లితోనే ఉంటాను' అని స్పష్టం చేశారు.

'బ్రహ్మానందంతో తన అనుబంధాన్ని వివరిస్తూ 'బ్రహ్మానందం ఎవరో కాదు, నా సోల్‌మేట్. ఆయన్ను విపరీతంగా ప్రేమించిన సందర్భాలున్నాయి. ఏడ్పించిన సందర్భాలున్నాయి. కోప్పడిన సందర్భాలున్నాయి. వయసులో చిన్నవాణ్ణే అయినా అవేవి ఆయన మనసులో పెట్టుకోలేదు. బ్రహ్మానందం సినిమాల్లోకి తన కొడుకులు రాజా, గౌతమ్‌ను కూడా తీసుకురావాలని రెండు మూడు సినిమాలు చేసినా అనుకున్న ఫలితవివ్వలేదు. అయినా మళ్లీ ఈ సినిమాతో ఓ ప్రయత్నం చేస్తున్నప్పుడు నావంతుగా సహకారం అందించాలనుకున్నాను. నేనే స్వయంగా ఫోన్ చేసి ఈ కార్యక్రమానికి వస్తాను అని చెప్పాను. బ్రహ్మానందంతో నా స్నేహం కలకాలం ఇలాగే కొనసాగాలి. సినిమా బాగా ఆడుతుంది. బ్రహ్మానందానికి పుత్రోత్సాహం కలుగుతుంది. దర్శకుడు ఫ్రెష్‌థాట్‌తో సినిమా చేశాడు. ఈ సినిమాతో అందరికీ బ్రేక్ రావాలి. ప్రేక్షకులు ఈ చిత్రాన్ని ఆదరించాలి' అని చిరంజీవి కోరారు. బ్రహ్మానందం మాట్లాడుతూ 'చిరంజీవిగారితో నాది 4 దశాబ్దాల అనుబంధం. ఎంత ఎదిగినా ఒదిగి ఉండే వ్యక్తిత్వం ఆయనది. మా దర్శకుడు నటీనటుల నుంచి అద్భుతమైన నటనను రాబట్టుకున్నారు. ఈ సినిమాకు సంగీతం ప్రధానాకర్షణ' అని చెప్పారు. ప్రేమ, డబ్బు మానవ జీవితాలను ప్రభావితం చేస్తున్న తీరును దర్శకుడు హృద్యంగా తెరకెక్కించారు అని రాజా గౌతమ్ చెప్పారు. వినోదం, సందేశం మేళవింపుగా ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్లు దర్శకుడు నిఖిల్ చెప్పారు. సినిమా విజయంపై పూర్తి నమ్మకంతో ఉన్నామని నిర్మాత రాహుల్ యాదవ్ నక్కా తెలిపారు.

చైతూని చూస్తుంటే నాన్నగారు గుర్తొచ్చారు

అక్కినేని నాగార్జున



నాగచైతన్య, సాయిపల్లవి జంటగా చందు మొండేటి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'తండేల్'. అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాసు నిర్మించిన ఈ చిత్రం ఇటీవలే విడుదలై హిట్ టాక్ తెచ్చుకుంది. ఈ సందర్భంగా 'తండేల్ లవ్ సునామీ సెలబ్రేషన్స్'ను నిర్వహించింది చిత్రబృందం. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అక్కినేని నాగార్జున మాట్లాడుతూ "ఇలా ఓ సక్సెస్ మీట్‌కు వచ్చి చాలా రోజులైంది. అరవింద్‌గారు కథ విని చందు దర్శకత్వంలో తీద్దామనుకున్న ఆలోచన.. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం జతకావడం.. బన్నీవాసు సరైన టీమ్‌ను సెట్ చేయడం నుంచి.. నాగచైతన్య శోభితాను పెళ్లి చేసుకున్న సందర్భం అన్నీ కలగలసి 'తండేల్' విజయానికి దోహదపడ్డాయి. ఈ విజయం చాలా ఆనందాన్ని ఇస్తోంది. ఇందులో చైతన్యని చూస్తుంటే నాన్నగారు గుర్తుకువచ్చారు. సాయిపల్లవి నటన గురించి ఎంత చెప్పినా తక్కువే. సినిమాలోని తన పాత్రలో జీవించారు" అని చెప్పారు. "ఒక నటుడికి ఇలాంటి పాత్ర చాలా అరుదుగా దొరుకుతుంటుంది. రిలీజ్‌కు ముందు నేను బయపడితే అరవింద్‌గారు ధైర్యం చెప్పారు. నా కెరీర్‌లో బెస్ట్ ఫిల్మ్ అవుతుంది అని అన్నారు. అదే జరిగింది" అని నాగచైతన్య చెప్పారు. "ఈ సినిమాలో చైతన్య నటన అద్భుతంగా ఉండబోతోందని ఎడిటింగ్ రూమ్‌లోనే అర్థమైపోయింది" అని నిర్మాత అల్లు అరవింద్ తెలిపారు. "నాగేశ్వరరావుగారి 'తెనాలి రామకృష్ణ' సినిమాను నాగచైతన్యతో తెరకెక్కిస్తాను" అని చందూ అన్నారు. "నేను నాగార్జునతో తీసినట్లే నాగచైతన్యతోనూ సినిమాలు తీయాలనుకుంటున్నాను" అని నిర్మాత అశ్వనీదత్ అన్నారు.

బిజినెస్

విజయవాడ ● బుధవారం 12 ఫిబ్రవరి 2025

మూడింట రెండొంతుల పన్ను రిటర్నుల్లో చెల్లింపులు నిల్లు

న్యూఢిల్లీ: ఆదాయం పన్ను (ఐటీ) రిటర్న్‌లు సమర్పించే వారిలో మూడింట రెండొంతుల మంది చెల్లించిన పన్ను సున్నా అని కేంద్రం వెల్లడించింది. వీరి సంఖ్య 2019-20 ఆర్థికతో పోలిస్తే 2024-25 ఆర్థిక సంవత్సరం నాటికి దాదాపు రెట్టింపైంది. లోక్‌సభలో పన్ను చెల్లింపుదారులపై అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి సోమవారం లిఖిత పూర్వకంగా ఈ విషయాన్ని వెల్లడించారు. మంత్రి సమర్పించిన డేటా ప్రకారం.. 2019-20లో 6.48 కోట్ల మంది ఐటీ రిటర్న్‌లు సమర్పించగా.. అందులో సున్నా పన్ను బకాయితో దాఖలైన రిటర్నులు 2.9 కోట్లు. అంటే మొత్తం రిటర్న్‌ల్లో 44.75 శాతానికి సమానం. కాగా, 2024-25 ఆర్థిక సంవత్సరంలో డిసెంబరు 31 నాటికి 8.39 కోట్ల మంది రిటర్న్‌లు ఫైల్ చేశారు. అందులో 5.58 కోట్ల(66.5 శాతం) మంది సున్నా పన్ను బకాయితో రిటర్న్‌లు సమర్పించినట్లు మంత్రి తెలిపారు.

ఆసుపత్రుల విభాగంలోకి అదానీ, బజాజ్

ముంబై: అదానీ, బజాజ్ గ్రూప్‌లు తాజాగా ఆసుపత్రుల వ్యాపారంలోకి ప్రవేశించబోతున్నాయి. రూ.6,000 కోట్ల పెట్టుబడులతో ముంబై, అహ్మదాబాద్‌లో ఒక్కొక్కటీ 1,000 పడకల సామర్థ్యంతో కూడిన మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్, మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేయబోతున్నట్లు అదానీ గ్రూప్ ప్రకటించింది. బజాజ్ గ్రూప్ సైతం రూ.10,000 కోట్ల భారీ పెట్టుబడులతో దేశంలోని పలు ప్రాంతాల్లో ఆసుపత్రులను ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	97	విజయవాడ	111
వరంగల్	97	గుంటూరు	116
కరీంనగర్	97	ఒంగోలు	116
మహబూబ్‌నగర్	97	చిత్తూరు	87
కర్నూలు	97	నెల్లూరు	92
విశాఖపట్నం	103	అనంతపురం	92
గోదావరి	111		

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

12వ తేదీ			
హైదరాబాద్	440	విజయవాడ	450
వరంగల్	442	గోదావరి	455
చిత్తూరు	493	విశాఖపట్నం	465
		డజను గుడ్లు రూ. 72	

కార్పొరేట్ నగరి



హైదరాబాద్‌లో ఆఫీస్ స్పేస్‌కు భారీ డిమాండ్

- 2030 నాటికి 20 కోట్ల చదరపు అడుగులు
- సీబీఆర్ఈ-హైసియా అంచనా

హైదరాబాద్: భాగ్యనగరంలో కార్యాలయ స్థలాలకు భారీగా డిమాండ్ నెలకొంది. 2030 నాటికి నగరంలో ఆఫీస్ స్పేస్ 20 కోట్ల చదరపు అడుగులకు చేరుకోవచ్చని సీబీఆర్ఈ సౌత్ ఏషియా ప్రైవేట్ లిమిటెడ్- హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంటర్‌ప్రైజెస్ అసోసియేషన్(హైసియా) సంయుక్తంగా మంగళవారం విడుదల చేసిన నివేదిక అంచనా వేసింది. దేశంలోని మొత్తం ఆఫీస్ స్పేస్‌లో హైదరాబాద్ వాటా 15 శాతంగా ఉండగా.. గ్రీన్ సర్టిఫైడ్ ఆఫీస్ స్పేస్‌లో 18 శాతం వాటా కలిగి ఉంది. అంతర్జాతీయ సంస్థల నుంచి భారీ డిమాండ్ నెలకొనడంతో 2014 నుంచి నగరంలో ఆఫీస్ స్పేస్ మూడు రెట్లకు పైగా పెరిగిందని, 2024 డిసెంబరు నాటికి దాదాపు 13.7 కోట్ల చదరపు అడుగులకు చేరుకుందని ఆ నివేదికలో వెల్లడించారు. హైదరాబాద్ గడిచిన కొన్నేళ్లలో అంతర్జాతీయ సంస్థలకు వేదికగా, సాంకేతిక హబ్‌గా మారిందని.. మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా అభివృద్ధి చెందగల సామర్థ్యం ఈ నగరానికి ఉందనడానికిదే నిదర్శనమని సీబీఆర్ఈ ఇండియా, ఆగ్నేయాసియా, పశ్చిమాసియా, ఆఫ్రికా మార్కెట్ల చైర్మన్, సీఈఓ అన్షుమన్ మ్యాగజైన్ అన్నారు. సమృద్ధిగా మౌలిక వసతులతో పాటు కంపెనీల కార్యాలయ స్థలాల వైవిధ్యీకరణ, విరివిగా నిపుణుల లభ్యత వంటి అంశాలు భారత స్థిరాస్తి రంగంలో హైదరాబాద్‌ను కీలక మార్కెట్‌గా నిలిపాయన్నారు. ఐటీ, ఐటీఈఎస్ విభాగాల్లో బలంగా ఉండటంతో టెక్నాలజీ, బీఎఫ్ఎస్ఐ, లైఫ్ సైన్సెస్ రంగాలకు చెందిన గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల(జీసీసీ) ఏర్పాటుకు హైదరాబాద్ టాప్ చాయిస్‌గా కొనసాగనుందన్నారు. ఇది నగరంలో కార్యాలయ స్థలాల గిరాకీని మరింత పెంచనుందన్నారు.

గత ఏడాది 1.23 కోట్ల చ.అ స్థలాల లీజు

హైదరాబాద్‌లో రియల్టీ మార్కెట్ శరవేగంగా వృద్ధి చెందుతోందని, పర్యావరణహిత నిర్మాణాలపై దృష్టిపెరిగిందని సీబీఆర్ఈ ఇండియా సీనియర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిప్సన్ పాల్ అన్నారు. హైదరాబాద్ వ్యాపారాలకు ప్రాధాన్య గమ్యంగా మారడంతో ఆఫీస్ స్పేస్‌కు గిరాకీ పెరుగుతోందన్నారు. 2024లోనూ ఇదే జోరు కొనసాగిందని, 1.23 కోట్ల చదరపు అడుగుల స్థలాన్ని కంపెనీలు లీజుకు తీసుకున్నాయి. నగరంలోని కార్యాలయ స్థలాల లీజులో టెక్నాలజీ కంపెనీల వాటా అత్యధికంగా 31 శాతంగా ఉంది. జీసీసీల ఏర్పాటు కోసం ఆఫీస్ స్పేస్ లీజింగ్‌లో బెంగళూరు తర్వాత హైదరాబాద్ రెండో స్థానంలో ఉంది. టెక్నాలజీ, ఫార్మా, బయోటెక్నాలజీ, ఆర్థిక సేవల రంగ సంస్థలు ఎక్కువగా ఈ నగరాన్ని ఎంచుకుంటున్నాయని నివేదిక పేర్కొంది. కృత్రిమ మేధ(ఏఐ), క్లౌడ్ కంప్యూటింగ్, డేటా అనలిటిక్స్ వంటి ఆధునిక సాంకేతికతల వినియోగం హైదరాబాద్‌లో ఆఫీస్ స్పేస్‌కు డిమాండ్‌ను మరింత పెంచనుందని రిపోర్టు ప్రస్తావించింది.

ఈ ఏడాది టాప్-6 నగరాల్లో 7 కోట్ల చ.అ స్థలం లీజుకు..

వర్ధమాన సంవత్సరంలోనూ దేశంలోని 6 ప్రధాన నగరాల్లో (ఢిల్లీ-ఎన్‌సీఆర్, ముంబై, బెంగళూరు, పుణె, హైదరాబాద్, చెన్నై) కార్యాలయ స్థలాలకు బలమైన డిమాండ్ నెలకొందని రియల్ ఎస్టేట్ కన్సల్టింగ్ సేవల సంస్థ కొలియర్స్ ఇండియా తాజా రిపోర్టు పేర్కొంది. మంగళవారం జరిగిన ఫిక్కీ 18వ రియల్ ఎస్టేట్ సదస్సులో ఈ నివేదికను విడుదల చేసింది. 2025లో ఈ ఆరు నగరాల్లో ఆఫీస్ స్పేస్ లీజింగ్ 6.5-7 కోట్ల చదరపు అడుగుల స్థాయిలో ఉండవచ్చని అంచనా వేసింది. 2024లో కంపెనీలు మొత్తం 6.64 కోట్ల చ.అ స్థలాన్ని లీజుకు తీసుకున్నాయని తెలిపింది. ఈ ఏడాది ఆఫీస్ స్పేస్ డిమాండ్ మొత్తంలో మూడో వంతు వాటా బెంగళూరుదే కానుందని కొలియర్స్ ఇండియా ఎండీ అర్పిత్ మెహ్రోత్రా అన్నారు. జీసీసీలు, ఇంజనీరింగ్, తయారీ సంస్థలు, కో-వర్కింగ్ స్పేస్ కంపెనీలు ఈ నగరంలో ఆఫీస్ స్పేస్ గిరాకీకి ప్రధాన చోదకం కానున్నాయని ఆయన అన్నారు. ఈ ఏడాది హైదరాబాద్, ఢిల్లీ-ఎన్‌సీఆర్ మార్కెట్లలో 1-1.5 కోట్ల చ.అ చొప్పున స్థలం లీజుకు తీసుకోవచ్చని రిపోర్టు అంచనా. ముంబై, చెన్నై, పుణెలో 0.5-1 కోటి చ.అ ఆఫీస్ స్పేస్ లీజు ఒప్పందాలు కుదిరే అవకాశాలున్నాయని నివేదిక పేర్కొంది.

ఉపాధి కల్పనలో హైదరాబాద్ యునికార్న్‌లు టాప్



హైదరాబాద్: ఉపాధి కల్పనలో హైదరాబాద్ యునికార్న్‌లు దేశంలోనే అగ్రస్థానంలో ఉన్నాయి. దేశవ్యాప్తంగా పని చేస్తున్న యునికార్న్‌లు జనవరి నెలలో ఉద్యోగ నియామకాల్లో 25% వృద్ధిని సాధించాయి. ఉపాధి కల్పనలో 74% వృద్ధితో హైదరాబాద్ యునికార్న్‌లు అగ్రస్థానంలో ఉండగా 60% వృద్ధితో చెన్నై రెండో స్థానంలో ఉంది. జనవరి నెలలో నియామకాల ధోరణిపై నౌకరీ జాబ్‌స్పీక్ ఇండెక్స్ ఈ విషయాలు ధ్రువీకరించింది. అయితే ఐటీ రంగం మొత్తాన్ని పరిగణనలోకి తీసుకున్నట్టయితే నియామకాల్లో -1% తగ్గుదలతో ఫ్లాట్‌గా ఉంది. రంగాలవారీగా చూసినట్టయితే ఎఫ్ఎంసీజీ 16%, బీమా 15%, ఫార్మా 11% వృద్ధిని నమోదు చేశాయి. ఫ్రెషర్ల నియామకం 3% పెరిగి నిలకడగా ఉంది. రిటైల్ రంగం దీర్ఘకాలిక ప్రతికూల ధోరణి నుంచి బయటపడి నియామకాల్లో 1% వృద్ధిని నమోదు చేసింది. బెంగళూరు, ఢిల్లీ ఎన్‌సీఆర్ వంటి కీలక మార్కెట్లు ఇందుకు దోహదపడ్డాయి. ప్రధానంగా మిడ్ లెవెల్ ఉద్యోగ నియామకాలు జోరుగా సాగాయని ఆ నివేదిక తెలిపింది.

జీఎంఆర్‌తో మెల్‌బోర్న్ సంస్థ ఒప్పందం

శంషాబాద్ రూరల్ (ఆంధ్రజ్యోతి): విమానయాన రంగంలో నిపుణులకు శిక్షణ ఇచ్చేందుకు జీఎంఆర్ స్కూల్ ఆఫ్ ఏవియేషన్ అండ్ జీఎంఆర్ ఏరో అకాడమీతో ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఒప్పందం కుదుర్చుకున్నట్లు జీఎంఆర్ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విమానయాన పరిశ్రమలోని కీలక రంగాల్లో డిమాండ్‌కు దీటుగా నిపుణులను అందుబాటులో ఉంచడానికి ఇది దోహదపడుతుందని వారన్నారు. విమానయానం, విమానాశ్రయ భద్రత కార్యకలాపాలు, కార్గో నిర్వహణ వంటి రంగాల్లో ఉభయ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఎయిర్ క్రాఫ్ట్ మెయింటెనెన్స్ ఇంజినీరింగ్‌లో స్పెషలైజేషన్‌ను బ్యాచిలను మాస్టర్స్ ప్రోగ్రామ్‌ల రూపకల్పన వంటివి చేపటనున్నట్లు చెప్పారు. అలాగే ఇంటర్న్‌షిప్, ప్లేస్‌మెంట్ అవకాశాల ఒప్పందంపై కూడా సంతకాలు చేసినట్లు చెప్పారు.

సైయెంట్ డీఎల్ఎంకు బోయింగ్ కాంట్రాక్టు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): బోయింగ్ గ్లోబల్ సర్వీసెస్‌తో (బీజీఎస్) సైయెంట్ డీఎల్ఎం ప్రెసిషన్ మెషీన్డ్ విడిభాగాలు, అసెంబ్లీల ఉత్పత్తి కాంట్రాక్టు కుదుర్చుకుంది. తమ భాగస్వామ్యంలో ఇది ఒక మైలురాయి అని సైయెంట్ డీఎల్ఎం సీఈఓ ఆంథోని మాంటాల్బానో అన్నారు. ఏరోస్పేస్, రక్షణ రంగాల్లో సైయెంట్ డీఎల్ఎం విశ్వసనీయమైన భాగస్వామి అన్న విషయాన్ని ఈ కాంట్రాక్టు నిరూపిస్తున్నదని చెప్పారు.

66 పైసలు బలపడిన రూపాయి

దేశీయ స్టాక్ మార్కెట్ భారీ నష్టాలతో ముగిసినా రూపాయి మారకం రేటు మంగళవారం కొద్దిగా కోలుకుంది. సోమవారంతో పోలిస్తే డాలర్‌తో 66 పైసలు మెరుగుపడి రూ.86.79 వద్ద ముగిసింది. గత రెండేళ్లలో డాలర్‌తో రూపాయి మారకం రేటు ఒకే రోజు ఈ స్థాయిలో పుంజుకోవడం ఇదే మొదటిసారి.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	87,380 ▲	80,010 ▲	1,07,000 ▲
విజయవాడ	88,500 ▲	82,500 ▲	98,000 ▼
విశాఖపట్నం	85,410 ▼	78,290 ▼	94,350 ▼
రాజమండ్రి	87,350 ▲	80,100 ▲	97,800 ▼
ప్రొద్దుటూరు	88,300 ▲	81,770 ▲	95,700 ▼
ముంబై	85,480 ▼	78,300 ▼	94,170 ▼

2025లో రూ.1.64 లక్షల కోట్లు

- ప్రకటనల ఆదాయంపై గ్రూప్‌ఎం నివేదిక

ముంబై: ఈ ఏడాది భారత మీడియా విభాగాల ప్రకటనల ఆదాయ వృద్ధి 7 శాతానికి తగ్గవచ్చని ప్రముఖ మీడియా ఏజెన్సీ గ్రూప్‌ఎం అంచనా వేసింది. 2024లో ఈ వృద్ధి 8.8 శాతంగా నమోదైందని రిపోర్టులో పేర్కొంది. 2025లో దేశంలోని అన్ని మీడియా విభాగాలకు ప్రకటనల ద్వారా మొత్తం రూ.1,64,137 కోట్ల ఆదాయం సమకూరవచ్చని గ్రూప్‌ఎం అంటోంది. 2024లో నమోదైన రూ.1,53,407 కోట్ల ఆదాయంతో పోలిస్తే ఇది 7 శాతం అధికం. నివేదికలోని మరిన్ని విషయాలు..

- ప్రపంచంలోని అతిపెద్ద అడ్వర్టైజ్‌మెంట్ మార్కెట్లలో భారత్ 9వ స్థానంలో ఉండగా.. అమెరికా, చైనా, యునైటెడ్ కింగ్‌డమ్(యూకే) టాప్-3 స్థానాల్లో ఉన్నాయి.
- ప్రపంచవ్యాప్తంగా యాడ్ రెవెన్యూ వృద్ధి ఈ ఏడాదిలో 7.7 శాతానికి పరిమితం కానుంది. 2024లో ఇది 9.5 శాతంగా నమోదైంది.
- భారత్‌లో డిజిటల్ ప్రకటనల ఆదాయం వేగంగా పెరుగుతోంది. ఈ ఏడాది డిజిటల్ యాడ్ రెవెన్యూ వార్షిక ప్రాతిపదికన 11.5% వృద్ధితో రూ.లక్ష కోట్లకు చేరుకోవచ్చని అంచనా.
- దేశంలో మొత్తం ప్రకటనల ఖర్చులో 60 శాతం వాటా డిజిటల్ యాడ్స్‌దే. ప్రపంచవ్యాప్తంగా ఈ వాటా 82 శాతంగా ఉంది.
- టీవీ ప్రకటనల ఆదాయం ఈ ఏడాదిలో 1% తగ్గి రూ.42,431 కోట్లకు పరిమితం కావచ్చని అంచనా. 2024లో ఈవిభాగ ప్రకటనల రెవెన్యూ రూ.42,859 కోట్లుగా నమోదైంది. టీవీ యాడ్ రెవెన్యూలో 12.6%వాటా స్ట్రీమింగ్ టీవీలదే.
- 2025లో పత్రికల ప్రకటనల ఆదాయం 4 శాతం పెరిగి రూ.15,947 కోట్లుగా నమోదుకావచ్చని అంచనా. మొత్తం ప్రకటనల ఆదాయంలో ఈ విభాగ వాటా 10 శాతంగా ఉండనుంది.

ఐపీఓలపై స్టార్టప్‌ల దృష్టి

- పెరగనున్న నియామకాలు.. • ఇన్నోవెన్ క్యాపిటల్

న్యూఢిల్లీ: నిధుల సమీకరణ లేదా పెట్టుబడుల ఉపసంహరణ కోసం అనేక స్టార్టప్ కంపెనీలు ఈ సంవత్సరం ఐపీఓ మార్కెట్‌వైపు చూస్తున్నాయి. అంతర్జాతీయంగా కొన్ని సవాళ్లున్నా ఈ సంవత్సరం ఈ కంపెనీల నిధుల సమీకరణకు పెద్ద ఇబ్బందులేమీ ఉండక పోవచ్చని ఇన్నోవెన్ క్యాపిటల్ అనే సంస్థ తన తాజా 'ఇండియా స్టార్టప్ ఔట్‌లుక్ నివేదికలో తెలిపింది. ఈ సర్వేలో పాల్గొన్న 100 స్టార్టప్ కంపెనీల ప్రమోటర్లలో 47 మంది ఈ సంవత్సరం నియామకాల జోరు పెరుగుతుందని చెప్పారు. అయితే నిధుల సమీకరణలో సమస్యలు ఉండవన్న 79 శాతం మంది చెప్పగా ఐపీఓల ద్వారా పెట్టుబడుల ఉపసంహరణకు 73 శాతం స్టార్టప్ కంపెనీల ప్రమోటర్ల ఆసక్తి ప్రదర్శించారు. వచ్చే రెండు మూడేళ్లలో తమ వ్యాపార మోడల్స్‌పై ఏఐ ప్రభావం ఉంటుందని 28 శాతం స్టార్టప్ కంపెనీల ప్రమోటర్లన్నారు. 83 శాతానికిపైగా స్టార్టప్ కంపెనీల నాయకత్వ స్థానాల్లో మహిళలు 20 శాతం కూడా లేరని ఆ సర్వేలో తేలింది.

స్పోర్ట్స్

జ్యోతి, యాసిన్ పసిడి కాంతులు



జ్యోతి



యాసిన్

జాతీయ క్రీడలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): అథ్లెట్ యర్రాజి జ్యోతి, జిమ్నాస్ట్ షేక్ యాసిన్ ఒకే రోజు పసిడి పతకాలు కొల్లగొట్టడంతో ఆంధ్రప్రదేశ్‌కు డబుల్ ధమాకా లభించింది. డెహ్రాడూన్‌లో జరుగుతున్న ఈ పోటీల్లో మంగళవారం ముగిసిన 200 మీటర్ల పరుగులో విశాఖ ఎక్స్‌ప్రెస్ జ్యోతి స్వర్ణం సొంతం చేసుకుంది. ఈ జాతీయ క్రీడల్లో జ్యోతికి ఇది రెండో పసిడి. ఈ 200 మీటర్ల రేసును జ్యోతి 23.35 సెకన్లలో ముగించి ప్రథమ స్థానం దక్కించుకోగా, ఉన్నతి అయ్యప్ప (కర్ణాటక) రజతం, హైదరాబాద్ అమ్మాయి జి.నిత్య కాంస్యం నెగ్గారు. మహిళల ట్రాంపోలిన్ జిమ్నాస్టిక్స్ విభాగంలో గుంటూరు జిమ్నాస్ట్ యాసిన్ 39.79 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. చైత్రాళి (మహారాష్ట్ర) రజతం, ప్రీతి మహేష్ (గుజరాత్) కాంస్యం సాధించారు. తెలంగాణ అథ్లెట్ నందిని హెప్టాథ్లాన్‌లో స్వర్ణం, మహిళల ఫాస్ట్ 5 నెట్‌బాల్‌లో తెలంగాణ జట్టు రజత పతకంతో మెరిసింది. పతకాల పట్టికలో ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ఏడు స్వర్ణాలు సహా మొత్తం 14 పతకాలతో 17వ స్థానంలో నిలవగా, తెలంగాణ రెండు పసిడితో సహా మొత్తం 12 పతకాలతో 27వ స్థానంలో కొనసాగుతోంది.



నిత్య

తదుపరి క్రీడలకు మేఘాలయ ఆతిథ్యం

న్యూఢిల్లీ: 39వ జాతీయ క్రీడలకు మేఘాలయ ఆతిథ్యమివ్వనుంది. ఈ మేరకు భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అధ్యక్షురాలు పీటీ ఉష.. ఆ రాష్ట్ర సీఎం కాన్రాడ్ సంగ్మాకు లేఖ రాశారు. 2027 ఫిబ్రవరి/మార్చిలో క్రీడలు జరిగే అవకాశం ఉంది. ఉత్తరాఖండ్‌లో జరుగుతున్న 38వ జాతీయ క్రీడల ముగింపోత్సవంలో ఐఓఏ జెండాను మేఘాలయకు అందించనున్నారు.



సీనియర్ జట్టుకు వరల్డ్‌కప్ అందించాలి

క్రికెటర్ త్రిష

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): భారత సీనియర్ మహిళల జట్టుకు ప్రపంచకప్ అందించడమే తన ఆశయమని అండర్-19 టీ20 వరల్డ్‌కప్ స్టార్, హైదరాబాద్ యువ ఆల్‌రౌండర్ గొంగడి త్రిషా రెడ్డి వెల్లడించింది. మంగళవారం ఏఆర్‌కే ఫౌండేషన్ త్రిషను ఘనంగా సత్కరించింది. భారత బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్, బీసీసీఐ మాజీ చీఫ్ సెలెక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్, టీఎస్‌పీఎస్సీ మాజీ చైర్మన్ జనార్దన్‌రెడ్డి, మాజీ డీజీపీ మహేందర్ రెడ్డి, ఏఆర్‌కే గ్రూప్ చైర్మన్ రామిరెడ్డి త్రిషపై ప్రశంసల వర్షం కురిపించారు. భారత్ మహిళల సీనియర్ కేటగిరీలో టీమిండియా ఇప్పటివరకు వన్డే, టీ20 వరల్డ్‌కప్‌లను నెగ్గలేదు, ఆ వెలితిని తీర్చి ప్రపంచకప్ అందించడమే తన ఆశయమని త్రిష చెప్పింది. త్రిష వంటి క్రికెటర్లు అరుదుగా లభిస్తారని, ఆమె మరింత ఎత్తుకు ఎదగాలని గోపీచంద్ ఆకాంక్షించాడు. త్రిషను స్ఫూర్తిగా తీసుకొని మరింత మంది మహిళా క్రికెటర్లు అంతర్జాతీయ స్థాయికి చేరాలని ఎమ్మెస్కే సూచించాడు.

యూఎస్ ఓపెన్: 'మిక్స్‌డ్'లో మార్పులు

న్యూయార్క్: యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ క్రేజ్‌ను పెంచేందుకు నిర్వాహకులు వినూత్న ప్రయోగం చేయనున్నారు. మెయిన్ డ్రా ఆరంభానికి వారం ముందే పునర్ వ్యవస్థీకరించిన ఫార్మాట్‌లో మిక్స్‌డ్ డబుల్స్‌ను నిర్వహించనున్నారు. అంతేకాకుండా స్టార్ ప్లేయర్లను ఆకర్షించేందుకు ప్రైజ్‌మనీని భారీగా రూ. 8.67 కోట్లకు పెంచారు. యూఎస్ ఓపెన్ సింగిల్స్ మెయిన్ డ్రా ఆగస్టు 24న ఆరంభం కానుంది. అయితే, మిక్స్‌డ్ డబుల్స్‌ను మాత్రం రెండు రోజుల్లో ముగిసే విధంగా ఆగస్టు 19-20 తేదీల్లో షెడ్యూల్ చేశారు. మొత్తం 16 జట్లు మాత్రమే తలపడతాయి.

సెమీస్‌లో ముంబై X విదర్భ

గుజరాత్ కూడా.. రంజీ ట్రోఫీ

కోల్‌కతా: డిఫెండింగ్ చాంప్ ముంబై, గతేడాది రన్నరప్ విదర్భతో పాటు గుజరాత్ రంజీ ట్రోఫీ సెమీస్‌కు దూసుకెళ్లాయి. కెప్టెన్ రహానె (108) సెంచరీతో అదరగొట్టగా.. పేసర్ రాయ్‌స్టన్ డయాస్ (5/39) ప్రత్యర్థి వెన్ను విరవడంతో.. హరియాణాతో క్వార్టర్స్‌లో ముంబై 152 పరుగుల తేడాతో గెలిచింది. ఆటకు నాలుగోరోజైన మంగళవారం ముంబై రెండో ఇన్నింగ్స్‌లో 339 పరుగులకు ఆలౌటై, 354 పరుగుల లక్ష్యాన్ని ప్రత్యర్థి ముందుంచింది. ఛేదనలో హరియాణా 201 రన్స్‌కు ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్‌లో ముంబై 315, హరియాణా 301 పరుగులు చేశాయి. మరో క్వార్టర్స్‌లో విదర్భ 198 రన్స్‌తో తమిళనాడును చిత్తు చేసింది. ఈనెల 17 నుంచి జరిగే సెమీస్‌లో ముంబైతో విదర్భ తలపడనుంది. ఇంకో క్వార్టర్స్‌లో గుజరాత్ జట్టు ఇన్నింగ్స్ 98 పరుగుల తేడాతో సౌరాష్ట్రను చిత్తు చేసింది.

చాంపియన్స్ ట్రోఫీకి బుమ్రా దూరం

- హర్షిత్ రాణాకు చోటు
- స్పిన్నర్ వరుణ్‌కు సైతం



న్యూఢిల్లీ: చాంపియన్స్ ట్రోఫీ (సీటీ) ఆరంభానికి ముందే భారత జట్టుకు గట్టి ఝలక్ తగిలింది. వెన్ను నొప్పి నుంచి కోలుకోకపోవడంతో స్టార్ పేసర్ బుమ్రా ఈ మెగా టోర్నీకి దూరమయ్యాడు. మంగళవారం రాత్రి ఈ విషయాన్ని బీసీసీఐ అధికారికంగా వెల్లడించింది. సీటీ కోసం తమ తుది జట్లను ప్రకటించేందుకు మంగళవారమే తుది గడువుగా ఉంది. దీంతో బుమ్రా స్థానంలో మరో పేసర్ హర్షిత్ రాణాను సెలెక్టర్లు ఎంపిక చేశారు. ఆస్ట్రేలియా పర్యటనలో జరిగిన ఆఖరి టెస్టులో బుమ్రా గాయపడిన విషయం తెలిసిందే. అయితే తను ఇంకా మ్యాచ్ ఫిట్‌నెస్ సాధించలేదని బోర్డు పేర్కొంది. బుమ్రా లేకపోవడంతో జట్టు బౌలింగ్ బలహీనంగా మారినప్పటికీ దేశవాళీ, ఐపీఎల్‌లో విశేషంగా రాణించిన రాణాపై సెలెక్టర్లు నమ్మకముంచారు. మరోవైపు ప్రాథమిక జట్టులో జైస్వాల్ ఉన్నప్పటికీ.. అతడి స్థానంలో స్పిన్నర్ వరుణ్ చక్రవర్తికి సీటీ జట్టులో చోటు కల్పించారు. ఇక నాన్ ట్రావెలింగ్ రిజర్వ్ ఆటగాళ్లలో సిరాజ్, దూబేలతో పాటు జైస్వాల్ ఉండనున్నాడు.

భారత్ తుది జట్టు: రోహిత్ (కెప్టెన్), గిల్ (వైస్ కెప్టెన్), కోహ్లీ, శ్రేయాస్, రాహుల్, పంత్, హార్దిక్, అక్షర్, సుందర్, కుల్దీప్, రాణా, షమి, అర్ష్‌దీప్, జడేజా, వరుణ్.

క్లీన్‌స్వీప్ లక్ష్యంగా..

మ.1.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

జోష్‌లో టీమిండియా • కోహ్లీ ఫామ్‌పై దృష్టి • ఇంగ్లండ్‌తో ఆఖరి వన్డే నేడు



అహ్మదాబాద్: వరుసగా రెండు వన్డేల్లో అద్భుత విజయాలు సాధించిన టీమిండియా ఇప్పుడు క్లీన్‌స్వీప్‌పై కన్నేసింది. దీంట్లో భాగంగా బుధవారమిక్కడి నరేంద్ర మోదీ మైదానంలో ఇంగ్లండ్‌తో జరిగే ఆఖరిదైన మూడో వన్డేలో తలపడనుంది. రెట్టించిన ఉత్సాహంతో ఉన్న రోహిత్ సేన ఈ మ్యాచ్‌ను కూడా ఖాతాలో వేసుకోవాలనుకుంటోంది. తద్వారా ప్రతిష్ఠాత్మక చాంపియన్స్ ట్రోఫీలో సగర్వంగా బరిలోకి దిగే అవకాశం ఉంటుంది. అటు వరుసగా టీ20, వన్డేల్లో సిరీస్‌లను కోల్పోయిన బట్లర్ సేనకు ఆత్మవిశ్వాసం సన్నగిల్లింది. పరిమిత ఓవర్ల ఫార్మాట్లకు మెకల్లమ్ కోచ్‌గా బాధ్యతలు తీసుకున్నాక ఆ జట్టు పేలవ ప్రదర్శన కనబరుస్తోంది. బజ్‌బాల్ గేమ్‌ను అలవాటు చేసుకున్న ఈ టీమ్ భారత్‌లో తమ స్థాయికి తగ్గ ఆటతీరును కనబర్చడం లేదు. కనీసం నేటి మ్యాచ్‌లోనైనా గెలిచి ఓదార్పు విజయంతో సీటీలో అడుగుపెట్టాలనుకుంటోంది. ఏదేమైనా సీటీ ముందు ఇరు జట్లకు ఇదే ఆఖరి సన్నాహకం కావడంతో ఎలాంటి అలక్ష్యం లేకుండా పోరాడాలనుకుంటున్నాయి. ఇక లక్షకు పైగా సామర్థ్యం కలిగిన స్థానిక స్టేడియంలో భారత జట్టు చివరిసారి వన్డే వరల్డ్‌కప్ ఫైనల్లో ఆడి ఓడింది.

బౌలింగ్ బలహీనంగా..

రెండో వన్డేలో ఇంగ్లండ్ బ్యాటర్లు విశేషంగా రాణించారు. టాప్-6 ఆటగాళ్ల జోరుతో స్కోరు 300 దాటగలిగింది. కానీ భారీస్కోరును కాపాడుకునే క్రమంలో బౌలర్లు ప్రభావం చూపలేకపోయారు. భారత్ అలవోకగా లక్ష్యాన్ని పూర్తి చేయగలిగింది. కటక్‌లో ఛేజింగ్ జట్టుకు విజయావకాశాలు ఉంటాయని తెలిసి కూడా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకోవడం ఇంగ్లండ్‌ను దెబ్బకొట్టింది. అలాగే పేసర్ ఆర్చర్‌కు విశ్రాంతినివ్వడమూ దెబ్బతీసింది. కాగా, ఈ మ్యాచ్‌లో ఆర్చర్‌తో పాటు బ్రైడన్ కార్స్‌ను ఆడించే అవకాశం ఉంది. స్పిన్నర్ ఆదిల్ రషీద్ మాత్రం నిలకడగా రాణించగలుగుతున్నాడు.

మార్పులుంటాయా?

సిరీస్‌ను ఇప్పటికే 2-0తో వశం చేసుకున్న భారత్ నామమాత్రమైన ఆఖరి మ్యాచ్ కోసం ఎలాంటి కూర్పుతో దిగనుందనే ఆసక్తి వ్యక్తమవుతోంది. చాంపియన్స్ ట్రోఫీ ముందు రిజర్వ్ బెంచ్ ఆటగాళ్లకు ప్రాక్టీస్ లభిస్తే బావుంటుందన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి. ఈనేపథ్యంలో వికెట్ కీపర్ రిషబ్ పంత్, పేసర్ అర్ష్‌దీప్, స్పిన్నర్ సుందర్‌లను ఆడిస్తారా? అనేది వేచిచూడాల్సిందే. అయితే పంత్ జట్టులోకి రావాలంటే రాహుల్‌ను తప్పించాలి. అతనిప్పటికే ఆరో నెంబర్‌లో ఆడి ఏ మాత్రం ప్రభావం చూపలేకపోయాడు. ఇక అర్ష్‌దీప్, సుందర్‌లను కూడా ఆడించేందుకు కోచ్ గంభీర్ సిద్ధంగా ఉన్నాడా? లేడా? అనే విషయంలో స్పష్టత లేదు. ఇక స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఫామ్ ఒక్కటే జట్టును ఆందోళనపరుస్తోంది. గాయంతో తొలి వన్డేకు దూరమైన అతను రెండో మ్యాచ్‌లో ఐదు రన్స్‌కే పరిమితమయ్యాడు. అంతకుముందు ఆసీస్ టూర్‌లోనూ విఫలమయ్యాడు. దీంతో నేటి మ్యాచ్ అతడికి అగ్నిపరీక్ష కానుంది. కెప్టెన్ రోహిత్ సూపర్ సెంచరీ టీమిండియాలో జోష్‌ను నింపింది. విరాట్ సైతం పరుగుల బాట పడితే చాంపియన్స్ ట్రోఫీ ముందు జట్టుకు తిరుగులేని ఆత్మవిశ్వాసం లభించినట్టవుతుంది. బౌలింగ్‌లో పేసర్లు హర్షిత్, షమిలతో పాటు స్పిన్నర్లు జడేజా, అక్షర్, వరుణ్ సమష్టిగా రాణిస్తున్నారు.

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), గిల్, విరాట్, శ్రేయాస్, రాహుల్/పంత్, హార్దిక్, జడేజా/సుందర్, అక్షర్, వరుణ్, రాణా/అర్ష్‌దీప్, షమి.

ఇంగ్లండ్: డకెట్, సాల్ట్, బాంటన్, రూట్, బ్రూక్, బట్లర్ (కెప్టెన్), లివింగ్‌స్టోన్, కార్స్, ఆర్చర్, రషీద్, ఉడ్.

పిచ్

ఈ వికెట్‌పై బ్యాటింగ్ చేయడం అంత సులువు కాదు. బౌండరీ విస్తీర్ణం కూడా పెద్దది. తొలి ఇన్నింగ్స్ సగటు స్కోరు కేవలం 237 మాత్రమే. అలాగే స్పిన్నర్లకు ఎక్కువగా అనుకూలిస్తుంటుంది. మంచు ప్రభావం ఎక్కువే. టాస్ గెలిచిన జట్టు బౌలింగ్ ఎంచుకునే అవకాశం ఉంది.

ఫిక్సింగ్ ఆరోపణలతో బంగ్లా మహిళా క్రికెటర్‌పై నిషేధం

దుబాయ్: మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణలతో బంగ్లాదేశ్ ఆఫ్ స్పిన్నర్ షొహెలి అక్తర్‌పై ఐసీసీ ఐదేళ్ల నిషేధం విధించింది. 36 ఏళ్ల షొహెలి బంగ్లా తరఫున రెండు వన్డేలు, 13 టీ20ల్లో ప్రాతినిథ్యం వహించింది. 2023లో దక్షిణాఫ్రికా వేదికగా జరిగిన మహిళల టీ20 ప్రపంచకప్ సందర్భంగా షొహెలి మ్యాచ్‌లను ఫిక్స్ చేసేందుకు ప్రయత్నించినట్టు ఐసీసీ అవినీతి నిరోధక విభాగం (ఏసీయూ) విచారణలో తేలింది. ఆ టోర్నీలో తలపడ్డ బంగ్లా జట్టులో షొహెలి సభ్యురాలు కానప్పటికీ, మ్యాచ్‌లు ఫిక్స్ చేయాలంటూ సహచర క్రికెటర్‌కు ఆమె డబ్బు ఆశజూపింది. ఈనెల 10 నుంచి షొహెలిపై నిషేధం అమల్లోకి రానుంది. దీంతో ఫిక్సింగ్ ఆరోపణలతో నిషేధానికి గురైన తొలి మహిళా క్రికెటర్‌గా షొహెలి అక్తర్ అపఖ్యాతిని మూటగట్టుకుంది.

అమెరికాలో ట్రంపొచ్చె..
మార్కెట్ పోయె!

(మొదటి పేజీ తరువాయి)

దిగుమతులపై సుంకాల కొరడా ఝుళిపిస్తుండడంతో ప్రపంచం యావత్తూ బెంబేలెత్తిపోతోంది. కెనడా, మెక్సికో దేశాలపై 25 శాతం సుంకాలు కొరడా ఝుళిపించడం.. చైనాపై 10% అదనపు సుంకాలు వేస్తాననడం.. ఆయా దేశాలూ ప్రతిచర్యలకు దిగడం.. ఇలా ఒకదాని వెంట మరొకటిగా జరుగుతున్న పరిణామాల ప్రభావంతో.. ఒక్క అమెరికా మార్కెట్లే కాదు, ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల మార్కెట్లు తీవ్ర ఒడిదుడుకులకు గురవుతున్నాయి. భారీగా నష్టాల బారిన పడుతున్నాయి. గడిచిన రెండేళ్లుగా జోరుగా దూసుకుపోయిన డౌజోన్స్, ఎస్ అండ్ పీ 500, నాస్‌డాక్ సూచీలు, అమెరికా కంపెనీల షేర్ల ధరలు ఇప్పుడు కుదేలవుతున్నాయి. మన ఈక్విటీ మార్కెట్‌నే తీసుకుంటే.. ఈ ఏడాది జనవరి 20న ట్రంప్ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి మంగళవారం వరకు.. అంటే 22 రోజుల్లో నికరంగా సెన్సెక్స్ 779.84 పాయింట్లు, నిఫ్టీ 272.95 పాయింట్లు నష్టపోయాయి. దీంతో ఈక్విటీ మదుపరుల సంపదగా భావించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల షేర్ల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.23.07 లక్షల కోట్లకు పైగా పతనమైంది. జనవరి 20న రూ.431.59 లక్షల కోట్లున్న మార్కెట్ విలువ మంగళవారం మార్కెట్ ముగిసే సమయానికి రూ.408.52 లక్షల కోట్లకు పడిపోయింది. ఇరవై రెండు రోజుల్లో రూ.23 లక్షల కోట్లు నష్టం అంటే.. సగటున రోజుకు లక్ష కోట్ల రూపాయలకు పైగా సొమ్ము ఆవిరైపోయింది. ఇక చిన్న, మధ్య శ్రేణి కంపెనీల షేర్లయితే 40 శాతం వరకు దిగజారాయని అంచనా.

మాగా దెబ్బకు..

ట్రంప్ అధ్యక్షుడిగా ఎన్నికైనప్పటి నుంచి మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్ (మాగా) నినాదం అందుకున్నారు. ఇందుకోసం చైనాతో పాటు దాదాపు అన్ని దేశాల దిగుమతులపైనా సుంకాలు పెంచేశారు. తాజాగా స్టీలు, అల్యూమినియం దిగుమతులపైనా 25 శాతం సుంకం విధించారు. ఇది చాలదన్నట్టు వచ్చే రెండు మూడు రోజుల్లో కొన్ని దేశాల దిగుమతులపై ప్రతీకార సుంకాలు తప్పవని హెచ్చరించారు. సోమ, మంగళవారాల్లో మార్కెట్ పతనానికి ఈ హెచ్చరికలే ప్రధాన కారణంగా కనిపిస్తున్నాయి. సోమ, మంగళవారాల్లోనే కాదు.. మన స్టాక్ మార్కెట్ వరుసగా ఐదు సెషన్లుగా అమ్మకాలతో హోరెత్తిపోతోంది. మంగళవారం సెన్సెక్స్ 1,018.20 పాయింట్ల నష్టంతో 76,293.60 స్థాయికి దిగజారగా... నిఫ్టీ 309.80 పాయింట్ల నష్టంతో 23,071.80 వద్ద ముగిసింది. గత రెండు వారాల్లో సెన్సెక్స్ ఇంత కనిష్ఠ స్థాయిలో ముగియడం ఇదే మొదటిసారి. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల షేర్లలో 29, నిఫ్టీలోని 50 కంపెనీల షేర్లలో 44 మంగళవారం నష్టాలతో ముగిశాయి. దీంతో బీఎస్ఈలో లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ ఒక్క రోజే రూ.9.29 లక్షల కోట్లు కోసుకుపోయి రూ.408.52 లక్షల కోట్లకు చేరింది. గత 5రోజుల నష్టాలను పరిగణనలోకి తీసుకుంటే మొత్తం రూ.16.97 లక్షల కోట్ల మదుపరుల సంపద ఆవిరైంది. గత ఐదు సెషన్స్‌లో సెన్సెక్స్ 2,290.21 పాయింట్లు, నిఫ్టీ 667.45 పాయింట్లు నష్టపోయాయి.

విదేశీ మదుపర్లు వెనక్కి...

మన దేశంలో పెట్టుబడులు పెట్టే విదేశీ పోర్టుఫోలియో మదుపరుల (ఎఫ్‌పీఐ) అమ్మకాలు కూడా మార్కెట్ పతనానికి ప్రధాన కారణం. 2024 సెప్టెంబరు త్రైమాసిక వృద్ధిరేటు నీరసించినప్పటి నుంచే ఈ సంస్థలు అమ్మకాలకు లాకులెత్తాయి. ఈ సంవత్సరం ఇప్పటి వరకు ఎఫ్‌పీఐలు దాదాపు రూ.85,841 కోట్ల పెట్టుబడులను మన మార్కెట్ నుంచి వెనక్కి తీసుకున్నట్టు అంచనా. డాలర్‌తో రూపాయి మారకం రేటు ఒక స్థాయి వద్ద స్థిరపడే వరకూ ఈ సంస్థల అమ్మకాలు ఆగక పోవచ్చని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. మార్కెట్లు ఇలా నష్టాల్లో ఉండడంతో.. తమ అవసరాలకు షేర్లు అమ్మి సొమ్ము చేసుకుందామనుకునేవారికి ఇబ్బందికర పరిస్థితి. కొత్తగా కొందామనుకునేవారికి కూడా భవిష్యత్తుపై భరోసా లేని దుస్థితి!! ఈ పరిస్థితి ఇప్పటికే పరిమితం కాదని.. ట్రంప్ అత్యుత్సాహం, టెంపరితనం తగ్గేవరకు ఇలాగే కొనసాగే ప్రమాదం ఉందనే ఆందోళన ఇన్వెస్టర్లలో వ్యక్తమవుతోంది. - బిజినెస్ డెస్క్, ఆంధ్రజ్యోతి

జమ్మూకశ్మీర్లో బాంబు పేలి ఇద్దరు జవాన్ల మృతి

శ్రీనగర్, ఫిబ్రవరి 11: జమ్మూ-కశ్మీర్‌లోని అఖ్నూర్ సెక్టార్‌లో మంగళవారం బాంబు పేలి ఇద్దరు జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. రాజౌరీ జిల్లా లాలెయిలీ గ్రామం సమీపంలోని సరిహద్దు కంచె వద్ద వైట్ నైట్ కార్ప్స్ విభాగానికి చెందిన జవాన్లు గస్తీ తిరుగుతున్న సమయంలో ఐఈడీ పేలుడు పదార్థంగా అనుమానిస్తున్న బాంబు పేలింది. ఈ దుర్ఘటనలో ఇద్దరు జవాన్లు మరణించినట్టు సైన్యం తెలిపింది. వీరిలో ఒకరు ఆర్మీ కెప్టెన్ కావడం గమనార్హం. చనిపోయిన వారిని కెప్టెన్ కరంజీత్ సింగ్ బక్షి, నాయక్ ముకేష్‌గా గుర్తించారు.

పంజాబ్ సీఎంగా కేజ్రీవాల్?

» లూధియానా ఉప ఎన్నికలో పోటీ చేసే అవకాశం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి11: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయంతో ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ పంజాబ్ ముఖ్యమంత్రి కావాలని యోచిస్తున్నారా? అవుననే అంటున్నారు రాజకీయ విశ్లేషకులు. త్వరలో లూధియానాలో జరగబోయే ఉప ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచి, మాన్‌ను తప్పించి.. కేజ్రీవాల్ పంజాబ్ సీఎం అయ్యే అవకాశాలున్నాయని ప్రచారం జరుగుతోంది. ఇందులో భాగంగానే ఢిల్లీలోని కపుర్తలా హౌస్‌లో పంజాబ్ సీఎం భగవంత్ మాన్, మంత్రులు, ఎమ్మెల్యేలతో కేజ్రీవాల్ సమావేశమయ్యారని ప్రచారం జరుగుతోంది. ఢిల్లీ ఎన్నికలపై సమావేశం నిర్వహించారని పైకి చెబుతున్నా కేజ్రీవాల్ మనసులో మాట పంజాబ్ సీఎం పదవేనని రాజకీయ వర్గాలంటున్నాయి. ఒకవేళ పంజాబ్ సీఎం పదవి కాదనుకున్న పక్షంలో పార్టీని కాపాడుకునే క్రమంలో కేజ్రీవాల్ రాజ్యసభకు వెళ్లేందుకు అవకాశముంది. ఆప్‌నకు 10 మంది రాజ్యసభ ఎంపీలు, ముగ్గురు లోక్‌సభ ఎంపీలున్నారు. పంజాబ్ నుంచి రాజ్యసభ సభ్యుడిగా ఉన్న సందీప్ పాఠక్‌తో రాజీనామా చేయించి ఆయన స్థానంలో పోటీ చేసే అవకాశముంది.

ఏఐ విషయంలో దేశాలు కలిసికట్టుగా పనిచేయాలి

» పారిస్‌లో జరిగిన యాక్షన్ సమ్మిట్‌కు మోదీ సహాధ్యక్షత

పారిస్, ఫిబ్రవరి 11: కృత్రిమ మేధ విషయంలో ప్రపంచ దేశాలు కలిసి కట్టుగా పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రధానమంత్రి మోదీ చెప్పారు. పారదర్శకతను, నమ్మకాన్ని పెంపొందించే ఓపెన్ సోర్స్ వ్యవస్థను అభివృద్ధి చేయాలని, పక్షపాతం, ఆంక్షలు లేని ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ అవసరమని నొక్కి చెప్పారు. పారిస్‌లో జరిగిన ఏఐ యాక్షన్ సమ్మిట్‌కు ఆయన ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మ్యాక్రాన్‌తో కలిసి సహాధ్యక్షత వహించారు. పలు దేశాధినేతలు, ఏఐ నిపుణులు పాల్గొన్న ఈ సదస్సులో మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. తదుపరి ఏఐ సదస్సు భారత్‌లో నిర్వహిస్తామని మోదీ ప్రకటించారు.

తెలంగాణలో బీర్ల ధరలు పెరిగాయ్

హైదరాబాద్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీర్ల ధరల పెంపు అమలులోకి వచ్చింది. ఎమ్మార్పీపై 15 శాతం పెంచుతూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు ఇవ్వగా మంగళవారం నుంచే కొత్త ధరలు అమలులోకి వచ్చాయి. ధరలను 15 శాతం పెంచిన తర్వాత వచ్చిన మొత్తాన్ని దగ్గరి రూపాయికి సవరించుకోవచ్చునని ప్రభుత్వం పేర్కొంది. అయితే, ధరలను దగ్గరి దశాంశానికి సవరించారు. దీంతో ధరలు భారీగా పెరిగాయి. ఒక్కో బీరు ధర సగటున రూ.35 మేర పెరిగింది.

ఏపీలో ఏరోస్పేస్, డిఫెన్స్ కంపెనీల పెట్టుబడులు

అమరావతి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రముఖ ఏరోస్పేస్, డిఫెన్స్ పరిశ్రమలు పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చాయి. ప్రభుత్వంతో రూ. 2,458 కోట్ల విలువైన పారిశ్రామిక అవగాహన ఒప్పందాలు (ఎంవోయూ) కుదుర్చుకున్నాయి. సాగర్ డిఫెన్స్ ఇంజినీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్, హెచ్ఎఫ్‌సీఎల్, మీడియా మ్యాట్రిక్స్ వరల్డ్ వైడ్ లిమిటెడ్ కంపెనీలతో ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డ్ (ఏపీఈడీబీ) ఈ ఎంవోయూలు చేసుకుంది. బెంగళూరులో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం శాఖల మంత్రి టీజీ భరత్ సమక్షంలో జరిగిన ఈ ఒప్పందాల కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమలశాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్, ఇతర అధికారులు, కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఏరో ఇండియా-2025లో భారీ పెట్టుబడులను సాధించామని మంత్రి టీజీ భరత్ తెలిపారు.

అదానీకి ట్రంప్ అండ!

(మొదటి పేజీ తరువాయి)

చర్యలను సమీక్షించాలని.. చట్టం అమలుకు కొత్త మార్గదర్శకాలు తీసుకురావాలని కొత్త అటార్నీ జనరల్ పామ్ బోండీని ఆదేశించారు. ఈ ఆదేశాలతో స్టాక్‌మార్కెట్లలో అదానీ గ్రూపునకు చెందిన అదానీ ఎంటర్‌ప్రైజెస్, అదానీ పవర్, అదానీ గ్రీన్ ఎనర్జీ తదితర సంస్థల షేర్ల ధరలు మంగళవారం ఒక్కసారిగా పుంజుకున్నాయి. ప్రధాని మోదీ బుధవారం అమెరికా పర్యటనకు వెళ్తున్న నేపథ్యంలో ట్రంప్ నిర్ణయానికి ప్రాధాన్యం ఏర్పడింది. సౌర విద్యుత్ కాంట్రాక్టుల కోసం ఆంధ్ర, ఒడిశా, తమిళనాడు, ఛత్తీస్‌గఢ్, జమ్మూకశ్మీరు అధికారులకు అదానీ గ్రీన్ సంస్థ రూ.2,100 కోట్లు ముడుపులుగా ఇచ్చిందని.. లంచాల వ్యతిరేక చట్టాలకు కట్టుబడి ఉంటామని హామీ ఇచ్చి.. ఈ ప్రాజెక్టుల కోసం అమెరికాలో అదానీ గ్రూపు రుణసేకరణ చేసిందని.. ఇది వంచనేనంటూ గౌతమ్ అదానీ, ఆయన సమీప బంధువు సాగర్ అదానీ, మరో ఏడుగురు అదానీ గ్రీన్ అధికారులపై గత ఏడాది జో బైడెన్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు అమెరికా న్యాయశాఖ గత ఏడాది నవంబరులో అభియోగాలు నమోదు చేయడం.. ఇవన్నీ నిరాధార ఆరోపణలని అదానీ గ్రూపు ఖండించడం.. అదానీపై సంయుక్త పార్లమెంటరీ సంఘం (జేపీసీ)తో విచారణ జరపాలంటూ భారత పార్లమెంటును ప్రతిపక్షాలు స్తంభింపజేయడం తెలిసిందే. 2021 రెండో అర్ధభాగంలో ఈ ముడుపుల భాగోతం చోటుచేసుకుందని నాడు అమెరికా న్యాయశాఖ పేర్కొంది. అప్పట్లో ఏపీలో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం, ఒడిశాలో బిజూ జనతాదళ్, తమిళనాట డీఎంకే, ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఉన్నాయి. జమ్మూకశ్మీరు లెఫ్టినెంట్ గవర్నర్ పాలనలో అంటే.. బీజేపీ పాలనలో ఉన్నట్లు లెక్క. ఎఫ్‌సీపీఏ కింద ప్రాసిక్యూషన్‌ను ఆపేస్తూ ట్రంప్ తీసుకున్న తాజా నిర్ణయం పరిధిని బట్టి అదానీ కేసులను ప్రభావితం చేసే అవకాశం ఉందని న్యాయనిపుణులు అంటున్నారు.

హిండెన్‌బర్గ్ ఆరోపణల సంగతేంటి..?

తన గ్రూపు షేర్ల ధరను పెంచుకోవడానికి అదానీ స్టాక్‌మార్కెట్లలో అవకతవకలకు, కార్పొరేట్



మోసాలకు పాల్పడ్డారని అమెరికాకు చెందిన 'హిండెన్‌బర్గ్ రీసెర్చ్' సంస్థ 2022లో చేసిన ఆరోపణలు ప్రపంచవ్యాప్తంగా కలకలం రేపాయి. అదానీ గ్రూపు షేర్ల ధరలు దారుణంగా పతనమయ్యాయి. సుప్రీంకోర్టు ఆదేశాలతో సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) దర్యాప్తు కూడా చేసింది (ఇటీవలే హిండెన్‌బర్గ్ రీసెర్చ్ సంస్థను మూసివేస్తున్నట్లు ప్రకటించారు). జేపీసీతో విచారణ జరిపించాలని నాటి నుంచి విపక్షాలు డిమాండ్ చేస్తూనే ఉన్నా.. మోదీ ప్రభుత్వం అంగీకరించలేదు. ఆ తర్వాత ముడుపుల అభియోగాలపై అదానీలపై అమెరికాలో అభియోగాలు నమోదైన తర్వాత కూడా విచారణకు సమ్మతించలేదు. హిండెన్‌బర్గ్ ఆరోపణలపై ఎఫ్‌సీపీఏ కింద దర్యాప్తు చేయాలని అమెరికన్ అధికారులు గనుక భావిస్తూ ఉంటే.. ఇప్పుడు ట్రంప్ నిర్ణయంతో అదానీలపై చట్టపరమైన చర్యలు ఆలస్యం కావచ్చని.. లేదంటే కేసు బలహీనపడే అవకాశమూ ఉందంటున్నారు. అటు భారతీయ ఏజెన్సీలు సెబీ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా ఈ అంశంలో ముందడుగు వేయరాదని అనుకుంటే.. న్యాయపరమైన సమస్యల నుంచి గౌతమ్ అదానీ బయటపడినట్లేనని విశ్లేషకులు చెబుతున్నారు. అయితే అంత మాత్రాన ఆయన అంతర్జాతీయ స్క్రూటినీ నుంచి తప్పించుకోలేరని. బ్రిటన్, యూరోపియన్ యూనియన్, ఇతర ప్రపంచ మార్కెట్లు ఆయన గ్రూపుపై నిఘా మానవని వ్యాఖ్యానిస్తున్నారు.

ఎఫ్‌సీపీఏ అంటే..

అమెరికాలో లిస్టయిన కంపెనీలు, అధికారులు, వ్యక్తులు, విదేశీ సంస్థలు.. బిజినెస్ ఒప్పందాల కోసం విదేశీ అధికారులకు లంచాలు ఎరచూపడాన్ని నిషేధిస్తూ 1977లో అమెరికా ఎఫ్‌సీపీఏ చట్టం తీసుకొచ్చింది. దీనిప్రకారం.. మోసాలను నివారించేందుకు కచ్చితమైన ఆర్థిక రికార్డులను చూపించడం కూడా వ్యాపార సంస్థలకు తప్పనిసరి. ఈ చట్టం కింద భారీ స్థాయి కార్పొరేట్ మోసాలపై అమెరికన్ ఏజెన్సీలు ప్రాసిక్యూట్ చేశాయి కూడా. అయితే ఈ చట్టాన్ని అతిగా అమలు చేయడం వల్ల అమెరికన్ కంపెనీలకు నష్టం వాటిల్లిందని ట్రంప్ గట్టిగా భావిస్తున్నారు.

అదానీపై చర్యలొద్దు: అమెరికన్ కాంగ్రెస్ సభ్యులు

గౌతమ్ అదానీపై అమెరికా న్యాయశాఖ మోపిన అభియోగాలపై పునరాలోచన చేయాలని ఆరుగురు అమెరికన్ కాంగ్రెస్ సభ్యులు అటార్నీ జనరల్ పామ్ బోండీని అభ్యర్థించారు. ఆయన్ని ప్రాసిక్యూట్ చేస్తే అమెరికా-భారత్ సంబంధాలు దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఇండియాతో పటిష్ఠ ద్వైపాక్షిక సంబంధాల కొనసాగింపు ప్రాధాన్యాన్ని నొక్కిచెప్పారు. బైడెన్ హయాంలో న్యాయశాఖ అదానీపై చేపట్టిన చర్యలను ప్రశ్నించారు. 'దశాబ్దాలుగా భారత్ మనకు ముఖ్యమైన మిత్రదేశం. రాజకీయాలు, వాణిజ్యం, ఎకానమీకి మించి.. రెండు అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాల నడుమ సామాజిక-సాంస్కృతిక బంధంగా రూపాంతరం చెందింది. ఈ చారిత్రక భాగస్వామ్యం, మిత్రుల మధ్య నిరంతర సంప్రదింపుల ప్రక్రియ.. బైడెన్ యంత్రాంగం తీసుకున్న కొన్ని తెలివితక్కువ నిర్ణయాల వల్ల ప్రమాదంలో పడింది' అని వారు పేర్కొన్నారు.

ఆ ఎంజైమ్‌ను అడ్డుకుంటే క్యాన్సర్‌కు చెక్!

» కీలక ఎంజైమ్‌ను గుర్తించిన దక్షిణ కొరియా శాస్త్రజ్ఞులు

సోల్, ఫిబ్రవరి 11: శరీరంలో ఉండే ఆరోగ్యవంతమైన కణాలు.. క్యాన్సర్ కణాలుగా మారకుండా ఆపే ప్రక్రియను నిరోధించే ఒక ఎంజైమ్‌ను దక్షిణ కొరియా శాస్త్రజ్ఞులు గుర్తించారు. ఆ ఎంజైమ్‌ను నిరోధించడం ద్వారా.. క్యాన్సర్ కణాలు తిరిగి సాధారణ కణాలుగా మారుతాయని ప్రయోగశాలలో వారు చేసిన పరిశోధనల్లో తేలింది! మానవాళికి పెనుముప్పుగా మారిన క్యాన్సర్ మహమ్మారిపై ప్రపంచవ్యాప్తంగా శాస్త్రజ్ఞులు సాగిస్తున్న పోరులో కీలక మైలురాయిగా నిలిచిపోయే ప్రయోగమిది. శరీరంలో క్యాన్సర్ కణాలు తొలగించడానికి శస్త్రచికిత్స, కీమోథెరపీ, రేడియేషన్, ఇమ్యూనోథెరపీ అందుబాటులోకి ఉన్నాయి. వీటివల్ల కొన్ని దుష్ప్రభావాలున్నా వాటివల్ల కలిగే మేలే ఎక్కువ కాబట్టి వైద్యనిపుణులు ఈ చికిత్సలను చేస్తూ వస్తున్నారు. అయితే, దక్షిణ కొరియా శాస్త్రవేత్తలు దీనికి భిన్నంగా ఆలోచించారు. సాధారణ కణాలు క్యాన్సర్ కణాలుగా మారాక చికిత్స చేసే కంటే.. అసలు అవి ఎందుకు క్యాన్సర్ కణాలుగా మారుతున్నాయో గుర్తించి, అలా మారకుండా అడ్డుకునే ప్రయత్నాలు ప్రారంభించారు. పెద్దపేగు క్యాన్సర్‌కు సంబంధించిన కణాలను సేకరించి.. వాటితో ప్రయోగశాలలో చిన్నచిన్న కణితులను అభివృద్ధి చేశారు. సాధారణ కణాలు క్యాన్సర్ కణాలుగా మారేలా చేసే ప్రొటీన్లను నాశనం చేసే వ్యవస్థ పనిచేయకుండా అడ్డుకుంటున్న ఎంజైమ్‌ను గుర్తించారు. తాము ల్యాబ్‌లో పెంచిన అర్గనాయిడ్లలో ఆ ఎంజైమ్‌ను నిరోధించారు. అంతే.. ఆ క్యాన్సర్ కణాల (ఆర్గనాయిడ్ల) పెరుగుదల ఆగడమే కాక, అవి మళ్లీ సాధారణ కణాలుగా మారాయని వారు వెల్లడించారు. ప్రస్తుతానికి ప్రయోగాల దశలో ఉన్న ఈ చికిత్స భవిష్యత్తులో క్యాన్సర్ ట్రీట్‌మెంట్ గతినే మార్చేస్తుందని అమెరికాకు చెందిన ప్రముఖ ఆంకాలజిస్టు డాక్టర్ టిఫనీ ట్రోసో శాండోవల్ తెలిపారు.



ప్రయాగ్‌రాజ్ నో వెహికిల్ జోన్

మహాకుంభ్‌నగర్, ఫిబ్రవరి 11: ప్రయాగ్‌రాజ్ నగరం మొత్తాన్ని అధికారులు వాహన రహిత ప్రాంతం(నో వెహికిల్ జోన్)గా ప్రకటించారు. బుధవారం మాఘ పూర్ణిమను పురస్కరించుకొని త్రివేణి సంగమంలో పుణ్య స్నానాల కోసం భక్తులు భారీ సంఖ్యలో రావొచ్చన్న అంచనాలు, ఇప్పటికే మహాకుంభమేళా జరుగుతున్న ప్రాంతాలన్నీ కిక్కిరిసిపోవడం, ప్రయాగ్‌రాజ్ వైపు వెళ్లే మార్గాల్లో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ రద్దీ ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. నగరం వెలుపల ప్రత్యేకంగా పార్కింగ్ ఏర్పాట్లు చేశారు. ఈ రూల్స్ నుంచి ఎమర్జెన్సీ, నిత్యావసర వస్తువులు తీసుకువెళ్లే వాహనాలను మినహాయించారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముఖేశ్ అంబానీ కుటుంబసమేతంగా మంగళవారం మహాకుంభమేళాలో పాల్గొన్నారు. పుణ్యస్నానం ఆచరించి యాగం నిర్వహించారు.

హజ్ యాత్రకు పిల్లల్ని అనుమతించరు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11: సౌదీ అరేబియా ప్రభుత్వం హజ్ యాత్ర-2025 నిబంధనల్లో గణనీయమైన మార్పులు చేసింది. పిల్లలు ఈ యాత్రలో పాల్గొనకుండా నిషేధం విధించింది. హజ్ యాత్రకు వచ్చే భారీ జనసందోహం వల్ల పిల్లలకు ఏ విధమైన ముప్పు ఏర్పడకూడదనే ఈ నిర్ణయం తీసుకున్నట్టు హజ్-ఉమ్రా మంత్రిత్వశాఖ తెలిపింది. అలాగే, మొదటి సారిగా వచ్చే యాత్రికులకు హజ్ యాత్ర-2025లో ప్రాధాన్యం కల్పిస్తామని పేర్కొంది. మరింతమందికి ఈ అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపింది. అలాగే, అనుమతి లేకుండా హజ్ యాత్రలో పాల్గొనడాన్ని నివారించేందుకు ఈ నెల 1వ తేదీ నుంచి భారత్ సహా 14 దేశాల యాత్రికులకు సింగిల్ ఎంట్రీ వీసాలు మాత్రమే జారీ చేస్తున్నట్టు వివరించింది.

భర్త చేసే బలవంతపు శృంగారం నేరం కాదు

» ఛత్తీస్‌గఢ్ హైకోర్టు తీర్పు

రాయ్‌పూర్, ఫిబ్రవరి 11: భార్యతో భర్త చేసే బలవంతపు శృంగారం, అసహజ లైంగిక చర్యలు నేరాలు కాబోవని ఛత్తీస్‌గఢ్ హైకోర్టు తీర్పు చెప్పింది. భార్య వయసు 18 ఏళ్లలోపు లేకుంటే లైంగిక సంబంధం నెరపేందుకు ఆమె సమ్మతి పొందాల్సిన అవసరం భర్తకు లేదని తెలిపింది. ఈ మేరకు జస్టిస్ నరేంద్ర కుమార్ వ్యాస్ ఆధ్వర్యంలోని ఏకసభ్య ధర్మాసనం నిర్ణయాన్ని ప్రకటించింది. 2017లో ఓ వ్యక్తి భార్య అనుమతి తీసుకోకుండానే ఆమెతో అసహజ లైంగిక సంబంధం నెరిపాడు. ఆ కారణంగా ఆమె అస్వస్థతకు గురికావడంతో ఆస్పత్రిలో చేర్పించారు. అయినా డాక్టర్లు ఆమె ప్రాణాలను కాపాడలేకపోయారు. బలవంతపు శృంగారం కారణంగానే తన ఆరోగ్యం పాడయినట్టు ఆమె మరణ వాంగ్మూలంలో పేర్కొంది. పోస్టుమార్టం చేసిన వైద్యులు కూడా దీన్ని ధ్రువీకరిస్తు నివేదిక ఇచ్చారు. విచారణ జరిపిన ట్రయల్ కోర్టు భర్తకు 10 ఏళ్ల జైలు శిక్ష విధించింది. దీనిపై నిందితుడు హైకోర్టులో అప్పీలు చేశారు. వాదనలు విన్న న్యాయమూర్తి... పరిస్థితులను గమనిస్తే ఇది రేప్ కిందకు రాదని తెలిపారు.

ఆధార్‌కు 175 కోట్లు చాలు

» 11,385 కోట్లు వృథాగా ఖర్చు పెట్టారు


హాట్ మెయిల్ సహ వ్యవస్థాపకుడు సబీర్

ఢిల్లీ, ఫిబ్రవరి 11: 'ఆధార్ ప్రాజెక్టును కేవలం రూ.175.16 కోట్లతో పూర్తి చేయవచ్చు. దాని కోసం వృథాగా రూ.11,385 కోట్లు ఖర్చు చేశారు' అని హాట్ మెయిల్ సహ వ్యవస్థాపకుడు సబీర్ భాటియా అన్నారు. ప్రఖర్ గుప్తా నిర్వహిస్తున్న 'ప్రఖర్ కే ప్రవచన్' టాక్ షోలో ఆధార్ ప్రాజెక్టుపై ఆయన మాట్లాడారు. "ఈ ప్రాజెక్టును నిర్వహించిన వారు సాంకేతిక నిపుణులు కారు. వారికి ఎలాంటి టెక్నాలజీ తెలియదు. వాళ్ల జీవితంలో ఎన్నడూ కోడింగ్ చేయలేదు. అదే అసలు సమస్య" అని అన్నారు.

కుటుంబం గడవడం కష్టమనుకుంటేనే
కారుణ్య నియామకం!

» సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11: కారుణ్య నియామకాలపై సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది. ఆ ఉద్యోగం లేకపోతే కుటుంబం గడవడం కష్టమనుకునే వాళ్లకే కారుణ్య నియామకం కింద వారసులకు కొలువు ఇవ్వాలని పేర్కొంది. అంటే దారిద్ర్య రేఖకు దిగువన ఉండి, కనీస అవసరాలకు కూడా డబ్బు లేక ఇబ్బందులు పడే కుటుంబాల వారికే ఉద్యోగం ఇవ్వాలని వ్యాఖ్యానించింది. అంతే తప్ప మరణించిన ఉద్యోగి కుటుంబ జీవన ప్రమాణాలు పడిపోతాయన్న కారణంతో కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాల్సిన అవసరం లేదని జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రాల ధర్మాసనం అభిప్రాయపడింది. ఉద్యోగి సంపాదనతోనే కుటుంబం మొత్తం నడుస్తున్న పరిస్థితుల్లో.. ఆ ఉద్యోగి మరణిస్తే, అతని/ఆమె కుటుంబ సభ్యుల్లో అర్హులకు ఉద్యోగం ఇవ్వాలన్నది 'కారుణ్య నియామకం' ఉద్దేశమని వివరించింది. కెనరా బ్యాంకు ఉద్యోగి పదవీ విరమణ కంటే ముందు 2001లో మరణించగా.. కారుణ్య నియామకం కింద తనకు ఉద్యోగం ఇవ్వాలంటూ ఆయన కుమారుడు అజిత్‌కుమార్ దరఖాస్తు చేసుకున్నారు. బ్యాంకు ఉన్నతాధికారి తిరస్కరించారు. దాన్ని సవాలు చేస్తూ అజిత్‌కుమార్ హైకోర్టును ఆశ్రయించారు. ఆయనకు 2నెలల్లోగా ఉద్యోగం ఇవ్వాలని, పరిహారంగా రూ.5 లక్షలు చెల్లించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. తీర్పుపై బ్యాంకు అధికారులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆ పిటిషన్‌పై జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ పీకే మిశ్రాల ధర్మాసనం విచారణ చేపట్టింది.



ఈవీఎంలలో డాటా తొలగించవద్దు

» ఎన్నికల కమిషన్‌కు సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల్లో డాటాను తొలగించడం లేదా జోడించడం చేయవద్దని సుప్రీంకోర్టు మంగళవారం ఎన్నికల కమిషన్‌ను ఆదేశించింది. ఎన్నికలు పూర్తయిన తర్వాత ఈవీఎంల నుంచి డాటాను తొలగించడానికి అనుసరిస్తున్న ప్రామాణిక నిర్వహణ పద్ధతి ఏమిటో తెలపాలని కూడా నిర్దేశించింది. ఒకవేళ ఎన్నికలలో ఓడిపోయిన అభ్యర్థి కోరితే... ట్యాంపరింగ్ జరగలేదని వివరణ ఇవ్వగలిగేలా ఉండాలని పేర్కొంది. ఏడీఆర్, పలువురు కాంగ్రెస్ నాయకులు దాఖలు చేసిన పిటిషన్ల విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ ఆదేశాలు జారీ చేసింది. ఓట్ల లెక్కింపు పూర్తయిన తర్వాత కూడా ఈవీఎంల నుంచి డాటాను తొలగించవద్దని ఈసీని ఆదేశించాలని పిటిషనర్లు కోరారు.

హెచ్‌ఏఎల్ మీద నమ్మకం లేదు!

ఆ సంస్థ మిషన్‌మోడ్‌తో పని చేయటం లేదు

» 11 తేజస్ ఎంకే1ఏలు సిద్ధం చేస్తామన్నారు.. ఒక్కటీ తయారు కాలేదు

» ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్‌సింగ్ వ్యాఖ్య

బెంగళూరు, ఫిబ్రవరి 11: 'ప్రస్తుతానికైతే నాకు హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్‌ఏఎల్)' మీద నమ్మకం లేదు. సంస్థలో సందర్భానికి తగిన పనితీరు, వేగం (మిషన్ మోడ్) కనిపించటం లేదు'... ఈ మాటలు అన్నది ఎవరో సాధారణ వ్యక్తి కాదు.. ఏకంగా, వాయుసేన అధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్‌సింగ్ చేసిన వ్యాఖ్య ఇది. వాయుసేనకు యుద్ధవిమానాలను, హెలికాప్టర్లను అందించే ప్రభుత్వ రంగ రక్షణ సంస్థ హెచ్‌ఏఎల్ రూపొందించిన హెచ్‌జేటీ-36 యాషాస్ విమానాన్ని ఇటీవల ఆయన తనిఖీ చేశారు. ఆ విమానం కాక్‌పిట్‌లో కూర్చున్నారు. ఆయనతో పాటు హెచ్‌ఏఎల్ ఛైర్మన్ డీకే సునిల్ కూడా ఉన్నారు. ఈ సందర్భంగా.. హెచ్‌ఏఎల్‌పై అమర్‌ప్రీత్ తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. 'మా అవసరాలు ఏమిటో, మా ఆందోళనలు ఏమిటో మీకు తెలియజేస్తుంటాం. ఆ ఆందోళనలను దూరం చేసి మాలో ఆత్మవిశ్వాసాన్ని నింపే బాధ్యత మీదే. కానీ, ప్రస్తుతానికైతే నాకు హెచ్‌ఏఎల్ మీద నమ్మకం లేదు' అని తెలిపారు. అమర్‌ప్రీత్ మాట్లాడుతున్న వీడియోను డిఫెన్స్ న్యూస్ పోర్టల్ 'నేషనల్ డిఫెన్స్' తన యూట్యూబ్ చానల్‌లో పెట్టటంతో ఈ వివరాలు బయటకొచ్చాయి. 'హెచ్‌ఏఎల్ మనందరి సంస్థ. అందరమూ ఇక్కడ పని చేసిన వాళ్లమే. నేను ఫిబ్రవరిలో ఇక్కడికి వచ్చినప్పుడు 11 తేజస్ ఎంకే1ఏ విమానాలు సిద్ధంగా ఉంటాయని హామీ ఇచ్చారు. కానీ ఒక్కటి కూడా సిద్ధం కాలేదు' అని నిలదీశారు. హెచ్‌ఏఎల్ ఉన్నతాధికారులు స్పందిస్తూ.. 'మీరు చెప్పిన అంశాలను పరిగణనలోకి తీసుకుంటాం' అని తెలిపారు. అమర్‌ప్రీత్‌సింగ్ మళ్లీ మాట్లాడుతూ, తన మాటలు తప్పని నిరూపిస్తే తనకంటే సంతోషించే వాళ్లుండరని స్పష్టం చేశారు.



కుంభమేళాకు వెళ్లి వస్తూ.. ఏడుగురు దుర్మరణం

మధ్యప్రదేశ్‌లో జబల్‌పూర్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

హైదరాబాద్ సిటీ/ఉప్పల్/నాచారం/తార్నాక/మల్కాజిగిరి, శంకర్‌పల్లి, రఘునాథపల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రయాగ్‌రాజ్ మహా కుంభమేళాలో పుణ్యస్నానాలకు వెళ్లిన ఏడుగురు హైదరాబాద్ వాసులు ఘోర రోడ్డు ప్రమాదం జరిగి విగతజీవులుగా తిరిగి వచ్చిన ఉదంతమిది..! మృతుల్లో టెంపో ట్రావెలర్ డ్రైవర్ సహా.. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు, మరో ముగ్గురు స్నేహితులు ఉన్నారు. ఇంకో ఇద్దరు మిత్రులు తీవ్ర గాయాలతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. ఈ సంఘటన మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో 30వ నంబరు జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. జబల్‌పూర్ పోలీసుల కథనం ప్రకారం.. హైదరాబాద్‌లోని నాచారం, దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతాలకు చెందిన ఎనిమిది మంది టెంపో ట్రావెలర్(ఏపీ29 డబ్ల్యూ 1525)లో ఈ నెల 8న ప్రయాగ్‌రాజ్ మహా కుంభమేళాకు వెళ్లారు. సోమవారం పుణ్యస్నానాలు ఆచరించాక.. హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యంలో టెంపోట్రావెలర్ రెండుసార్లు పంక్చర్ అయినట్లు సమాచారం. దీంతో.. కొందరు విమానంలో హైదరాబాద్ రావాలని నిర్ణయించుకుని, చార్జీలు ఎక్కువగా ఉండడంతో.. చివరి క్షణంలో విరమించుకున్నారు. మంగళవారం ఉదయం వీరి వాహనం మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్ సమీపంలో ఉన్న షిగోరా పట్టణానికి చేరుకుంది. అప్పటికే అంతా బాగా అలసిపోవడంతో.. వాహనాన్ని ఎక్కడైనా నిలిపి, విశ్రాంతి తీసుకోవాలనుకున్నారు. అలా ముందుకు సాగుతుండగా.. ఉదయం 8.30 సమయంలో.. ఎదురుగా రాంగ్‌రూట్‌లో వచ్చిన సిమెంట్ లారీ వీరి వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో డ్రైవర్ బాలరాజు సహా.. సంతోష్‌కుమార్, శశికాంత్, ఆనంద్ కుమార్, మల్లారెడ్డి, రవి, వెంకటప్రసాద్ అక్కడికక్కడే మృతిచెందారు. నవీనాచారి కాలు ఫ్రాక్చర్ అవ్వగా, బాలకిషన్ ప్రాణాపాయ స్థితిలో ఉన్నారు. వీరికి నేతాజీ సుభాష్ చంద్రబోస్ మెడికల్ కాలేజీలో చికిత్స అందిస్తున్నారు. వీరిద్దరి పరిస్థితి నిలకడగా ఉందని ఆస్పత్రి అధికారులు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. మృతదేహాలకు రెండు అంబులెన్సుల్లో హైదరాబాద్‌కు తరలిస్తున్నామని చెప్పారు. కాగా, సంతోష్‌కుమార్ భార్య గత ఏడాది మృతిచెందారు. రెండ్రోజుల్లో ఆమె సంవత్సరీకం ఉండగా.. కుంభమేళా వెళ్లొచ్చాక కార్యక్రమాన్ని నిర్వహించాలని సంతోష్ భావించారు. అంతలోనే రోడ్డు ప్రమాదంలో సంతోష్ మృతిచెందడంతో.. ఇద్దరు పిల్లలు అనాథలుగా మారారు. రోడ్డు ప్రమాదం పట్ల తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, ఏపీ సీఎం చంద్రబాబునాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు.



ఉచిత ఇసుకతో ఆదాయానికి గండి: గనులశాఖ

అమరావతి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): కూటమి సర్కారు అమలు చేస్తున్న ఉచిత ఇసుక విధానం రాష్ట్ర ఖజానాపై ప్రభావం చూపుతోంది. దీని కారణంగా ఇసుకపై రావాల్సిన ఆదాయం భారీగా తగ్గిపోయింది. 2024-25లో గనులశాఖ ఆదాయం 2,420కోట్లు ఉండగా, 2025-26లో అది రూ.2,166 కోట్లే వస్తుందని ఆ శాఖ అంచనా వేసింది. మంగళవారం నిర్వహించిన కార్యదర్శుల సమావేశంలో శాఖ కార్యదర్శి మీనా నివేదిక ఇచ్చారు. లీజుదారుల నుంచి 3 నెలల పాటు ఫీజులు వసూలు చేయకపోవడం, క్వార్ట్జ్, సిలికా శాండ్ పర్మిట్లను 3 నెలల పాటు నిలిపివేయడం కూడా ఆదాయం తగ్గడానికి కారణాలుగా పేర్కొన్నారు. కొత్త మైనింగ్ పాలసీ ద్వారా ఆదాయం పెంచుతామని నివేదించారు. గత సెప్టెంబరులో ఉచిత ఇసుక అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రజలకు రికార్డు స్థాయిలో 67 లక్షల టన్నుల ఇసుక పంపిణీ చేశామని తెలిపారు. వచ్చే 2 నెలల్లో భారీ, చిన్న తరహా ఖనిజాల నుంచి కనీసం రూ.1,100 కోట్ల ఆదాయం తీసుకొస్తామని, లీజు కాంట్రాక్టు దారుల నుంచి పెండింగ్ బకాయిలు, డెడ్‌రెంట్ వసూలు చేస్తామని గనుల శాఖ నివేదించింది.

2026 జూన్ నాటికి 5లక్షల ఇళ్లు పూర్తి

అమరావతి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 5లక్షల ఇళ్ల నిర్మాణాన్ని వచ్చే ఏడాది జూన్ నాటికి పూర్తిచేసి, వాటిని ఒకేరోజు ప్రారంభించాలని హౌసింగ్ అధికారులకు సీఎం చంద్రబాబు లక్ష్యాన్ని నిర్దేశించారు. అర్బన్, రూరల్ హౌసింగ్ శాఖలు కలిసి ఐదేళ్లలో మొత్తం ఇళ్లను పూర్తి చేయాలని ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో నిర్వహించిన మంత్రులు, కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'స్థలంతో పాటు ఇల్లు కట్టుకోవడానికి డబ్బులు కూడా ప్రభుత్వమే ఇస్తుంది. 2029 నాటికి ఇళ్లతో పాటు కరెంటు, నీళ్లు, గ్యాస్, సోలార్ సహా అన్ని సదుపాయాలు కల్పిస్తాం. వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల నిర్మాణం పూర్తయితే వాటిని లబ్ధిదారులకు ఇచ్చేయాలి. స్థలం కేటాయించి ఇళ్లు కట్టకపోతే మాత్రమే పాలసీ ప్రకారం అదే ప్రాంతంలో పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు చొప్పున అర్హులైన పేదలకు స్థలాలివ్వాలి' అని సీఎం పేర్కొన్నారు. కాగా, 2014-19 మధ్యకాలంలో మంజూరు చేసిన ఇళ్లకు నిధులు ఇవ్వడం లేదని కొంతమంది మధ్యలోనే నిర్మాణాలు నిలిపివేశారని, ఇలాంటివారు 50వేల మంది వరకూ ఉన్నారని మంత్రి పార్థసారథి చెప్పారు. వారందరినీ 2.0లోకి తీసుకురావాలని సీఎం ఆదేశించారు. రాష్ట్రంలో పేదల ఇళ్ల నిర్మాణంపై హౌసింగ్ ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్ జైన్ ప్రజెంటేషన్ ఇచ్చారు.



మంత్రులు, కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రులు బీసీ జనార్దన్, నిమ్మల, కొండపల్లి శ్రీనివాస్, రాం ప్రసాద్‌రెడ్డి, అధికారులు

స్పీడ్ పెంచేద్దాం!

(మొదటి పేజీ తరువాయి)

ఆమోదయోగ్యమైన పరిపాలన అందించాలన్నారు. ఆయన మంగళవారం సచివాలయంలో కార్యదర్శులు, మంత్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఇప్పటి దాకా కలెక్టర్ల సదస్సు మాత్రమే ఉదయం నుంచి సాయంత్రం దాకా, ఆ మరుసటి రోజూ నిర్వహించిన సందర్భాలున్నాయి. తొలిసారిగా కార్యదర్శులతో ఉదయం నుంచి రాత్రిదాకా దాదాపు 10 గంటలపాటు సుదీర్ఘ సమావేశం నిర్వహించారు. అదీ మూసపద్ధతిలో కాకుండా... సూటిగా, స్పష్టంగా దిశా నిర్దేశం చేశారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విజయవంతమైన విధానాలు, ప్రజోపయోగ పథకాలపై అధ్యయనం చేయాలని... వాటిలో రాష్ట్రంలోని పరిస్థితులు, అవసరాలకు అనుగుణంగా ఉండేవాటిని ఎంపిక చేసి ఒక నివేదిక ఇవ్వాలని అన్ని శాఖలను ఆదేశించారు. వినూత్నంగా ఆలోచించాలని సూచించారు. "డబ్బుల్లేవు... ఇది చేయలేం అని మంచి ప్రతిపాదనలు, ఆలోచనలను పక్కన పడేయవద్దు. తక్కువ వ్యయంతోనే వాటిని అమలు చేయడంపై ఆలోచించండి. వాటికి కేంద్రం నుంచి ఎలాంటి మద్దతు తీసుకోవచ్చో చూడండి" అని స్పష్టం చేశారు. దీని కోసం సీఎంవో స్థాయిలో 'ఇన్నోవేషన్ సెంటర్' ఏర్పాటు చేస్తామన్నారు. అప్పటికప్పుడే సౌరభ్ గౌర్, కాటమనేని భాస్కర్, కోన శశిధర్‌తో ఒక కమిటీని ఏర్పాటు చేశారు.

జిల్లాలకు వెళ్లండి...

'రేసుగుర్రాల్లో జోష్ ఏదీ' అంటూ అధికారుల తీరుపై 'ఆంధ్రజ్యోతి' మంగళవారం ప్రత్యేక కథనం ప్రచురించిన సంగతి తెలిసిందే. ఇందులోని అంశాలను ముఖ్యమంత్రి పరోక్షంగా ప్రస్తావించారు. "ఐఏఎస్‌లకు సమాజంలో మంచి పేరుంది. మీరు సమస్యలు పరిష్కరిస్తారని ప్రజలు నమ్ముతారు. మంచి స్థానాల్లో ఉన్నారు... మంచి చేయాలి" అని హితవు పలికారు. ఇళ్లలో కూర్చుని పని చేస్తే క్షేత్రస్థాయిలో పరిస్థితులు తెలియవన్నారు. గ్రూప్-1 అధికారుల నుంచి ప్రతి ఒక్కరూ ఏప్రిల్ నుంచి ప్రతి నెలా కనీసం మూడు నాలుగు జిల్లాల్లో పర్యటించాలని ఆదేశించారు. అధికారులు గ్రామాలకు వెళ్లే అంశంపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రణాళిక రూపొందిస్తారని చెప్పారు.

ఫిర్యాదులు ఎందుకొస్తున్నాయి?

ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులపై ముఖ్యమంత్రి ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఫిర్యాదుల పరిష్కారానికి తొలి ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. మరీ ముఖ్యంగా రెవెన్యూ, వైద్య, పోలీసు, విద్యా శాఖలకు సంబంధించి ఫిర్యాదులు అధికంగా వస్తున్నాయని చెప్పారు. 'దీనికి కారణాలేమిటో తెలుసుకోండి. సమస్యలు పరిష్కరించండి. వాటిని సరైన కోణంలో చూడండి. అంతే తప్ప... ఫిర్యాదు చేసిన వారిపై విసుక్కోవద్దు" అని హితవు పలికారు. "ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయంటే... ఆ శాఖ సరిగా పనిచేయనట్టే లెక్క. ముఖ్యంగా రెవెన్యూ సమస్యలు లా అండ్ ఆర్డర్ సమస్యలుగా మారే పరిస్థితి వస్తోంది. నిర్దిష్ట సమయంలో వాటిని పరిష్కరించాల్సిన బాధ్యత మీదే" అని అధికారులకు స్పష్టం చేశారు. సులువుగా, సరళంగా పౌర సేవలు అందించేందుకు ఉద్దేశించిన 'వాట్సాప్ గవర్నెన్స్'ను సమర్థంగా ఉపయోగించుకోవాలని అన్ని శాఖలను ముఖ్యమంత్రి ఆదేశించారు. ధ్రువీకరణ పత్రాలు, ఇతర సేవల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండొద్దని స్పష్టం చేశారు. 'పాలనను సరళీకరించాలి. ఇందుకు టెక్నాలజీయే మార్గం" అని తెలిపారు.

సూటిగా... స్పష్టంగా...


కలెక్టర్ల సదస్సుతో పోల్చితే మంగళవారం నిర్వహించిన కార్యదర్శుల భేటీ సూటిగా, స్పష్టంగా సాగింది. సుదీర్ఘంగా సాగే పవర్ పాయింట్ ప్రజెంటేషన్లకు కళ్లెం వేశారు. కేటాయించిన సమయం పూర్తికాగానే 'మైక్ కట్' చేసేశారు. ఇక... చంద్రబాబు 'ఎవరినీ ఉద్దేశించి అనడం లేదు' అంటూనే... తాను అనాల్సిన వారికి అర్థమయ్యేలా చురకలు అంటించారు. సమయ పాలన, ఫైళ్ల కదలిక, నిర్ణయాలు తీసుకోవడంలో వేగం... తదితర అంశాలపై దిశా నిర్దేశం చేశారు. కీలక శాఖల నుంచి సూక్ష్మస్థాయిలో సమాచారం తెప్పించుకున్నారు. ప్రజెంటేషన్‌లో లోపాలను అప్పటికప్పుడే ఎత్తిచూపించారు. గత ఎనిమిది నెలల్లో ఏం సాధించారు... భవిష్యత్ లక్ష్యాలు ఏమిటి అని అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్ ప్రణాళిక లేకుండా వచ్చిన అటవీ, పర్యాటక శాఖ అధికారులపై ఆగ్రహించారు. అలాగే... పూర్తిస్థాయి సమాచారం లేకుండా వచ్చిన వారినీ మందలించారు. 'తర్వాత చెబుతామంటే... ఇప్పుడు మీటింగ్ పెట్టడం ఎందుకు?' అని ప్రశ్నించారు. అటవీశాఖ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. "మేం ఒక్కో ఇటుక పేర్చుకుంటూ వస్తున్నాం. మీ ప్రవర్తనతో ప్రభుత్వానికి చెడ్డపేరు తేవొద్దు" అని సూచించారు. ఈసారి జరిగే కలెక్టర్ల సదస్సుల్లో... జిల్లా కలెక్టర్ల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకుని వారికి గైడ్ చేయాలే తప్ప... లీడ్ చేయొద్దని చంద్రబాబు అన్నారు. శాఖల కార్యకలాపాలను నిశితంగా పరిశీలించాలని మంత్రులను కూడా ఆదేశించారు. ప్రభుత్వ పాలనకు సంబంధించి ఏడు అంశాలపై అందరు అధికారుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. ఇంకా కొన్ని శాఖలపై రివ్యూ పెండింగ్‌లో ఉన్నప్పటికీ... 'విఎమ్మల్ని ఇంకా ఇబ్బంది పెట్టను' అంటూ చంద్రబాబు రాత్రి 9 గంటలకు సమీక్షను ముగించారు.

ఇవీ ఆదేశాలు...

- ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల్లో ఆర్థికంతో సంబంధం లేనివాటిని వెంటనే పరిష్కరించాలి. అసాధ్యమైన సమస్యలు ఉంటే వాటిపై తగిన వివరణ ఇవ్వాలి.
- ఒక్కొక్క ఉన్నతాధికారి ఒక్కో జిల్లాను దత్తత తీసుకోవాలి. రాష్ట్రంలో ఉన్న 5 జోన్లకు కూడా ఉన్నతాధికారులు వెళితే చాలా ఆలోచనలు వస్తాయి.
- వృద్ధిరేటు (జీఎస్‌డీపీ) 15 శాతం సాధించకపోతే రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడలేదు. అది సాధించాల్సిందే!
- ఒక ప్రాజెక్టు పనులు ప్రారంభమైతే అది ఎప్పుడు పూర్తవుతుందనే క్లారిటీ ఉండాలి. ఇందుకోసం మిషన్ కర్మయోగి, ప్రాజెక్టు మోనిటరింగ్ గ్రూప్ (పీఎంజీ)లను ఎడాప్ట్ చేసుకోవాలి.
- ఎన్నికల ప్రణాళికలో ఇచ్చే ప్రధాన హామీలన్నీ అమలు చేయాల్సిందే.
- ఉగాది పండుగ నుంచి 'హ్యాపీ సండే' కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభిస్తాం.



సమావేశంలో పాల్గొన్న మంత్రి నారాయణ



మార్చిలో మెగా డీఎస్సీ

అమరావతి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ నోటిఫికేషన్ మార్చిలో విడుదల చేయనున్నట్లు పాఠశాల విద్యాశాఖ తెలిపింది. 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి గతంలోనే జీవో జారీ చేశామని, జూన్ నాటికి బడుల్లో కొత్త టీచర్లు ఉంటారని వివరించింది. మంగళవారం నిర్వహించిన కార్యదర్శుల సమావేశంలో విద్యాశాఖపై ఆ శాఖ కార్యదర్శి కోన శశిధర్ ప్రజెంటేషన్ ఇచ్చారు. జీవో 117కు త్వరలో ప్రత్యామ్నాయం తీసుకొస్తామన్నారు. గతంలో టీచర్లకు 45 రకాల యాప్‌లు ఉండేవని, వాటిని ఒక్క యాప్‌లోకి మార్చామని వివరించారు. త్వరలో టీచర్ బదిలీల చట్టం తీసుకొస్తామని, అసెంబ్లీ సమావేశాల్లో దీనిపై బిల్లు పెడతామని చెప్పారు. వీసీల నియామకం తర్వాత రాష్ట్రంలో అన్ని యూనివర్సిటీలకు ఏకీకృత చట్టం అమలు చేస్తామని శశిధర్ పేర్కొన్నారు.

ఏప్రిల్ 1 నుంచి కొత్త పాసుపుస్తకాలు

రాష్ట్రవ్యాప్తంగా రైతులకు ఆంధ్రప్రదేశ్ రాజముద్ర ఉన్న కొత్త పాసుపుస్తకాలను ఏప్రిల్ 1 నుంచి పంపిణీ చేయాలని రెవెన్యూ శాఖ నిర్ణయించింది. భూముల రీసర్వే జరిగిన 8,680 గ్రామాల్లో జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్ష పేరిట ఇచ్చిన పాసుపుస్తకాలను వెనక్కి తీసుకొని, వాటిస్థానంలో కొత్తగా ముద్రించిన పుస్తకాలను ఇవ్వనుంది. ఈ మేరకు మంగళవారం జరిగిన కార్యదర్శుల సమావేశంలో సీఎం చంద్రబాబుకు రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ నివేదించారు. పాసుపుస్తకాలపై జగన్ బొమ్మలు ఉండటంతో వాటిని రైతులు తిరస్కరిస్తున్నారని చెప్పారు. మార్చి నాటికి సర్వేరాళ్లపై జగన్ బొమ్మలు, పేర్లు తొలగించే కార్యక్రమం కూడా పూర్తవుతుందని తెలిపారు. రెవెన్యూ సదస్సులు, రీసర్వే గ్రామాల్లో జరిగిన సభల్లో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ఈ నెలాఖరు నాటికి పరిష్కరిస్తామని మంత్రి పేర్కొన్నారు. ల్యాండ్ గ్రాబింగ్ నిరోధక చట్టం కేంద్రం పరిశీలనలో ఉందని ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి. సిసోడియా వెల్లడించారు. కేంద్రం ఆ చట్టాన్ని త్వరగా ఆమోదించేలా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. భూముల అక్రమాల నిగ్గు తేల్చేందుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ల ఏర్పాటుకు త్వరలో ఉత్తర్వులు జారీ చేస్తామని, ఇప్పటికే సీసీఎల్ఏ మార్గదర్శకాలు ఇచ్చారని సిసోడియా వివరించారు.

క్రీడలకు మెరుగైన పాలసీ: సీఎం

క్రీడలకు సంబంధించి దేశంలోనే మనం మంచి పాలసీ తీసుకొచ్చామని, సదుపాయాలు సృష్టించామని, క్రీడాకారులకు ప్రోత్సాహకాలు భారీగా పెంచామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. క్రీడలు, యువజన సంక్షేమ శాఖపై సమీక్ష సందర్భంగా అధికారులు వేగం పెంచాలని సూచించారు. భవిష్యత్తు క్రీడా మాణిక్యాలను గుర్తించి, తగిన శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. నేషనల్ గేమ్స్ నిర్వహించాలంటే 2029 నాటికి మౌలిక సదుపాయాలు సిద్ధం చేయాలన్నారు.

దారిలో పడని 'పోలీసు'!

ప్రభుత్వం మారినా ప్రజల్లో కానరాని సంతృప్తి

20 శాఖల సేవల్లో పోలీసులకు 18వ స్థానం



అమరావతి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వ హయాంలో అరాచకాలకు కొమ్ముకాసి ఐదేళ్లపాటు అమాయకులను వేధించిన ఆంధ్రప్రదేశ్ పోలీసులు.. రాష్ట్రంలో ప్రభుత్వం మారినా సామాన్య ప్రజలకు న్యాయం చేయలేకపోతున్నారు. గత ఏడాది జూన్ 15 నుంచి ఈ నెల 6వ తేదీ వరకూ కూటమి ప్రభుత్వంలో పోలీసు శాఖ పనితీరు.. ఇతర ప్రభుత్వ శాఖలతో పోలిస్తే అట్టడుగున ఉంది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన మంగళవారం అమరావతిలో జరిగిన మంత్రులు, ముఖ్య కార్యదర్శులు, శాఖాధిపతుల సమావేశంలో ప్రభుత్వం ఈ విషయాన్ని వెల్లడించింది. 20 శాఖలు అందిస్తున్న సేవలపై ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించగా.. పోలీసు శాఖ అట్టడుగున 18వ స్థానంలో ఉంది. వైద్యం, పౌరసరఫరాలు, వ్యవసాయం, విద్యుత్, హౌసింగ్, పంచాయతీరాజ్, గ్రామీణ నీటిసరఫరా, రెవెన్యూ, గ్రామీణాభివృద్ధి, పాఠశాల విద్య, పట్టణాభివృద్ధి లాంటి శాఖలన్నీ పోలీసుల కంటే మెరుగైన సేవలందిస్తున్నాయి.

వినతుల్లో భూ సంబంధమైనవే ఎక్కువ

వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీ నేతల్లో పలువురు సామాన్యుల భూములు, ఆస్తులు కబ్జా చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత ప్రారంభించిన ప్రజాదర్బార్‌లో అందుతున్న వేలాది ఫిర్యాదుల్లో అత్యధికం భూ, ఆస్తి వ్యవహారాలకు సంబంధించినవే. ప్రతి పది వినతుల్లో ఐదు రెవెన్యూవే. ఇవే సమస్యలపై పోలీసుల వద్దకు వెళ్లి ఫిర్యాదు చేస్తే ఇది సివిల్ వివాదం.. కోర్టులో తేల్చుకోండని అంటున్నారు. మరికొందరు ఖాకీలు డబ్బులు ఇచ్చిన వారివైపో లేదా ఒత్తిడి తెచ్చిన వారివైపో మొగ్గు చూపుతున్నారు. దీంతో రాష్ట్రంలో చాలా చోట్ల ఆస్తి వివాదాలు పరిష్కారం కావట్లేదు. ప్రతి సోమవారం జిల్లా ఎస్పీకి అందే వినతుల్లోనూ ఆస్తి వివాదాలకు సంబంధించినవే ఎక్కువగా ఉంటున్నాయి. రెండో సమస్య సైబర్ నేరాలు, ఆర్థిక మోసాలకు సంబంధించింది. ప్రతి ఒక్కరి చేతిలో మొబైల్ ఫోన్, వాటికి బ్యాంకు ఖాతా లింకై ఉండడంతో ఏదో రూపంలో సైబర్ నేరగాళ్లు మోసగిస్తున్నారు. వీటిపై ఫిర్యాదు చేయడానికి వెళ్తే.. 'నీకు ఫోన్ ఎందుకు.. ఎవడో ఓటీపీ అడిగితే చెప్పడమేనా.. వాడెక్కడో రాజస్థాన్‌లో ఉంటాడు.. అంతదూరం వెళ్లినా చిక్కుతాడా.. ఫోన్‌పే లాంటి యాప్‌లు తీసేసి నగదు లావాదేవీలు చేసుకో..' అంటూ స్టేషన్ హౌస్ ఆఫీసర్లు (ఎస్‌హెచ్‌వోలు) మాటలతో గాయపరుస్తున్నారు.

అసంపూర్ణ పరిష్కారం..

ఇక పోలీసు శాఖకు గతేడాది జూన్ 15 నుంచి వచ్చిన వినతుల్లో పరిష్కారమయ్యాయని చెప్పిన తర్వాత కూడా 13 శాతం ఫిర్యాదులు మళ్లీ వస్తున్నట్లు తేలింది. అసంపూర్ణంగా పరిష్కరించిన పోలీసులు మళ్లీ అదే వినతితో బాధితులు వస్తే.. ఎన్నిసార్లు వస్తారంటూ కోప్పడుతున్నారు. అత్యధికంగా పార్వతీపురం, తిరుపతి జిల్లాల్లో ప్రజలు పోలీసులపై తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు తేలింది. ముఖ్యమంత్రి కార్యాలయం 20,324 ఫిర్యాదులు అందుకుంటే అందులో 987 పోలీసు శాఖకు సంబంధించినవి. సీఎంవో పంపిన ఫిర్యాదులను పరిష్కరించినట్లు పోలీసులు చెప్పాక.. మళ్లీ 126 వినతులు రావడం వారి పనితీరు ఎంత లోపభూయిష్టంగా ఉందో స్పష్టం చేస్తోంది. ప్రతి వంద మందిలో 39శాతం మంది పోలీసుల పనితీరుపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేశారు. 'ప్రజల బాధలు ఓపిగ్గా వినండి.. మనం సేవకులం.. మన ప్రవర్తన ముఖ్యం.' అని చంద్రబాబు పదే చెబుతున్నా పోలీసుల చెవికెక్కడం లేదన్న విమర్శలు వస్తున్నాయి.

ఇలా చేస్తేనే.. రియల్ టైమ్ కేస్ ట్రాకింగ్, ఫిర్యాదుల నిర్వహణలో పారదర్శకత, డిజిటల్ మోసాలు, ఆన్‌లైన్ నేరాలు, సైబర్ మోసాల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టకపోతే సీఎం చంద్రబాబు ఆశిస్తున్న 80 శాతం సంతృప్తి సంగతి సరే.. ఇప్పుడున్న 61 శాతం కూడా తగ్గిపోయే అవకాశం లేకపోలేదు. మిషన్ కర్మయోగి వంటి కార్యక్రమాల ద్వారా చట్టం అమలుకు మెరుగైన శిక్షణ ఇచ్చి అధికారుల పర్యవేక్షణ పెంచాలి. సేవలను మరింత మెరుగుపరిచేందుకు అదనపు పోలీసు సిబ్బందిని నియమించడం, కొత్తగా పోలీసు స్టేషన్ల ఏర్పాటు, ప్రతి జిల్లాలోనూ సైబర్ స్టేషన్ల బలోపేతం, డిజిటల్ నిఘా, రాష్ట్ర స్థాయి ప్రాజెక్టు మానిటరింగ్ వంటి చర్యలతోనే పోలీసుల పనితీరు మెరుగుపడుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఫిర్యాదుల్లో 90% భూవివాదాలే

అమరావతి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వివిధ మార్గాల్లో ప్రజల నుంచి తీసుకుంటున్న ఫిర్యాదులపై కార్యదర్శుల సదస్సులో సమీక్షించారు. మొత్తం 7,42,301 ఫిర్యాదులు రాగా.. 90 శాతం రెవెన్యూ శాఖకు సంబంధించినవే. అత్యధికంగా శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల నుంచి ఫిర్యాదులు అందగా, పల్నాడు జిల్లా నుంచి తక్కువగా వచ్చాయి. 2024 జూన్ 15వ తేదీ నుంచి 2025 ఫిబ్రవరి 6 వరకు 7,42,301 ఫిర్యాదులు వచ్చాయి. ఇందులో 4,50,735 ఫిర్యాదులను పరిష్కరించారు. ఫిర్యాదుల్లో అధికంగా గ్రామసభల నుంచి 2,36,459, రెవెన్యూ సదస్సుల నుంచి 2,34,849, కలెక్టరేట్ల నుంచి 78,169 వచ్చాయి. భూకబ్జాలపై అందిన ఫిర్యాదుల్లో 26.5%, భూ తగాదాలపై 26.5%, రెవెన్యూ రికార్డుల్లో తప్పుడు ఎంట్రీలపై 20%, పోలీసులపై పాలనాపరమైన వాటిపై 14.5%, సైబర్ క్రైమ్‌పై 12.4% ఫిర్యాదులను పరిష్కరించారు.

ఆరోగ్య సూచీలో ఎక్కడున్నామో చెక్ చేసుకోవాలి: సీఎం

ఆరోగ్య సూచీలో ఏపీ ఎక్కడుందో ఎప్పటికప్పుడు పరిశీలన చేసుకోవాలని సీఎం పేర్కొన్నారు. ఆరోగ్య శాఖలో సర్వీసులను అవుట్‌సోర్సింగ్ చేయాలన్నారు. జన ఔషధి మందుల కేంద్రాలు ఏర్పాటు చేయాలని, డిజిటల్ హెల్త్ కార్డులను వాట్సాప్‌కు లింక్ చేయాలన్నారు. మెడికల్ కాలేజీలను పూర్తి చేయాలని ఆదేశించారు. మెడికల్ ఇన్సూరెన్స్‌ను ఆపరేషన్‌లోకి తీసుకురావాలన్నారు. ఆరోగ్య రంగంలో బిల్‌గేట్స్ మనతో కలిసి పని చేసేందుకు ముందుకు వచ్చారన్నారు.

పిల్లలంతా బడుల్లోనే ఉండాలి


పాఠశాలల్లో డ్రాపౌట్లు ఉండకూడదని, బడి ఈడు పిల్లలంతా బడుల్లో ఉండేలా మంత్రులు, ఎమ్మెల్యేలు బాధ్యత తీసుకోవాలని సీఎం సూచించారు. పాఠశాలల్లో అవసరమైతే బ్రిడి కోర్సులు నిర్వహించాలన్నారు. బడుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఎలాంటి వివాదాలు లేకుండా టీచర్ల సర్వీసు రూల్స్ ఉండాలన్నారు. యూనివర్సిటీల్లో ఖాళీల భర్తీని వేగవంతం చేయాలన్నారు. జేఈఈ మెయిన్స్ టాపర్ల జాబితాలో నిలిచిన మనోజ్ఞ గుత్తికొండను అభినందించారు.

ప్రజలతో దురుసుగా ప్రవర్తించొద్దు

ఈ నెలాఖరులోగా ఈ- ఆఫీస్‌తో శాఖలన్నీ అనుసంధానం

- రాష్ట్రాభివృద్ధి లక్ష్యంగా బడ్జెట్ ప్రతిపాదనలు
- అధికారులు, మంత్రులకు ముఖ్యమంత్రి ఆదేశం
- వివరాలు వెల్లడించిన మంత్రి పార్థసారథి

అమరావతి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రజల పట్ల దురుసుగా ప్రవర్తించవద్దని, వారి సమస్యలను ఓపికగా విని, సానుకూలంగా స్పందించాలని సీఎం చంద్రబాబు సూచించారు. మంగళవారం అమరావతి సచివాలయంలో మంత్రులు, కార్యదర్శుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సీఎం ఏమన్నది మంత్రి పార్థసారథి విలేకరులకు తెలిపారు. "గత ప్రభుత్వం విధ్వంస పరిపాలన చేసింది. వ్యవస్థలను కూల్చివేసింది. దీంతో ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకువచ్చారు. ప్రజల ఆశలను సాకారం చేసేవిధంగా శాఖలు పని చేయాలి. దానికి అనుగుణంగా లక్ష్యాలు నిర్దేశించుకోవాలి. వ్యవస్థలకు మళ్లీ పూర్వవైభవం తీసుకు వచ్చి రాష్ట్ర పరిస్థితులను గాడిలో పెట్టాలి. ఈ-ఆఫీసు అమలుపై అధికారులు సమీక్షలు నిర్వహించాలి. ప్రభుత్వంలోని అన్ని శాఖలను నెలాఖరుకల్లా ఈ-ఆఫీస్‌తో అనుసంధానం చేయాలి. ప్రజలతో వ్యవహరించే తీరు బాగుండాలి. వారు సంతృప్తిపడే విధంగా అధికారుల ప్రవర్తన ఉండాలి. వారి సమస్యలు ఓపిగ్గా విని వాటిని సాధ్యమైనంత వరకు పరిష్కరించడానికి ప్రయత్నం చేయాలి."



స్వర్ణాంధ్ర లక్ష్యంగా పనితీరు మెరుగుపడాలి

"2025-26 బడ్జెట్‌ను రాష్ట్రాభివృద్ధికి దోహదపడేలా రూపొందించాలి. స్వర్ణాంధ్ర-2047 లక్ష్యంగా ప్రభుత్వ శాఖలు తమ పనితీరును మెరుగుపరుచుకోవాలి. 15శాతం వృద్ధి రేటును సాధించడం, తలసరి ఆదాయం 42,000 డాలర్లకు చేర్చడమే లక్ష్యం. 2047 నాటికి ఏపీని 2.4 ట్రిలియన్ డాలర్ల జీఎస్‌డీపీ ఆర్థిక వ్యవస్థగా మార్చాలనేది ధ్యేయం. తెలంగాణలో పోలిస్తే జీఎస్‌డీపీలో రూ.87,000 కోట్ల లోటు ఉంది. జీఎస్‌డీపీ లక్ష్యాలను చేరుకోవడానికి వ్యూహాత్మక విధానం అవసరం. రాష్ట్రంలో కొనుగోలు శక్తిని పెంచాలి. కేంద్రం వద్ద మిగిలిన నిధులను అందిపుచ్చుకోవాలి. కేంద్రం నుంచి నిధులు రాబట్టుకోవడానికి మంత్రులు, అధికారులు కృషి చేయాలి. స్వర్ణాంధ్ర-2047 విజన్ సాధించడానికి రాష్ట్ర స్థాయిలో విజన్ మానిటరింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలి. జిల్లాల ద్వారా నియోజకవర్గ స్థాయిలో ప్రణాళికలు రూపొందించాలి. జీఎస్‌డీపీ వృద్ధికి దోహదపడే ప్రాజెక్టులను గుర్తించి, వాటిని ప్రత్యేక పోర్టల్ ద్వారా ట్రాక్ చేయాలి. ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ పనితీరు మారాలి. మున్సిపల్, రెవెన్యూ, హోం, పంచాయతీరాజ్, పౌరసరఫరాల విభాగాల్లో సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. పెన్షన్ల పంపిణీలో లబ్ధిదారులతో దురుసుగా ప్రవర్తించొద్దు. పెన్షన్లు ఇచ్చేటప్పుడు అధికారుల తీరుబాగుండాలి. ప్రభుత్వ ఉద్యోగులకు నిరంతర శిక్షణ కోసం మిషన్ కర్మయోగి కార్యక్రమం, నైపుణ్యాభివృద్ధికి ఐఎండీ స్విట్జర్లాండ్ సహకారం తీసుకోవాలి. ప్రభుత్వ ప్రాజెక్టుల సత్వర అమలుకు పీఎంజీ విధానాన్ని రాష్ట్రంలోని అన్ని శాఖలు ఈ నెలాఖరులోగా అనుసంధానం చేయాలి. రాష్ట్రంలో రూ. 50 కోట్లు విలువైన ప్రతి ప్రాజెక్టును పర్యవేక్షిస్తూ, ప్రాజెక్టు అమలులో సమస్యలు త్వరితగతిన పరిష్కారం లభించేలా చర్యలు తీసుకోవాలి" అని చంద్రబాబు అధికారులను ఆదేశించినట్టు మంత్రి పార్థసారథి తెలిపారు.

గత ఐదేళ్లలో వృద్ధిరేటు భారీగా తగ్గింది

కార్యదర్శుల సదస్సులో ఆర్థిక శాఖ ప్రజెంటేషన్

విభజన అనంతరం 2014-15 నుంచి 2018-19 వరకు ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు తలసరి ఆదాయంలోనూ సమానంగా పోటీ పడ్డాయని ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి పీయూష్ కుమార్ తెలిపారు. "తొలుత ఏపీ 13.21% వృద్ధిని నమోదుచేయగా, తెలంగాణ 13.37% సాధించింది. అయితే, 2019-20 నుంచి 2023-24 మధ్య భారీ తేడా వచ్చింది. జాతీయ సగటు 8.16 శాతానికి తగ్గినా తెలంగాణ కొంతమేర తన వృద్ధిరేటును నిలబెట్టుకుంది. ఏపీ మాత్రం గణనీయంగా వెనుకబడింది. తెలంగాణ తలసరి ఆదాయం 11.45శాతానికి తగ్గి రూ.3,56,564కి చేరింది. అదే సమయంలో ఏపీ 9.18 శాతానికి తగ్గి రూ.2,37,951కి పడిపోయింది. 2014-15లో 13.07 శాతంగా ఉన్న ఏపీ జీఎస్‌డీపీ వృద్ధిరేటు 2023-24కు 8.60 శాతానికి తగ్గింది. 2024-25లో జీఎస్‌డీపీ వృద్ధి రేటు 12.9 శాతంగా ఉంటుందని అంచనా" అని పేర్కొన్నారు.

ఎమ్మెల్యేల హాజరు తగ్గడంపై సీఎం సీరియస్

- వారు వచ్చేటట్లు చూడాల్సిన బాధ్యత విప్‌లదే
- వైసీపీ గైర్హాజరీతో ప్రతిపక్ష పాత్రా మనదే.. చీఫ్ విప్ జీవీ

అమరావతి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): 'ఎమ్మెల్యేల హాజరు విషయంలో సీఎం చంద్రబాబు చాలా సీరియస్‌గా ఉన్నారు. ఈ విషయంలో విప్‌లు పూర్తిస్థాయిలో శ్రద్ధ పెట్టాలి. ఎమ్మెల్యేల హాజరు బాధ్యత విప్‌లు తీసుకోవాలి' అని చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు విప్‌లకు దిశానిర్దేశం చేశారు. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభంకానున్న నేపథ్యంలో మంగళవారం అసెంబ్లీ కమిటీ హాలులో విప్‌లతో సమావేశం నిర్వహించారు. అసెంబ్లీలో ప్రతిపక్ష పాత్ర పోషించాల్సిన వైసీపీ నాయకులు హోదా కోసం పట్టుబట్టి సభకే రావడం లేదని, అధికారపక్షమే ప్రతిపక్ష పాత్ర కూడా పోషించాల్సిన అవసరం ఉందని ఆంజనేయులు అన్నారు. సభలో విప్‌లకు ప్రశ్నలు అడిగే అధికారంపై చర్చ జరిగింది. అడగాల్సిన ప్రశ్నలను ఎమ్మెల్యేలు ఈనెల 14లోపు పంపాలని ఆంజనేయులు సూచించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 'అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు 24 నుంచి ప్రారంభంకానున్నాయి. తర్వాత వరుసగా 3 రోజులు సెలవులు రానున్నాయి. సెలవులు అనంతరం ఫిబ్రవరి 28న పూర్తిస్థాయి రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. ప్రారంభానికి రెండు రోజుల ముందు ఫిబ్రవరి 22, 23 తేదీల్లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు అవగాహన తరగతులు నిర్వహిస్తున్నాం. సభా సాంప్రదాయాలు, మర్యాదలు, సభ్యుల ప్రవర్తన తదితర అంశాలపై తరగతుల్లో వివరిస్తారు. వైసీపీ సభ్యులూ ఈ అవగాహన తరగతులకు హాజరు కావాలి' అని జీవీ కోరారు.

పార్లమెంటుకు ఏ హోదా ఉందని వెళుతున్నారు?: యార్లగడ్డ

విప్ యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ... 'పార్లమెంటుకు వైసీపీ సభ్యులు ఏ హోదా ఉందని వెళ్తున్నారు? ఢిల్లీలో ఒక రూల్, ఏపీలో మరో రూల్ ఎలా పాటిస్తారు? అసెంబ్లీ అన్నా, చంద్రబాబు అన్నా జగన్‌కు భయం. అందుకే హోదా ఇస్తేనే వస్తానంటూ మెలిక పెడుతున్నారు. గతంలో సభలో అన్ పార్లమెంటరీ భాష వాడినట్లు ఇప్పుడు ఉండదు. జగన్ ధైర్యంగా రావచ్చు. వచ్చే ఎన్నికల్లో ప్రతిపక్ష హోదా ఇస్తేనే సభకు వెళతానని మేనిఫెస్టోలో పెట్టే ధైర్యం జగన్‌కు ఉందా?' అని ప్రశ్నించారు. సమావేశానికి టీడీపీ నుంచి బొండా ఉమ, తంగిరాల సౌమ్య, జగదీశ్వరి, మాధవి, జనసేన నుంచి బొలిశెట్టి శ్రీనివాస్, బొమ్మిడి నాయకర్, శ్రీధర్ హాజరయ్యారు.

పింఛన్ల పేరుతో వైసీపీ నేతల అరాచకం

- మహిళలను బెదిరించి, లోబర్చుకునేందుకు ప్రయత్నిస్తున్నారు: మాధవి

'పింఛన్ల పేరుతో వైసీపీ నాయకులు చాలా అరాచకాలకు పాల్పడ్డారు. ఇప్పుడూ పాల్పడుతున్నారు' అని కడప ఎమ్మెల్యే విప్ రెడ్డప్పగారి మాధవి ఆరోపించారు. మంగళవారం జరిగిన విప్‌ల సమావేశంలో ఆమె మాట్లాడారు. "రాష్ట్రంలో చాలా మంది మహిళలు నిబంధనలకు విరుద్ధంగా ఒంటరి మహిళ, వితంతు పింఛన్లు తీసుకుంటున్నారు. వైసీపీ హయాంలో ఆ పార్టీ నేతలు దొంగ సర్టిఫికెట్లతో వారికి పింఛన్లు ఇప్పించారు. ప్రభుత్వం మారాక వారిని వైసీపీ నేతలు టార్చర్ చేస్తున్నారు. బ్లాక్ మెయిల్ చేసి లోబర్చుకోవాలని చూస్తున్నారు. ఈ పరిస్థితుల్లో చాలా మంది మహిళలు దిక్కుతోచక.. 'మాకు భర్త ఉన్నాడు. పింఛను వద్దు. కేసు లేకుండా చూడండి' అంటూ మా వద్దకు వస్తున్నారు" అని మాధవి విప్‌ల సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు.

శివ భక్తులకు ఇబ్బంది కలిగించవద్దు

శైవ క్షేత్రాలు ఎక్కువగా అటవీ ప్రాంతంలోనే ఉన్నాయి. అయా ఆలయాలకు వెళ్లే మార్గంలో భక్తులకు అటవీ అధికారులు ఇబ్బంది కలిగిస్తున్నారు' అని సమావేశంలో దేవదాయ మంత్రి రామనారాయణరెడ్డి, సీఎం దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై సీఎం చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. 'శ్రీశైల భక్తులకు ఇబ్బంది కలిగించవద్దు. అటవీ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి కూడా పూర్తి స్థాయిలో సహకరించాలి' అని ఆదేశించారు. కాగా, రాష్ట్రంలోని సరిహద్దు గ్రామాల్లో ఏనుగుల గుంపులను తరిమికొట్టేందుకు కర్ణాటక నుంచి కుంకీ ఏనుగులను తెప్పించేందుకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రయత్నాలు చేస్తే... అటవీ అధికారులు ఫాలో అప్ చేయకపోవడంపై సీఎం చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేశారు. 'మీ ఫాలోఅప్ లేక ఇప్పటికీ కుంకీ ఏనుగులు రాలేదు. దీనిపై అధికారులు హోంవర్క్ చేయాలి' అని సీఎం ఆదేశించారు.



మంత్రులు, ప్రభుత్వ కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు, పాల్గొన్న మంత్రులు అనగాని సత్యప్రసాద్, అనిత, అచ్చెన్నాయుడు, నారా లోకేశ్, నిమ్మల రామానాయుడు, బీసీ జనార్దన్ రెడ్డి, రాంప్రసాద్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, గొట్టిపాటి రవికుమార్, కొలుసు పార్థసారథి, పయ్యావుల కేశవ్, నారాయణ, నాదెండ్ల మనోహర్, సీఎస్ విజయానంద్, డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా తదితరులు

ఏడాదైనా ఫైళ్లు క్లియర్ చేయరా?

- బాధ్యత లేకుండా పనిచేస్తున్నారు
- అధికారులపై ముఖ్యమంత్రి తీవ్ర ఆగ్రహం
- ఆర్థిక బాధలున్నా బకాయిలన్నీ చెల్లిస్తూనే ఉన్నాం
- మంత్రులు, కార్యదర్శుల భేటీలో సీఎం వ్యాఖ్యలు

అమరావతి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఆర్నెల్లైనా, ఏడాదైనా ఫైళ్లు క్లియర్ కాకపోవడం ఏమిటని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆగ్రహించారు. బాధ్యత లేకుండా పనిచేస్తున్నారంటూ అధికారులపై తీవ్ర స్వరం వినిపించారు. ఈ - ఆఫీసులో ఫైళ్ల క్లియరెన్సు ప్రక్రియ వేగవంతం చేయాల్సిందేనని స్పష్టం చేశారు. సచివాలయంలో జరిగిన మంత్రులు, కార్యదర్శుల సదస్సులో భాగంగా వివిధ శాఖల్లో ఈ-ఆఫీసు ఫైళ్ల క్లియరెన్సు జరుగుతున్న క్రమం గురించి ఆర్టీజీఎస్ సీఈవో దినేశ్ కుమార్ ప్రజంటేషన్ ఇచ్చారు. కొన్ని ప్రభుత్వ శాఖల్లో సగటున మూడు రోజుల్లోనే ఫైళ్లు క్లియర్ అవుతున్నాయని ఆర్టీజీఎస్ సీఈవో తెలిపారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడారు. ఫైళ్లు పెండింగ్‌లో లేకుండా చూసుకోవాలని నిర్దేశించారు. ఆర్థికేతర అంశాలపై వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలనీ, ఆర్థిక అంశాలకు సంబంధించిన అంశాలపైనా అవసరమైన ఆదేశాలు ఇవ్వాలని ఆదేశించారు. అటవీశాఖ ప్రగతిపై ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనంతరాము ప్రజెంటేషన్ ఇచ్చారు. ఆ సమయంలో గాలి నాణ్యతపై చర్చ జరిగింది. 'రాష్ట్రంలోని వివిధ నగరాల్లో గాలి నాణ్యత ఎలా ఉంది? దేశంలోని ఇతర నగరాల్లో ఎయిర్ క్వాలిటీ ఎలా ఉంది?.' అని సీఎం ప్రశ్నించారు. అనంతరాము వద్ద సమాచారం లేకపోవడంతో ముఖ్యమంత్రి సీరియస్ అయ్యారు. "సమాచారం లేకుండా సమావేశానికి ఎలా వస్తారు? ప్రభుత్వ కార్యదర్శులకు అన్ని అంశాలపై కంట్రోల్ ఉండాలి. తమ శాఖకు సంబంధించిన పూర్తి సమాచారంతో, సన్నద్ధమై సమావేశాలకు రావాలి. అలా కాకుండా మీటింగ్‌కు వచ్చిన తర్వాత మళ్లీ డేటా పంపిస్తామంటే కుదరదు. చాలా మంది కార్యదర్శులు బాధ్యత లేకుండా పని చేస్తున్నారు" అని సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉత్తమ పాలసీల రూపకల్పన, అమలు బాధ్యత మనదేనన్నారు. 2024 ఎన్నికల్లో ప్రజలు చరిత్రాత్మక తీర్పు ఇచ్చారని, ఎప్పుడూ ఇలాంటి తీర్పు రాలేదన్నారు. గత ఐదేళ్ల విధ్వంస పాలనకు విసుగు చెంది కొత్త ఆశలు, ఆకాంక్షలతో ప్రజలు ముందుకొచ్చి కూటమికి ఘన విజయం అందించారన్నారు. వారి ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఇతరులపై ఆధారపడితే కొత్త ఆలోచనలు రావని, తాను ప్రతి గంటనూ లెక్కిస్తానన్నారు. 90 కేంద్ర ప్రాయోజిత పథకాలను గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని, పథకాలకు ఇచ్చిన నిధులను పక్కదారి పట్టించిందన్నారు. గత ప్రభుత్వంలో పరిశ్రమలు పడకేశాయని ఆయన గుర్తుచేశారు.

మన నిబద్ధతకు నిదర్శనమిదే..

గత ప్రభుత్వం వల్ల ఏర్పడ్డ నష్టాలు వెంటాడుతున్నా, ఆర్థిక ఇబ్బందులు, బాధలు ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలల్లోనే రూ.22,507 కోట్ల పాత అప్పులు చెల్లించామని ముఖ్యమంత్రి అన్నారు. ఇది ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమన్నారు. చాలా క్లిష్టపరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం ఏర్పాటైందని, ఎన్నో సవాళ్లు ఇబ్బందులు ఎదురయ్యాయని, అయినప్పటికీ క్రమశిక్షణతో పాత బకాయిలు కూడా తీర్చగలిగేలా ఆర్థిక శాఖ పనిచేయడం సంతోషదాయకమంటూ ఆ శాఖ అధికారులను సీఎం ప్రశంసించారు.

చేతల్లో చూపిస్తేనే ప్రజల్లో మనుగడ

రాబోయే రోజుల్లో భావితరాలు గుర్తించుకునేలా మన పాలసీలు, అమలు విధానం ఉండాలని చంద్రబాబు నిర్దేశించారు. మాటలు చెప్పి ప్రజలను ఏమార్చే పాలకులు కనుమరుగవుతున్నారనీ, చేతల్లో చూపించే వారికే ప్రజల్లో మనుగడ ఉంటుందన్నారు. బడ్జెట్‌లో కేంద్రం ప్రాధాన్యం కల్పించిన వ్యవసాయ రంగంలో అవకాశాలను అందిపుచ్చుకోవాలని మంత్రులు, కార్యదర్శులకు చంద్రబాబు నిర్దేశించారు వినూత్న మార్గంలో వ్యవసాయంలో ఏపీ ముందుకెళ్తోందన్నారు. ప్రపంచంలో చోటు చేసుకుంటున్న మార్పుల కారణగా రైతులు కూడా సాగు పద్ధతులు మార్చుకుంటున్నారని అన్నారు. కమర్షియల్ సాగులో ముందుకెళ్తున్న వారికి ప్రోత్సాహకాలు అందించాలని కోరారు. ఏఐ టెక్నాలజీని అన్నీ శాఖలు అనుసంధానం చేసుకోవాలన్నారు. 1995లో ఐటీని దత్తత చేసుకున్నామని, ఇప్పుడు ఏఐని దత్తత తీసుకోవాలన్నారు.

ఎయిర్ క్వాలిటీలో మన స్థానమెంత?

ఏపీకి నివాసయోగ్య రాష్ట్రంగా పేరు తీసుకురావాలని చంద్రబాబు కోరారు. "ఢిల్లీ కాలుష్యంపై ప్రజల్లో చాలా ప్రతి స్పందన వచ్చింది. ప్రపంచంలోనే ఢిల్లీకి అత్యంత కాలుష్య నగరంగా పేరు వచ్చింది." అని సీఎం అన్నారు. ఏపీలో ఉత్తమ నివాసయోగ్య పట్టణాలను సృష్టిస్తే బాగుంటుందని మంత్రి నాదెండ్ల మనోహర్ సూచించారు. దానిపై సీఎం కొనసాగిస్తూ... 'కాలుష్య నియంత్రణపై ఎప్పటికప్పుడు సమీక్ష చేసుకోవాలి. ఎయిర్ క్వాలిటీలో మనం ఏ స్థానంలో ఉన్నామో చెక్ చేసుకోవాలి. తర్వాత టార్గెట్ ప్రకారం సమిష్టిగా కృషి చేయాలి. ఇందుకోసం మున్సిపల్ మంత్రి నారాయణ బాధ్యత తీసుకోవాలి. ఎయిర్ క్వాలిటీలో దేశంలోనే బెస్ట్ సిటీలు ఏపీలోనే ఉండేలా కృషి జరగాలి." అని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

అధికారులకు సీఎం చురకలు...

- నన్ను మెప్పించడం కాదు. పని చేయండి. ఉపన్యాసాలు వద్దు.
- ఫైళ్ల క్లియరెన్స్‌లో జాప్యానికి గల కారణాలు క్లుప్తంగా, సూటిగా చెప్పండి. చెప్పింది కార్యాచరణలో చూపండి.
- సాధారణ పరిపాలనా శాఖ, ఆర్థిక శాఖ, జలవనరుల శాఖ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల్లోని ఫైళ్ల క్లియర్ కావడం లేదని అధికంగా ఫిర్యాదులు వచ్చాయి.
- సీఎంవోలో ఫైళ్ల క్లియరెన్సుకు సగటున 30 రోజుల ఏడున్నర గంటల సమయం పడుతోంది. అయినప్పటికీ మూడు ఫిర్యాదులే వచ్చాయి. చీఫ్ సెక్రటరీ కార్యాలయంలో ఫైళ్ల క్లియరెన్సుకు సగటున 2 రోజుల 13 గంటల సమయం పడుతోంది. ఈ కార్యాలయంపై కూడా ఫైళ్ల క్లియరెన్సు కోసం 3 ఫిర్యాదులే వచ్చాయి.
- అత్యధికంగా ఆర్థిక శాఖ జనవరి ఒకటో తేదీ నాటికి 26,613 ఫైళ్లను క్లియర్ చేసింది. ఈ శాఖపై 129 ఫిర్యాదులు వచ్చాయి. 7013 ఫైళ్లు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి.
- సాధారణ పరిపాలన శాఖ 17,780 ఫైళ్లను క్లియర్ చేసింది. 195 ఫిర్యాదులొచ్చాయి. 11,958 ఫైళ్లు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి.
- జలవనరుల శాఖ 18,430 ఫైళ్లను క్లియర్ చేసింది. 91 ఫిర్యాదులు వచ్చాయి. ఇంకా 9,491 ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నాయి.
- హోం శాఖలో 12,200 ఫైళ్లు క్లియర్ అయ్యాయి. 65 ఫిర్యాదులు వచ్చాయి. ఇంకా 7,433 ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నాయి.
- పురపాలక, పట్టణాభివృద్ధి శాఖలో 17,259 ఫైళ్లు క్లియర్ చేశారు. 72 ఫిర్యాదులు వచ్చాయి. 3,296 ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నాయి.
- పంచాయతీరాజ్ శాఖలో క్లియర్ చేసిన ఫైళ్ల కంటే పెండింగ్‌లో ఉన్న ఫైళ్లే అధికం. జనవరి ఒకటో తేదీ నాటికి 9,011 ఫైళ్లు క్లియర్ కాగా, ఇంకా 14,140 ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ శాఖపై 101 ఫిర్యాదులు వచ్చాయి.
- రెవెన్యూశాఖలో 16,313 ఫైళ్లు క్లియర్ చేయగా, 11,286 పెండింగ్‌లో ఉన్నాయి. 112 ఫిర్యాదులు వచ్చాయి.
- ఫైళ్లు తక్కువ సమయంలో క్లియర్ చేస్తున్న శాఖల్లో రెవెన్యూ, న్యాయశాఖ, పశుసంవర్ధక శాఖ, ఉన్నతవిద్యాశాఖ, ఆర్థిక శాఖ, అటవీ శాఖ, సీఎస్ కార్యాలయాలు ఉన్నాయి.

4 నెలల్లో పోలవరం-బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టు

వెంటనే కేంద్రం ఆమోదం తీసుకోవాలి: సీఎం

అమరావతి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): పోలవరం నుంచి బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టును నాలుగు నెలల్లో ప్రారంభించాలని, దీనికి వెంటనే కేంద్ర ప్రభుత్వం ఆమోదం తీసుకోవాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. వెలగపూడి సచివాలయంలో మంత్రులు, కార్యదర్శులతో ఒకరోజు వర్క్‌షాప్ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ఈ పథకానికి సంబంధించిన ప్రణాళికలను ఇప్పటినుంచే రూపొందించాలని, పంపులు, ఎత్తిపోతలపై కార్యాచరణను సిద్ధం చేయాలని నిర్దేశించారు. పోలవరం నుంచి బనకచర్లకు గోదావరి జలాల తరలింపు పథకాన్ని పూర్తి చేసేందుకు అత్యంత ప్రాధాన్యం ఇస్తామని సీఎం ప్రకటించారు. వచ్చే ఏడాది నాటికి మొత్తం రిజర్వాయర్లను పూర్తిగా వంద శాతం నింపాలని సీఎం స్పష్టం చేశారు. కాగా, ప్రభుత్వ శాఖలన్నింటికీ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐవోటీ) అనుసంధానం చేయాలని జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ సూచించారు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌పై ఐఐటీ చెన్నైతో అవగాహన కుదుర్చుకున్నామని రెవెన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా తెలిపారు.

సీఎం చెప్పినా పట్టాలెక్కలేదు

- నైపుణ్యాభివృద్ధిశాఖ తీరు మారలేదు

అమరావతి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): నైపుణ్య గణనలో నైపుణ్యాభివృద్ధి శాఖ తీరు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్లు ఉంది. డిసెంబరు రెండో వారంలో జరిగిన కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు దీనిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేయగా... రెండు నెలల తర్వాత మంగళవారం జరిగిన కార్యదర్శుల సదస్సు నాటికి కూడా ఆ శాఖ పనితీరు మారలేదు. కలెక్టర్ల సదస్సులో ఆ శాఖ అధికారులు ఏం చెప్పారో ఇప్పుడు కూడా అదే సమాధానం చెప్పడం గమనార్హం. అధికారంలోకి వచ్చిన వెంటనే నైపుణ్య గణనపై దృష్టి పెట్టి.. వీలైనంత వేగంగా పూర్తి చేయాలని భావించారు. లక్ష్యాన్ని నిర్దేశించి నైపుణ్యాభివృద్ధి శాఖకు గణనను అప్పగించారు. దీనిపై మొదట్లో హడావుడి చేసిన ఆ శాఖ అధికారులు ఆ తర్వాత చేతులెత్తేశారు. ఆరు నెలలకు జరిగిన కలెక్టర్ల సదస్సు నాటికి మంగళగిరి నియోజకవర్గంలో పైలెట్ ప్రాజెక్టు కూడా పూర్తిచేయలేకపోయారు. పైగా అప్పట్లో నైపుణ్యాభివృద్ధి శాఖ కార్యదర్శి ఆ శాఖ ఎండీ మధ్య సమన్వయలోపంతో ప్రభుత్వానికి వేర్వేరు గణాంకాలు సమర్పించారు. కలెక్టర్ల సదస్సులో దీనిపై ప్రజెంటేషన్ ఇచ్చిన సమయంలో సీఎం తీవ్రంగా స్పందించారు. 'నైపుణ్య గణన రాష్ట్రం మొత్తం ఆరు నెలల్లో పూర్తికావాలి. ఇప్పటికే ఆరు నెలలు గడిచినా ఇంకా ఒక్క నియోజకవర్గంలోనే ఉన్నారు. రాష్ట్రం మొత్తం నైపుణ్య గణన ఎప్పుడు పూర్తిచేస్తారు?.' అని ఆగ్రహం వ్యక్తంచేశారు. దీంతో ప్రజెంటేషన్‌ను కూడా అక్కడే ఆపేశారు. అయితే ఇది జరిగి రెండు నెలలైనా ఇప్పటికీ నైపుణ్య గణన ప్రారంభం కాలేదు. మంగళవారం నాటి కార్యదర్శుల సదస్సులోనూ అధికారులు గతంలో చెప్పిందే మళ్లీ చెప్పారు.

వసతి గృహాల్లో భద్రతా ప్రమాణాలు పెరగాలి

వన్ మ్యాన్ కమిషన్‌కు సహకరించండి: సీఎం

అమరావతి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): సంక్షేమ వసతి గృహాల్లో భద్రతా ప్రమాణాలను పెంచేందుకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి ఆర్‌టీజీఎస్ ద్వారా పర్యవేక్షించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో జరిగిన కార్యదర్శుల సమీక్షలో సంక్షేమ శాఖపై ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం నియమించిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా ఏకసభ్య కమిషన్‌కు అత్యంత ప్రాధాన్యమిస్తూ అవసరమైన సమాచారాన్ని వెంటనే అందజేయాలని సూచించారు. విద్యార్థులకు అవసరమైన ఆదాయ, కుల తదితర ధ్రువపత్రాలను ఆన్‌లైన్ ద్వారా తక్షణమే అందజేయాలని ఆదేశించారు. ఉద్యోగాల్లో గిరిజనులకు రిజర్వేషన్ కల్పించే జీవో 3 రద్దుకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో కౌంటర్ దాఖలు చేసే ప్రక్రియకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని, గిరిజన హక్కులకు ఎలాంటి విఘాతం కలగకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మైనారిటీలకు రంజాన్ తోఫా అందజేయడానికి ఏర్పాట్లు చేయాలని, విజయవాడలో హజ్‌హౌస్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. సాంఘిక సంక్షేమశాఖ డైరెక్టర్ లావణ్యవేణి, గిరిజన సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి ఎంఎం నాయక్, బీసీ సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి సత్యనారాయణ ప్రజంటేషన్‌లు ఇచ్చారు.

నకిలీ విత్తనాలపై కఠినంగా ఉండండి

- మత్స్యకారులకు ఆర్థిక సాయం
- అన్నదాత సుఖీభవ అమలుకు చర్యలు

కోళ్ల రైతులు నష్టపోకుండా చూడండి: సీఎం

అమరావతి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): రైతులకు తీవ్ర నష్టం చేస్తున్న నకిలీ విత్తనాల విషయంలో కఠినంగా వ్యవహరించాలని సీఎం చంద్రబాబు వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం అమరావతి సచివాలయంలో జరిగిన మంత్రులు, కార్యదర్శుల సదస్సులో వ్యవసాయ శాఖ ఎక్స్‌అఫీషియో స్పెషల్ సీఎస్ బుడితి రాజశేఖర్ తన శాఖలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రులు కేశవ్, మనోహర్ మాట్లాడుతూ రాష్ట్రంలో నకిలీ విత్తనాల సమస్య జటిలంగా మారిందని, గత ప్రభుత్వంలో రైతులు తీవ్రంగా నష్టపోయారని, నకిలీల నియంత్రణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని కోరారు. దీనిపై సీఎం స్పందిస్తూ, షాపుల్లో విత్తనాలను విక్రయించేటప్పుడే నకిలీలను గుర్తించి, వారి లైసెన్సు రద్దు చేసి జరిమానా విధించాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న మైక్రో ఇరిగేషన్ బిల్లులు రూ.52కోట్లు విడుదల చేయాలని మంత్రి అచ్చెన్నాయుడు కోరగా, కేంద్రం మ్యాచింగ్ గ్రాంటు ఉన్న నిధుల్ని వెంటనే విడుదల చేయాలని సీఎం ఆదేశించారు. ఏప్రిల్‌లో మత్స్యకారులకు ఆర్థిక సహాయాన్ని అందించేందుకు, రైతులకు అన్నదాత సుఖీభవ అమలుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కోళ్ల మృతిపై సీఎం ఆరా తీశారు. కోళ్ల రైతులకు నష్టంలేకుండా చూడాలని ఆదేశించారు.

అన్న క్యాంటీన్లకు సలహా కమిటీలు

2028 నాటికి ప్రతి ఇంటికీ కొళాయిలు: సీఎం

అమరావతి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): అన్న క్యాంటీన్లకు సమాజంలో సలహా కమిటీలను ఏర్పాటు చేయడంతో పాటు వాటి నిర్వహణలో దాతలను ప్రోత్సహించాలని సీఎం చంద్రబాబు సూచించారు. మంగళవారం జరిగిన మంత్రులు, కార్యదర్శుల సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ దాతలు నేరుగా వచ్చి అన్న క్యాంటీన్‌లో వడ్డించడం లేదా వాళ్ల పేరుపై ప్రభుత్వ కార్యక్రమం చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. నగరాలు, పట్టణాల్లో పబ్లిక్ టాయిలెట్లను సక్రమంగా నిర్వహించాలని మున్సిపల్ శాఖకు స్పష్టం చేశారు. విజయవాడలోని పబ్లిక్ టాయ్‌లెట్లు పాడయ్యాయని, నిర్వహణను కొత్త ఏజెన్సీలకు ఇవ్వాలన్నారు. గాలి కాలుష్యంలో విజయవాడ 6వ, విశాఖపట్నం 28వ స్థానంలో ఉందని మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ ఈ సందర్భంగా ప్రజంటేషన్ ద్వారా వివరించారు. రాష్ట్రంలో గాలి, ధ్వని కాలుష్యంపై సర్వే చేయాలని సీఎం ఆదేశించారు. జల్‌జీవన్ మిషన్ కింద 2028 నాటికి ప్రతి ఇంటికీ కొళాయి కనెక్షన్ ఇవ్వాలని స్పష్టం చేశారు.



వైసీపీ పాలనలో పరిశ్రమలు మూతపడ్డాయి

- కూటమి ప్రభుత్వం వచ్చాక పరిశ్రమలు వస్తున్నాయి
- కుటుంబానికి ఓ పారిశ్రామిక వేత్త లక్ష్యాన్ని సాధించాలి
- మంత్రులు, కార్యదర్శుల సదస్సులో సీఎం చంద్రబాబు

అమరావతి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి పూర్తిగా పడిపోయిందని, దాంతో రాష్ట్రానికి తీరని నష్టం జరిగిందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ద్వారా పారిశ్రామికాభివృద్ధిలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు పరిశ్రమలకు అధిక ప్రోత్సాహకాలు అందిస్తున్నామని చెప్పారు. మంత్రులు, కార్యదర్శుల సదస్సులో ఆయన మాట్లాడారు. "2022-23లో దేశంలోని అన్ని రాష్ట్రాల్లో కొత్త పరిశ్రమలు ఏర్పాటు కాగా.. ఏపీలో మాత్రం ఉన్న పరిశ్రమలు మూతపడ్డాయి. కనీసం ఎంఎస్ఎంఈలను కూడా ఏర్పాటు చేయలేకపోయారు. పరిశ్రమలు వస్తేనే ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలతో పాటు ఆర్థికంగానూ రాష్ట్రం బలపడుతుంది. పెట్టుబడులను ఆకర్షించేందుకు తీసుకువచ్చిన నూతన పారిశ్రామిక విధానాలతో అన్ని రంగాలు ప్రగతి పథంలో అడుగులు వేస్తున్నాయి. పారిశ్రామికవేత్తలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా విశాఖపట్నం, రాజమండ్రి, అనంతపురం, తిరుపతి నగరాలను తీర్చిదిద్దుతున్నాం. లాజిస్టిక్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి రాష్ట్రంలో సీ పోర్టులు, ఎయిర్‌పోర్టులను అభివృద్ధి చేస్తాం. దేశంలోనే బెస్ట్ లాజిస్టిక్ హబ్‌గా ఏపీ అభివృద్ధి చెందబోతోంది. రాష్ట్రంలో పారిశ్రామిక పార్కులు మరిన్ని ఏర్పాటు చేయాలి. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్‌తో పాటు ఎస్క్రో ఖాతాను వెంటనే పెట్టుకోవాలి. 'ఒక కుటుంబం - ఒక పారిశ్రామిక వేత్త' లక్ష్యాన్ని కచ్చితంగా సాధించి తీరాలి. లక్ష్యాలను సాధించడంలో అలక్ష్యం వద్దు. అధికారుల్లో ఇన్నోవేషన్ కల్చర్ పెరగాలి. సిలికాన్ వ్యాలీలా ఆంధ్రా వ్యాలీ తయారు కావాలి" అని చంద్రబాబు అన్నారు.

175 పారిశ్రామిక పార్కులు

రాష్ట్రంలోని 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 175 పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల కార్యదర్శి ఎన్.యువరాజ్ తెలిపారు. ఏపీఐఐసీ ద్వారా రూ. 2,500 కోట్లతో ప్లగ్ అండ్ ప్లే పారిశ్రామిక పార్కులను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. పీఎం కిసాన్ యోజన ద్వారా కేంద్రం నుంచి రూ. 2 వేల కోట్ల నిధులు తీసుకువస్తామన్నారు. రూ. 3 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించాలనేది లక్ష్యమని చెప్పారు. రామాయపట్నం పోర్టులో 52.91 శాతం, మచిలీపట్నం పోర్టులో 31 శాతం, మూలపేట పోర్టులో 32 శాతం, కాకినాడ గేట్ వే పోర్టులో 24 శాతం పనులు పూర్తయినట్లు యువరాజ్ వివరించారు. ఫిషింగ్ హార్బర్‌లను కూడా త్వరితగతిన పూర్తి చేస్తున్నామన్నారు. 2026 నాటికి భోగాపురం ఎయిర్‌పోర్టు పూర్తి చేస్తామని, 300 ఎకరాల్లో డ్రోన్ సిటీ ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. సాగర మాల కార్యక్రమంలో భాగంగా నదుల అనుసంధానికి రూ. 866 కోట్లను కేంద్ర బడ్జెట్‌లో కేటాయించినట్లు చెప్పారు.

14వేల కి.మీ. పరిధిలో గోతులు పూడ్చాం

నెలాఖరు నాటికి గుంతలు లేని రోడ్లు: ఆర్అండ్‌బీ

అమరావతి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జనవరి నాటికి 14వేల కి.మీ. పరిధిలో గుంతలను పూడ్చామని రోడ్లు, భవనాల శాఖ కార్యదర్శి కాంతిలాల్ దండే తెలిపారు. ఈ నెలాఖరు నాటికి గ్రామీణ, పట్టణ రహదారులపై గుంతలు పూడ్చివేసే కార్యక్రమం పూర్తిచేస్తామని పేర్కొన్నారు. గుంతలు లేని రహదారుల నిర్మాణం, నిర్వహణ కొనసాగుతుందని స్పష్టం చేశారు. మంగళవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన కార్యదర్శుల సమావేశంలో ఆర్అండ్‌బీ రోడ్లపై ఆయన ప్రజెంటేషన్ ఇచ్చారు. ఎన్‌డీబీ నిధులతో ఇప్పటి వరకు 250 కి.మీ. రహదారుల నిర్మాణం జరిగిందని, వచ్చే ఏడాది మార్చి నాటికి మొత్తం ప్రాజెక్టు పూర్తవుతుందని కార్యదర్శి నివేదించారు. సీఎం చంద్రబాబు మాట్లాడుతూ రోడ్లపై గుంతలన్నవే కనిపించడానికి వీల్లేదని, జాతీయ రహదారుల నిర్మాణ ప్రాజెక్టులు వచ్చే నాలుగేళ్లలో పూర్తిచేయాలని ఆదేశించారు. గతంలో రోడ్లపై ప్రయాణం నరకప్రాయంగా ఉండేదని, కూటమి ప్రభుత్వం చేపడుతోన్న చర్యలతో ప్రజలు ఇప్పుడు ప్రశాంతంగా ప్రయాణం చేస్తున్నారని పేర్కొన్నారు. రహదారుల నిర్వహణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం స్పష్టం చేశారు.

ఇక ప్రభుత్వ సేవలన్నీ వాట్సా్‌ప్‌లోనే

ప్రభుత్వ యంత్రాంగం సిద్ధం కావాలి

- ప్రజలు ఆఫీసులకు రావాల్సిన అవసరం ఉండొద్దు
- యూజర్ ఫ్రెండ్లీగా సేవలు అందించాలి
- వాట్సాప్ గవర్నెన్స్‌పై మంత్రులు దృష్టి పెట్టాలి
- తొలి వారంలోనే 2.64 లక్షల లావాదేవీలు
- వాట్సాప్ గవర్నెన్స్ - మన మిత్రపై సీఎం సమీక్ష

అమరావతి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఇకపై ప్రభుత్వ సేవలన్నీ ప్రజలకు వాట్సా్‌ప్‌లోనే అందించాలని ఉన్నతాధికారులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. వెలగపూడి సచివాలయంలో మంత్రులు, ప్రభుత్వ శాఖల ముఖ్యకార్యదర్శులు, కార్యదర్శుల సదస్సులో 'వాట్సాప్ గవర్నెన్స్ - మన మిత్ర'పై మంగళవారం సమీక్ష నిర్వహించారు. రాబోయే రోజుల్లో పనుల కోసం ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలకు రావాల్సిన అవసరం ఉండకూడదని, ఆ పనులన్నీ వాట్సా్‌ప్‌లోనే జరిగిపోవాలని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఇందుకు అనుగుణంగా ప్రభుత్వ యంత్రాంగం సన్నద్ధమవ్వాలని చెప్పారు. ప్రభుత్వ శాఖలన్నీ ప్రజలకు యూజర్ ఫ్రెండ్లీగా ఉండాలని, తమ శాఖల్లో సర్వర్‌ల కెపాసిటీని పెంచుకుని వేగవంతమైన పాలన అందించాలని ఆదేశించారు. మంత్రులు కూడా తమ తమ శాఖల్లో వాట్సాప్ గవర్నెన్స్ అమలు చేయడంపై దృష్టి సారించాలని, వస్తున్న ఫలితాలపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ఉండాలని చెప్పారు. గత నెల 30న ప్రారంభించిన వాట్సాప్ సేవల ద్వారా వారం రోజుల్లోనే 2.64 లక్షల లావాదేవీలు జరగడంపై సీఎం చంద్రబాబు సంతోషం వ్యక్తం చేశారు. ప్రజలలో వాట్సాప్ గవర్నెన్స్‌పై సంతృప్తి ఎలా పెరుగుతుందో కూడా అధ్యయనం చేయాలని అన్నారు.

మరిన్ని సేవలు అందుబాటులోకి తేవాలి

వాట్సాప్ గవర్నెన్స్ సత్ఫలితాలు ఇస్తున్నందున.. ప్రస్తుతమున్న 161 సేవలతో పాటు రాబోయే 45 రోజుల్లో 500 సేవలు అందుబాటులోకి తేవాలని కార్యదర్శులకు సీఎం ఆదేశించారు. వచ్చే ఆర్నెల్లలో ప్రభుత్వ సేవలన్నీ వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా సంపూర్ణంగా అందించేందుకు కృషి చేయాలన్నారు. ప్రజలకు వాట్సాప్ గవర్నెన్స్‌కు ఎంతగా అందాలంటే.. ఏదైనా బిల్లు చెల్లింపు జరగలేదంటే, ఆ బిల్లును ఆ వ్యక్తి స్కాన్ చేసి వాట్సాప్ గవర్నెన్స్‌లో పెడితే పరిష్కారమయ్యే స్థాయికి తీసుకువెళ్లాలని సీఎం చంద్రబాబు అన్నారు. ప్రభుత్వ శాఖలు చెల్లించాల్సిన బిల్లులు కూడా స్కాన్ చేస్తే చెల్లింపులు జరిగేలా చేయాలన్నారు. ప్రభుత్వం నుంచి ఏ పని కావాలన్నా ప్రజలు వాట్సాప్ గవర్నెన్స్‌లోకి వెళ్లేంతగా అలవాటు చేయాలని సీఎం చెప్పారు. రాబోయే రోజుల్లో ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో జీపీఎస్ ట్రాకింగ్ కూడా చూసుకునే సేవలు దీని ద్వారా అందుబాటులోకి తెస్తామన్నారు.

వాట్సాప్ గవర్నెన్స్‌లోకి టీటీడీ

వాట్సాప్ గవర్నెన్స్‌లోకి టీటీడీ సేవలను తీసుకువస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. అవసరమైతే కేంద్రంతో సంప్రదించి రైల్వే టికెట్లు కూడా వాట్సాప్ గవర్నెన్స్‌లోకి తీసుకువస్తామన్నారు. సినిమా టికెట్లు అందించే సదుపాయాన్ని కూడా పరిశీలించాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఇవే కాకుండా ప్రభుత్వ పనితీరుపై ప్రజాభిప్రాయాన్ని కూడా వాట్సాప్ గవర్నెన్స్ ద్వారానే సేకరించాలని సీఎం స్పష్టం చేశారు.

ధ్రువపత్రాలన్నీ వాట్సాప్‌లోనే: మంత్రి లోకేశ్

ప్రభుత్వ శాఖల ధ్రువపత్రాలన్నీ వాట్సా్‌ప్‌లోనే జారీ చేస్తామని ఐటీ, మానవ వనరులు, ఆర్టీజీఎస్ శాఖల మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు. త్వరలోనే క్యూఆర్ కోడ్‌తో కూడిన డిజిటల్ రేషన్ కార్డులను రాష్ట్రంలో జారీ చేస్తామన్నారు. ప్రజలకు సీమ్‌లెస్ సర్వీసులు అందజేయాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని, వాట్సాప్ గవర్నెన్స్ ప్రజలకు ప్రభుత్వం కల్పిస్తున్న అత్యున్నత వేదికని చెప్పారు. వాట్సాప్ గవర్నెన్స్‌కు సంబంధించి శాఖలన్నీ తమ డేటాను ఆర్టీజీఎస్ డేటాలేక్‌కు అనుసంధానం చేయాలని, వాట్సాప్ ద్వారా సర్టిఫికెట్లు ఇవ్వాలంటే ఇది తప్పనిసరి అని లోకేశ్ స్పష్టం చేశారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చాలా కీలక ప్రక్రియ అన్నారు. అధికారులు తమ శాఖల్లో ఈ దిశగా సాంకేతికపరమైన చర్యలు తీసుకోవాలని చెప్పారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వంలో అన్ని సేవలూ ఆన్‌లైన్ చేయాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయమన్నారు.

ఎస్‌హెచ్‌వోపై ఎస్పీ తీసుకున్న చర్యలపై సంతృప్తిగా లేం!

- సౌత్రికా టెక్నాలజీస్ నివేదిక వాస్తవికతపై అనుమానం కలుగుతోంది: హైకోర్టు

అమరావతి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): పోలీసుస్టేషన్‌లో సీసీటీవీల నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించిన మాచవరం రాణా ఎస్‌హెచ్‌వోకు ఏడాదిపాటు ఇంక్రిమెంట్‌ను నిలిపివేస్తూ పల్నాడు జిల్లా ఎస్పీ తీసుకున్న చర్యలపై తాము సంతృప్తిగా లేమని హైకోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించింది. పౌరుల అక్రమ నిర్బంధం విషయంలో వాస్తవాలను నిర్ధారించేందుకు సీసీటీవీ ఫుటేజ్ సమర్పించాలని తాము ఆదేశించిన ప్రతిసారీ ఫుటేజ్ మాయమవుతోందని పేర్కొంది. ఎస్ఎంపీఎస్ కాలిపోయిన కారణంగా సీసీటీవీ ఫుటేజ్ రిట్రీవ్ చేయలేకున్నామని సౌత్రికా టెక్నాలజీస్ ఇచ్చిన రిపోర్టును జత చేస్తూ మాచవరం రాణా ఎస్‌హెచ్‌వో, జిల్లా ఎస్పీ అఫిడవిట్లు వేశారని, సంబంధిత రిపోర్టులో ముద్రించిన కంపెనీ సీలు, సంతకంలో వ్యత్యాసం ఉందని గుర్తు చేసింది. సౌత్రికా టెక్నాలజీస్ నివేదిక వాస్తవికతపై అనుమానం కలుగుతోందంది. పూర్తి వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని పిటిషనర్‌ను ఆదేశించింది. విచారణను ఈ నెల 18కి వాయిదా వేసింది. ఈ మేరకు జస్టిస్ ఆర్.రఘునందనరావు, జస్టిస్ ఎన్.హరినాథ్‌తో కూడిన ధర్మాసనం మంగళవారం ఆదేశాలిచ్చింది.

వైద్యుడవ్వాలనే కల కరిగిపోయింది!

- కాకినాడ రంగరాయలో వైద్య విద్యార్థి బలవన్మరణం

కాకినాడ క్రైం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాలలో వైద్య విద్యార్థి ఉరి వేసుకుని తనువు చాలించాడు. పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలం బాడవ గ్రామానికి చెందిన రావూరి సుబ్రహ్మణ్యం, మహాలక్ష్మి దంపతుల కుమారుడు రావూరి సాయిరామ్(22) ఆర్ఎంసీలో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. చిన్నప్పటినుంచీ మెరిట్ స్టూడెంట్‌గా రాణిస్తూ ఎంబీబీఎస్‌లో ఫ్రీ సీట్ సాధించాడు. సోమవారం అర్ధరాత్రి 1.30 గంట సమయంలో ఆర్ఎంసీ మెన్స్ హాస్టల్లో తన గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకుని సాయిరామ్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సహచర విద్యార్థులు సీపీఆర్ చేసినా చలనం లేకపోవడంతో స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదని పోలీసులు తెలిపారు. చదువు ఒత్తిడి తాళలేక ఆత్మహత్య చేసుకున్నాడా లేక ప్రేమ వ్యవహారమా అనే కోణాల్లో పోలీసులు ఆరా తీస్తున్నారు.

సునీల్‌కుమార్ వేధింపులపై
సీఐడీ విచారణ ప్రారంభం

- న్యాయవాది లక్ష్మీనారాయణ వాంగ్మూలం నమోదు
- వైసీపీ హయాంలో అర్ధరాత్రి అరెస్టులు, థర్డ్ డిగ్రీలు
- అప్పట్లోనే కేంద్రానికి లక్ష్మీనారాయణ ఫిర్యాదు
- నివేదిక ఇవ్వాలని సీఎస్‌కు హోం శాఖ ఆదేశం
- జగన్ జమానాలో పట్టించుకోని ఉన్నతాధికారులు
- కూటమి ప్రభుత్వం రాకతో మళ్లీ న్యాయవాది లేఖ
- దీంతో సీఐడీ రంగప్రవేశం

విజయవాడ, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): సీఐడీ మాజీ చీఫ్, సీనియర్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్‌కుమార్‌పై సీఐడీ విచారణ మొదలైంది. ఆయన సీఐడీ అధిపతిగా ఉన్న సమయంలో పలువురిని అర్ధరాత్రి అరెస్టు చేయడమే కాకుండా థర్డ్‌డిగ్రీ ప్రయోగించారంటూ న్యాయవాది గూడపాటి లక్ష్మీనారాయణ చేసిన ఫిర్యాదుపై విచారణ ముందుకు కదిలింది. మంగళవారమిక్కడ న్యాయస్థానాల ప్రాంగణంలో లక్ష్మీనారాయణ వాంగ్మూలాన్ని సీఐడీ అధికారులు నమోదు చేశారు. అనంతరం టీడీపీ మీడియా సెల్ ఇన్‌చార్జి దారపనేని నరేంద్ర, టీడీపీ సోషల్ మీడియా నేత గార్లపాటి వెంకటేశ్వరరావు అలియాస్ వెంకటేశ్, సీనియర్ జర్నలిస్టు కొల్లి అంకబాబు నుంచీ వాంగ్మూలం తీసుకున్నారు. సీఐడీ డీజీగా సునీల్‌కుమార్ ఉన్నకాలంలో పలువురు టీడీపీ కార్యకర్తలను అర్ధరాత్రి అరెస్టు చేయడమే కాకుండా నిబంధనలను అతిక్రమించి కస్టడీలో వారిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారని లక్ష్మీనారాయణ అప్పట్లో కేంద్ర హోం శాఖకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని కేంద్ర హోం కార్యదర్శి.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు. దీనిపై విచారణ జరపాలని సీఎస్ డీజీపీని కోరినా.. జగన్ హయాంలో పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ వ్యవహారంలో విచారణ చేపట్టాలని లక్ష్మీనారాయణ మళ్లీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి, డీజీపీకి లేఖ రాశారు. దీంతో ప్రభుత్వం సునీల్‌కుమార్‌పై విచారణకు ఆదేశించింది. సీఐడీ అధికారులు మంగళవారం మధ్యాహ్నం లక్ష్మీనారాయణ వద్దకు వెళ్లారు. తాను ఈ ఫిర్యాదు ఎందుకు చేయాల్సి వచ్చిందో ఆయన వివరించారు. విజయవాడలో సీనియర్ జర్నలిస్ట్ కొల్లు అంకబాబును అర్ధరాత్రి అరెస్టు చేయడమే కాకుండా.. కనీసం ఆయన వయసుకు గౌరవం కూడా ఇవ్వలేదని తెలిపారు. టీడీపీ మీడియా సెల్ ఇన్‌చార్జి దారపనేని నరేంద్రను రాత్రిపూట అరెస్టుచేసి, సీఐడీ కార్యాలయంలో ఉంచి బెదిరించడమే కాకుండా తీవ్రంగా హింసించారని వివరించారు. ధరణికోట వెంకటేశ్‌ను అర్ధరాత్రి ఇంటి గోడలు దూకి అరెస్టు చేసి తీసుకురావడమే కాకుండా హింసించారని వివరించారు. ఈ కారణంగానే తాను ఫిర్యాదు చేయాల్సి వచ్చిందని లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఐపీసీ సెక్షన్లతో పాటు రాజ్యాంగ నిబంధనలను ఉల్లఘించి వ్యక్తిగత స్వేచ్ఛను హరించారని వివరించారు. తాను ఇచ్చిన వాంగ్మూలాన్ని అధికారులు నమోదు చేసుకున్నారని లక్ష్మీనారాయణ మీడియాకు తెలిపారు. ఆ తర్వాత నరేంద్ర, వెంకటేశ్‌ను పిలిపించి వారిని అరెస్టు చేసిన తీరును సీఐడీ అధికారులు అడిగి తెలుసుకున్నారు. ఆ రోజున అధికారులు ఏ విధంగా వ్యవహరించారనే అంశాన్ని అడిగారు. వారి వాంగ్మూలం తీసుకుని.. నాడు అరెస్టు చేసేందుకు వచ్చిన వారిని, శారీరకంగా హింసించిన వారిని గుర్తుపడతారా అని ప్రశ్నించినట్లు తెలిసింది. నరేంద్ర, వెంకటేశ్వరరావు, అంకబాబు వాంగ్మూలాలు ఇవీ..



దుస్తులు విప్పించి చిత్రహింసలు పెట్టారు: దారపునేని నరేంద్ర

వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు గన్నవరం విమానాశ్రయంలో జరిగిన బంగారం స్మగ్లింగ్‌లో అప్పటి సీఎంవోలోని ఓ కీలక అధికారికి సంబంధం ఉన్నట్లు వాట్సాప్ గ్రూపుల్లో పోస్టింగ్‌లు ఫార్వర్డ్ చేశానని నాపై తప్పుడు కేసు నమోదు చేశారు. నేను గుంటూరులో ఇంట్లో ఉండగా సీఐడీ పోలీసులు అరెస్టు చేసి తీసుకెళ్లారు. అక్కడున్న అధికారి విజయ్‌పాల్‌తో పాటు మరో నలుగురు నన్ను దుస్తులు విప్పించి గోడ కుర్చీ వేయించారు. సీఐడీ కార్యాలయంలో నన్ను చిత్రహింసలు పెట్టారు. దానిపై న్యాయాధికారి ముందు వాంగ్మూలం కూడా ఇచ్చాను. కోర్టు నాకు వ్యక్తిగత పూచీకత్తుపై బెయిల్ మంజూరు చేసింది. ఇదంతా అప్పటి సీఐడీ చీఫ్ సునీల్‌కుమార్ ప్రోద్బలంతో చేశారని తర్వాత తెలిసింది.

దారుణంగా కొట్టారు: వెంకటేశ్

వైసీపీ గౌరవాధ్యక్షురాలు విజయలక్ష్మి రాజీనామా చేసినట్లుగా అప్పట్లో తప్పుడు పోస్టులు పెట్టానంటూ నాపై గుంటూరు సీఐడీ పోలీసులు కేసు నమోదు చేశారు. డీఎస్పీ చెంచు రామారావు, ఇన్‌స్పెక్టర్ జగదీశ్, హెచ్‌సీలు బాషా, వంశీ.. మా ఇంటి తలుపులు విరగ్గొట్టి లోపలకు ప్రవేశించారు. నన్ను అర్ధరాత్రి తీసుకెళ్లి దారుణంగా కొట్టారు. నాకు కోర్టు వ్యక్తిగత పూచీకత్తుపై బెయిల్ మంజూరు చేసింది. వేధించిన అధికారులపై గుంటూరు నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ప్రైవేట్ పిటిషన్ వేశాను. నాకు చిత్రహింసల వెనుక సునీల్‌కుమార్ ఉన్నారు.

హైకోర్టు క్వాష్ చేసింది: అంకబాబు

గన్నవరం విమానాశ్రయంలో బంగారం స్మగ్లింగ్‌కు అప్పటి సీఎంవోలోని ఓ కీలక అధికారికి సంబంధం ఉందంటూ పోస్టింగ్‌లు పెట్టానని నరేంద్రతో పాటు నాపైనా కేసుపెట్టారు. 2022 సెప్టెంబరు 22న రాత్రి ఇంట్లో ఉండగా ఏడుగురు సీఐడీ పోలీసులు అక్రమంగా ప్రవేశించి.. చొక్కా కూడా వేసుకోనివ్వకుండా దుర్భాషలాడుతూ సీఐడీ కార్యాలయానికి తీసుకెళ్లారు. 41ఏ నోటీసు ఇవ్వకుండా మర్నాడు నన్ను అరెస్టు చేస్తున్నట్లు చెప్పి కోర్టులో హాజరుపరిచారు. కోర్టు నాకు వ్యక్తిగత పూచీకత్తు కింద బెయిల్ ఇచ్చింది. తర్వాత హైకోర్టులో క్వాష్ పిటిషన్ వేశాను. నాపై కేసును హైకోర్టు కొట్టివేసింది. నా అరెస్టు వెనుక సునీల్‌కుమార్ ఉన్నట్లు తెలిసింది.

జేఈఈ మెయిన్ సెషన్-1లో 14 మందికి 100 పర్సంటైల్!

- ఏపీ నుంచి సాయి మనోజ్ఞ గుత్తికొండ, తెలంగాణ నుంచి బాని బ్రతా మాజీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11: జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష (జేఈఈ) మెయిన్ 2025 సెషన్-1 ఫలితాల్లో దేశవ్యాప్తంగా 14 మంది విద్యార్థులు '100 పర్సంటైల్' తో సత్తా చాటారు. వీరిలో ఇద్దరు తెలుగు విద్యార్థులు ఉన్నారు. తెలంగాణ నుంచి బాని బ్రతా మాజీ, ఏపీ నుంచి సాయిమనోజ్ఞ గుత్తికొండ 100 పర్సంటైల్ సాధించారు. జేఈఈ మెయిన్ సెషన్-1 తుది కీని సోమవారం వెల్లడించిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) మంగళవారం ఫలితాలను విడుదల చేసింది. ట్రిపుల్ ఐటీ, ఎన్ఐటీ, బీఈ/బీటెక్, కోర్సుల్లో ప్రవేశాల కోసం దేశవ్యాప్తంగా 22, 23, 24, 28, 29 తేదీల్లో మెయిన్ సెషన్-1 పరీక్షలు జరిగాయి. హండ్రెడ్ పర్సంటైల్ సాధించిన విద్యార్థుల్లో అత్యధికంగా రాజస్థాన్ నుంచి ఐదుగురు ఉండటం విశేషం. తర్వాత ఢిల్లీ, యూపీ నుంచి ఇద్దరు చొప్పున విద్యార్థులు సాధించారు. జేఈఈ మెయిన్ కోసం 13,11,544 మంది రిజిస్టర్ చేసుకోగా, 12,58,136 మంది హాజరయ్యారు. అభ్యర్థులు jeemain.nta.nic.in నుంచి స్కోరు కార్డును తమ దరఖాస్తు నంబరు, పాస్‌వర్డును ఎంటర్ చేసి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. జేఈఈ మెయిన్ సెషన్-2 పరీక్షలు ఏప్రిల్ 1 నుంచి 8 వరకు నిర్వహిస్తారు. ఈ రెండింటిలో అభ్యర్థుల అత్యుత్తమ స్కోరును జేఈఈ అడ్వాన్స్‌డ్ కోసం పరిగణనలోకి తీసుకుంటారు. మొత్తంగా 2.5 లక్షల మందిని అడ్వాన్స్‌డ్‌కు అర్హత కల్పిస్తారు. అయితే.. జేఈఈ మెయిన్‌లో హండ్రెడ్ పర్సంటైల్ తుది జాబితాను సెషన్-2 ఫలితాల తర్వాత విడుదల చేస్తారు.

సెషన్-1 టాపర్స్ (హండ్రెడ్ పర్సంటైల్)

1. ఆయూష్ సింఘాల్ (రాజస్థాన్), 2. కుశాగ్ర గుప్తా (కర్ణాటక), 3. దక్ష్, ఢిల్లీ (ఎన్సీటీ), 4. హర్ష్ఝా, ఢిల్లీ (ఎన్సీటీ), 5. రజిత్ గుప్తా, రాజస్థాన్, 6.శ్రేయాస్ లోహియా (యూపీ), 7.సక్షమ్ జిందాల్, (రాజస్థాన్), 8. సౌరవ్ (యూపీ), 9. విశాద్ జైన్ (మహారాష్ట్ర), 10. అర్ణవ్ సింగ్ (రాజస్థాన్), 11. శివేన్ వికాస్ తోష్నివాల్ (గుజరాత్), 12. సాయి మనోజ్ఞ గుత్తికొండ (ఏపీ), 13. ఓం ప్రకాశ్ బెహ్రా (రాజస్థాన్), 14. బనీ బ్రత మాజీ (తెలంగాణ).

తులసిబాబుకు 48 లక్షలు

- నాడు సీఐడీ లాయరుగా నియమించారు
- బార్‌లో ఎన్‌రోల్ అయిన మూడు నెలల్లో 12 కేసుల్లో సహకారం
- అందుకు 48 లక్షలు చెల్లించిన సీఐడీ
- మరోసారి కస్టడీకి తీసుకొని విచారించాలి
- ఆయన పాత్ర గురించి స్నేహితులే చెప్పారు
- బెయిల్‌పై హైకోర్టుకు నివేదించిన పోలీసులు
- ముగిసిన వాదనలు.. 14న నిర్ణయం

అమరావతి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ, శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజును సీఐడీ కస్టడీలో చిత్రహింసలకు గురిచేసిన వ్యవహారంలో నిందితుడు తులసిబాబు పాత్ర ఉందని అతని స్నేహితులే వాంగ్మూలం ఇచ్చారని పోలీసుల తరఫున సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ మంగళవారం హైకోర్టుకు నివేదించారు. తులసిబాబు బెయిల్ కేసు మంగళవారం విచారణకు వచ్చింది. పోలీసుల తరఫున న్యాయవాదులు వాదనలను వినిపిస్తూ... 'నలుగురు వ్యక్తులు ముఖానికి ముసుగులు ధరించి సీఐడీ కార్యాలయంలోకి వచ్చారని డ్యూటీలో ఉన్న కానిస్టేబుళ్లు వాంగ్మూలం ఇచ్చారు. నలుగురిలో ఒడ్డు, పొడుగు ఉన్న వ్యక్తి తన గుండెలపై కూర్చున్నారని ఫిర్యాదుదారుడు వాంగ్మూలం ఇచ్చారు. అప్పటి దర్యాప్తు అధికారి సీఐడీ అడిషనల్ ఎస్పీ విజయ్‌పాల్, తులసిబాబు... ఇద్దరినీ కలిపి పోలీసులు విచారించారు. చిత్రహింసలకు గురిచేసిన వారిలో తులసిబాబు లేరని విజయ్‌పాల్ చెప్పడం లేదు. నేర ఘటన నాలుగు గోడల మధ్య జరిగింది. ఈ నేపథ్యంలో నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాల్సిన బాధ్యత దర్యాప్తు అధికారిపై ఉంటుంది. విచారణ సందర్భంగా నోరు తెరవకుండా ఉంటామంటే కుదరదు. తులసిబాబు 2020 అక్టోబరు 6న సీఐడీ లీగల్ అసిస్టెంట్‌గా నియమితులయ్యారు. హైకోర్టులో సీఐడీ కేసులు ట్రయల్ కోసం తులసిబాబును నియమిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అప్పటికి తులసిబాబు న్యాయవాది కూడా కాదు. తులసిబాబు 2021, నవంబరు 16న ఏపీ బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా నమోదయ్యారు. న్యాయవాదిగా ఎన్‌రోల్ అయిన మూడు నెలల్లోనే 12 కేసుల్లో సహకారం అందించినందుకుగాను ఆయనకు సీఐడీ రూ.48 లక్షలు చెల్లించింది. రఘురామను చిత్రహింసలకు గురిచేసిన వ్యవహారంలో పిటిషనర్ పాత్రపై ప్రాథమిక ఆధారాలున్నాయి. రఘురామపై పిటిషనర్‌తో పాటు మరో ముగ్గురు దాడి చేశారు. వారిని గుర్తించాల్సి ఉంది. అప్పటి సీఐడీ అడిషనల్ ఎస్పీ విజయ్‌పాల్ కూడా దర్యాప్తునకు సహకరించడం లేదు. సీఆర్‌పీసీ సెక్షన్ 160 కింద విచారణకు హాజరుకావాలని నోటీసులు ఇస్తే పోలీసు అధికారులను తులసిబాబు బెదిరించారు. కుట్ర కోణం వెలికితీయాలన్నా, ఘటనలో ఇతరుల పాత్ర తేల్చాలన్నా పిటిషనర్‌ను మరోసారి కస్టడీకి తీసుకొని విచారించాలి. బెయిల్ పిటిషన్‌ను కొట్టివేయాలి' అని కోరారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది కేఎస్ మూర్తి రిప్లై వాదనలు వినిపిస్తూ.... 'కేసులో మొదటి, రెండో నిందితుడిగా ఉన్న పోలీస్ అధికారులకు ఇప్పటివరకు కనీసం నోటీసులు కూడా ఇవ్వలేదు. సాక్షులను ప్రభావితం చేసే సామర్థ్యం పిటిషనర్‌కు లేదు. పిటిషనర్‌కు బెయిల్ మంజూరు వల్ల దర్యాప్తునకు ఎలాంటి ఆటంకం కలగదు. బెయిల్ మంజూరుకు ఎలాంటి షరతులు విధించినా అభ్యంతరం లేదు' అని పేర్కొన్నారు. మంగళవారం జరిగిన విచారణలో బెయిల్ పిటిషన్‌పై ఇరువైపుల వాదనలు ముగియడంతో ఫిబ్రవరి 14న నిర్ణయం వెల్లడిస్తామని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కె కృపాసాగర్ ప్రకటించారు.



గుంటూరు మిర్చియార్డులో ఆందోళనకు దిగిన రాయలసీమ జిల్లాల రైతులు

మిర్చి ధర పతనంతో
రైతుల గగ్గోలు

గుంటూరు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మిర్చి ధర పతనం కావడంతో గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ(మిర్చియార్డు)లో రైతులు ఆందోళనకు దిగారు. మంగళవారం రాయలసీమ జిల్లాల నుంచి మిర్చిని తీసుకొచ్చిన రైతులకు వెరైటీని బట్టి క్వింటాల్‌కు రూ.11 వేల నుంచి రూ.12 వేల మధ్య మాత్రమే ధర లభించింది. ఈ ధర మీద అమ్మినందుకు తమకు కూలి ఖర్చులు కూడా రావని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలంటూ యార్డు ఆవరణలో కాసేపు బైఠాయించి నినాదాలు చేశారు.

'తిరుపతి' తొక్కిసలాట మృతుల కుటుంబీకులకు టీటీడీలో ఉద్యోగాలకు ప్రభుత్వ అనుమతి

తిరుమల, ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): తిరుపతి తొక్కిసలాటలో మృతుల కుటుంబీకులకు కాంట్రాక్టు ఉద్యోగం, పరిహారంపై టీటీడీ తీసుకున్న నిర్ణయాలకు ఆమోదం తెలుపుతూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల జారీ సందర్భంగా జనవరి 8వ తేదీన తిరుపతిలో తొక్కిసలాట జరిగి ఆరుగురు భక్తులు మృతి చెందడంతో పాటు పలువురు గాయపడిన విషయం తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు వీరిలో అర్హత కలిగిన ఒకరికి కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఉద్యోగం, అలాగే పిల్లలకు విద్యా సహాయం అందించాలని.. తీవ్రంగా గాయపడిన వారికి రూ.5 లక్షలు, గాయపడిన వారికి రూ.2 లక్షల ఆర్థిక సాయం అందించాలని గత నెలలో జరిగిన టీటీడీ బోర్డులో తీర్మానం చేసి అనుమతి కోసం ప్రభుత్వానికి పంపారు. ఈ క్రమంలో టీటీడీ నిర్ణయాలను ఆమోదించడంతో పాటు వెంటనే అమలుచేయాలంటూ దేవదాయశాఖ కార్యదర్శి వినయ్‌చంద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

తాడేపల్లి 'మంటల' సీసీ ఫుటేజీ లేదు

- మరోసారి వైసీపీ నేతల వివరణ

తాడేపల్లి టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా తాడేపల్లిలో మాజీ సీఎం జగన్ ఇంటి ఎదుట గార్డెన్‌లో అగ్ని ప్రమాద ఘటనపై వైసీపీ నేతలు మరోసారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. భద్రతాలోపం వల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయన్నారు. తమ వద్ద సీసీ ఫుటేజీ ఏమీ లేదు... ఉన్నది పని చేయని కెమెరా మాత్రమే అని రెండో సారి ఇచ్చిన పోలీసు నోటీసులకు వివరణ ఇచ్చినట్లు వైసీపీ నేతలు తెలిపారు.

జేఈఈ మెయిన్స్‌లో టాపర్‌గా భాష్యం విద్యార్థిని

- నూరుశాతం పర్సంటైల్‌తో అగ్రస్థానంలో సాయి మనోజ్ఞ

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్ మొదటి సెషన్ ఫలితాల్లో గుంటూరులోని భాష్యం ఐఐటీ జేఈఈ అకాడమి విద్యార్థిని గుత్తికొండ సాయి మనోజ్ఞ నూరుశాతం పర్సంటైల్‌తో అగ్రస్థానంలో నిలిచినట్టు సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ మంగళవారం తెలిపారు. దాదాపు 13 లక్షల మంది పోటీపడిన జేఈఈ మెయిన్స్‌లో తమ విద్యార్థి టాపర్‌గా నిలవడం తెలుగు రాష్ట్రాలకే గర్వకారణమన్నారు. ప్రత్యేక శ్రద్ధతో పాటు భాష్యం ఐఐటీ ఫౌండేషన్ కరిక్యులం పటిష్టంగా అమలు చేయడం వల్లే జాతీయ స్థాయి పరీక్షల్లో తమ విద్యార్థులు ర్యాంకులు సాధిస్తున్నారని తెలిపారు.

జేఈఈ ఫలితాల్లో ఎస్సార్ ప్రభంజనం

హసన్‌పర్తి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్- 2025 సెషన్-1 ఫలితాల్లో ఎస్సార్ విద్యాసంస్థల విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారని ఆ సంస్థల అధినేత ఎనగందుల వరదారెడ్డి తెలిపారు. ఫలితాల్లో తమ విద్యాసంస్థలకు చెందిన వల్లాల నాగసిద్ధార్థ (ఫిజిక్స్‌లో 100 పర్సంటిల్)తో 99.97 పర్సంటైల్, తాడిపర్తి తేజాస్ ఉద్భవ్‌రెడ్డి 99.83, మారం రాజవర్ధిత్‌రెడ్డి 99.81, దిడ్డి ప్రజ్వల్ కుమార్ 99.77 పర్సంటైల్ సాధించారని ఆయన వెల్లడించారు. వీరితో పాటు మరో 25 మంది విద్యార్థులు 99 పర్సంటైల్ సాధించారని తెలిపారు. ప్రతి సంవత్సరం రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీ పరీక్షలలో ఎస్సార్ విద్యాసంస్థలు అత్యుత్తమ ర్యాంకులు సాధిస్తున్నట్లు వరదారెడ్డి తెలిపారు.

జేఈఈలో నారాయణ ఆల్‌టైమ్ రికార్డు

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): జేఈఈ-2025 మెయిన్స్ ఫలితాల్లో నారాయణ విద్యాసంస్థల విద్యార్థులు ఆల్‌టైమ్ రికార్డు సాధించారని ఆ సంస్థల డైరెక్టర్లు పి. సింధూర నారాయణ, పి. శరణి నారాయణ తెలిపారు. దేశవ్యాప్తంగా 100 పర్సంటైల్ సాధించిన 14 మంది విద్యార్థుల్లో 5గురు తమ విద్యాసంస్థలకు చెందిన వారే ఉన్నారని వెల్లడించారు. తమ విద్యార్థులు బనిబ్రత మజీ, ఆయుష్ సింఘాల్, కుషాగ్ర గుప్తా, విషద్ జైన్, షివిన్ వికాస్ 100 పర్సంటైల్ సాధించారని వారు తెలిపారు. జాతీయ స్థాయిలో నిర్వహించే జేఈఈ కోసం తమ విద్యాసంస్థల్లో అమలు చేస్తున్న ప్రత్యేక పాఠ్య ప్రణాళిక తోనే ఈ విజయం సాధ్యమైందని సింధూర నారాయణ, శరణి నారాయణ పేర్కొన్నారు.

జేఈఈలో శ్రీ చైతన్య సంచలన రికార్డు

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): జేఈఈ ఫలితాల్లో శ్రీ చైతన్య విద్యాసంస్థలు సంచలన రికార్డు సాధించిందని ఆ సంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మ పేర్కొన్నారు. మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ పాఠ్యాంశాల్లో తమ విద్యార్థులు 42 మంది 100 శాతం పర్సంటైల్ సాధించారని ఆమె వెల్లడించారు. అలాగే మల్టీపుల్ సబ్జెక్టుల్లో 8 మంది 100 శాతం పర్సంటైల్ సాధించారని చెప్పారు. విద్యార్థుల నిరంతర కృషితోపాటు ప్రత్యేక ప్రణాళికలు, మైక్రో షెడ్యూల్స్, ఇంటర్నల్ ఎగ్జామ్స్ వల్లే ఈ విజయం సాధ్యమైందని సుష్మ వెల్లడించారు.

జల్లా సుదర్శన్‌రెడ్డి అరెస్ట్‌పై పోలీసులకు హైకోర్టు నోటీసులు

అమరావతి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రాసిక్యూషన్స్ పూర్వ డైరెక్టర్ జల్లా సుదర్శన్‌రెడ్డి అరెస్ట్ వ్యవహారంలో లక్కిరెడ్డిపల్లి సీఐ కొండారెడ్డి, వీరబల్లి ఎస్ఐ మోహన్‌లకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఈనెల 25వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆర్.రఘునందనరావు, జస్టిస్ ఎన్.హరినాథ్‌తో కూడిన ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు ఇచ్చింది.

చట్టనిబంధనల మేరకే పోర్టు వాటాల బదిలీ!

- రాజకీయ కారణాలతోనే విక్రాంత్‌రెడ్డిపై కేసు

అమరావతి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): కాకినాడ డీప్ వాటర్ పోర్ట్, కాకినాడ సెజ్‌లోని వాటాల బదలాయింపు చట్టనిబంధనల ప్రకారమే జరిగిందని విక్రాంత్‌రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి మంగళవారం హైకోర్టులో వాదనలు వినిపించారు. విక్రాంత్‌రెడ్డి అప్పటి ముఖ్యమంత్రి జగన్‌కు దగ్గరి బంధువు కావడంతోనే రాజకీయ కారణాలతో కేసు నమోదు చేశారని తెలిపారు. విక్రాంత్‌రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది వాదనలు ముగియడంతో సీఐడీ తరఫున అడ్వకేట్ జనరల్ వాదనల కోసం విచారణను ఈ నెల 13కు వాయిదా వేస్తున్నట్లు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి ప్రకటించారు.

పౌల్ట్రీపై పిడుగు!

(మొదటి పేజీ తరువాయి)



పశ్చిమగోదావరి జిల్లాలో బర్డ్ ఫ్లూతో చనిపోయిన కోళ్లు

పౌల్ట్రీ పరిశ్రమ ఒక్కసారిగా కుదేలైంది. వాస్తవానికి గోదావరి జిల్లాలైన తూర్పుగోదావరి, అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో కోళ్ల పరిశ్రమ బాగా విస్తరించింది. ఈ జిల్లాల్లో 350 వరకూ పౌల్ట్రీ ఫారాలున్నాయి. వాటిలో 3 కోట్ల వరకూ కోళ్లను పెంచుతున్నారు. ఇక్కడ రోజుకు 2.40 కోట్ల గుడ్లు ఉత్పత్తి అవుతుంటాయి. ఇవన్నీ స్థానిక అవసరాలకే కాకుండా.. ఒడిశా, బిహార్, పశ్చిమ బెంగాల్, అస్సాం తదితర రాష్ట్రాలకూ ఎగుమతి అవుతుంటాయి. గోదావరి జిల్లాల్లో రోజుకు కనీసం 30 వేల కోళ్లను మాంసం కోసం వినియోగిస్తారు. పరిశుభ్రత లేకపోవడం కానీ, వేరే ప్రాంతాల నుంచి వచ్చిన కోళ్ల ద్వారా గానీ కానూరు అగ్రహారంలో బర్డ్ ఫ్లూ వ్యాపించి ఉండొచ్చని అంటున్నారు. బర్డ్‌ఫ్లూ కారణంగా ప్రస్తుతం తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో కోళ్లు ఎక్కువగా చనిపోతున్నాయి. ఇది మరింత వ్యాప్తిచెందకుండా తక్షణ చర్యలు తీసుకోకపోతే.. పౌల్ట్రీ పరిశ్రమ మరింత కుదేలయ్యే ప్రమాదం ఉంది. కానూరు అగ్రహారంలో బర్డ్‌ఫ్లూ నిర్ధారణ కావడంతో పెరవలి, ఉండ్రాజవరం, నిడదవోలు మండలాల పరిధిలోని 34 గ్రామాల్లో 64 వైద్య బృందాలు ఇంటింటికీ సర్వే చేపట్టాయని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కాగా, పశ్చిమగోదావరి జిల్లా తణుకు రూరల్ మండలం వేల్పూరులోని కృష్ణానందం పౌల్ట్రీలోనూ కోళ్లకు వ్యాధి సోకినట్టు నిర్ధారణ అయిందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. వెంటనే ఉన్నతాధికారులతో సమీక్షించి నివారణ చర్యలకు ఆదేశించామని చెప్పారు. కృష్ణానందం పౌల్ట్రీ నుంచి కిలోమీటరు దూరం వరకూ ఇన్ఫెక్షన్ జోన్‌గా, 10 కిలోమీటర్ల పరిధిని అలర్ట్ జోన్‌గా గుర్తించామన్నారు. ఈ జోన్‌లో చికెన్, కోడి గుడ్లు అమ్మకాలను నిలిపివేయాలని ఆదేశించారు.

ఏపీ నుంచి కోళ్లు రానీయొద్దు: తెలంగాణ

బర్డ్ ఫ్లూ భయంతో తెలంగాణ రాష్ట్రం అప్రమత్తమైంది. ఏపీ నుంచి కోళ్లను తమ రాష్ట్రంలోకి రానీయకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. దీంతో తెలంగాణ వ్యాప్తంగా 24 చెక్‌పోస్టులు పెట్టిన అధికారులు.. ఏపీ నుంచి కోళ్ల లోడుతో వచ్చే వాహనాలను వెనక్కి పంపుతున్నారు. కాగా, బర్డ్ ఫ్లూ భయంతో తెలంగాణలో చికెన్, గుడ్ల అమ్మకాలు గణనీయంగా పడిపోయాయి.

ఒక్క పాఠశాలనూ మూసేయం

- పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు

అమరావతి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఒక్క ప్రభుత్వ పాఠశాలను కూడా మూసేయడం లేదని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ వి.విజయరామరాజు స్పష్టం చేశారు. అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ల రెండు రోజుల అవగాహన సదస్సును సమగ్రశిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావుతో కలిసి మంగళవారం విజయవాడలో ఆయన ప్రారంభించారు. బడికి దూరంగా ఆవాసాలుంటే అక్కడి విద్యార్థులకు నెలకు రూ.600 చొప్పున పది నెలల పాటు రవాణా ఖర్చులు ఇస్తామని పేర్కొన్నారు. కొత్తగా ఏర్పాటు చేస్తున్న ఆదర్శ ప్రాథమిక పాఠశాలల్లో తరగతికి ఒక టీచర్‌ను కేటాస్తామని చెప్పారు. వచ్చే ఏప్రిల్‌లో విద్యార్థుల నమోదుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని చెప్పారు. ఇకపై ప్రతి మూడో శనివారం మధ్యాహ్నం పాఠశాలలకు సెలవులు ఇచ్చి, స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను పూర్తిగా అకడమిక్ అంశాలపై నిర్వహిస్తామని తెలిపారు. ఎస్పీడీ బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పీఎంశ్రీ పాఠశాలలకు రూ.100 కోట్లు, ఇతర పనులకు రూ.200 కోట్లు ఇటీవల విడుదల చేసినట్లు తెలిపారు. ఈ నిధులను మార్చి నెలాఖరు నాటికి పూర్తిగా వినియోగించాలని కోరారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.